# మరో కోణం

డి.మార్కండేయ





కరీంనగర్ జిల్లా కేశవపట్నం మండలం ఏరడపల్లికి చెందిన దూడం మార్కండేయ పద్దెనిమిదేళ్ల ప్రాయంలో డిగ్రీ చదువుతూ విప్లవోద్యమంలోకి వెళ్ళారు. 2000లో బయటికి వచ్చి జర్నలిజంలో పీజీ చేసి, 2002లో పునః ప్రారంభమైన ఆంధ్రజ్యోతిలో చేరారు. కరీంనగర్ ఎడిషన్ ఇన్‌చార్జిగా, హైదరాబాదు సిటీబ్యూరో చీఫ్‌గా 2010 సెప్టెంబర్ వరకు పని చేసారు. తెలంగాణ ఉద్యమ నేపథ్యంలో వచ్చిన 'నమస్తే తెలంగాణ'లో లీడింగ్ టీంలో ఒకరిగా పత్రిక ప్రారంభంలోనే చేరి న్యూస్ నెట్‌వర్క్/టాబ్లాయిడ్స్ ఇన్‌చార్జిగా విధులు నిర్వర్తించారు, 2017 ఆగస్టులో ఉద్యోగానికి రాజీనామా చేసారు.

పదిహేనేళ్ల తన జర్నలిస్టు జీవితంలో మార్కండేయ ఎడిట్ పేజీలో అనేక వ్యాసాలు రాయడమే కాకుండా ప్రజా ఉద్యమాలపై, రాజ్యం అనుసరిస్తున్న అణచివేత విధానాలపై పలు విశ్లేషణాత్మక వార్తా కథనాలు రాసారు. ఆంధ్రజ్యోతి మెయిన్‌లో 2009 నవంబర్‌లోనే 'ఆపరేషన్ గ్రీన్‌హంట్'పై కథనాలు ఇచ్చారు. 2013 ఫిబ్రవరిలో బస్తర్ అడవుల్లోని విప్లవోద్యమ ప్రాంతంలో వారం రోజుల పాటు సంచరించి 'అన్నల రాజ్యంలో ఆరు రోజులు' పేరిట నమస్తే తెలంగాణలో వరుస కథనాలు రాసారు. అదే సంవత్సరంలో ఖమ్మం జిల్లా బయ్యారం అడవుల్లో న్యూడెమోక్రసీ దళాలతో తిరిగి ఆ పార్టీ నేతలను ఇంటర్వ్యూ చేసారు.

మరో కోణం

డి. మార్కండేయ

# మరో కోణం

## ప్రపంచీకరణ–పరాయీకరణ
## రాజ్యం–విప్లవం
## సామ్రాజ్యవాదం–పేదరికం

డి. మార్కండేయ

*MARO KONAM*
*by D. Markandeya*

*ISBN : 978-93-85076-14-5*

*Cover design : Ramanajeevi*

*Published by : MALUPU BOOKS, Hyderabad.*

*http://malupu.wordpress.com, email: malupuhyd@gmail.com*

*For copies : 3-6-677/2, Flat No. 302, MSK Towers,*
*Street No.11, Himayatnagar, Hyderabad-500029.*

*Published : September, 2018*

ప్రచురణ సంఖ్య : 23
మొదటి ముద్రణ : సెప్టెంబర్, 2018

మరో కోణం
డి. మార్కండేయ

ప్రచురణ : మలుపు బుక్స్, హైదరాబాద్.
ప్రతులకు : 3-6-677/2, ఫ్లాట్ నెం. 302, ఎం.ఎస్.కె. టవర్స్,
స్ట్రీట్ నెం. 11, హిమాయత్‌నగర్, హైదరాబాద్-500029.

కవర్ డిజైన్ : రమణజీవి

₹ 150/-

---

ముద్రణ : చరిత ఇంప్రెషన్స్, హైదరాబాద్. ఫోన్ : 27678411

ఐదుగురు అక్కాచెల్లెళ్ల పేరిట
ఒక్కగానొక్క కొడుకునైన నేను
విప్లవోద్యమంలోకి వెళ్లిన మూలంగా
మంచం పట్టి.. చివరకు నన్ను
చూడకుండానే తుదిశ్వాస విడిచిన
నన్ను కన్నతల్లి మధురమ్మకు,
విప్లవోద్యమ అమరులకు ప్రేమతో
అంకితం..

# విషయసూచిక

ముందుమాట - వరవరరావు 9
నా మాట 21

**మొదటి భాగం : ప్రపంచీకరణ-పరాయీకరణ**

1. పోస్కోపై పోరాటం 31
2. తాగునీటి పరాయీకరణ 35
3. కూడంకుళం.. కుట్ర ఎవరిది? 39
4. విధ్వంసమా? అభివృద్ధి 'వేదాంత'మా? 43
5. మురికివాడలపై 'మమత' కరువు! 47
6. త్వరలో కొత్త భూ'తర్పణ' చట్టం.. 52
7. జీవ వైవిధ్యాన్ని కాపాడుకుందాం! 56
8. అణు విద్యుత్‌తో అనర్థాలే అధికం! 60
9. ఆదివాసులపై మరో ఆక్రమణ.. 64
10. అభివృద్ధి విలయతాండవం.. 68
11. నియాంగిరి కొండల్లో అవతార్ కథ.. 73

**రెండవ భాగం: రాజ్యం-విప్లవం**

12. పౌరులపై 'సాయుధ' చట్టం? 79
13. రాష్ట్రాల హక్కులపై 'ఉగ్ర' కేంద్రం.. 83
14. స్వార్థం.. ఉద్యమాలపై అస్త్రం.. 87
15. నక్సల్స్‌పై 'మానవ రహిత' యుద్ధం.. 91
16. నక్సలిజంపై ఇక 'కార్పొరేట్' వార్.. 96
17. సోని సోరి.. రాజ్యహింసకు పరాకాష్ఠ 100
18. జర్నలిస్టు లింగారాం కథ.. మరో వ్యథ 104
19. నాట్‌గ్రిడ్‌తో ప్రైవసీకి భంగం 108
20. పౌరులపై నిఘా నేత్రం 112

21. ఈశాన్యంలో మావోయిస్టులు 116
22. బూర్జువా సైన్యంలో మావోయిస్టులు 120
23. నేపాల్‌లో చీలిన మావోయిస్టులు 124
24. బస్తర్.. భారత యేనాన్ 129
25. అబూజ్‌మాడ్‌లో ఏం జరుగుతోంది? 136
26. అబూజ్‌మాడియాలకు ముప్పు! 141
27. మానెసర్ హింసకు కారకులెవరు? 146

**మూడవ భాగం : సామ్రాజ్యవాదం - పేదరికం**

28. అంతులేని అమెరికా ఉగ్రవాదం 153
29. అమెరికాలో నయా బానిసలు 157
30. ఇరాన్‌పై యుద్ధ మేఘాలు..? 161
31. పతనం అంచున అస్సద్! 165
32. శ్రీలంక పాలకులకు టైగర్ ఫోబియా 170
33. పేదరికం.. అంకెల గారడీ 174
34. ప్రణబ్ చిలుక పలుకులు 179
35. నల్లధనం.. తెల్ల బతుకులు 183
36. ఆ సంతోషాలు మనకెప్పుడు..? 187
37. పని మనుషులా? బానిసలా? 192
38. ఆహారం భద్రమేనా! 196
39. జనాభా లెక్కలు.. అపోహలు.. నిజాలు 200
40. బాలలు.. హక్కులు.. చట్టాలు 204

# 'కాలమ్'ను అధిగమించిన కలం

'మరో కోణం' పేరుతో వచ్చిన ఈ పుస్తకంలోని నలభై వ్యాసాలు ప్రముఖ పత్రికా రచయిత మార్కండేయ 'నమస్తే తెలంగాణ'లో 2011-13 మధ్యలో రాసిన వారం వారం కాలమ్స్‌లో వచ్చినవి. అవును.. ఆశ్చర్యంగా ఉందా..? అక్కర్లేదు. అటువంటి వ్యాసాలు, వార్తలు రాసే అర్హత ఉన్నందుకే ప్రత్యేక తెలంగాణ ఉద్యమకాలంలో ఆయనకు ఆయా పత్రికలు ఉద్యోగాలు ఇచ్చాయి. ఆ అర్హత పెట్టుబడిగా పత్రిక అమ్మకాలు పెరిగితే ఆయనకు కీలక స్థానాలిచ్చాయి. ఆ అమ్మకాలైనా యాజమాన్య నమ్మకాలకు ప్రమాదకరమైనప్పుడు ఆయనను తొలగించాయి. ముఖ్యంగా ఇక్కడ చెప్పవలసింది నమస్తే తెలంగాణ దినపత్రిక గురించి..

మార్కండేయ విప్లవోద్యమంలో పదిహేడేళ్లు పనిచేసిన అనుభవం, అవగాహన తెలంగాణ రాష్ట్రం ఏర్పడక ముందు ఆ పత్రిక యాజమాన్యానికి చాలా అవసరమైంది. అందులోనూ ఆయన కరీంనగర్ జిల్లాకు చెందినవాడు. విప్లవోద్యమంలో పుట్టి పెరిగి దశాబ్దంకు పైగా డికెలో పనిచేసినప్పుడు కూడా తెలంగాణ పీడిత పోరాట ప్రజల హృదయస్పందనలతో కలిసి నడిచినవాడు.

2001లో ఏర్పడి 2004లో కాంగ్రెస్‌తో పొత్తుపెట్టుకొని ఎన్నికల ప్రచారంలో వైఎస్సార్ వలెనే పాదయాత్రలు, సైకిల్ యాత్రలు చేసిన కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు తనది పీపుల్స్‌వార్ ఎజెండా అని ప్రకటించాడు. అధికారంలోకి వచ్చి ఏర్పడిన సంకీర్ణ ప్రభుత్వంలో ఎనిమిది మంది టిఆర్ఎస్ మంత్రులున్నారు. అప్పటికి మరో విప్లవ పార్టీ ఎంసిసి కలయికతో ఏర్పడిన మావోయిస్టు పార్టీ ఎజెండా ఏమిటో 2004 చర్చల సమయంలో ఆయనకు, ఆయన మంత్రివర్గానికి, పార్టీకి పండు ఒలిచి చేతిలో పెట్టినంత స్పష్టంగా అర్థమై వుంటుంది.

కాకపోతే 2005 జులై 1న హైదరాబాదు ప్రాఫ్ ఆసుపత్రి ముందు రియాజ్‌తో పాటు అరెస్టు చేసిన నలుగురు సీపీఐ (ఎంఎల్) జనశక్తి విప్లవకారులను బదన్‌కల్ (ప్రస్తుత సిరిసిల్ల జిల్లా)లో ఎన్‌కౌంటర్ పేరుతో హత్య చేసినప్పటికి టిఆర్ఎస్ రాష్ట్ర

మంత్రులకు ఇంకా అధికారం తలకెక్కలేదు. పైగా రియాజ్ చర్చల ప్రతినిధి. ఆయనతో పాటు ఆయన సహచరులందరూ తమ కళ్ల ముందు 2004లోనే మసలుకున్నవాళ్లు. తమ వలెనే అవిభక్తఆంధ్రప్రదేశ్‌లో తెలుగుదేశం పార్టీ విధ్వంసకర పాలనను ప్రశ్నించినవాళ్లు. ప్రపంచ బ్యాంకు అభివృద్ధి నమూనాను వ్యతిరేకించినవాళ్లు. ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో విప్లవ పార్టీలతో, ప్రజాసంఘాలతో కలిసి పనిచేసినవాళ్లు. కనుక తెలంగాణ ఆత్మగౌరవం భంగపడినందుకనే కాదు.. వైఎస్సార్ ఆధిపత్యంలో తమ స్వీయ గౌరవం భంగపడినందుకు కూడా రాజీనామా చేసారు. మొదటిసారి, చివరిసారి సామ్రాజ్యవాద ప్రపంచీకరణ విధానాలను, విప్లవోద్యమంపై తిరిగి ప్రారంభమైన రాజ్యహింసను ఖండించారు.

అయితే కేంద్రంలో మంత్రులుగా ఉన్న కె చంద్రశేఖర్‌రావు, నరేంద్రలు మాత్రం రాజీనామా చేయలేదు. 'నమస్తే తెలంగాణ'లో చేరేముందు ప్రజాస్వామిక భావాలు గల పత్రికా రచయితలు ఈ తేడాను గమనించివుంటే, ఈ వర్గ వివక్షను, ఆధిపత్య కుల వివక్షను గమనించివుంటే బాగుండునని ఇప్పుడు అనుకుని ప్రయోజనం లేదు.

పైగా మన తృప్తి ఎట్లా ఉంటుంది అంటే 2014లో తెలంగాణ రాష్ట్రం ఏర్పడక ముందు ఈ మాత్రం రాయడానికైనా, ఇటువంటిది రాయడానికైనా అవకాశం (స్పేస్) దొరికింది కదా అని.

నిజమే... ఈ అవకాశాన్ని మార్కండేయ ఈ నలబై వ్యాసాల్లో చాలా అర్థవంతంగా, సమర్థంగా వినియోగించుకున్నాడు. ఆయనతో పాటే బయటకు వచ్చిన ఈ వ్యాసాలు ఇప్పుడు వెలుగు చూడడమే ఇవి కాలపరీక్షకు నిలిచినవని చెప్పడం.

'కాలమ్' అనేది కాలికమైనది. ప్రత్యేక సందర్భానికి, సంఘటనకు, విషయానికి, స్థల కాలాలకు పరిమితమైనది. ఈ పరిమిత, ప్రత్యేక అంశాలలో సార్వకాలీనత ఎంత మేరకు ఉంటే అవి కాలపరీక్షకు అంతగా నిలుస్తాయి. కాళోజీ, కుటుంబరావు గారలు బాధ పడినట్లు.. ఇంతకాలం పోయినా మేమెపుడో డెబ్బై ఏళ్ల కింద చెప్పిన విషయాలకు కూడా ప్రాసంగికత ఉండడమంటే సమాజం ఏమీ పురోగమించనట్లా..? ఔను.. కాదు..

సమాజం సంక్షోభంలో ఉంది. సంఘర్షణలో ఉంది. మార్పు కోసం ఏబై ఏళ్లుగా జరుగుతున్న పోరాటం ఆటుపోటులకు గురవుతున్నది. దేశమంతా ఒకే చిత్రంలా లేదు. తెలంగాణలో విప్లవోద్యమ ప్రభావం ఉన్నది. తెలంగాణ విప్లవోద్యమ నాయకత్వం తెలంగాణ ప్రజల మధ్య నిర్మాణంగా లేని స్థితి ఉన్నది. పొరుగు రాష్ట్రంలో పదిహేనేళ్లుగా నూతన ప్రజాస్వామిక విప్లవ బీజరూపంగా జనతన సర్కారు ప్రజల మీద ఈ దోపిడి ప్రభుత్వం ప్రకటించిన యుద్ధాన్ని ప్రజాయుద్ధంతో ప్రతిఘటిస్తున్నది.

అధికారంలో ఉన్న రాజకీయ పార్టీలే కాదు, లేనివి కూడా అనగా పాలకవర్గాలన్నీ,

ఎన్నికల రాజకీయ పార్టీలన్నీ 1991 నుంచి చాలా స్పష్టంగా ప్రకటించి మరీ ప్రపంచ బ్యాంకు అభివృద్ధి నమూనానే నూతన ఆర్థిక విధానంగా అమలు చేస్తున్నాయి. నమ్ముతున్నాయి... హామీలు పడుతున్నాయి.

రష్యా, తూర్పు యూరపు దేశాలలో నామమాత్రపు కమ్యూనిస్టు లేదా సోషలిస్టు ప్రభుత్వాల పతనం, తాత్కాలికంగా ప్రపంచ దేశాలన్నీ అమెరికా ఏక ధృవ సామ్రాజ్యవాద ప్రపంచీకరణ కిందికి వచ్చిన పరిణామంగా కనిపించవచ్చు గానీ రష్యా, తూర్పు యూరపులలో సారాంశంలో ఈ మార్పు 1953-56లలో పొడసూపి సైద్ధాంతిక స్థాయికి చేరుకున్నది. అది రాజకీయార్థిక రూపంలోనే కాకుండా సైనిక ఆక్రమణగా కూడా 1959 నుంచి (హంగరీ) తన అవలక్షణాలను ప్రదర్శిస్తూ 1966లో జెకోస్లవేకియాపై దాడితో 'గర్జించు రష్యా' విలోమార్థంలో రుజువైంది. సరిగ్గా 1956 నుంచి 66 దాకా మావో నాయకత్వంలో నిర్వహింపబడిన 'మహత్తర చర్చ' (గేట్ డిబేట్) చైనా శ్రామికవర్గ సాంస్కృతిక విప్లవంగా మూడో ప్రపంచ విప్లవమంతటి ఆశల్ని కార్మికవర్గంలో, యువతరంలో రగిలించి అతి, మితవాద ధోరణులను అధిగమిస్తూ 1974 నాటికి ఒక కొత్త ఒరవడిని ప్రపంచానికందించి 76 నాటికే దారి తప్పడం ఆరంభించింది. వియత్నాం వంటి దేశాలతో సరిహద్దు యుద్ధాల దాకా కాలుదువ్వింది. ఇప్పుడింక ఆధిపత్య పోరులో అమెరికా, యూరపులతో పాటు రష్యా, చైనా సామ్రాజ్యవాదాలు కూడా షరీకైనవి.

సామ్రాజ్యవాద మార్కెట్‌తో ప్రపంచంలో మూడవ వంతు ఉన్న సోషలిస్టు మార్కెట్ శాంతియుతంగా పోటీ పడడం సాధ్యమేనని చేసిన సిద్ధాంతం కాస్త ఇవ్వాళ ప్రపంచాన్ని ఒక సామ్రాజ్యవాద ప్రపంచ మార్కెట్ మాయాజాలంలోకి నెట్టివేసింది. ఇప్పుడింక ఇదే గ్లోబల్ సంగ్రామం.

భారతదేశానికి పరిమితమై ఆలోచించినా బొంబాయి ప్లాను (బిర్లా రచించి అప్పటి ప్రధాని నెహ్రూకు అందించినది) మొదలు మిశ్రమ ఆర్థిక విధానం మొదలు 1984-85 నాటికే సామ్రాజ్యవాద ప్రపంచీకరణకు ఇక్కడి పాలకవర్గాలు దళారులుగా మారిపోయాయి. ఇక్కడ వేల సంవత్సరాల బ్రాహ్మణీయ భూస్వామ్య భావజాలం ఈస్టిండియా కంపెనీ కాలం నుంచే పెట్టుబడికి సేవ చేసే ఒక బ్యూరాక్రటిక్ కాంప్రడార్ పాత్రను ఎంచుకున్నది. సంస్కృత నాటకాల్లో విదూషక పాత్ర కేవలం హాస్యరస పోషణకే కాదు.. రాజు చేసే తప్పులను ఒప్పు చేయడానికి కూడా ప్రవేశపెట్టబడుతుంది. శ్రీశ్రీ 'విదూషకుని ఆత్మహత్య' ఏ అధివాస్తవిక స్థితిలో రాసాడో గానీ 1857 ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామం తర్వాత ఇక్కడి భూస్వామ్యం ఆ పాత్రను నిర్వహిస్తూనే వస్తున్నది.

1857 నుంచి 1885లో కాంగ్రెస్ పార్టీ ఏర్పడేవరకే కాదు, ఆ తర్వాత కూడా ఈ ఉపఖండంలో అసంఖ్యాకంగా రైతాంగ పోరాటాలు పెల్లుబికాయి. 1925లో

కమ్యూనిస్టు పార్టీ ఏర్పడిన తర్వాత కూడా పంజాబు, మద్రాసు ప్రావిన్సు, బెంగాల్‌లో ఎన్నో ప్రతిఘటనా పోరాటాలు జరిగాయి. పంజాబులో స్పష్టంగా సామ్రాజ్యవాద వ్యతిరేకతను గదర్ పార్టీ విప్లవ ఎజెండాగా ప్రకటించింది. కమ్యూనిస్టు పార్టీ నాయకత్వంలో మద్రాసు ప్రావిన్సులోని ఇప్పటి కేరళలో పునప్రా వాయలార్, మాప్లా పోరాటాలు, బెంగాల్‌లో చిట్టగాంగ్, తెభాగ పోరాటాలు సాయుధ వర్గ పోరాటాలుగా వికసించక పోవడానికి నాయకత్వానికి సృజనాత్మకత లేకపోవడమే కారణం. చైనాలో నూతన ప్రజాస్వామిక విప్లవానికి సమకాలీనంగా తెలంగాణలో రైతాంగ సాయుధ పోరాటం (1946–51) ఒక్కటే స్పష్టమైన వ్యవసాయ విప్లవంగా భూమి, భుక్తి, విముక్తి పోరాటంగా ప్రారంభమై నాయకత్వం నెహ్రూపై పెట్టుకున్న భ్రమలతో విద్రోహానికి గురైంది. పోర్చుగీసు, డచ్చి, ఫ్రెంచ్ వలసలు కూడా ఉన్న భారత ఉపఖండం పూర్తిగా బ్రిటిష్ సామ్రాజ్యవాద వలసగా మారడం అనేది మన రాజకీయాలకు వలసీకరణ భావాలనే కాదు, పార్లమెంటరీ రాజకీయాల భావాలను కూడా ఒక అంటువ్యాధిగా అంటించింది.

ఈ వ్యవస్థను, రాజ్య స్వభావాన్ని అర్ధ వలస, అర్ధ భూస్వామ్య దళారీగా నక్సల్బరీ పంథా నిర్వచించేదాకా ఇరవై ఏళ్ల పాటు ఇది మన జీవన వ్యాపారాన్ని నియంత్రించింది. అప్పటినుంచీ పాలక శిబిరానికి, పోరాట శిబిరానికి మధ్యన జరుగుతున్న ఘర్షణ అంతా పార్లమెంటరీ ప్రజాస్వామ్యం పేరుతో చెలామణి అవుతున్న సామ్రాజ్యవాద, భూస్వామ్య దళారీ నియంతృత్వానికీ, అశేష పీడిత ప్రజల మధ్యన జరుగుతున్నదే.

1967 నక్సల్బరీ నాటికే ఒక 'సంక్షేమ రాజ్యం' చేపట్టే సోషలిస్టు తరహా, గరీబీ హటావో పార్లమెంటరీ సంస్కరణలన్నీ కాలం చెల్లి పెద్ద ఎత్తున అంతర్జాతీయ ద్రవ్యనిధి దేశంలోకి ప్రవేశించడం ప్రారంభమైంది. 1966 నాటికే అమెరికా పబ్లిక్ లా–480 కింద గోధుమలు మాత్రమే కాదు మన దేశానికి అమెరికా సాంస్కృతిక కేంద్రాలు, విశ్వవిద్యాలయాల్లో అమెరికా సాహిత్య అధ్యయన పరిశోధన కేంద్రాలు వచ్చాయి. 1971 బంగ్లాదేశ్ యుద్ధంతో సోవియట్ సోషల్ సామ్రాజ్యవాదంతో బంధం బలపడి సైనిక ఒప్పందాల దాకా పోయాం. ఎమర్జెన్సీ ఎత్తివేసిన తర్వాత ప్రధానిగా చంద్రశేఖర్ ఉన్న కాలానికి అమెరికా యుద్ధ విమానాలకు మన దేశంలో విడిది, చమురు సమకూర్చడమే కాదు ఇప్పుడిక ఇక్కడి ప్రజలపై 2009 నుంచి ఆపరేషన్ గ్రీన్‌హంట్ పేరిట యుద్ధానికి ఎఫ్‌బిఐలు, ఇజ్రాయిల్ మానవరహిత విమానాలు, అన్ని సామ్రాజ్యవాదాల అత్యంత ఆధునిక సాంకేతిక యుద్ధ పరికరాలు, వ్యూహాలు, శిక్షణ అందుతున్నాయి.

కార్ల్ మార్క్స్ కాలానికి పెట్టుబడితో ప్రారంభమైన పరాయీకరణ మన దేశాన్ని అధికారికంగానే ప్రపంచ మార్కెట్ శాసించే కాలానికి ఎంత విశ్వరూపం తీసుకున్నదో

అవగాహనకు తెచ్చుకుని మార్కండేయ రాసిన ఈ వ్యాసాలు చదవాలి. ఒక దినపత్రికలో ఆయా సందర్భాల్లో తక్షణ సంఘటనలకు, పరిణామాలకు స్పందించి రాసినట్లుగా కనిపించే ఈ వ్యాసాల వెనుక మార్కండేయ పుట్టిన గడ్డ 1967 నుంచి అనుభవించిన, ప్రతిఘటించిన, నిర్మించిన చరిత్ర, ఆ క్రమంలో ప్రజలు నిర్మిస్తున్న చరిత్ర ఉన్నది. అందులో పదిహేడు సంవత్సరాలు ఆయన ఉన్నాడు. అది ఎంతో అవసరమైన ఎద్యుకేషన్. ఆ నేపథ్యం లేకుండా ఈ రచనలు లేవు. పరిమితులు ఒక పాలక పత్రికలో ఉద్యోగం. పత్రికా చరయిత కూడా మార్క్స్ చెప్పినట్లు ఒక వేజ్ లేబరర్. వేతన శ్రామికుడు.

ఇంత ఉపోద్ఘాతం అక్కర్లేకుండానే మార్కండేయ తన 40 వ్యాసాలను మూడు భాగాలలో చేసిన విభజింపును బట్టే నేను ప్రతిపాదించిన అవగాహన ఈ రచనలనెట్లా రూపొందించిందో పాఠకులు గ్రహించగలరు.

మొదటి భాగం: ప్రపంచీకరణ–పరాయీకరణ

రెండవ భాగం: రాజ్యం–విప్లవం

మూడవ భాగం: సామ్రాజ్యవాదం–పేదరికం

రెండవ భాగం మూడవ భాగం అయివుంటే.. అట్లా చదువుకుంటే సమస్య, పరిష్కారం రెండూ అర్థమవుతాయి. ఒక సమస్య ఎటువంటి కృత్రిమ భౌతిక స్థితికి, పరిణామానికి దారితీస్తుందో ఆ సమస్యకు పరిష్కారమేమిటో తెలుస్తుంది.

పెట్టుబడి పెట్టుబడిదారీ గర్భంలోంచే పుట్టిన కార్మికవర్గం శ్రమశక్తిని సరుకుల ఉత్పత్తి కొరకు అదనపు విలువగా దోచుకుంటుంది. శ్రామికుల రక్తమాంసాలు స్వేదంగా మారి ఉత్పత్తి చేసే సరుకులు మార్కెట్లో ఉపయోగపు విలువగా కాకుండా మారకపు విలువగా మారి సృష్టికర్త అయిన శ్రమజీవి నుంచి శ్రమశక్తినే కాదు మానవ సారాన్ని హరించడం వల్ల తనకు తానే పరాయివాడు/పరాయిది అవుతాడు. అవుతుంది. ఈ పరాయీకరణ ఒక భౌతిక వాస్తవికతగా మారినందువల్ల కష్టజీవులు పేదవాళ్లవుతారు. ఇది సహజమైన పేదరికం కాదు. కృత్రిమ పేదరికం. మన దేశం పేదది కాదు, మన ప్రజలు పేదలు అనడంలో ఇమిడివున్న మార్కెట్ రహస్యమదే. భారతదేశం భాగ్యసీమయే గానీ సకల సంపదలున్న దేశంలో దరిద్రమెట్లున్నదో ప్రపంచీకరణను పరాయీకరణను అర్థం చేసుకుంటే తప్ప అవగతం కాదు.

గ్రాహం గ్రీన్ అనే అమెరికన్ రచయిత సామ్రాజ్యవాదం గురించి 'ది ఎనిమీ' (శత్రువు) అని ఒక పుస్తకమే రాసాడు.

ఈ ప్రపంచీకరణకు ఏజెంటుగా పనిచేస్తున్నది రాజ్యం. ఈ రాజ్యాన్ని విప్లవంతో కూల్చకుండా ఈ పరాయీకరణ తొలగదు. ఈ పేదరికం తొలగదు.

ఈ మూడు విభాగాల్లో ఈ చిట్కాలు లేదా పరిష్కారాలు ఉన్నాయని గానీ, ఇట్లాగే

ప్రతిపాదనలు, పరిణామాల వివరణ, పరిష్కారాలు ఉన్నాయని కాదు. 2012–13లలో దేశాన్ని, అవిభక్త ఆంధ్రప్రదేశ్‌ను కుదిపేస్తున్న సమస్యలు, చేపట్టిన ప్రాజెక్టులు, పథకాలు, ఆ క్రమంలో ప్రజలు ఎదుర్కొనక తప్పని విధ్వంసం, దౌర్జన్యం, రాజ్యహింసలను ఆయా సందర్భాలు, సంఘటనల ఆధారంగా ఈ వ్యాసాలు విశ్లేషిస్తాయి.

ప్రపంచీకరణలోని సరళీకరణ, ప్రైవేటీకరణ అంతర్నిబిడంగా ఉన్న అంశాలని దాదాపు 28 ఏళ్లు కావస్తున్నా ఇప్పుడు కొత్తగా చెప్పనక్కర్లేదు. సామ్రాజ్యవాద దేశాల కోసం, బహుళజాతి కంపెనీల కోసం, వాళ్ల ఆదేశాలపై వాళ్లతో చేసుకున్న ఒప్పందాల కోసం మన దేశంలో ఒక అభివృద్ధి కార్యక్రమాన్ని చేపట్టి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవి ఒప్పంద గడువు ప్రకారం అమలు చేసి పూర్తి చేసే క్రమంలో ప్రజలు నిర్వాసితులవుతున్నారు. విస్థాపితులవుతున్నారు. ఎంత ప్రతిఘటిస్తే అంత రాజ్యహింసకు గురవుతున్నారు. ఇటువంటి చాలా సందర్భాల్లో ఆ ప్రజలు ఆదివాసులు, పల్లెకారులు, మత్స్యకారులు, దళితులు వంటి ఆదిమ సమాజాలకు చెందిన వాళ్లే అవుతున్నారు. ఈ వ్యాసాల్లో నియాంగిరి, పోస్కో (ఒరిస్సా), కూడంకుళం (తమిళనాడు) పోరాటాలపై ఇచ్చిన సమాచారం, విశ్లేషణ అటువంటిదే.

పోస్కో, నియాంగిరి వంటి పోరాటాలు చాలాకాలం ఎంతో సాహసంగా విశాల ప్రజారాశులతో, ప్రజాస్వామ్య శక్తుల అండతో సాగి, తాత్కాలిక విజయాన్ని సాధించినప్పటికీ ప్రమాదం నుంచి బయటపడినవని చెప్పడానికి లేదు. కూడంకుళం అణు విద్యుత్ ప్రాజెక్టు అయితే సముద్రతీరం పల్లెకారుల స్త్రీలు సముద్రంలో రోజుల తరబడి తలలు బయటపెట్టే దీక్ష కొనసాగించినా, ఎంత ప్రతిఘటించినా దాని నిర్మాణం ఆగలేదు. దేశవ్యాప్తంగా, ప్రపంచవ్యాప్తంగా చెర్నోబిల్ (రష్యా) వంటి ఉదహరణలు చెప్పినా అణు రజం వల్ల కానీ, కంటెయినర్లు ఏ కారణం వల్ల విస్ఫోటనం చెందినా వచ్చే నష్టం ఎంత వివరించినా ఆగలేదు. ఎందుకంటే అది రాజీవ్‌గాంధీ–గోర్బచేవ్ స్థాయిలో జరిగిన ఒప్పందం. మన్మోహన్‌సింగ్ ప్రధానిగా రెండు దఫాలుగా చేసిన కాలంలో పూర్తి చేసే ఒప్పందం పూర్తి చేసి తీరాలి. అట్లని మోడీ అధికారానికి వచ్చి దానిని రద్దు చేస్తాడని లేదు. అటు అధికారంలో పుతిన్ కొనసాగడమే కాదు. ఇది రెండు ప్రభుత్వాలే కాదు, రెండు రాజ్యాల మధ్య జరిగిన ఒప్పందం.

మార్కండేయ ఈ వ్యాసం రాసిన 2012 నాటికే ఇరవైనాలుగేళ్ల క్రితం చేసుకున్న ఒప్పందం. ఇప్పటికి ముప్పై ఏళ్ల క్రితం భారత–రష్యాల వ్యూహాత్మక మైత్రికి చిహ్నంగా రాజీవ్‌గాంధీ–గోర్బచేవ్ చేసుకున్న ఒప్పందం. 1988లో ఒకవైపు గ్లాస్‌నోస్త్, పెరిస్ట్రోయికా వంటి శాంతియుత సహజీవన సిద్ధాంతానికి మరింత తాత్విక స్థాయిని సమకూర్చిన గోర్బచేవ్–ఎల్ట్సిన్‌ల పాలనయే రూపమాత్ర ఎర్రజెండా పాలన. ఎల్ట్సిన్‌తోనే రష్యాలో

ఎర్రజెండాలు, మార్క్స్, లెనిన్ జ్ఞాపకాలు కూడా అధికారికంగా తొలగిపోయాయి. అమెరికాలో రీగన్ సినిమా రంగం నుంచి రాజకీయాల్లోకి వచ్చినట్లుగా రాజీవ్‌గాంధీ పైలట్‌గా ఉన్నవాడు దేశ రాజకీయాలకు పైలట్ అయి దేశాన్ని 21వ శతాబ్దంలోకి తీసుకుపోతానని శ్రీలంక మీదికి శాంతిస్థాపక సైన్యాన్ని పంపినవాడు. దేశంలో సిఖ్ఖు జాతి హననం చేసినవాడు. టాడా చట్టం తెచ్చి దేశవ్యాప్తంగా ముఖ్యంగా పంజాబు, గుజరాత్, ఆంధ్రప్రదేశ్‌లలో వేల సంఖ్యలో అన్ని రంగాల కార్యకర్తలను, ప్రజలను నిర్బంధించినవాడు. కశ్మీర్ సరేసరి. ఆయన కాలంలోనే భోపాల్ గ్యాస్ విషాదంలో మూడు వేల మంది కార్మికులు, వాళ్ల కుటుంబాలు, స్త్రీలు, వృద్ధులు, పిల్లలతో సహా మరణించారు. అయినా సరే.. 'హింద్ కరేగా.. హిందూరాజ్' అనే పేరుతో 406 స్థానాలతో లోక్‌సభకు గెలిచి ప్రధాని అయ్యాడు. అయినాసరే.. శాంతి ప్రవచనాలు పలికే గోర్బచేవ్-రాజీవ్‌గాంధీలకు కూడంకుళంలో చెర్నోబిల్ కన్నా పెద్దదయిన అణు విద్యుత్కేంద్రం తమిళనాడు తీరంలో కూడంకుళంలో అవసరమైంది. దీనిని వ్యతిరేకించిన పల్లెకారులకు నాయకత్వం వహించిన వారి వెనుక మాత్రం భారత ప్రభుత్వానికి విదేశీ హస్తం కనిపించింది.

1988లో ఈ ఒప్పందం చేసుకోవడానికి రష్యాకున్న కారణం 1986లో చెర్నోబిల్ ప్రమాదం. కనుక వ్యూహాత్మకంగానే భారత్‌తో ఒప్పందం చేసుకున్నది. అంతకు మించిన ప్రమాద అవకాశం ఉంది కనుకనే కూడంకుళాన్ని ప్రజలు ప్రాణాలొడ్డి ప్రతిఘటించారు.

2011లో మొదటిదశ పూర్తి చేయాలని మన్మోహన్‌సింగ్ పట్టుదలగా ఉన్నప్పుడు తీవ్ర ప్రతిఘటన వచ్చింది. అప్పుడే ఢిల్లీ యూనివర్సిటీ ప్రొఫెసర్ జిఎన్ సాయిబాబా చొరవతో ఒక అఖిల భారత నిజనిర్ధారణ బృందం కూడంకుళం వెళ్లే ప్రయత్నం చేసింది. అందులో జార్ఖండ్ నుంచి దామోదర్ తురి, జెఎన్‌యూ నుంచి ప్రీతి (తమిళనాడుకు చెందిన యువతి) ఒరిస్సా నుంచి ప్రతిమ (అడ్వొకేట్-హక్కుల కార్యకర్త), ఆంధ్రప్రదేశ్ నుంచి వరలక్ష్మి (విరసం కార్యదర్శి) మొదలైన వారందరినీ మధురైలోనే నిర్బంధించి కేసులు పెట్టి జైళ్లో పెట్టారు. వీళ్లందరికీ మావోయిస్టు పార్టీతో సంబంధాలున్నాయని ఆరోపించారు. వరలక్ష్మినయితే అజ్ఞాతంలో ఉన్న మావోయిస్టు పార్టీ నాయకుని సహచరి అని తమిళ పత్రికలు మాత్రమే కాకుండా ఈనాడు కూడా రాస్తే వరలక్ష్మి ప్రెస్ కౌన్సిల్‌కు ఫిర్యాదు చేసింది. ప్రెస్ కౌన్సిల్ విచారణ చేసి ఈనాడుతో సంజాయిషీ కూడా చెప్పించింది.

అణువిద్యుత్‌తో అనర్థాలే అధికం అనే శీర్షికతో మరో వ్యాసం కూడా కూడంకుళం నేపథ్యంలోనే ఈ రచనల్లో ఉంది.

ఇక, వేదాంత వంటి బహుళజాతి కంపెనీల ప్రస్తావన నియాంగిరి ఆదివాసుల ప్రతిఘటన సందర్భంగానూ, తిరిగి 'అవతార్' సినిమా గురించి రాసిన సందర్భంగానూ వస్తుంది. లండన్ కేంద్రంగా ఉన్న ఈ బహుళజాతి కంపెనీ చాలా అర్థవంతమైన

వేదాంత పేరు పెట్టుకున్నది. మార్కెట్ ఫెటిషిజం వంటిదే వేదాంతం. జీవుడు, జగం మిథ్య. ఆత్మ ఒక్కటే అఖండ సత్యమని చెప్పే శంకరాచార్య అద్వైత సిద్ధాంతమే, మాయావాదమే వేదాంతం. కనుక వేదాంతం మార్కెట్ ఫెటిషిజానికి ఉపరితల భావజాల రంగంలో పదునైన ఆయుధం. ఒరిస్సా, ఛత్తీస్‌గఢ్‌లలో వేదాంత ఖనిజ దోపిడి గురించి అరుంధతీరాయ్, ఫెడెల్ వంటి వాళ్లు ఎంతో తీవ్రంగా రాసి ఉన్నారు. వేదాంత డైరెక్టర్స్‌లో చిదంబరం ఉన్నాడు. వేదాంత వంటి బహుళజాతి కంపెనీల కోసమే ఆయన 2009లో కేంద్ర హోం మంత్రిగా ఆపరేషన్ గ్రీన్‌హంట్ పేరిట ప్రజల మీద యుద్ధం ప్రారంభించాడు. చిదంబరం పదవిలో లేనప్పుడు ఆయన స్వయంగా, పదవిలో ఉన్నప్పుడు ఆయన భార్య ఎన్రాన్, వేదాంత వంటి కంపెనీల తరఫున సుప్రీంకోర్టులో వాదిస్తారు.

కనుక కంపెనీ, రాజ్యం, న్యాయం– అన్నీ జీవుడు, జగత్తు వలె అసత్యాలే. మార్కెట్ దోపిడి ఒక్కటే విశ్వవ్యాప్తమైన అఖండమైన ఆత్మ వంటి సత్యం.

సరిగ్గా ఐదేళ్ల క్రితం 2013 జూన్ 17న 'నమస్తే తెలంగాణ'లో మార్కండేయ 'ఆదివాసులపై మరో ఆక్రమణ' అనే వ్యాసం రాసాడు. ఇప్పుడు గడ్చిరోలిలో మొన్నటి ఏప్రిల్ 22న ఆరంభమైన రాజ్య మారణకాండ వెనుక రాజ్య వ్యూహాన్ని అర్థం చేసుకోవాలంటే ఆ వ్యాసం తప్పకుండా ప్రతి ఒక్క పాఠకుడు చదవాలి. గడ్చిరోలి జిల్లా ఏటపల్లి తాలూకా సుర్జాగఢ్ గుట్టల ప్రాంతంలో మావోయిస్టులు ముగ్గురు వ్యక్తులను చంపారన్నది అన్ని పత్రికల్లో, ఎలక్ట్రానిక్ మీడియాలో ప్రముఖ వార్త అయింది. అందుకు కారణం ఆ ముగ్గురిలో ఒక్కరు ప్రముఖ బహుళజాతి కంపెనీ లాయిడ్ స్టీల్ ఉన్నతస్థాయి అధికారి. రూ. ఐదు వేల కోట్ల టర్నోవర్ గల ఈ కంపెనీ ప్రధానంగా ఉక్కు సంబంధిత పరిశ్రమలను కలిగివున్నది. అధికార వర్గాల సమాచారం ప్రకారం "ఈ కంపెనీకి వైస్ ప్రెసిడెంట్ అయిన జస్పాల్ థిల్లాన్, లాయిడ్స్‌కు అనుబంధంగా ఉన్న హేమలతా మినరల్స్ ఎండి ఆంధ్రప్రదేశ్‌కు చెందిన మల్లికార్జున్‌రెడ్డి కలిసి స్థానిక పోలీసు పటేల్ రాజు సడిమెక్ మధ్యవర్తిత్వంతో మావోయిస్టులతో చర్చలు జరిపేందుకని మంగేర్ గ్రామానికి వెళ్లారు. చర్చల్లో ఏం జరిగిందో తెలియదు కానీ వారిని వదిలిపెట్టి ఓ గంటలో తిరిగి వెళ్లిన కారు డ్రైవరుకు మూడు శవాలు కనిపించాయి."

సుర్జాగఢ్ అడవులు, ప్రకృతి సంపద, జీవరాశులు, అక్కడ లభించే ఖనిజాల గురించి మార్కండేయ చాలా వివరంగా, సాధికారికంగా కళ్లకు కట్టినట్లు వివరిస్తాడు. 2011లో నేను, నా సహచరి హేమలత, ఎన్ వేణుగోపాల్, ప్రఖ్యాత సినీ దర్శకుడు, నిర్మాత ఆర్ నారాయణమూర్తి గారితో కలిసి ఈ దట్టమైన అడవులన్నీ తిరిగాం. ఆయన హిందీలో 'లాల్ ధర్తీ' అనే సినిమా అవుట్‌డోర్ షూటింగు కోసం గడ్చిరోలి అడవులను ఎంచుకొని అక్కడి నదులు, కొండలు, అడవులు చూపించడానికి మమ్ములను

తోడ్కొనిపోయాడు. గడ్చిరోలి ఫారెస్టు గెస్ట్‌హౌజ్‌లోనే ఉన్నాం. బల్లార్షా ఫారెస్టు ఆఫీసరు నర్సింహులు గారు అనంతపురానికి చెందినవారు. నారాయణమూర్తి గారి వీరాభిమాని. ఆయన సహకారంతోనే రాష్ట్ర ప్రభుత్వ అనుమతి కూడా తీసుకుని అక్కడ తన హిందీ సినిమా అవుట్‌డోర్ షూటింగు చేసాడు. ఒకే గెస్ట్‌హౌజ్‌లో వేర్వేరు సూట్స్‌లో ఉన్న మాకాయనను పరిచయం చేయించలేదు జాగ్రత్త కోసం. కానీ ఆయన మమ్మల్ని పోల్చుకున్నాడు. మంచి స్నేహితులమయ్యాం. ఇంద్రావతి, ప్రాణహిత, గోదావరి నదీతీరాలు– మూడు నదులు కలిసిన ప్రాంతం. ఎత్తైన కొండలు, లోయలు, అడవులు ఆ సినిమా బృందంతో తిరిగి ఆ అనుభూతులను మా గుండెలోతుల్లో పదిలపరుచుకున్నాం. సిరొంచ దాకా మమ్మల్నెవరూ స్థానిక ప్రజలు గుర్తుపట్టలేదు. సిరొంచలో ఇక ముగింపు సమయంలో ఈటీవీ వాళ్లు గుర్తుపట్టారు.

ఇప్పుడు సరిగ్గా అక్కడే.. ఆ ఏటపల్లి అడవుల్లోనే కసన్సూరు ప్రాంతంలో ఇంద్రావతికి అర కిలోమీటరు దూరంలో లాయిడ్ స్టీలు వంటి బహుళజాతి కంపెనీల కోసం సీఆర్‌పీఎఫ్, సీ–60, తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ పోలీసుల సహకారంతో నలభై రెండు మందిని.. అందరికందరు ఆదివాసులను.. అందులోనూ సగం మంది మహిళలను, ఎనిమిది మంది మైనర్లను చంపారు. వారిలో విజేందర్ @ శ్రీకాంత్ ఒక్కడే పాత వరంగల్ జిల్లా చల్లగరిగెకు చెందిన దళితుడు. వీరిలో ఆయనతో సహా ఇరవై రెండు మంది మాత్రమే మావోయిస్టులు. మిగతా అందరూ తునికాకు కాలం కాబట్టి తునికాకు సేకరణ రేట్ల పెంపు పోరాటం చేపట్టే విషయం చర్చించడానికి సమావేశమయ్యారు. పక్కా సమాచారంతో పోలీసు బలగాలు ఆంబుష్ చేసి అండర్ బ్యారల్ గ్రెనేడ్ లాంచర్ (యూబీజీఎల్) అనే ఆయుధాన్ని వాడి మందుపాతరలను, విషవాయువులను ప్రయోగించి ఈ మారణకాండ జరిపి ఇంద్రావతి నదిని రక్తసిక్తం చేసారు.

ఈ ప్రపంచీకరణ అభివృద్ధి విధ్వంసం ఎంత అమానుష పరాయీకరణ స్థాయికి వెళ్లిందంటే ఈ మారణకాండ నిర్వహించిన సీఆర్‌పీఎఫ్, సీ–60 తదితర సాయుధ బలగాలు తమ యూనిఫాంలతో విందులు, వినోదాలు చేసుకుంటూ సామూహిక నృత్యాలు చేసి సామాజిక మాధ్యమాల్లో పెట్టారు. గతంలో ఖమ్మం జిల్లా ఛత్తీస్‌గఢ్ సరిహద్దుల్లో ఇటువంటి మారణకాండతో కంచెర్ల వద్ద పదిహేను మంది మావోయిస్టులు అమరులైతే వాళ్ల మృతదేహాలను ఒక హౌజ్‌లో వేసి సాల్వాజుడుం సాయుధులు ఇటువంటి వికటాట్టహాసాల నృత్యాలే చేసారు.

ప్రకృతి సంపద, మానవ శ్రమ కోసం పెట్టుబడి వేటకు ఇవ్వాళటి పేరు ప్రపంచీకరణ. అందులోని పరాయీకరణను మార్కండేయ పట్టుకున్న పద్ధతి ఎంతో శాస్త్రీయంగా ఉన్నది. సాధికారికంగా ఉన్నది.

ఇందులోని రచనలన్నీ కూడా వ్యాస రచన గురించి శ్రీశ్రీ చెప్పిన మూడు తప్పనిసరి అంశాలను కలిగివున్నాయి. వ్యాసరచన విమానాన్ని నడపడం వంటిదంటాడు శ్రీశ్రీ. అందులోనూ దినపత్రికలోని కాలమ్ కదా.. చాలా పరిమితులు ఉంటాయి. ఒక విధంగా విమాన వీక్షణమే. విహంగమై ఎగురడానికి లేదు. టేకాఫ్–ఆకాశంలో నిర్వహణ–ల్యాండింగ్. అంటే వ్యాసం ఎత్తుగడ ఆరంభం.. నిర్వహణ.. విషయ ప్రతిపాదన.. సమాచారం.. ముగింపు. ముగింపులో రచయిత వ్యాఖ్య.. ప్రాపంచిక దృక్పథం.. అక్కడ రచయిత వ్యక్తిత్వం ఆవిష్కృతమవుతుంది. ఇందులోని మూడు భాగాల్లో ఉన్న నలబై వ్యాసాల్లో ప్రతి వ్యాసంలోనూ ఈ పద్ధతి పరుచుకొని ఉన్నది.

ఈ 40 వ్యాసాల్లోనూ ఒక అంతస్సూత్రం ఉన్నది. విడి విడి విభాగాలుగా విడి విడి అంశాలపై వైవిధ్యం, బహుళత్వం, అనేకత్వం వ్యక్తమయ్యే వ్యాసాలైనా అన్నింటి చారిత్రక గతి చలన సూత్రం సామ్రాజ్యవాద ప్రపంచీకరణ. అందుకు దోహదం చేస్తున్న రాజ్యం. అభివృద్ధి పేరిట విధ్వంసం. పరాయీకరణ.

ఇందులో కేవలం ఆదివాసులు, సముద్రతీర మత్స్యకారులు, పల్లెకారులపై అభివృద్ధి నమూనా దాడి పైనే కాదు.. మైదానప్రాంత ప్రజలపై విస్థాపన, నిర్వాసితత్వ సమస్యలు, పోరాటాల చిత్రణ కూడా ఉంది. మురికివాడలపై 'మమత' కరువు (ఎంత అర్థవంతమైన శీర్షిక..!) ఒక్క మమతా బెనర్జీ అభివృద్ధి పాలన గురించి చెప్పినట్లు కనిపించవచ్చు కానీ నగరాల్లోని బస్తీల్లో, మురికివాడల్లో, ఘెట్టోల్లో ఉండే కార్మికులు, దళితులు, ముస్లింలపై ఎమర్జెన్సీ కాలంలోనూ, గుజరాత్ మారణకాండ మొదలు ముజఫర్‌నగర్ వరకు, ఢిల్లీలో రెండు పర్యాయాలు జరిగిన దాడి, విస్థాపన, హింస, దౌర్జన్యాలను ఇందులో ఊహించుకోవచ్చు.

1975 జూన్ 25న ఇందిరాగాంధీ ఎమర్జెన్సీ పెట్టడానికి రైల్వే సమ్మె, బీహార్, గుజరాత్ ఉద్యమాలతో పాటు ప్రపంచ బ్యాంకు ఇచ్చిన పట్టణ సుందరీకరణ, జనాభా నియంత్రణ.. అనే కర్తవ్యాలు కూడా కారణమైనవి.

రాజ్యాంగేతర శక్తి అయిన సంజయ్‌గాంధీ ఢిల్లీని సుందరీకరించడానికి టర్క్‌మన్ గేట్‌లో ఉండే ముస్లిం బస్తీలను బుల్డోజర్లు పెట్టి ధ్వంసం చేసిన తీరు మొదలు 1984 అక్టోబర్ 31 నుంచి నవంబర్ 3 వరకు సాగిన సిఖ్ఖుల ఊచకోతల సందర్భంగా త్రిలోకపురి, జమునాఘాటీ వంటి బస్తీలలో సిఖ్ఖుల దురవస్థలను ఒకసారి గుర్తు చేసుకోవచ్చు. ఇంకా హిందీ రాష్ట్రాలుగా పిలువబడే యుపి, బీహార్, మధ్యప్రదేశ్, రాజస్థాన్ మొదలైన రాష్ట్రాలలో వివాహిత, అవివాహిత ముస్లింలకు వేల సంఖ్యలో బలవంతపు కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేసిన ఫలితంగా ఈ ఐదు రాష్ట్రాల్లోనూ ఎన్నికల్లో కాంగ్రెస్ తుడిచిపెట్టుకుపోయింది. ఇప్పుడు మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్‌లలో ఆదివాసీ

స్త్రీల కుటుంబ నియంత్రణ, నేత్ర చికిత్సలలో చనిపోతున్న వాళ్లను, అంధులవుతున్న వాళ్లను పోల్చుకుని చదవండి.

రెండవ భాగం రాజ్యం–విప్లవంలో సహజంగానే ఆదివాసులు, మావోయిస్టులే కేంద్రంగా ఉంటారు. నక్సల్స్‌పై మానవ రహిత యుద్ధం, నక్సలిజంపై ఇక కార్పొరేట్ వార్, సోని సోరీ.. రాజ్యహింసకు పరాకాష్ఠ, జర్నలిస్టు లింగారాం కథ.. మరో వ్యథ, పౌరులపై నిఘా నేత్రం, ఈశాన్యంలో మావోయిస్టులు, బస్తర్.. భారత యేనాన్, నేపాల్‌లో చీలిన మావోయిస్టులు, అబూజ్‌మాడ్‌లో ఏం జరుగుతోంది..? అబూజ్‌మాడియాలకు ముప్పు వంటి వ్యాసాలన్నీ రాజ్య స్వభావాన్ని, రాజ్యాన్ని విప్లవం ద్వారా తప్ప కూల్చలేమనే అవసరాన్ని గుర్తు చేసేవే. ఆ కర్తవ్యాన్ని ఇవ్వాళ ఆదివాసులు మావోయిస్టుల నాయకత్వంలో నిర్వహిస్తున్నారు. పూజారి కాంకేర్ అమరుల జీవిత చరిత్రలు చదివితే ఈ నక్సల్బరీ వారసులైన ఆదివాసులు మావోయిస్టులుగా మారిన తీరు కళ్లకు కడుతుంది.

మూడవ భాగం సామ్రాజ్యవాదం–పేదరికం.. ఇప్పటి పేదరికం సహజమైనది కాదనడానికి సోపపత్తికమైన ఉదాహరణలతో రాసిన పదమూడు వ్యాసాలు. సామ్రాజ్యవాదం ఎంత అసహజమైందో, సంపద, శ్రమ, ఉత్పత్తి, విజ్ఞానశాస్త్ర అభివృద్ధి, సాంకేతిక జ్ఞాన అభివృద్ధి ఉన్న కాలంలో పేదరికం ఉండడం కూడా అంతే అసహజం.

సామ్రాజ్యవాదాన్ని అందుకే లెనిన్ యుద్ధం అన్నాడు. మృత్యువన్నాడు. అది ప్రజల్ని యుద్ధంలోకి లాగి మృత్యువు అంచుల్లోకి తీసుకెళ్లిపోతున్నది. అమెరికా ఉగ్రవాదం, ఇరాన్, సిరియాలపై ప్రదర్శిస్తున్న ఉగ్రవాదం, అది స్త్రీలపై, పిల్లలపై, సాధారణ ప్రజలపై సృష్టిస్తున్న హింసా బీభత్సాలు, భారతదేశ రాజకీయార్థిక విధానాలపై ప్రభావం ఈ విభాగంలో మార్కండేయ చర్చించాడు.

ఈ వ్యాసాలలోని అంశాలను వివరించి, విశ్లేషించి వ్యాఖ్యానించే ప్రయత్నం మొదటిభాగం గురించి చేసినట్లు చేస్తూపోతే దానికది ఒక పుస్తకమే అవుతుంది. మార్కండేయ పుస్తకాన్ని చదివే ఆసక్తిని పెంచడానికి తప్ప అంతకన్నా ఎక్కువ ఏం రాసినా ఆయనకు న్యాయం చేసినట్లు కాదు.

బూర్జువా పత్రికల్లో పనిచేసేవాళ్లు (2013 కన్నా పూర్వం నమస్తే తెలంగాణను దళారీ బూర్జువా పత్రిక అనడానికి కూడా వీలుందో లేదో విచికిత్స చేయాలి) కూడా పంక్తుల మధ్యన ప్రపంచీకరణ వలన పరాయీకరణకు గురవుతున్న ప్రజల గురించి ఎంత వేదనను, ఎంత వెలుగును ప్రసరించవచ్చునో ఈ వ్యాసాలు కూడా ఒక తార్కాణం. తెలంగాణలో ఇట్లా రాసిన, కలాలను ఆయుధాలుగా ఉపయోగించిన పత్రికా రచయితలు ఉండేవారు. ఇప్పుడు ఎవరైనా ఒకరిద్దరు మిగిలారా?!

నలభై వ్యాసాలు చదివే ఓపిక లేనివారికైనా లేదా నలభై వ్యాసాలు చదివే ఆసక్తి

కలిగి విడువకుండా చదువడానికైనా నేను ముందుగా రెండు వ్యాసాలు చదువమని రెకమెండ్ చేస్తాను. ఒక దాని గురించి పైన రాసాను. అది మొదటిభాగంలోని తొమ్మిదవ వ్యాసం 'ఆదివాసులపై మరో ఆక్రమణ'. రెండవది.. రెండవ భాగంలో ఉంది. పద్నాలుగవ వ్యాసం.(రెండవ భాగంలో మూడవ వ్యాసం). 'స్వార్థం.. ఉద్యమాలపై అస్త్రం..'

1971లో అప్పటిదాకా బయటి ప్రపంచానికి బాంబూ కర్టెన్ (వెదురు తెర)గా భావించబడే జన చైనాకు మొదటిసారిగా అమెరికా అధ్యక్షుడు నిక్సన్ వెళ్లాడు. అప్పటిదాకా అమెరికా కోసమే.. అమెరికా వల్లనే.. రష్యా దాని అనుయాయి దేశాలు తప్ప మిగతా ప్రపంచం చైనాను ఒక తెలియని ప్రపంచంగా దూరంగా ఉన్నాయి. చైనా శ్రామికవర్గ సాంస్కృతిక విప్లవంతో అందరికన్నా ఎక్కువ ఆసక్తి అమెరికాకే జన చైనా గురించి ఏర్పడింది. అక్కడ కార్మికవర్గ నాయకత్వంలో వెల్లువెత్తిన సాంస్కృతిక విప్లవం గురించి అమెరికా, యూరపులలోనే కాదు, ప్రపంచమంతా ఆసక్తి చూపింది. అప్పుడు నిక్సన్ వెళ్లాడు. ఆయన వెంట వెళ్లిన బృందంలో ఇంగ్లండ్‌కు చెందిన చరిత్రకారుడు, పత్రికా రచయిత మ్యాక్స్‌వెల్ ఉన్నాడు. 1962 భారత–చైనా యుద్ధం గురించి 'ఇండియాస్ చైనా వార్' పుస్తకంలో సరిహద్దు సమస్యను సామరస్యంగా పరిష్కరించుకోకుండా ఇండియానే చైనాను యుద్ధానికి కవ్వించిందని రాసాడు.

పెకింగ్ (బీజింగ్) విమానాశ్రయంలో దిగుతూనే మ్యాక్స్‌వెల్ బయటవున్న పెద్ద పెద్ద ప్రకటన బోర్డులు (హోర్డింగులు) చూసాడు. బూర్జువావర్గం నశించాలి.. శ్రామికవర్గం వర్థిల్లాలి.. అని. పక్కనే ఉన్న కమ్యూన్‌కు వెళ్లి ఆయన అక్కడ పనిచేస్తున్న కార్మికులను బూర్జువాలు అంటే ఏమిటి? అని అడిగాడు. వాళ్లకు వెంటనే ఏం సమాధానం చెప్పాలో తోచలేదు. వాళ్లలో వాళ్లు చర్చించుకొని స్వార్థపరులు అన్నారు. మ్యాక్స్‌వెల్‌కు ఇంక ప్రోలిటేరియట్ అంటే ఏమిటి అని అడిగే అవసరం రాలేదు. స్వార్థాన్ని వీడిన వాళ్లు.. స్వార్థానికి మూలమైన వ్యక్తిగతమైన ఆస్తిని రద్దు చేసిన వాళ్లు అని చెప్తారని. అటువంటి వర్గరహిత, రాజ్యరహిత, స్వార్థ రహిత ప్రపంచం కోసమే విప్లవం.

దండకారణ్యాన్ని చూడడానికి మావోయిస్టు పార్టీ ఆహ్వానంపై వెళ్లిన అరుంధతీ రాయ్‌కు అప్పటి దంతేవాడ జిల్లా ఎస్పీ రాహుల్‌శర్మ ఇంకొక వైపు నుంచి అదే మాట చెప్పాడట. "దంతెవాడలో యుద్ధ పరిస్థితులు పోయి శాంతి నెలకొనడానికి ఒకే ఒక మార్గముందని, అక్కడి ఆదివాసీలకు స్వార్థం నేర్పించాల"ని చమత్కరించాడట.

ఆయన ఆ తర్వాత 2012 ఫిబ్రవరి రెండవ వారంలో తన సర్వీసు పిస్టలుతో కాల్చుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎందుకో తెలుసుకోవాలంటే ఈ పుస్తకం చదవండి..

***– వరవరరావు,***

మే10, 2018

**నా మాట**

# జర్నలిజానికి నమస్తే..

సుమారు పదిహేడేళ్లకు పైగా విప్లవోద్యమంలో పనిచేసిన తర్వాత 2000 ఆగస్టులో కొన్ని స్వీయాత్మక బలహీనతలు, తొందరపాటు నిర్ణయం మూలంగా నేను అజ్ఞాతవాసానికి స్వస్తి చెప్పి ఈ ప్రపంచంలోకి వచ్చాను. నాపై ఉన్న కేసులను చట్టబద్ధంగా ఎదుర్కొని 43 రోజుల పోలీసు కస్టడీ, నాలుగు నెలల జైలు జీవితం అనంతరం అన్ని కేసుల్లో కోర్టు నుంచి బెయిలు పొంది బయటకు వచ్చాను. 1983లో పరీక్షలు రాసి ముగించిన డిగ్రీలో ఉత్తీర్ణుడనయ్యానని తెలిసి తదుపరి జీవితాన్ని ప్లాను చేసుకున్నాను. మావోయిస్టు పార్టీ నాకు నేర్పిన రాజకీయ, భాషా జ్ఞానాలను వినియోగించుకుని జర్నలిజంలోకి ప్రవేశించాలని నిర్ణయించుకున్నాను. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ప్రవేశపరీక్ష రాసి బీసీజేలో సీటు సంపాదించాను. సంవత్సరం తర్వాత దానిని ముగించి ఎంసీజేలో సైతం ఓయూ క్యాంపస్‌లో అడ్మిషన్ పొందాను. ఈలోగా మూతపడిన ఆంధ్రజ్యోతి దినపత్రికను పున:ప్రారంభిస్తున్నారని విని దరఖాస్తు చేసాను. ఆ సంస్థ ఎండీ రాధాకృష్ణ గారిని కలిసి నా గురించి వివరించాను. ఆయన వెంటనే స్పందించి నన్ను అప్పటి ఎడిటర్ రామచంద్రమూర్తి సార్, కట్టా శేఖర్‌రెడ్డి సార్‌లకు అప్పగించారు. అలా ఆంధ్రజ్యోతి జర్నలిజం కళాశాల మొదటిబ్యాచ్ విద్యార్థిగా వాళ్లిద్దరి శిక్షణలో 2002 సెప్టెంబర్ 5న నేను నా జర్నలిస్టు కెరీర్‌ను ఆరంభించాను.

అక్టోబర్ 15న ఆంధ్రజ్యోతి ప్రారంభమైనప్పటి నుంచి 10 నెలల పాటు సెంట్రల్ డెస్కులో పనిచేసాను. అక్కడ ఇప్పటి సాక్షి ఎడిటర్ మురళి సార్, ప్రెస్ అకాడమీ చైర్మన్ అల్లమన్న తదితర సీనియర్ జర్నలిస్టుల నుంచి చాలా నేర్చుకున్నాను. మావోయిస్టు పార్టీకి చెందిన సైనిక వ్యవహారాల పత్రిక జంగ్ వర్కింగ్ ఎడిటర్‌గా, వ్యాస రచయితగా, అనువాదకుడిగా గతంలో పనిచేసిన అనుభవం నాకు బాగా ఉపయోగపడింది. పత్రిక పెద్దల వద్ద మంచి మార్కులే కొట్టేసాను. అయితే, ఓ వైపు చాలీచాలని జీతం, మరోవైపు కోర్టుల చుట్టూ తిరగడానికయ్యే ఖర్చులు నన్ను బాగా ఇబ్బంది పెట్టాయి. ఇల్లు గడువడం కష్టమైంది. వేతనం పెంచమని లేదంటే కనీసం నన్ను సొంత జిల్లా కరీంనగర్‌కు

బదిలీ చేయమని నేను చేసిన విజ్ఞప్తికి ఎండీ గారు అంగీకరించారు. స్వగ్రామం ఏరడపల్లిలో మాకు ఇల్లు, కొంచెం పొలం వున్నాయి కనుక ఖర్చులు తగ్గుతాయని, కోర్టుకు వెళ్లడం కూడా సులువవుతుందని నా ఉద్దేశం. అలా 2003 జులైలో నన్ను సబ్ ఎడిటర్‌గా కరీంనగర్ యూనిట్‌కు పంపించారు. అదే నా జర్నలిస్టు జీవితానికి కీలకమలుపయింది. అక్కడ నా ప్రతిభను నిరూపించుకోవడానికి చక్కని అవకాశం దొరికింది. అనతికాలంలోనే కరీంనగర్ డెస్క్ ఇన్‌చార్జిగా, ఆ వెంటనే రెండు జిల్లాల (ఆదిలాబాద్–కరీంనగర్) ఎడిషన్ ఇన్‌చార్జిగా ప్రమోటయ్యాను. అక్కడ పనిచేసిన ఐదేళ్ల కాలంలో నేనేంటో నిరూపించుకున్నాను. 2009 ప్రారంభంలో ఏబీఎన్ చానల్ కోసమని నన్ను, మరికొందరిని హైదరాబాదుకు బదిలీ చేసారు. మొదట ఎన్నికల స్పెషల్ డెస్కులో, తర్వాత చానల్ ఆఫీసులో పనిచేసి ప్రత్యేక పరిస్థితుల్లో ఎండీ రాధాకృష్ణ గారి అభ్యర్థన మేరకు ఆంధ్రజ్యోతి హైదరాబాదు సిటీబ్యూరో ఇన్‌చార్జిగా బాధ్యతలు తీసుకున్నాను. సిటీ డెస్క్ పర్యవేక్షణ సైతం నిర్వహిస్తూ చీఫ్ రిపోర్టర్/చీఫ్ సబ్ ఎడిటర్ స్థాయికి ఎదిగాను.

2010 ఆగస్టు మొదటివారంలో శేఖర్‌రెడ్డి సార్ నాకు కాల్ చేసాడు. తెలంగాణ ఉద్యమానికి దన్నుగా ఒక దినపత్రికను ప్రారంభించడానికి టిఆర్ఎస్ అధినేత కేసీఆర్ సన్నాహాలు చేస్తున్నారని చెప్పాడు. ఆయనతో ప్రాథమిక చర్చలు ముగిసాయని, బయటకు వచ్చి నీతో మాట్లాడుతున్నానన్నాడు. నువ్వు కూడా లీడింగ్ టీంలో చేరితే బాగుంటుందని సూచించాడు. మరేమీ ఆలోచించకుండా నేను ఓకే చెప్పాను. పనిచేస్తున్నది ఓ పెద్ద పత్రిక అయినా, సరిపోయేంత వేతనం వస్తున్నా, ఆ సంస్థ ఎండీకి నాపై ఎనలేని విశ్వాసం ఉన్నా నేను నమస్తే తెలంగాణ (అప్పటికి ఇంకా ఆ పేరు ఖరారు కాలేదు) వైపే మొగ్గు చూపాను. ఉద్యమ పత్రికగా వస్తున్నది కనుక నా భావాలను ప్రజలతో పంచుకోవడానికి విస్తృత అవకాశాలు దొరుకుతాయని ఆశించడం అందుకు మొదటి కారణం. జర్నలిస్టు కెరీర్‌లో నాకు గురువుగా, మిత్రుడిగా, విమర్శకుడిగా ఉన్న శేఖర్‌రెడ్డి సార్ నుంచి ఆ ప్రతిపాదన రావడం రెండవ కారణం.

ఆ క్షణం నుంచే నేను నమస్తే తెలంగాణ కోసం పనిచేయడం ఆరంభించాను. పదవి ఏదో తెలువకున్నా, జీతం ఖరారు కాకున్నా శేఖర్‌రెడ్డి సార్‌తో టచ్‌లో ఉంటూ ఆయన చెప్పిన విధులను నిర్వర్తించాను. ఆ సంవత్సరం అక్టోబర్ 12న నమస్తేలో న్యూస్ ఎడిటర్‌గా చేరాను. అప్పటి పరిస్థితుల్లో నాకు న్యూస్ నెట్వర్క్ ఇన్‌చార్జి, స్టేట్‌బ్యూరో చీఫ్, సెంట్రల్‌డెస్క్ ఇన్‌చార్జి బాధ్యతల్లో ఏదో ఒకటి అప్పగించాలని శేఖర్‌రెడ్డి సార్, అప్పటికే పత్రిక ఎడిటర్‌గా చేరిన అల్లమన్న ఉద్దేశంగా ఉండింది. తగిన వ్యక్తులు దొరక్కపోతే బ్యూరో చీఫ్/సెంట్రల్‌డెస్క్ ఇన్‌చార్జిగా పనిచేయడానికి నేను సిద్ధమని, అయితే కింది స్థాయి జర్నలిస్టులతో నేరుగా సంబంధం ఉండే న్యూస్ నెట్వర్క్ ఇన్‌చార్జి

బాధ్యతలు నాకిష్టమని వారికి తెలిపాను.

తర్వాతికాలంలో నెట్వర్క్ ఇన్‌చార్జిగానే నేను నమస్తేలో చిరపరిచితుడనయ్యాను. అల్లమన్న లేదంటే శేఖర్‌రెడ్డి సార్‌లతో కలిసి అన్ని జిల్లాలు తిరిగి రిపోర్టర్లను రిక్రూటు చేసుకోవడం, డెస్క్ స్టాఫ్‌ను నియమించడం, టాబ్లాయిడ్ల రూపురేఖలను ప్లాన్ చేయడం వంటి బాధ్యతలను నిర్వర్తించాను. కిందిస్థాయి నుంచి వచ్చినవాడిని కనుకనూ, కార్మికవర్గ స్పృహ ఉండడం మూలంగానూ నేను ఏ రోజూ నా పోస్టును చూసి మురిసిపోలేదు. ఆఫీసు బాయ్ నుంచి ఎడిటర్ వరకూ బాధ్యతలు వేరైనా అందరూ బేసిక్‌గా మనుషులేనన్న సూత్రాన్ని పాటించాను. ప్రారంభకాలంలో అల్లమన్నకు అనధికార పీఏగా సైతం వ్యవహరించాను. పత్రిక ప్రారంభంలో నెలసరి వేతనాలిస్తున్నప్పుడు తన వద్ద సేఫ్ లేదు కనుక పెద్ద మొత్తంలో నగదును ఉంచలేనని క్యాషియర్ చెప్పినప్పుడు ఆ నగదును ఇంటికి తీసుకువచ్చి మరునాడు సిబ్బందికి పంపిణీ చేసే డ్యూటీ సైతం నిర్వర్తించాను. పత్రికలో నేను పనిచేసిన ఏడేళ్ల కాలంలో ఒక్కో జిల్లాకు కనీసం ముప్పై సార్లయినా వెళ్లివుంటాను. అలా కిందిస్థాయిలో పనిచేసే అనేక మంది రిపోర్టర్లతో నాకు సాన్నిహిత్యం ఏర్పడింది. నెట్వర్క్ అంతా ఒక టీంగా రూపుదిద్దుకుంది. ఉద్యమకాలంలో పత్రిక మనుగడకు అవసరమైనప్పుడు నెట్వర్క్ ఆధ్వర్యంలో అడ్వర్టయిజ్‌మెంట్స్ చేసి కంపెనీకి భారీగా రెవెన్యూ సమకూర్చాం. తెలంగాణ వచ్చిన తర్వాత ఆ అవసరం రాలేదు కానీ, పత్రికను రాష్ట్రంలో నెంబర్ వన్ చేయాలన్న లక్ష్యంతో మేనేజ్‌మెంటు ఇచ్చిన కర్తవ్యాలను విజయవంతంగా పూర్తి చేసాం. ఫలితంగా సర్క్యులేషన్ బాగా పెరిగింది.

అల్లమన్న, శేఖర్‌రెడ్డి సార్‌ల సహాయ సహకారాలతో ఎడిటోరియల్ పరంగా కూడా టాబ్లాయిడ్లలో అనేక మార్పులు తెచ్చాం. పేజీల సంఖ్య పెంచాం. స్థానిక వార్తల కోసం నియోజకవర్గ పేజీలు ప్రవేశపెట్టాం. అనేక శీర్షికలను, కొత్త ఫీచర్లను ప్రారంభించాం. పోటీ పత్రికలకు దీటుగా నమస్తే తెలంగాణను తీర్చిదిద్దే క్రమంలో అన్ని వర్గాల పాఠకుల ఆదరణ పొందేలా చర్యలు చేపట్టాం. కొత్త రాష్ట్రం ఎదుర్కొంటున్న సమస్యలను, ప్రజాభిప్రాయాన్ని, అన్ని పార్టీల, ప్రజాసంఘాల వార్తలను ప్రముఖంగా ప్రచురించాం.

ఈ క్రమంలోనే పత్రిక యాజమాన్యంలో మార్పు జరిగింది. కొత్త యాజమాన్యం వార్తల, వ్యాసాల ప్రచురణలో పరిమితులు విధించడం మొదలుపెట్టింది. ఈ పరిమితులు తర్వాతికాలంలో ఆంక్షలుగా మారి అధికార పక్షం వార్తలు తప్ప మరే వార్తలూ ప్రచురించవద్దనే వరకు వచ్చింది. ఏ పత్రిక యాజమాన్యానికైనా కొన్ని అభిప్రాయాలూ, ఆబ్లిగేషన్లూ ఉండడం సహజం. దానిని అర్థం చేసుకోవచ్చు. అయితే, అవి దినపత్రిక సహజ లక్షణానికి విరుద్ధంగా ఉండకూడదన్నది జర్నలిజం మౌలిక సూత్రం. అది

మరిచిపోతే పాఠకుల్లో పత్రిక విశ్వసనీయత తగ్గిపోతుంది. అప్పుడు ఏదైనా విషయాన్ని పేజీలకు పేజీలు రాసుకున్నా ప్రజలు నమ్మే పరిస్థితి ఉండదు. ఇదే విషయాన్ని నేను, నాతో పాటు లీడింగ్ టీంలో ఉన్న సీనియర్ జర్నలిస్టులు, కిందిస్థాయి రిపోర్టర్లు, డెస్క్ సిబ్బంది, సర్క్యులేషన్-అడ్వర్టయిజ్‌మెంటు విభాగాల పెద్దలు పలుమార్లు చర్చించాం. యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లాం.

ఇలాంటి విషయాల్లో సహజంగానే నేను కొంచెం ఎక్కువ చొరవ చూపాను. నా రాజకీయాభిప్రాయాల వల్లనూ, వివిధ వర్గాలకు, పార్టీలకు సంబంధించిన పాఠకుల్లో నా ఆధ్వర్యంలో సంవత్సర చందాలు భారీగా చేయించిన మూలంగానూ ఈ వైఖరి నాకు అనివార్యమైంది. అయితే, ఇదే నా ఉద్యోగం ఊడిపోవడానికి కారణమవుతుందని ఊహించలేదు. అననుకూల పరిస్థితుల్లో 2017 ఆగస్టులో నేను సంస్థ నుంచి రాజీనామా చేసి బయటకు వచ్చాను.

టీనేజీ వయసులోనే రంగనాయకమ్మ రచనల ప్రభావంతో నేను నాస్తికుడిగా మారాను. డిగ్రీ చదువుతున్నప్పుడు గతితర్కాన్ని, మార్క్సిజం-లెనినిజాన్ని అధ్యయనం చేసి భారతదేశంలో ఉన్న అర్థవలస-అర్థభూస్వామ్య వ్యవస్థను మార్చాలంటే నూతన ప్రజాస్వామిక విప్లవం మినహా మరో మార్గం లేదని మనస్ఫూర్తిగా నమ్మాను. నేను పుట్టిన కరీంనగర్ జిల్లాలోని జగిత్యాల, మెట్‌పల్లి, పెద్దపల్లి తదితర ప్రాంతాల్లో అప్పటికి సాగుతున్న రైతాంగ పోరాటాలు, చదివిన ఎస్సారార్ డిగ్రీ కళాశాలలో నడుస్తున్న విద్యార్థి ఉద్యమాలు నన్ను ప్రభావితుడిని చేసాయి. నేనున్న ప్రభుత్వ మేనేజ్‌మెంట్ హాస్టల్‌లో అమరుడు పులి రాములు మొదలుకొని అనేక మంది రాడికల్ విద్యార్థి నేతలు నన్ను అటు వైపు వెళ్లేలా ప్రోత్సహించారు. అమరుడు, అప్పటి పీపుల్స్‌వార్ జిల్లా కమిటీ సభ్యుడు అయిన సాయిని ప్రభాకర్, ప్రస్తుత మావోయిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి (అప్పుడు కరీంనగర్ జిల్లా కార్యదర్శి) ముప్పాళ లక్ష్మణ్‌రావు అలియాస్ గణపతిలతో నాలుగైదు సార్లు నేను జరిపిన సంభాషణలు చివరకు నన్ను ఆ పార్టీలోకి ఫుల్‌టైమర్‌గా చేరేలా చేసాయి.

మావోయిస్టు పార్టీలో ఫుల్‌టైమర్‌గా నేనున్న పదిహేడు సంవత్సరాల్లో వివిధ పట్టణాల ఆర్గనైజర్‌గా మూడేళ్లు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రకమిటీ చీఫ్ కొరియర్‌గా మూడేళ్లు పనిచేసాను. కొరియర్‌గా ఉన్నప్పుడే ఇంగ్లీష్ నుంచి తెలుగులోకి ముఖ్యంగా మిలిటరీ రచనలను అనువాదం చేయడం ఆరంభించాను. అది నా విప్లవ జీవితాన్ని మలుపు తిప్పింది. పార్టీలో ప్రత్యేకించి మిలిటరీ రంగానికి కేటాయించిన మొట్టమొదటి ఫుల్‌టైమర్‌ను నేనే కావడం విశేషం. తర్వాతి రోజుల్లో జంగ్ వర్కింగ్ ఎడిటర్‌గా, గెరిల్లా యుద్ధ మెలకువలపై వ్యాస/పుస్తక రచయితగా, అనువాదకుడిగా, మిలిటరీ

ఇన్‌స్ట్రక్టర్‌గా పనిచేస్తూ దేశంలోని అనేక ప్రాంతాలు తిరిగాను. పెరూ, ఫిలిప్పైన్స్, నేపాల్, శ్రీలంక, కాశ్మీర్, పంజాబ్‌లలో సాగిన గెరిల్లా పోరాటాలను సూక్ష్మస్థాయిలో పరిశీలించాను. అయితే, అధ్యయనమొక్కటే సరిపోదని గుర్తించి ప్రత్యక్ష ఆచరణలోకి దిగాను. దండకారణ్యంలో దళ కమాండరు స్థాయి నుంచి స్పెషల్ జోనల్ కమిటీ సభ్యుడిగా వివిధ బాధ్యతలు నిర్వహించి సిద్ధాంతానికీ ఆచరణకూ మధ్య ఉన్న సంబంధాన్ని తెలుసుకున్నాను. ఆదివాసుల్లో మావోయిస్టు పార్టీకి ఎంతటి ఉన్నతమైన స్థానముందో గుర్తించాను.

ఈ క్రమంలోనే నాలో కొన్ని వ్యక్తిగత బలహీనతలు ప్రవేశించాయి. వివిధ దేశాల విప్లవోద్యమాలను, గెరిల్లా పోరాటాలను మిలిటరీ కోణంలో అధ్యయనం చేసిన నేపథ్యంలో నేను స్వీయాత్మక ధోరణులకు గురయ్యాను. కేంద్ర నాయకత్వం కంటే కూడా మిలిటరీ విషయాలు నాకే ఎక్కువ తెలుసుననే భావంతో వాదించడం ఆరంభించాను. నేను పార్టీ ముందు పెట్టి, తిరస్కారానికి గురైన ప్రతిపాదనల్లో కొన్ని తర్వాతికాలంలో సరైనవని నిరూపించబడడం, స్వయానా కేంద్ర కమిటీ ఆ విషయాన్ని గుర్తించడం నాలో మరింత అహంభావాన్ని పెంచింది. ఫలితంగా నాకు కేంద్ర కమిటీ సమర్థతలపై విశ్వాసం సన్నగిల్లింది. ఆ సమయంలోనే రాజకీయంగా నాకు అత్యంత సన్నిహితుడైన కేంద్ర కమిటీ సభ్యుడు కామ్రేడ్ నల్లా ఆదిరెడ్డి కొయ్యూరు ఎన్‌కౌంటర్‌లో అమరుడు కావడం నా నైతిక స్థయిర్యాన్ని దెబ్బతీసింది. విశ్వాసం లేని కేంద్ర కమిటీ కింద పని చేయడం కంటే బయటకు వెళ్లడం మంచిదనే తొందరపాటు నిర్ణయం తీసుకున్నాను. విషాదమేమిటంటే ఏ విషయాల్లోనయితే నేను కేంద్ర కమిటీ సమర్థతలను శంకించానో, వాటిని పటాపంచలు చేసే నిర్ణయాన్ని నేను నాగపూర్ జైలులో ఉన్న కాలంలోనే మావోయిస్టు పార్టీ కార్యదర్శి కామ్రేడ్ గణపతి ప్రకటించారు. తీవ్ర పశ్చాత్తాపాన్ని వ్యక్తం చేయడం మినహా నేనేమీ చేయలేకపోయాను.

అందుకే పార్టీ బయటకు వచ్చాక, జర్నలిస్టుగా కుదురుకున్నాక వృత్తి బాధ్యతలు సంపూర్ణంగా నిర్వర్తిస్తూనే ప్రవృత్తిగా వ్యాసరచన చేయాలనుకున్నాను. నేను నమ్మిన భావాలను, వివిధ సమకాలీన అంశాలపై నాకేర్పడిన అభిప్రాయాలను ప్రజానీకంతో పంచుకోవడం ఆరంభించాను. ఆంధ్రజ్యోతిలో చేరిన మొదట్లోనే సెంట్రల్ డెస్క్ పనుల్లో భాగంగా అనేక కథనాలు రాసాను. జాతీయ-అంతర్జాతీయ అంశాలపై అనువాద రచనలు చేసాను. ఎడిట్ పేజీకి సైతం కొన్ని వ్యాసాలు రాసాను. కరీంనగర్‌కు బదిలీ అయిన తర్వాత నా పరిధి కుంచించుకుపోవడం మూలాన అవకాశం అంతగా దొరకలేదు. మానేరు ముచ్చట్లు పేరిట టాబ్లాయిడ్‌లో కొన్ని వారాలు కాలమ్ నిర్వహించినా అవి స్థానిక అంశాలపైనే ఆధారపడి రాసినవి. 2009లో తిరిగి హైదరాబాదుకు వచ్చి సిటీ

బ్యూరోచీఫ్‌గా బాధ్యతలు తీసుకున్న తర్వాత రాయడానికి తీరికే దొరకలేదు.

ఉద్యమ ఆకాంక్షలతో వచ్చిన నమస్తే తెలంగాణ నాకు ఆ అవకాశాన్ని కల్పించింది. పత్రికకు సంబంధించిన నెట్‌వర్క్, డెస్క్‌లు, టాబ్లాయిడ్లు కుదురుకున్న తర్వాత 2011 చివరి నుంచి 2013 జూలై వరకు సంపాదకీయ పేజీలో వ్యాసాలు రాసాను. నాకు అత్యంత ఆసక్తి ఉన్న అంశాలైన ప్రపంచీకరణ, పరాయీకరణ, ఉద్యమాలు, ప్రభుత్వాల నిర్బంధం, సామ్రాజ్యవాదం, ప్రజాప్రతిఘటన, విప్లవపార్టీలు తదితర అనేక జాతీయ అంతర్జాతీయ విషయాలపై కేంద్రీకరించాను. తెలంగాణ ఏర్పాటుపై కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ తీర్మానం చేసిన నేపథ్యంలో పేజీని మొత్తంగా ఆ అంశాలకే కేటాయిస్తే బాగుంటుందనే భావనతో తాత్కాలికంగా రాయడం ఆపేసాను. ఈలోగా తెలంగాణ కల సాకారం కావడం, టిఆర్ఎస్ గెలిచి ఉద్యమ నాయకుడే సీఎం పదవిని చేపట్టడం జరిగిపోయింది. పత్రిక అంతర్గత విషయాల్లోనూ భారీమార్పుల నేపథ్యంలో ఇక నేను రాయాల్సిన అవసరమూ రాలేదు.

ఈ పుస్తకంలోని వ్యాసాలన్నీ వివిధ పత్రికలు, పుస్తకాలు, వెబ్‌సైట్లలో వచ్చిన సమాచారం ఆధారంగా నాకున్న దృక్కోణంలో రాసినవే. ఒక్కో వ్యాసం కోసం కనీసం నాలుగైదు రోజుల పాటు నెట్‌ను జల్లెడ పట్టాను. ఉదహరణకి అమెరికాలో నయా బానిసలు రాయడానికి పదిహేను రోజులు పట్టింది. మరికొన్ని వ్యాసాల కోసం కూడా లోతైన అధ్యయనం చేసాను. నాకు పట్టున్న అంశాలపై మాత్రం సులభంగానే రాయగలిగాను. దొరికిన సమాచారంలో పరస్పర విరుద్ధంగా ఉన్న విషయాలను తర్కబద్ధంగా పరిశీలించాను. నాకున్న జ్ఞానంతో వ్యాసరూపంలో పాఠకుల ముందుంచాను.

ఇప్పుడీ వ్యాసాలనన్నింటినీ పుస్తకంగా తెద్దామని కొందరు మిత్రులు ప్రతిపాదించినప్పుడు ముందు నేను నిరాసక్తత ప్రదర్శించాను. పుస్తకం వేసుకునే స్థాయి నాకు లేదనిపించింది. అయితే, 'మలుపు' మిత్రుడు బాల్‌రెడ్డి నా వెంటపడి ఒప్పించాడు. నేను రాసిన వివిధ విషయాలను ఒకచోట చేర్చడం వల్ల ఉపయోగంగా ఉంటుందని కన్విన్స్ చేసాడు. నా పేరున ఇప్పటికే విరసం మిత్రులు ఒక చిన్న పుస్తకం (బస్తర్‌లో జనతన జైత్రయాత్ర) వేసివుండడం వల్ల ఒకరకంగా ఇది నా రెండవ పుస్తకం. పైన చెప్పినట్లు ఈ పుస్తకం క్రెడిట్ అంతా మిత్రుడు బాల్‌రెడ్డికే చెందుతుంది.

ఇక, ఈ వ్యాసాలన్నీ నమస్తే తెలంగాణలో ప్రచురితమవడానికి ప్రధాన కారకుడు అప్పటి ఎడిటర్ అల్లమన్న (మీడియా అకాడెమీ చైర్మన్ అల్లం నారాయణ).. ప్రేరకుడు నమస్తే తెలంగాణ అప్పటి సీఈఓ, ఇప్పటి ఎడిటర్ శేఖర్‌రెడ్డి సార్.. నిజానికి కాలమ్ రాయడానికి నన్ను ఒత్తిడి చేసింది వాళ్లిద్దరే. నమస్తే సంపాదకీయ పేజీలో అన్నీ తెలంగాణ రాష్ట్ర ఆకాంక్ష, ఆంధ్రా పాలకుల వివక్ష, వివిధ రంగాల్లో వెనుకబాటుతనం వంటి

అంశాలపైనే వ్యాసాలు వస్తున్నాయని, నువ్వు జాతీయ–అంతర్జాతీయ అంశాలపై రాయమని ప్రోత్సహించారు. ప్రతి వ్యాసాన్నీ చదివి మార్పులు సూచించారు. వాళ్లిద్దరికీ అలాగే నమస్తే తెలంగాణ దినపత్రిక యాజమాన్యానికీ నా హృదయపూర్వక కృతజ్ఞతలు.

తప్పులు లేకుండా, ఏమాత్రం కత్తిరించకుండా ఎడిట్ పేజీలో నా వ్యాసాలను అందంగా కూర్చిన మిత్రులు సామ మల్లారెడ్డి, ఆసరి రాజులకు కృతజ్ఞతలు.

అడగగానే తన విలువైన సమయాన్ని కేటాయించి, నా వ్యాసాల వెనుక ఉన్న రాజకీయ అవగాహనను లోతుగా చర్చించి, ముందుమాట రాసి ఈ పుస్తకాన్ని సర్వసమగ్రం చేసిన ప్రముఖ విప్లవ రచయిత వరవరరావు సార్‌కు విప్లవాభివందనాలు.

అందంగా, అర్థవంతంగా కవర్ డిజైన్ చేసిన రమణజీవికి కృతజ్ఞతలు.

**– డి. మార్కండేయ**
10 జూన్ 2018

# మొదటి భాగం

# ప్రపంచీకరణ.. పరాయీకరణ..

# పోస్కోపై పోరాటం

అభివృద్ధి ప్రాజెక్టుల పేరిట మూలవాసుల బతుకులను ఆగం చేస్తున్న బహుళజాతి కంపెనీలకు వ్యతిరేకంగా వర్తమానంలో కొనసాగుతున్న ఉద్యమాల్లో పోస్కో వ్యతిరేక పోరాటం ప్రముఖమైనది. రూ.60 వేల కోట్ల విదేశీ ప్రత్యక్ష పెట్టుబడితో ఏటా 12 మిలియన్ టన్నుల స్టీలును ఉత్పత్తి చేయడం లక్ష్యం గా భారీ కర్మాగారాన్ని నెలకొల్పడానికి పోస్కో కంపెనీ ఒరిస్సా ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకున్నది మొదలు స్థానికులు అత్యంత దృఢమైన, రాజీలేని పోరాటం కొనసాగిస్తున్నారు. జగత్‌సింగ్‌పూర్ జిల్లాలోని ఎనిమిది గ్రామాలకు చెందిన సుమారు నాలుగు వేల కుటుంబాలను బజారుకీడ్చే ప్రాజెక్టు తమకు వద్దే వద్దంటూ స్థానికులు పనులను అడ్డుకుంటున్నారు. ఒప్పందం కుదిరిన 15 రోజుల్లోనే పోస్కో ప్రతిరోధ్ సంఘర్ష్ సమితి (పోస్కో వ్యతిరేక పోరాట సమితి–పీపీఎస్ఎస్)పేరిట సంస్థను ఏర్పాటు చేసుకుని పోరాడుతున్నారు. పోస్కో ప్రేరేపిత గూండాలు దాడి చేసి నేతలను హత్య చేసినా, లాఠీచార్జీలు, అరెస్టులతో పోలీసు బలగాలు బీభత్సం సృష్టించినా వెనకడుగు వేయకుండా గత ఆరేళ్లుగా ప్రజాస్వామిక పద్ధతుల్లో ఉద్యమిస్తున్నారు.. పోస్కో ప్రాజెక్టును మరోచోటుకు తరలించాలని, తమ బతుకులు తమను బతుకనివ్వాలని డిమాండ్ చేస్తున్నారు.

దక్షిణ కొరియాకు చెందిన పోస్కో (పోహాంగ్ స్టీల్ కంపెనీ) ఒరిస్సాలోని జగత్‌సింగ్‌పూర్ జిల్లాలో భారీ ఉక్కు కర్మాగారాన్ని నెలకొల్పడానికి 2005 జూన్ 22న ఆ రాష్ట్ర ప్రభుత్వంతో ఎంఓయూ కుదుర్చుకున్నది. 2007 మేలో కేంద్ర ప్రభుత్వం ఈ ప్రాజెక్టును ప్రత్యేక ఆర్థిక మండలి(సెజ్)గా గుర్తించి అనుమతి మంజూరు చేసింది. ఒప్పందం ప్రకారం ధింకియా గ్రామం వద్ద భారీ ఉక్కు కర్మాగారం నిర్మిస్తారు. ఈ కర్మాగారానికి అవసరమైన ఇనుప ఖనిజం కోసం సుందర్‌గఢ్ జిల్లాలోని కండధర్ పర్వతశ్రేణుల్లో 6100 ఎకరాల ప్రాంతాన్ని, టౌన్‌షిప్ కోసం మరో 500 ఎకరాలను పోస్కోకు అప్పగిస్తారు. శుద్ధి చేసిన ఖనిజాన్ని, స్టీలును ఎగుమతి చేయడం కోసం పరదీప్ రేవుకు సమీపంలో పోస్కో స్వంత రేవును నిర్మించుకుంటుంది. కర్మాగారానికి

అవసరమైన నీటిని మహానది బ్యారేజీ నుంచి సరఫరా చేస్తారు. ఇనుప ఖనిజానికి టన్నుకు కేవలం రూ. 27 మాత్రమే (అంతర్జాతీయ మార్కెట్‌లో టన్ను ఇనుము ధర రూ. 7 వేలు ఉంది) పోస్కో కంపెనీ ప్రభుత్వానికి చెల్లిస్తుంది. 2016కల్లా ప్రాజెక్టు మొదలై ముందు సంవత్సరానికి 6 మిలియన్ టన్నుల ఉక్కు ను ఉత్పత్తి చేస్తూ క్రమంగా 12 మిలియన్ టన్నుల స్థాయికి చేరుకుంటుంది. కర్మాగారం కోసం ధింకియా తదితర ఎనిమిది రెవెన్యూ గ్రామాలకు చెందిన 4004 ఎకరాల భూమిని కేటాయించారు. ఇది కాకుండా ఓడరేవుకు సరుకుల రవాణా కోసం రోడ్డు, రైలు మార్గం, ఇతర సదుపాయాల కల్పనకు, టౌన్‌షిప్ అభివృద్ధికి అవసరమయ్యే 2–3 వేల ఎకరాల భూమిని సైతం అప్పగించారు. పోస్కో చెబుతున్న ప్రకారం ఈ భూకేటాయింపుల వల్ల 471 కుటుంబాలు (పెళ్లయిన వారందరిని యూనిట్‌గా తీసుకుంటే 718 కుటుంబాలు) ఇళ్లను, పంట పొలాలను కోల్పోతాయి. అయితే నిర్వాసితుల తరఫున పోరాడుతున్న పీపీఎస్ఎస్ చెబుతున్న సంఖ్య నాలుగు వేలకు పైగానే ఉంది. ఈ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఏ నిరసన కార్యక్రమాలకైనా, సభలకైనా 20 వేలకు మించిన సంఖ్యలో జనాలు రావడం చూస్తే ఏది నిజమో మనకు ఇట్టే అవగతమవుతుంది.

తమకు కేటాయించిన 4004 ఎకరాల్లో కేవలం 438 ఎకరాలు మాత్రమే ప్రైవేట్ వ్యక్తులకు చెందినదనీ, మిగతా 3566 ఎకరాలు ప్రభుత్వ అటవీ భూమనీ పోస్కో చెబుతున్నది. తాము ఏ చట్టాలనూ ఉల్లంఘించడం లేదని, తమ ప్రాజెక్టు మూలంగా ఈ ప్రాంతం సంపద్వంతమవుతుందని స్పష్టం చేస్తున్నది. భూమి కోల్పోయిన ప్రతి కుటుంబానికీ పరిహారం కింద ఎకరానికి పదకొండున్నర లక్షల రూపాయలు ఇవ్వడంతో పాటు పునరావాసం కల్పిస్తామని, కర్మాగారంలో ఉద్యోగం ఇచ్చేవరదాకా నెలకు రూ. 2250 చొప్పున అలవెన్సు ఇస్తామని మరోవైపు ప్రభుత్వం స్థానికులకు ఆశ జూపుతున్నది.

అయినప్పటికీ స్థానికులు ప్రాజెక్టు నిర్మాణానికి ససేమిరా అంటున్నారు. సాగుభూమిని, ఆదివాసుల ఆధీనంలో ఉన్న అటవీ భూమిని బహుళజాతి కంపెనీలకు ధారాదత్తం చేయడం చట్టాలను ఉల్లంఘించడమేనని పీపీఎస్ఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు అభయ్ సాహు ఆరోపిస్తున్నారు. కేటాయించింది ప్రభుత్వ భూమే అయినప్పటికీ దశాబ్దాల తరబడి ఆ భూములను స్థానిక ఆదివాసులు సాగు చేసుకుంటున్నారని, 2006లో పార్లమెంటు ఆమోదించిన అటవీ హక్కుల చట్టం ప్రకారం స్థానికంగా నివసించే తెగలకు అటవీ భూమితో పాటు ఇతర వనరులను ఉపయోగించుకునే హక్కు ఉందని చెబుతున్నారు. తమలపాకులు వంటి వాణిజ్యపంటలు పండిస్తూ స్థానికంగా స్వయం పోషక ఆర్థిక వ్యవస్థ వర్ధిల్లుతున్నదని, పారిశ్రామికీకరణ పేరిట ఆదివాసుల జీవన

విధ్వంసం తగదని ఆయన అన్నారు.

సాహూ నాయకత్వంలో 2005 జూలై 11 నుంచీ పోస్కో వ్యతిరేక ఆందోళన కొనసాగుతున్నది. ఓ ఆరు నెలల పాటు స్థానికులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించిన తర్వాత 2006 జనవరి 21న ప్రభుత్వ పునరావాస ప్యాకేజీని వివరించడానికి వచ్చిన మంత్రుల బృందం తమ గ్రామాలకు రాకుండా స్థానికులు అడ్డుకున్నారు. ఈ పోరాటంలో ప్రధానంగా మహిళలు ముందున్నారు. అప్పటి నుంచి పోస్కో ప్రైవేటు సైన్యంతో పాటు పోలీసు బలగాల సాయంతో ఇళ్ల నుంచి, పొలాల నుంచి స్థానికులను బలవంతంగా ఖాళీ చేయించే చర్యలను పీపీఎస్ఎస్ నాయకత్వంలో ప్రజలు తిప్పికొడుతున్నారు. 2008లో తపన్ మండల్ అనే పీపీఎస్ఎస్ నేతను పోస్కో గూండాలు చంపివేశారు. భారీయెత్తున పోలీసు బలగాలను మోహరించి పోలాంగ్, నౌగాం గ్రామాలకు చెందిన 1700 ఎకరాలను ప్రభుత్వం స్వాధీనం చేసుకున్నది. అయితే, కర్మాగార నిర్మాణ స్థలంగా భావిస్తున్న ధింకియా గ్రామం మాత్రం పట్టు సడలని దీక్షతో నిలబడింది. గ్రామం చుట్టూరా కంచెను నిర్మించి బయటివాళ్లు లోపలకు రాకుండా, లోపలివాళ్లు బయటకు వెళ్లకుండా చేసి, గ్రామానికి వచ్చే రోడ్డును తవ్వేసి గత ఐదేళ్లుగా పోస్కో ఆక్రమణను అడ్డుకుంటున్నారు.

నిజానికి పోస్కోతో ఎంఓయూ కుదుర్చుకున్నప్పటి నుంచీ ఆ ఒప్పందం ఆదివాసుల హక్కులను ఉల్లంఘిస్తోందని, అక్కడ జరుగుతున్న భూసేకరణ చట్టవిరుద్ధమని, ఓడరేవు నిర్మిస్తున్న చోట నివసించే ఆలివ్ రిడ్లీ జాతికి చెందిన అరుదైన తాబేళ్ల ఉనికికి ప్రమాదమన్న విమర్శలు వినవస్తూనే ఉన్నాయి. ఈ అంశాన్ని పరిశీలించడానికి భారత ప్రభుత్వం 2010 జూలైలో 19 మంది సభ్యులతో ఎన్‌సీ సక్సేనా కమిటీని వేసింది. ఒరిస్సాను పర్యటించి వివిధ వర్గాల ప్రజలను కల్సిన తర్వాత పోస్కోకు భూకేటాయింపు విషయంలో అటవీ హక్కుల చట్ట ఉల్లంఘన జరిగిందని ఈ కమిటీ తేల్చింది. పర్యావరణ, అటవీ శాఖ వెంటనే ఈ ప్రాజెక్టుకు ఇచ్చిన అనుమతిని వెనక్కి తీసుకోవాలని కోరింది. దరిమిలా పోస్కో పనులను ఆపేయాల్సిందిగా ఆ మంత్రిత్వ శాఖ 2010 ఆగస్టులో ఆదేశాలు జారీ చేసింది.

అయితే, సక్సేనా కమిటీ నివేదికను జీర్ణించుకోని భారత ప్రభుత్వం నలుగురు సభ్యులతో మీనా గుప్తా కమిటీని వేసింది. విస్తృత పరిశీలన తర్వాత 2010 అక్టోబర్‌లో ఈ కమిటీ భిన్నాభిప్రాయం కలిగిన నివేదికను విడుదల చేసింది. పోస్కోకు కేటాయించింది అటవీ భూములే అయినప్పటికీ అవి ఆదివాసుల ఆక్రమణలో లేవని, రైతులు, మత్స్యకారుల ఆధీనంలో ఉన్నవని కమిటీ చైర్‌పర్సన్ మీనా గుప్తా అభిప్రాయపడ్డారు. భూములు కోల్పోయిన వారిలో ఆదివాసులు కూడా ఉన్నారని, ఇది అటవీ హక్కుల చట్ట ఉల్లంఘన కిందకే వస్తుందని మిగతా ముగ్గురు సభ్యులు తేల్చి చెప్పారు. ఈ

మీనాగుప్తా కమిటీ నివేదిక ఆధారంగా పోస్కో ప్రాజెక్టుకు కేంద్ర పర్యావరణ, అటవీ శాఖ 2011 జనవరి 31న తిరిగి షరతులతో కూడిన అనుమతిని మంజూరు చేసింది. జూన్ 14న స్థానిక ప్రజల తీవ్ర నిరసనల నేపథ్యంలో ఒరిస్సా ప్రభుత్వం భూసేకరణను నిలిపివేసింది. సెప్టెంబర్ 8న అటవీశాఖ ఆధీనంలో ఉన్న భూముల సేకరణకు అనుకూలంగా ఒరిస్సా హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. అయితే, ప్రైవేట్ భూముల సేకరణను మాత్రం తదుపరి ఆదేశాలు ఇచ్చేవరకు నిలిపివేసింది.

2005 ఎంఓయూకు చెల్లుబాటు కాలం గడిచిపోవడంతో ప్రస్తుతం పోస్కోతో తిరిగి తాజాగా ఒప్పందం కుదుర్చుకునే పనిలో ఒరిస్సా ప్రభుత్వం ఉంది. ఈ లోపు నవంబర్ 25న పీపీఎస్ఎస్ చైర్మన్ అభయ్ సాహును ఓ వరకట్న హత్యలో నిందితుడిగా పేర్కొంటూ ఒరిస్సా పోలీసులు అరెస్టు చేశారు. మరికొన్ని తప్పుడు కేసులు కూడా బనాయించారు. సంస్థకు చెందిన క్రియాశీల కార్యకర్తలను సైతం జైలుపాలు చేశారు. 2008లో అరెస్టయి 14 నెలల పాటు నిర్బంధంలో ఉన్న సాహు మరోసారి జైలు నుంచే పోస్కో వ్యతిరేక పోరాటాన్ని నడిపిస్తున్నారు.

జగత్సింగ్‌పూర్ ప్రజలు దేశవాసులను ఒక అతి సామాన్యమైన ప్రశ్నను అడుగుతున్నారు. మేం ఇక్కడే పుట్టాం. ఇక్కడే పెరిగాం. మా ముత్తాతల ముత్తాతల నుంచీ ఇక్కడే ఉంటున్నాం. ఈ నేల మాది. అడవి మాది. మా ఇళ్లను, భూములను మేం ఎందుకు కోల్పోవాలి? కోల్పోవాలని నిర్ణయించడానికి వాళ్లెవరు? ప్రజాస్వామ్య దేశంలో తమకు కావల్సిందేదో నిర్ణయించుకునే హక్కు ప్రజలకే ఉంటుందంటారు కదా! ఆ హక్కు మాకు లేదా? అని. ఇదే ప్రశ్నను సింగూరు వాసులు, నందిగ్రాం వాసులు, మన రాష్ట్రంలోని కాకరాపల్లి వాసులు అడిగారు. అభివృద్ధి ప్రాజెక్టుల పేర భూములు కోల్పోయిన అనేక ప్రాంతాల ప్రజలు అడుగుతున్నారు.

ఈ ప్రశ్నకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత భారత పాలకుల పైన, రాజకీయ పక్షాల పైన, ప్రజాస్వామ్యవాదులు, మేధావుల పైన ఉంది. అభివృద్ధి అంటే బహుళజాతి సంస్థలకు తలుపులు బార్లా తెరిచి, సెజ్‌ల పేరుతో స్థానిక చట్టాల నుంచి మినహాయింపులు ఇస్తూ ఉచితంగా భూములను కట్టబెట్టడం, మూలవాసుల హక్కులను కొల్లగొట్టడం, స్థానిక సహజ వనరులను దోచుకెళ్లడం కాదని ఇప్పటికైనా గుర్తించాలి. ప్రజాభిప్రాయాన్ని గౌరవిస్తూ అభివృద్ధిలో స్థానికులకు భాగస్వామ్యం కల్పిస్తూ ప్రాజెక్టులను చేబట్టాలి. ఎంఓయూలు కుదుర్చుకోవాలి. స్థానికులు అంగీకరించిన తర్వాతనే భూసేకరణ చేయాలి. అలా కాకుండా బలప్రయోగానికి పూనుకుంటే సింగూరు, నందిగ్రాంలాగే కాకరాపల్లి, ధింకియాలూ లాల్‌గఢ్‌లు కాకతప్పదు.

***(నమస్తే తెలంగాణ, 10-01-2012)***

# తాగునీటి పరాయీకరణ

పీల్చే గాలి లాగే తాగే నీరూ ఉచితమనుకుంటున్న వారికి దుర్వార్త. మినరల్ వాటర్ పేరుతో ఇప్పటికే నీటిని అమ్మకపు సరుకుగా మార్చి దండిగా లాభాలు గడిస్తున్న సామ్రాజ్యవాదులు స్థానిక సంస్థల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కుళాయిల వ్యవస్థను కూడా ప్రైవేటీకరించే ప్రయత్నాల్లో ఉన్నారు. గతవారం (2012 ఫిబ్రవరి 1–3) బెంగుళూరు నగరంలోని ఓ ఐదు నక్షత్రాల హోటల్‌లో నిర్వహించిన ప్రపంచ నీటి సదస్సు ఈ దిశలో వ్యూహాలను రచించింది. నీటి నిర్వహణలో ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన పలువురు నిపుణులు, పరిశోధకులు, ప్రభుత్వేతర సంస్థల, బహుళజాతి కంపెనీల ప్రతినిధులు పాల్గొన్న ఈ సమావేశం నీటి సరఫరాకు సంబంధించి దేశం ముందున్న సవాళ్లను చర్చించింది. ప్రపంచం భవిష్యత్‌లో తీవ్ర నీటి కొరతను ఎదుర్కొనబోతున్నదని, సమగ్ర నీటి నిర్వహణకు తాగునీటి సరఫరా రంగాన్ని ప్రైవేటుకు అప్పజెప్పడం అవసరమని అభిప్రాయపడింది. సరిగ్గా ఇదే సమయంలో కేంద్ర నీటి వనరుల శాఖ జాతీయ జల విధానం–2012 ముసాయిదాను విడుదల చేసింది. నీటిని ఒక సరుకుగా గుర్తిస్తే తప్ప దాని వృథాను అరికట్టడం సాధ్యం కాదని తేల్చింది. నీటిని వ్యక్తిగత ఆస్తిగా కాకుండా సామాజిక ఆస్తిగా పరిగణించాలని, భారత అనుభోగ (ఈజ్‌మెంట్స్) చట్టం–1882ను ఇందుకు అనుగుణంగా సవరించాలని ఇందులో పేర్కొన్నారు. ప్రజలకు నీటి విలువ తెలిసిరావాలంటే జలాలకు ధరలు నిర్ణయించక తప్పదని చెప్పారు. తాగునీటి సరఫరా బాధ్యతల నుంచి ప్రభుత్వాలు వైదొలగాలని, కేవలం నియంత్రణ, పర్యవేక్షణలకు పరిమితం కావాలని సూచించారు.

విచిత్రమేమిటంటే 2005లో ప్రపంచ బ్యాంకు రూపొందించిన విధానపత్రంలోనూ సరిగ్గా ఇవే సూచనలున్నాయి. నీటిపారుదల, తాగునీటి సరఫరా, పారిశుధ్య రంగాల్లో ఆరోగ్యకరమైన పోటీని ప్రోత్సహించాలని బ్యాంకు సలహా ఇచ్చింది. 2011 ఫిబ్రవరి 28 నుంచి మార్చి 4 వరకు బెంగుళూరు, ముంబై నగరాలను సందర్శించిన అమెరికన్ వాటర్ ట్రేడ్ మిషన్ భారత్‌లో నీటి వ్యాపారానికి గల అవకాశాలను అన్వేషించింది.

ప్రముఖ వ్యాపారవేత్తలు, వాణిజ్యశాఖ ఉన్నతాధికారులు సభ్యులుగా ఉన్న ఈ మిషన్ భారత్‌లో దినదినం విస్తరిస్తున్న నీటివిపణిలోకి అమెరికన్ కంపెనీలను ప్రవేశపెట్టే దిశలో ఆయా రాష్ట్ర ప్రభుత్వాలతో చర్చలు జరిపింది.

మన దేశంలో తాగునీటి వ్యాపారం 1960లలో మినరల్ వాటర్ రూపంలో మొదలైంది. నీటిని కొనుక్కొని తాగే సంప్రదాయాన్ని ఇటలీ కంపెనీ బిస్లెరీ ప్రవేశపెట్టింది. గాజు సీసాల్లో నింపిన నీటిని ప్రధాన నగరాల్లో అమ్మడం ప్రారంభించారు. ఆ తర్వాత కోకాకోలా(కిన్లీ), పెప్సీకో(అక్వాఫినా), నెస్లె(ప్యూర్‌లైఫ్) వంటి బడా సంస్థలు ప్రవేశించాయి. గాజుసీసాలు కాస్తా పీవీసీకి, అంతిమంగా పెట్‌కూ మారాయి. మొదట ఢిల్లీ, ముంబై, కోల్‌కతా, చెన్నై వంటి మహానగరాలే ఈ వ్యాపారానికి వేదికలుగా ఉన్నా 90లలో వచ్చిన కలర్ టెలివిజన్ విప్లవం ఈ రంగ భవితవ్యాన్ని మార్చేసింది. మినరల్ వాటర్ తాగితే రోగాలు దరిచేరవని, రుచి, శుచితో పాటు ఆరోగ్యం మీ సొంతమవుతుందంటూ టీవీ ప్రకటనలు మధ్యతరగతి వర్గాలకు రంగుల కలలను చూపించాయి. ఫలితంగా నీటి వ్యాపారం వేగంగా విస్తరించింది. నగరాలు, పట్టణాల నుంచి పల్లెలకు మినరల్ వాటర్ బాటిళ్లు పయనమయ్యాయి. కరెంటు కూడా లేని మారుమూల పల్లెల్లో, ఆదివాసీగూడేల్లో సైతం నేడు వాటర్‌బాటిళ్లు, ప్యాకెట్లు దొరుకుతున్నాయంటే పరిస్థితిని మనం అర్థం చేసుకోవచ్చు. ప్రస్తుతం దేశంలో ఏటా రూ. 10 వేల కోట్ల మినరల్ వాటర్ వ్యాపారం వర్ధిల్లుతున్నది. ఇందులో పైన పేర్కొన్న 4 బహుళజాతి సంస్థల మార్కెట్ వాటా 80 శాతం కాగా మిగతా 20 శాతం వ్యాపారాన్ని దేశీయ కంపెనీలు చేసుకుంటున్నాయి. తమ వ్యాపారాన్ని మరింత విస్తరించడానికి, మూలమూలల్లోకి మినరల్ వాటర్ అలవాటును తీసుకెళ్లడానికి ఈ బహుళజాతి కంపెనీలు చేయని ప్రయత్నమంటూ లేదు.

అయితే, ఇప్పటికీ పశ్చిమ దేశాలతో పోల్చితే మన దేశంలో మినరల్ వాటర్ వినియోగం తక్కువే. అక్కడ తలసరి వినియోగం 111 లీటర్లు కాగా మన దేశంలో కేవలం అర లీటర్ మాత్రమే. ఇప్పటికీ మన పల్లెల్లో బావుల నుంచి, బోర్ల నుంచి, వాగుల నుంచి మంచినీటిని తోడుకుని తాగేవాళ్లే ఎక్కువ. దేశంలో ఉన్న 16 లక్షల గ్రామాల్లో కేవలం 4 లక్షల గ్రామాలకు మాత్రమే రక్షిత మంచినీటి సరఫరా వ్యవస్థ అందుబాటులో ఉందని స్వయంగా కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి జైరాం రమేష్ గత ఆగస్టులో రాజ్యసభలో ఓ ప్రశ్నకు సమాధానంగా చెప్పారు.

భారత నిర్దిష్ట పరిస్థితులను క్షుణ్ణంగా అధ్యయనం చేసిన బహుళజాతి సంస్థలు ఇక్కడి నీటి విపణిలో చొరబడడానికి ద్విముఖ వ్యూహాన్ని రచించాయి. నీటిని కొనడమేమిటన్న సగటు భారతీయుని మనస్తత్వాన్ని మార్చడం ద్వారా ఓ వైపు మినర

ల్ వాటర్ మార్కెట్‌ను పెంచుకుంటున్నాయి. రక్షిత మంచినీరు కరువైన చోట స్తోమత కలిగిన వర్గాలచే మినరల్ వాటర్‌ను కొనిపిస్తున్నాయి. మరోవైపు, నగరాలు, పెద్ద పట్టణాల మంచినీటి సరఫరా రంగంలోకి ప్రవేశించడానికి ఆయా రాష్ట్ర ప్రభుత్వాలతో ఒప్పందాలు కుదుర్చుకుంటున్నాయి. ఇప్పటికే కర్నాటకలోని హుబ్లీ-ధార్వాడ్, బెల్గాం, గుల్బర్గా నగరాల తాగునీటి సరఫరాను ఫ్రాన్స్ బహుళజాతి సంస్థ వియోలియా నిర్వహిస్తోంది. బెంగుళూరులోని కొన్ని ప్రాంతాలకు బ్రిటన్‌కు చెందిన థేమ్స్ నది కంపెనీ నీరందిస్తోంది. సైప్రస్ కంపెనీ హైడ్రో-కాంప్ మహారాష్ట్రలోని లాతూరు, తమిళనాడులోని మధురై నగరాలను చేజిక్కించుకుంది. టాటాకు చెందిన జస్కో (జంషెడ్‌పూర్ యుటిలిటీస్ అండ్ సర్వీసెస్ కంపెనీ) కర్నాటకలోని మైసూరు, జార్ఖండ్‌లోని జంషెడ్‌పూర్, బెంగాల్‌లోని హల్దియాల్లో, మధ్యప్రదేశ్ రాజధాని భోపాల్‌లోని కొన్ని ప్రాంతాల్లో నీటి నిర్వహణను చేపట్టింది. ఇంకా పలు నగరాలు, పట్టణాలకు తాగునీటిని సరఫరా చేయడానికి పలు కంపెనీలు రాష్ట్ర ప్రభుత్వాలతో, స్థానిక సంస్థలతో ఒప్పందాలు కుదుర్చుకునే ప్రక్రియ చాలా వేగంగా కొనసాగుతోంది.

ప్రైవేటీకరణ ద్వారానే పట్టణాల నీటి సరఫరా వ్యవస్థ మెరుగుపడగలదని ప్రపంచ బ్యాంకు సహా ఈ ప్రక్రియకు అనుకూలంగా ఉన్నవారు వాదిస్తున్నారు. వాడుకునే ప్రతి లీటర్‌కు బిల్లు చెల్లించాల్సివుంటుంది కనుక పౌరులు నీటిని వృథా చేయరని వీరంటున్నారు. పైపుల లీకేజీ, బిల్లుల వసూళ్లు, కనెక్షన్ల తొలగింపు, కొత్త కనెక్షన్ల మంజూరు, ఫిర్యాదులకు స్పందన తదితర విషయాల్లో ప్రైవేట్ సంస్థలు మెరుగైన పనితీరు కనబరుస్తాయని వివరిస్తున్నారు. జాతీయ జలవిధానం ముసాయిదాలో కేంద్ర ప్రభుత్వం సైతం ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేసింది.

అయితే, వాస్తవాలు మరోలా ఉన్నాయి. ప్రపంచ బ్యాంకు సహకారంతో పైలట్ ప్రాజెక్టుగా చేపట్టిన హుబ్లీ-ధార్వాడ్ నగరాల నీటి సరఫరా వ్యవస్థ పనితీరును ఓ పరిశోధకుల బృందం అధ్యయనం చేసింది. ఇక్కడ నీటి నిల్వలను ఎల్ అండ్ టీ కంపెనీ అందిస్తుండగా, సరఫరా-నిర్వహణ బాధ్యతలను వియోలియా సంస్థ చూస్తోంది. అధిక ఒత్తిడితో కూడిన స్వచ్ఛమైన నీటిని 24 గంటలు నిరంతర సరఫరా చేసే లక్ష్యంతో మొదలైన ఈ ప్రాజెక్టు చేదు అనుభవాలనే మిగులుస్తోందని బృందం తేల్చిచెప్పింది. ఇదివరకటి కంటే సరఫరా సమయం బాగా పెరిగినప్పటికీ వినియోగదారుల నుంచి వసూలు చేస్తున్న చార్జీలు అంతకంటే ఎక్కువే పెరిగాయని, నగరంలో 80 శాతం వరకు ఉన్న పేద, మధ్యతరగతి వర్గాలకు ఇది భారంగా మారిందని వివరించింది. అక్రమ కనెక్షన్ల క్రమబద్ధీకరణ పేరుతో మురికివాడల్లో నివసించే బడుగుల నుంచి వన్‌టైం చార్జీలు వసూలు చేశారని, వీధి కుళాయిలు కూడా కనుమరుగు కావడంతో

అభాగ్యులకు తాగేందుకు నీళ్లు కూడా దొరకని స్థితి ఏర్పడిందని చెప్పింది. కాంట్రాక్టులు, సబ్‌కాంట్రాక్టులు, సబ్‌లో మళ్లీ సబ్ కాంట్రాక్టుల ఫలితంగా పనుల్లో జాప్యం, పని తీరులో అసమర్థత కూడా గమనించామని పేర్కొంది.

ప్రభుత్వ-ప్రైవేట్ భాగస్వామ్యంలో పైలట్ ప్రాజెక్టుగా చేపట్టిన చోటే ఇలా ఉంటే ఇక తాగునీటి సరఫరా వ్యవస్థను ఏకంగా ప్రైవేట్‌కు అప్పగించిన చోట పరిస్థితి ఎలా ఉంటుందో మనం ఇట్టే అర్థం చేసుకోవచ్చు. లాభార్జనే ధ్యేయంగా పనిచేసే బహుళజాతి సంస్థలు తక్కువ పెట్టుబడులతో, అతితక్కువ నిర్వహణ వ్యయంతో ఎక్కువ లాభాలను ఆశించడం సహజం. హుబ్లీ-ధార్వాడ్‌లలాగే మిగతా నగరాల్లో ఇదే జరుగుతోంది. ఇంకా చెప్పాలంటే ఇప్పటివరకు మన దేశంలో ప్రైవేటీకరణ జరిగిన ఏ రంగంలోనైనా లాభపడుతున్నది బహుళజాతి సంస్థలు, దేశీయ కంపెనీలు కాగా, అంతిమంగా నష్టపోతున్నది సగటు మానవుడేనన్నది గుర్తించాల్సిన విషయం.

మన రాజ్యాంగం గుర్తించిన ప్రాథమిక హక్కుల్లో జీవించే హక్కు కీలకమైంది. ఈ జీవించే హక్కుకు మూలం గాలి, నీరు. తాగునీటిని ప్రజల సమష్టి ఆస్తిగా గుర్తించి దేశంలో నివసించే ప్రతి పౌరునికి ఎలాంటి షరతులు లేకుండా అందించాల్సిన బాధ్యత పాలకులపై ఉంటుంది. ఈ బాధ్యతను మరచిన ప్రభుత్వాలు వృథాను అరికట్టడం, భావి తరాలకు నీటి కొరతను నివారించడం, పర్యావరణాన్ని పరిరక్షించడం వంటి కుంటిసాకులతో జలాన్ని సరుకుగా చూడాలనడం, ధరను నిర్ణయించడం అసమంజసం. ప్రభుత్వ సంస్థలు, మున్సిపాలిటీలు, పంచాయితీలు లాభాపేక్ష లేకుండా దేశంలోని పలు నగరాలకు, పట్టణాలకు తాగునీటిని తరతరాలుగా సరఫరా చేస్తుండగా, ఆ విభాగాలను సమర్థతతో పనిచేయించాల్సిందిపోయి తన విధానాలతో ఆ వ్యవస్థలను నిర్వీర్యం చేస్తూ ప్రైవేట్‌కు అంటగట్ట చూస్తుండడం తగదు. ప్రపంచీకరణ, సరళీకరణ, ప్రైవేటీకరణ ముసుగులో ప్రజా ప్రయోజనాలను సామ్రాజ్యవాదులకు, బహుళజాతి సంస్థలకు తాకట్టు పెడుతున్న పాలకుల విధానాలను ప్రజలు వ్యతిరేకించాలి. స్థానిక సంస్థలకు మరిన్ని నిధులను, అధికారాలను సమకూర్చి వాటిని స్వయంపోషకంగా మార్చాలని, దాహం వేసిన ప్రతి వ్యక్తి దప్పిక తీర్చడం పౌరుల జన్మహక్కుగా గుర్తించాలని ఉద్యమించాలి.

***(నమస్తే తెలంగాణ, 14-02-2012)***

# కూడంకుళం.. కుట్ర ఎవరిది?

కూడంకుళం.. ఈ పేరు ఇటీవల తరచూ వార్తల్లోకెక్కుతోంది. రష్యా సహకారంతో రూ.17 వేల కోట్లతో తమిళనాడు కోస్తా తీరంలో ఉన్న ఈ గ్రామంలో చేపట్టిన అణువిద్యుత్ కేంద్రం వివాదాస్పదమైంది. అభివృద్ధి పేరిట తమ ఇళ్లను, జాగలను, బతుకుదెరువును మింగేయడమే కాకుండా భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన గాలిని, నీటిని, ఆహారాన్ని సైతం అందకుండాచేసే అణుకేంద్రం వద్దేవద్దని స్థానికులు అంటున్నారు. చెర్నోబిల్, ఫుకుషిమా దుర్ఘటనలు సంభవించి రేడియేషన్ ప్రభావంతో క్యాన్సర్ తదితర వ్యాధులు సోకి వేలాది మంది ప్రాణాలు కోల్పోయినా పాలకులు పట్టించుకోకపోవడం అన్యాయమని వాపోతున్నారు. సామ్రాజ్యవాదుల అండతో, బహుళజాతి కంపెనీల లాభాలే లక్ష్యంగా కొనసాగే అభివృద్ధి ప్రాజెక్టులను వ్యతిరేకించాలని, మూలవాసుల జీవన ప్రమాణాలను మెరుగుపర్చే స్వదేశీ విధానాలను అనుసరించాలని నినదిస్తున్నారు. అణుకేంద్రాన్ని ఎత్తేయాలని 24 ఏళ్లుగా శాంతియుత పద్ధతుల్లో పోరాడుతున్నారు.

స్థానికుల ఆకాంక్షలను, ఆవేదనను పట్టించుకోవాల్సిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉద్యమంపై విషప్రచారం చేయడం ద్వారా నిర్వీర్యం చేయడానికి ప్రయత్నిస్తున్నాయి. కూడంకుళం ఉద్యమం వెనకాల విదేశీశక్తుల హస్తం ఉన్నదని స్వయానా ప్రధాని ప్రకటించడం ఇందుకు ఉదహరణగా చెప్పవచ్చు. ప్రధాని ఆరోపణలను రష్యా సమర్థించింది. భారత-రష్యాల వ్యూహాత్మక మైత్రిని, అణు ఇంధన రంగంలో పరస్పర సహకారాన్ని ఇష్టపడని కొందరు కూడంకుళం కుట్రకు తెగబడ్డారని ఆ దేశ రాయబారి కడాకిన్ ఆరోపించారు. కూడంకుళం వ్యతిరేక పోరాటానికి నాయకత్వం వహిస్తున్న సంస్థలకు నిధులు ఎక్కడి నుంచి వస్తున్నాయో ఆరా తీయాలని కేంద్ర హోంశాఖ తన అధికారులను ఆదేశించింది. ఈ నేపథ్యంలో అసలు కూడంకుళంలో ఏం జరుగుతోందన్న చర్చ దేశవ్యాప్తంగా మొదలైంది.

తిరునల్వేలి జిల్లా కూడంకుళం గ్రామ పరిధిలో అణు విద్యుత్ కేంద్రం నెలకొల్పాలన్న ప్రతిపాదన మొట్టమొదటగా 1988లో వచ్చింది. రెండు అణు రియాక్టర్ల

సహాయంతో రెండు వేల మెగావాట్ల విద్యుత్తును ఉత్పత్తి చేసే ఒప్పందాన్ని అప్పటి ప్రధాని రాజీవ్‌గాంధీ, సోవియట్ యూనియన్ అధ్యక్షుడు గోర్బచేవ్‌తో ఒప్పందం కుదుర్చుకున్నారు. దీని ప్రకారం సోవియట్ యూనియన్ నీటితో చల్లబరిచే రెండు వీవీఈఆర్-1000 రకం రియాక్టర్లను సరఫరా చేస్తుంది. కూడంకుళంతోపాటు ఇదింతకరాయ్ గ్రామ పరిసరాల్లో సుమారు 27వందల ఎకరాల భూమిని స్థానికుల నుంచి సేకరించి అణువిద్యుత్ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తారు. రియాక్టర్లను చల్లబరచడానికి అవసరమైన నీటిని సమీపంలోనే ఉన్న పెచ్చిపరాయ్ డ్యాం నుంచి తరలిస్తారు. ప్లాంట్ నిర్మాణం మొదలుకొని పనిచేయించడం వరకు సోవియట్ కంపెనీలు చూసుకుంటాయి. అదే సంవత్సరం నిర్మాణపనులు మొదలయ్యాయి. భారీ పునరావాస ప్యాకేజీ, ఉద్యోగాలు, ప్రాంత అభివృద్ధిని ఎరగా చూపిన న్యూక్లియార్ పవర్ కార్పొరేషన్ (ఎన్‌పీసీ) అధికారులు ఎలాంటి ప్రజాభిప్రాయ సేకరణ లేకుండానే స్థానికుల నుంచి భూసేకరణ చేశారు. తమిళనాడు ప్రభుత్వ పీడబ్ల్యూడీ విభాగం ఓ జీఓను జారీ చేసింది. అణుకేంద్రానికి 16 కి.మీ. పరిధిలో పది వేలకు మించిన జనాభా ఉండరాదని, 20 కి.మీ. పరిధిలో నివసించే పౌరులందరికీ ఉచిత జీవిత బీమా కల్పించాలని ఇందులో పేర్కొన్నారు.

1991లో అటు సోవియట్ యూనియన్ కుప్పకూలిపోవడం, ఇటు టైగర్ల చేతిలో రాజీవ్‌గాంధీ హత్యకు గురికావడం నేపథ్యంలో కూడంకుళం ప్లాంట్ నిర్మాణాన్ని నిలిపివేస్తున్నట్లు ఎన్‌పీసీ ప్రకటించింది. తిరిగి 1997లో దేవేగౌడ ప్రధానిగా ఉన్న సమయంలో ఫైళ్లు మళ్లీ కదిలాయి. తీవ్ర సంక్షోభం నుంచి కోలుకుని పునరుజ్జీవం దిశగా సాగుతున్న రష్యా కూడంకుళం ప్లాంట్‌కు పావులు కదిపింది. భారీగా నిధులు సమకూర్చుకునేందుకు యుద్ధ విమానాలు, ట్యాంకులు తదితర సైనిక సామగ్రిని కట్టబెట్టడంతో పాటు అణుకేంద్రాన్ని నిర్మించి ఇవ్వడానికి ప్రతిపాదించింది. ఆ దేశాధ్యక్షుడు యెల్ట్సిన్‌తో ఒప్పందంపై సంతకాలు పూర్తి కాగానే పనులు వేగవంతమయ్యాయి. ఓడరేవు, రోడ్ల నిర్మాణం, సామగ్రి దిగుమతి కొనసాగింది. ముందనుకున్న రెండింటికి అదనంగా మరో నాలుగు రియాక్టర్లను జోడించి ప్లాంట్‌లో మొత్తం 9200 మెగావాట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేయాలని 2008లో ఇరుదేశాలు నిర్ణయించాయి. 2011 జులై ఒకటికల్లా మొదటి దశ నిర్మాణం పూర్తి కాగా, రియాక్టర్ టెస్ట్ రన్‌ను అధికారులు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్లాంట్ నుంచి దట్టమైన పొగ, భారీ శబ్దాలు రావడంతో స్థానికులు తీవ్ర భయాందోళనలకు లోనయ్యారు. పైగా, ప్రజలు తమ ముక్కులకు, నోళ్లకు మాస్కులు తగిలించుకోవాలని, అనుకోనిది ఏదైనా జరిగితే దూరంగా పారిపోవాలని అధికారులు మైకుల్లో హెచ్చరించడం వారిని కలవరపరిచింది. సాఫీగా సాగిపోతున్న తమ జీవితాలకు అణుకేంద్రం ముప్పుగా

పరిణమించిందన్న సత్యాన్ని గ్రహించి వీధుల్లోకి వచ్చారు.

నిజానికి కూడంకుళం ప్రజలు 1988లో ఒప్పందం జరిగినప్పటి నుంచే ప్లాంట్ నిర్మాణాన్ని వ్యతిరేకిస్తున్నారు. అప్పటికి చెర్నోబిల్ అణుప్రమాదం జరిగి రెండేళ్లే అయినా రేడియేషన్ మానవాళికి చేయగల కీడును వాళ్లు గ్రహించలేకపోయారు. ప్లాంట్‌కు అవసరమైన నీటిని తమ పొలాలకు జలాలనందిస్తున్న పెచ్చిపరాయ్ డ్యాం నుంచి తరలించడాన్ని మాత్రమే రైతులు తీవ్రంగా నిరసించారు. పరిశ్రమ నుంచి వెలువడే అణువ్యర్థ పదార్థాలు సముద్రంలో కలిస్తే చేపలు నాశనమవుతాయని తెలిసిన మత్స్యకారులు వీరికి మద్దతు తెలిపారు. సమతువ సముదాయ ఇయాక్కం(సామాజిక సమానత ఉద్యమం) నేతృత్వంలో తిరునల్వేలిలో భారీ ర్యాలీ నిర్వహించారు. కొన్ని అభ్యుదయ యువజన సంఘాలు చెన్నై నుంచి తిరునల్వేలికి సైకిల్ యాత్ర నిర్వహించాయి. అయితే ప్లాంట్ నిర్మాణాన్ని నిలిపివేస్తున్నట్లు ప్రకటించడంతో 1991లో ఈ పోరాటానికి బ్రేక్ పడింది.

రైతుల నుంచి ఎదురైన నిరసనను తగ్గించేందుకు 1997లో పనులను తిరిగి ప్రారంభించినప్పుడు ప్లాంట్‌కు అవసరమైన నీటిని పెచ్చిపరాయ్ నుంచి తరలించరాదని ప్రభుత్వం నిర్ణయించింది. అణు కేంద్రంలోనే వాటర్ రీసైక్లింగ్, డీసాలినేషన్ ఏర్పాటుకు ప్రతిపాదించింది. అయినప్పటికీ స్థానికుల నిరసన తప్పలేదు. వామపక్ష మేధావులు, అణుశక్తిని ఇంధనంగా వాడుకోవడాన్ని వ్యతిరేకించే సంస్థలు కల్పించిన అవగాహనతో ఈసారి ప్రజలు ఉద్యమించారు. నిరాహారదీక్షలు, ధర్నాలు, సభలు నిర్వహించి తమ నిరసనను తెలిపారు. 2008లో రియాక్టర్ల సంఖ్యను ఆరుకు పెంచడంతో ఈ నిరసన మరింత తీవ్రరూపం దాల్చింది. మత్స్యకారులే కాకుండా రైతులు, మధ్యతరగతి వర్గాలు, ప్లాంట్‌లో ఉద్యోగాలు, పనులు, కాంట్రాక్టులు పొందినవాళ్లు సైతం రేడియేషన్‌తో పొంచివున్న ముప్పును గుర్తించి ఉద్యమంలో చేరారు. ఈ నేపథ్యంలో అణుశక్తి వ్యతిరేక ప్రజా ఉద్యమం (పీపుల్స్ మూవ్‌మెంట్ అగేనెస్ట్ న్యూక్లియార్ ఎనర్జీ–పీఎంఏఎన్ఈ) పురుడు పోసుకుంది. కూడంకుళం అణు కేంద్రానికి వ్యతిరేకంగా కలిసివచ్చే వారిని, పార్టీలను సమీకరించి పోరాటాన్ని ఉధృతం చేసింది.

మొదటి రియాక్టర్ టెస్ట్ రన్ రోజు నుంచి పీఎంఏఎన్ఈ నేతృత్వంలో నిరసన కార్యక్రమాలు క్రమం తప్పకుండా కొనసాగుతున్నాయి. మార్చ్ 11న జపాన్‌లోని ఫుకుషిమా అణువిద్యుత్ కేంద్రంలో ప్రమాదం జరిగి ఘటనాస్థలంలోనే పలువురు చనిపోగా క్యాన్సర్‌కు వందలాది మంది బలవుతున్నారన్న వార్తలు ఉద్యమ బలాన్ని మరింత పెంచాయి. ఆగస్టు నెలంతా రిలే దీక్షలు చేసిన నిరసనకారులు సెప్టెంబర్ 11న ఆమరణ దీక్షకు దిగారు. దీక్షలకు మద్దతుగా మహిళలు రహదారులను

దిగ్బంధించారు. పది రోజుల తర్వాత స్పందించిన రాష్ట్ర ముఖ్యమంత్రి జయలలిత ఉద్యమ నేతలను చర్చలకు పిలిచారు. ప్రజల్లో నెలకొన్న భయాలను తొలగించేవరకు కూడంకుళం పనులను ఆపాల్సిందిగా కేంద్రాన్ని కోరుతూ కేబినెట్‌లో తీర్మానించారు. ప్రధానితో జరిగిన చర్చలు విఫలం కావడంతో అక్టోబర్ 13-16 వరకు వేలాదిమంది ప్లాంట్‌ను దిగ్బంధించారు. 18 నుంచి నేటి వరకు రిలే దీక్షలను నిరాటంకంగా కొనసాగిస్తున్నారు. కూడంకుళం ఉద్యమం వెనకాల ఎలాంటి విదేశీ శక్తులు లేవని పీఎంఏఎన్ఈ నేతలు స్పష్టం చేస్తున్నారు. స్థానికులు, మేధావులు, ఉద్యోగులు స్వచ్ఛందంగా ఇచ్చే విరాళాలతో తాము ఉద్యమం నడుపుతున్నామని సంస్థ కోఆర్డినేటర్ ఉదయ్ కుమార్ తెలిపారు. బాధ్యతాయుతమైన పదవిలో ఉన్న వ్యక్తి ఇలాంటి ఆరోపణలు చేయడం తగదని, ప్రధానిపై తాము త్వరలో పరువు నష్టం దావా వేస్తామని ప్రకటించారు. ప్రజల మనోభావాలు అర్థం చేసుకోకుండా, వారిపై రాజద్రోహం కేసులు పెట్టడం అన్యాయమన్నారు. కూడంకుళం ప్రాజెక్టును నిలిపివేస్తున్నట్లు ప్రకటించే వరకూ తమ పోరాటం ఆగదని స్పష్టం చేశారు.

ప్రజా సమస్యలపై పోరాడేవారిని నిందలపాలు జేయడం, విదేశీ శక్తుల కుట్రగా ఆరోపించడం, ఉగ్రవాద ముద్ర వేసి సైనికంగా అణచివేయడం భారత పాలకులకు కొత్త కాదు. ప్రపంచీకరణ, ప్రైవేటీకరణ పేరిట దేశ ప్రయోజనాలను సామ్రాజ్యవాదులకు, బహుళజాతి కంపెనీలకు తాకట్టు పెట్టడమన్నది మన్మోహన్‌సింగ్‌కు వెన్నతో పెట్టిన విద్య. అణుశక్తి ద్వారానే దేశానికి ఇంధన భద్రత చేకూరుతుందని తరచూ చెప్పే ప్రధాని దేశంలో నివసిస్తున్న కోట్లాది మందికి ఆహార, ఆరోగ్య, నీటి, ఉద్యోగ, జీవన భద్రతలు లేవన్న సంగతిని గుర్తించాలి. ప్రమాదం లేని విద్యుత్తును, రోగాలు లేని జీవితాలను, కలుషితం కాని పరిసరాలను, అందరికీ భాగస్వామ్యం కల్పించే అభివృద్ధిని డిమాండు చేస్తున్న కూడంకుళం వాసుల మొర ఆలకించాలి. తక్షణం కూడంకుళం అణువిద్యుత్ కేంద్రాన్ని ఆపేసి ప్రత్యామ్నాయ వనరులపై దృష్టిని కేంద్రీకరించాలి. మిగతా ప్రపంచ దేశాల్లాగే పవన, సౌర, జల, గ్యాస్ ఆధారిత విద్యుత్ పరిశ్రమలను ప్రోత్సహించాలి.

***(నమస్తే తెలంగాణ, 13-03-2012)***

# విధ్వంసమా? అభివృద్ధి 'వేదాంత'మా?

బహుళజాతి కంపెనీ వేదాంత ఇటీవలికాలంలో వార్తల్లో నిలిచింది. ఒరిస్సా రాష్ట్రంలోని నియాంగిరి పర్వతాలపై బాక్సైట్ తవ్వకాలను నిలిపివేస్తూ కేంద్ర పర్యావరణ శాఖ జారీ చేసిన ఉత్తర్వులను సవాలు చేస్తూ ఈ సంస్థ వేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టులో గత రెండేళ్లుగా విచారణ కొనసాగుతున్నది. పర్యావరణ చట్టాలను తాము ఉల్లంఘించలేదని, తమ మైనింగ్ అనుమతులను రద్దు చేస్తే ఆ ప్రాంత ఆదివాసుల అభివృద్ధి కుంటువడుతుందని వేదాంత తన పిటిషన్‌లో పేర్కొన్నది. బాక్సైట్ సరఫరా లేకపోతే లాంజిగఢ్‌లో తాము నెలకొల్పిన అల్యూమినియం శుద్ధి కర్మాగారం ఉత్పత్తి కార్యకలాపాలకు తీవ్ర ఆటంకం ఏర్పడుతుందని వివరించింది. ఒరిస్సా రాష్ట్ర ప్రభుత్వంతో తమకు ఒప్పందం ఉందని, పర్యావరణ శాఖ సైతం మొదట అనుమతినిచ్చి ఇప్పుడు రద్దు చేయడం అక్రమమని వాదించింది. వేదాంత వాదనలతో ఏకీభవిస్తూ ఒరిస్సా ప్రభుత్వ న్యాయవాది కూడా అత్యున్నత న్యాయస్థానంలో తమ అభిప్రాయాలను వినిపించారు. కాగా, నియాంగిరిలో వేదాంత కంపెనీ పర్యావరణ నిబంధనలను ఉల్లంఘించినట్లు రుజువు కావడం వల్లే తాము అనుమతిని ఉపసంహరించుకున్నామని కేంద్ర పర్యావరణ శాఖ తెలిపింది. అన్ని పక్షాల వాదనలను విన్న సుప్రీంకోర్టు వేసవి సెలవులకు ముందు తుది తీర్పు వెలువరిస్తామని రూలింగ్ ఇచ్చింది.

ఇక్కడ చర్చ వేదాంత గురించే. స్వల్ప పెట్టుబడులతో అనిల్ అగర్వాల్ అనే ముంబయి పారిశ్రామికవేత్త 1976లో ప్రారంభించిన ఈ సంస్థ ప్రస్తుత ఆస్తుల విలువ రూ. లక్షా 44వేల 450 కోట్లంటే ఎవరైనా ఆశ్చర్యపోక తప్పదు. వేదాంత చాలా వేగంగా దూసుకుపోవడానికి, ఖనిజ వనరుల రంగంలో మొనగాడుగా వర్ధిల్లడానికి ప్రస్తుత కేంద్ర హోం శాఖ మంత్రి చిదంబరం ఆశిస్సులే కారణమనే వారున్నారు. ప్రారంభ కాలంలో సంస్థ డైరెక్టర్లలో ఒకరిగా ఆయన ఉండేవారని, తర్వాతికాలంలో ఆయన రాజకీయ ఎదుగుదలతో పాటే వేదాంత పలుకుబడి కూడా బాగా పెరిగిందని వారంటారు. ఆయన సతీమణి ఇప్పటికీ సంస్థకు లీగల్ అడ్వైజర్‌గా పని చేస్తుండడమే

ఇందుకు తిరుగులేని సాక్ష్యమంటారు. యునైటెడ్ ఫ్రంట్, యూపీఏ ప్రభుత్వాల్లో ఆయన కీలక సభ్యునిగా ఉంటూ దేశంలోని అనేక ప్రాంతాల్లో కీలక మైనింగ్ కాంట్రాక్టులు ఇప్పించడంతోనే సంస్థ దశ తిరిగిందంటారు. ఆ విషయాల్లో నిజమెంతో చెప్పలేం కాని వేదాంత ఎదుగుదల క్రమం సహజంగా లేదన్నది మాత్రం అక్షర సత్యం.

వేదాంత రిసోర్సెస్ ప్రైవేట్ లిమిటెడ్ పేరుతో ఖనిజ వనరుల రంగంలో ప్రవేశించిన ఈ సంస్థ మొదట భారత్‌కే పరిమితమైంది. రాగి, అల్యూమినియం, జింక్, సీసం, ఇనుము, బంగారం తదితర రంగాల్లో కార్యకలాపాలు ప్రారంభించింది. 2003లో లండన్ స్టాక్ ఎక్స్ఛేంజీలో స్థానం సంపాదించింది. ఆస్ట్రేలియా, జాంబియా, నమీబియా, దక్షిణాఫ్రికా, లైబీరియా, ఐర్లాండ్‌కు విస్తరించింది. బ్యాంకింగ్ దిగ్గజం జెపి మోర్గాన్ మద్దతుతో పబ్లిక్ ఇష్యూకు వెళ్లి భారీయెత్తున పెట్టుబడులను సమీకరించింది. చర్చ్ ఆఫ్ ఇంగ్లాండ్ నుంచి మొదలుకొని పలు సంస్థలు పెట్టుబడులు సమకూర్చాయి. ఈ బలంతో, వరుస ప్రభుత్వాలు అనుసరించిన ప్రపంచీకరణ, ప్రైవేటీకరణ విధానాల దన్నుతో వేదాంత వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా అభివృద్ధి చెందింది. తన పెట్టుబడులతో స్టెరిలైట్ ఇండస్ట్రీస్, హిందుస్థాన్ జింక్ లిమిటెడ్, సెసా గోవా, బాల్కో(భారత్ అల్యూమినియం కంపెనీ), మాల్కో (మద్రాస్ అల్యూమినియం కంపెనీ), వేదాంత అల్యూమినియం, స్టెరిలైట్ ఎనర్జీ, ఆస్ట్రేలియన్ కాపర్ మైన్స్, కొంకోలా కాపర్ మైన్స్ వంటి సంస్థల కార్యకలాపాలను శాసిస్తోంది.

మధ్యభారతంలోని ఖనిజవనరులపై కన్నేసిన వేదాంత 1990ల చివరలో ఒరిస్సాలోని నియాంగిరి పర్వతశ్రేణుల్లో అపారమైన బాక్సైట్ నిల్వలున్నట్లు గుర్తించింది. ఇక్కడ మైనింగ్ హక్కుల కోసం లాబీయింగ్ ప్రారంభించింది. బాక్సైట్ తవ్వకాల కోసం, అల్యూమినియం శుద్ధి కర్మాగారాన్ని నెలకొల్పడం కోసం 2003లో ఒరిస్సా మైనింగ్ కార్పొరేషన్‌తో ఒప్పందం కుదుర్చుకుంది. తవ్వకాలు చేబడితే అది పర్యావరణంపై, జంతుజాలంపై, స్థానిక గిరిజనులపై ఎలాంటి ప్రభావం కలుగజేస్తాయనే విషయంపై భారీగా నిధులను సమకూర్చి నిపుణులతో అధ్యయనం చేయించింది. తనకు అనుకూలంగా నివేదికలు రాబట్టుకుంది. ఈ అధ్యయన నివేదికల ఆధారంగా కేంద్ర పర్యావరణ శాఖ తాత్కాలిక అనుమతిని సంపాదించింది. 2004లో లాంజిగఢ్‌లో 2060 ఎకరాల స్థలంలో అల్యూమినియం శుద్ధి కర్మాగారాన్ని నెలకొల్పింది. అయితే, నియాంగిరి కొండలపై బాక్సైట్ మైనింగ్ స్థానిక ఆదివాసుల జీవన విధ్వంసానికి కారణమవుతుందంటూ పీయూసీఎల్ తదితర ప్రజాసంఘాలు సుప్రీంకోర్టును ఆశ్రయించడంతో కొంతకాలం పాటు ప్రాజెక్టుకు బ్రేక్ పడింది. పలు దఫాల విచారణ అనంతరం లాభాల్లో ఐదు శాతం వాటాను స్థానిక ఆదివాసుల అభివృద్ధికి ఖర్చు పెట్టే

షరతుపై 2008 ఆగస్టులో కోర్టు మైనింగ్‌ను అనుమతించింది.

వేదాంత మైనింగ్‌ను వ్యతిరేకిస్తూ స్థానికులు కొనసాగిస్తున్న ఉద్యమం గురించి ఇక్కడ పేర్కొనాలి. ప్రాజెక్టు ప్రారంభమైన వెంటనే స్థానిక ఆదివాసులు సంఘటితమై నియాంగిరి సురక్షా సమితిని ఏర్పాటుచేసుకుని పోరాటం మొదలుపెట్టారు. నిరసన సభలు, ధర్నాలు, ఊరేగింపులు, బంద్‌లు నిర్వహించారు. వేదాంత పంపిన ఆదివాసేతర గూండాల దాడులను ఎదుర్కొంటూ ముందుకు సాగారు. మైనింగ్‌కు అనుకూలంగా సుప్రీంకోర్టు తీర్పునిచ్చిన తర్వాత ఈ ఉద్యమం మరింత తీవ్రరూపం దాల్చింది. గ్రీన్ కలహండి, కలహండి సచేతన్ నాగరిక్ మంచ్ వంటి సంస్థలు ఏర్పడి ఉద్యమంలో చేరాయి. నియాంగిరి కొండలపై నివసించే డోంగ్రియా, కుటియా కోందులు ప్రపంచంలోనే అరుదైన తెగలని, బాక్సైట్ మైనింగ్ వల్ల ఈ తెగల అస్తిత్వానికే ప్రమాదమని గుర్తించి పలువురు మేధావులు, సామాజిక కార్యకర్తలు, పర్యావరణ నిపుణులు రంగంలోకి దిగారు. వేదాంత తలపెట్టిన ప్రాజెక్టు అభివృద్ధికి మించి జీవన విధ్వంసాన్ని సృష్టిస్తుందని, పర్యావరణానికి ప్రమాదమని, భూగర్భ జలాలు అడుగంటుతాయని, జంతుజాలం నశిస్తుందని, ఇప్పటికే అల్యూమినియం కర్మాగారం వల్ల కలిగిన కాలుష్యం, పోగుబడిన వ్యర్థ పదార్థాలు ఇందుకు సాక్ష్యమని వీరు గొంతెత్తారు. ఫలితంగా అంతర్జాతీయ సమాజం స్పందించింది. మానవ హక్కుల సంస్థ ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్, సర్వైవల్ ఇంటర్నేషనల్ వేదాంత కార్యకలాపాలను వ్యతిరేకించాయి. నియాంగిరిలో జరుగుతున్న ఆదివాసుల హక్కుల హననంపై, చట్టాల ఉల్లంఘనపై నివేదికలు విడుదల చేశాయి. ఈ కారణంతోనే చర్చ్ ఆఫ్ ఇంగ్లాండ్ సహా బ్రిటన్‌కు చెందిన పలు వ్యాపార సంస్థలు వేదాంత నుంచి తమ షేర్లను ఉపసంహరించుకున్నాయి.

నియాంగిరి ఆదివాసుల పోరాటం, అంతర్జాతీయంగా పెల్లుబికిన నిరసన నేపథ్యంలో కేంద్రం ఎన్ సీ సక్సేనా నేతృత్వంలో నలుగురు నిపుణులతో కమిటీ వేసింది. ఈ కమిటీ 2010 ఆగస్టు 16న తన నివేదికను సమర్పించింది. అటవీ సంరక్షణా చట్టాన్ని, అటవీ హక్కుల చట్టాన్ని, పర్యావరణ పరిరక్షణ చట్టాన్ని, ఒరిస్సా అటవీ చట్టాన్ని వేదాంత ఉల్లంఘించిందని, రాష్ట్ర ప్రభుత్వ అధికారులు ఆ సంస్థతో కుమ్మక్కయ్యారని నివేదికలో పేర్కొన్నారు. నియాంగిరిలో మైనింగ్ వల్ల రెండు అతి పురాతన తెగల అస్తిత్వానికి ప్రమాదమేర్పడుతుందని తేల్చారు. ఇలాంటి చర్యలు ప్రజల్లో ప్రత్యేకించి గిరిజనుల్లో ప్రభుత్వాలపై, చట్టాలపై నమ్మకం పోయేలా చేస్తాయని వివరించారు. ఆ వెంటనే ఆగస్టు 24న వేదాంత కంపెనీకి ఇచ్చిన పర్యావరణ అనుమతులను రద్దు చేస్తున్నట్లు కేంద్ర మంత్రి జైరాం రమేష్ ప్రకటించారు.

అయితే, సమస్య ఇంతటితో సమసిపోలేదు. ఒరిస్సా ప్రభుత్వ దన్నుతో, కేంద్రంలోని

కొందరు పెద్దల ప్రోత్సాహంతో వేదాంత తిరిగి సుప్రీంను ఆశ్రయించింది. తమ ప్రాజెక్టుకు ఇచ్చిన అనుమతిని రద్దు చేయడం అక్రమమని, గతంలో కోర్టు ఆదేశించిన మేరకు నియాంగిరి ప్రాంత ఆదివాసుల అభివృద్ధికి ఇతోధికంగా తోడ్పడుతున్నామని పేర్కొంది. లాంజిగఢ్ ప్రాజెక్టు ఏరియా డెవలప్‌మెంట్ ఫౌండేషన్‌ను ఏర్పాటు చేసి రూ. 17 కోట్ల పనులను చేపట్టామని తెలిపింది. పిటిషన్‌పై విచారణ కొనసాగుతున్నది.

కాగా, మసకబారిన తన ప్రతిష్ఠను పెంచుకోవడం కోసం ఇటీవల వేదాంత భారీ ప్రచార కేంపెయిన్‌ను ఆరంభించింది. ఆదివాసుల అభివృద్ధే తమ వేదాంతమని స్పష్టం చేసింది. దేశంలోని ఆదివాసులకు తాము చేస్తున్న మేలును తెలుపుతూ జాతీయ ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాల్లో భారీగా ప్రకటనలను విడుదల చేసింది. మధ్య భారతంలోని అనేక నగరాల పొలిమేరల్లో హోర్డింగులు ఏర్పాటు చేసింది. 550 గ్రామాలకు చెందిన 27 లక్షల మంది గిరిజనులు తమ అభివృద్ధి కార్యక్రమాల మూలంగా లబ్ధి పొందు తున్నారని తెలిపింది. రెండున్నర లక్షల మంది పిల్లలకు పోషకాహారాన్ని, 22 లక్షల మందికి వైద్యసేవలను అందిస్తున్నామని, 10 లక్షల మంది విద్యార్థులకు కంప్యూటర్ విద్యను ఉచితంగా నేర్పుతున్నామని, కోటి 20 లక్షల చెట్లు నాటామని వివరించింది. వేదాంత యూనివర్సిటీని, ఆస్పత్రులను నెలకొల్పుతున్నామని ప్రకటించింది. ఆదివాసుల అభివృద్ధి గిట్టనివారే తమకు వ్యతిరేకంగా కుట్రలు చేస్తున్నారని, ఉద్యమాలు నడుపుతున్నారని విమర్శించింది.

లాభాలే లక్ష్యంగా ఏర్పడిన బహుళజాతి కంపెనీ వేదాంత అభివృద్ధి మంత్రం జపించడం దయ్యాలు వేదాలు వల్లించడమే అవుతుంది. ఛత్తీస్‌గఢ్, ఒరిస్సాల్లోని బాక్సైట్, ఇనుప గనుల్లో పెట్టుబడులు పెడుతున్నది ఆదివాసులను ఉద్ధరించడానికేనని చెప్పడం పచ్చి అబద్ధం. టన్ను ఖనిజానికి వందల్లో ఆయా రాష్ట్ర ప్రభుత్వాలకు రాయల్టీ రూపేణా చెల్లించి వేల రూపాయలకు అంతర్జాతీయ మార్కెట్లో అమ్ముకోవడం ఏ రకంగా ప్రజాసేవో దేశ ప్రజానీకం ఆలోచించాల్సిన సమయం ఆసన్నమైంది. ఓ వేదాంత బహుళజాతి దిగ్గజంగా మారడానికి, మరో జిందాల్ సామ్రాజ్యం విస్తరించడానికి, పోస్కో, మిట్టల్ వంటి కంపెనీలు ఇక్కడ పాగా వేయడానికి ఆదివాసీ ప్రాంతాల్లో దండిగా ఉన్న వనరుల దోపిడీయే కారణమని గుర్తించాలి. మధు కోడాలు, గాలి జనార్ధన్‌రెడ్డిలు తయారుకావడానికి, విచ్చలవిడిగా కుంభకోణాలు జరగడానికి, సమాజంలో అవినీతి పెచ్చరిల్లడానికి మూలాలు కూడా ఈ దోపిడీలోనే ఉన్నాయని అర్థం చేసుకోవాలి. రెడ్ కారిడార్ బూచిని చూపుతూ మధ్య భారతాన్ని కార్పొరేట్ కారిడార్‌గా మార్చడానికి యత్నిస్తున్న పాలకుల కుటిల విధానాలకు వ్యతిరేకంగా ఉద్యమించాలి.

***(నమస్తే తెలంగాణ, 15-05-2012)***

# మురికి వాడలపై 'మమత' కరువు!

కోల్‌కటా మహానగరంలోని నోనదంగా మురికివాడ ఇటీవల ఉద్యమాలు, అరెస్టులతో అట్టుడికిపోతోంది. దేశంలోనే పేరుగాంచిన ఈ మురికివాడకు చెందిన మజ్దూర్‌పల్లి, శ్రామిక్‌కాలనీల్లోని 200 గుడిసెలను మార్చ్ 30న కోల్‌కటా మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ (కేఎండీఏ) అధికారులు కూల్చివేశారు. తమకు నిలువ నీడ లేకుండా చేయవద్దని స్థానికులు నెత్తీ నోరూ బాదుకున్నా కనికరం చూపించలేదు. వందలాది మంది సాయుధ పోలీసుల పహరాలో నిర్మాణాలను బుల్డోజర్లు కూల్చివేస్తుంటే ఇళ్లల్లోని సరుకు, సామాగ్రిని మున్సిపల్ సిబ్బంది కాల్చివేశారు. ఫలితంగా వేయి మందికి పైగా నిరుపేదలు ఉన్నపళంగా రోడ్డున పడ్డారు. మా..మట్టీ.. మనుష్.. నినాదంతో, సింగూరు, నందిగ్రాం పోరాటాల స్ఫూర్తితో, బెంగాల్ తలరాతను మార్చే పాలననందిస్తానంటూ అధికారంలోకి వచ్చిన దీదీ మమతాబెనర్జీ హయాంలో ఇలా జరగడమేమిటని నివ్వెరపోయిన జనం ఆ వెంటనే కోలుకుని ఉద్యమబాట పట్టారు. ప్రభుత్వ భూమి అయినంత మాత్రాన ప్రత్యామ్నాయం చూపించకుండా, కనీసం ముందస్తు నోటీసు ఇవ్వకుండా దొంగల్లాగా దాడి చేయడం అన్యాయమని మొత్తుకున్నారు. పునరావాసం కల్పించకుండా ఈ గుడిసెల నుంచి ఖాళీ చేయించబోమని హామీలిచ్చిన మంత్రులు ఎక్కడ దాక్కున్నారని ఆగ్రహం వెళ్లగక్కారు. తమకు గృహవసతి కల్పించే వరకూ ఇక్కడ నుంచి కదలబోమని భీష్మించుకున్నారు. కూల్చివేతలు కొనసాగిన ప్రాంతంలోనే తాత్కాలికంగా టెంట్లను ఏర్పాటుచేసుకుని బైఠాయించారు. ఉఛేడ్ ప్రతిరోధ్ కమిటీ (కూల్చివేతల ప్రతిఘటన కమిటీ)ని ఏర్పాటు చేసుకుని ముందుకు సాగుతున్నారు. పలు ప్రజా సంఘాలు, అనేక మంది మేధావులు వీరికి సంఘీభావం ప్రకటించగా, రాష్ట్ర ప్రభుత్వం మాత్రం ఉక్కుపాదం మోపి వీరి పోరాటాన్ని అణచివేయాలని ప్రయత్నిస్తోంది.

ఏప్రిల్ 4న నోనదంగా వాసులు చేబట్టిన నిరసన ర్యాలీపై పోలీసులు, తృణమూల్ గూండాలు విరుచుకు పడ్డారు. ఈ ఘటనలో ఓ గర్భిణి, మరో పసిబాలుడు సహా

పలువురు గాయపడ్డారు. 8న మరోమారు భారీ ప్రదర్శన తలపెట్టగా, పోలీసులు 69 మందిని అరెస్టు చేసి అందులో పలువురిపై అక్రమ కేసులు బనాయించి జైలుకు పంపించారు. వెనక్కి తగ్గని నిరసనకారులు మరునాడు మళ్లీ ప్రదర్శనకు సిద్ధం కాగా మరో 91 మందిని అరెస్టు చేశారు. ఆ తర్వాత రోజుల్లోనూ నిర్వాసితులు ర్యాలీలు, ధర్నాలు, దీక్షలను కొనసాగిస్తుండగా అదే స్థాయిలో పోలీసుల అరెస్టులు, తృణమూల్ కార్యకర్తల దౌర్జన్యాలూ కొనసాగుతున్నాయి. స్థానికులతో పాటు వారి పోరాటానికి మద్దతునిస్తున్న ప్రజాసంఘాల నేతలను, ప్రముఖ మేధావులను సైతం పోలీసులు నిర్బంధిస్తున్నారు. వివాదం రోజురోజుకూ ముదురుతోంది.

ఇక్కడ నోనదంగా ప్రత్యేకత గురించి కొంత చెప్పుకోవాలి. ఏ మురికివాడ అయినా సాధారణంగా బతుకుదెరువు వేటలో ఉట్టిచేతులతో పట్టణాలకు వలస వచ్చిన కూలీలు, నిరుపేదలు నిలువ నీడ కరువైన స్థితిలో ఖాళీగా ఉన్న ప్రభుత్వ స్థలంలోనో, మురికికాలువ ఒడ్డునో, రైల్వే ట్రాక్ పక్కనో, చెరువుశిఖంలోనో గుడిసెలు, టెంట్లు వేసుకున్న ఫలితంగా ఏర్పడుతుంది. నోనదంగా మురికివాడ మాత్రం అలా ఏర్పడలేదు. నగరాన్ని సుందరీకరించడంలో భాగంగా కోల్‌కటాలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న అనేక మురికివాడలను తొలగించిన ఫలితంగా ఏర్పడింది. పట్టణ పేదలకు మౌలిక వసతుల కల్పన పథకం(బీఎస్‌యూపీ) పేరిట అప్పటి వామపక్ష ప్రభుత్వం నగరం నడిమధ్యలో గల మురికివాడల నుంచి పేదలను ఖాళీ చేయించి శివారులో ఉన్న నోనదంగాలో పునరావాసం కల్పించింది. కేవలం 160 చదరపు అడుగుల విస్తీర్ణంతో అచ్చం అగ్గిపెట్టెల్లాంటి గదులు కలిగిన అపార్ట్‌మెంట్లను నిర్మించింది. ఒక్కో కుటుంబానికి కేవలం ఒకే గదిని కేటాయించింది. టాయిలెట్లు, డ్రైనేజీ, తాగునీరు వంటి ప్రాథమిక సౌకర్యాలను కూడా కల్పించకపోవడంతో కాలక్రమంలో నోనదంగా అధికారిక మురికివాడగా మారిపోయింది. ప్రభుత్వమే ఈ స్థలాన్ని చూపించింది కనుక ఇక్కడ అడ్డా వేస్తే అధికారులు వచ్చి కూల్చివేయడముండదనే ధీమాతో ఆ తర్వాతికాలంలో నగరం నుంచే కాకుండా రాష్ట్రం నలుమూలల నుంచీ ఉపాధి కరువైన ఇళ్లు లేని అభాగ్యులు వచ్చి ఇక్కడి ఖాళీస్థలాల్లో గుడిసెలు వేసుకున్నారు. వరుస కరువు మూలంగా అప్పుల పాలై భూములు అమ్ముకున్న రైతులు.. ఆసరా కరువైన చేతివృత్తుల వాళ్లు.. ఐలా తుపాను బాధితులు.. ఇలా అనేక మంది తరలిరావడంతో కొద్దికాలంలోనే నోనదంగా జనాభా భారీగా పెరిగింది. అనేక కాలనీలుగా విస్తరించింది.

అయితే, ఒకప్పుడు కోల్‌కటాకు శివారుగా ఉన్న నోనదంగా ఇప్పుడు నగరం నడిబొడ్డుగా మారడం అక్కడి పేదల పాలిట శనిలా దాపురించింది. మహానగరంలోని ఖాళీ స్థలాలన్నింటినీ మింగేసిన రియల్ భూతం నోనదంగాపై కన్నేసింది. కోల్‌కటాను

లండన్‌గా మార్చడం తన చిరకాల స్వప్నమంటూ చెప్పిన మమత అధికారంలోకి రావడం వారికి కలిసివచ్చింది. ఇంకేం.. పబ్లిక్–ప్రైవేట్ భాగస్వామ్యం(పీపీపీ) పేరిట నోనదంగాలో ఉన్న 80 ఎకరాల కేఎండీఏ స్థలాన్ని 99 సంవత్సరాల లీజుకు కార్పొరేట్‌కు కట్టబెట్టారు. మల్టీప్లెక్స్‌లు, షాపింగ్‌మాళ్లు, స్టార్ హోటళ్లు, బహుళ అంతస్తుల గృహసముదాయాలను నిర్మించడానికి పథకాలు రచించారు. అందులో భాగంగానే మజ్దూర్‌పల్లి, శ్రామిక్ కాలనీలపై బల్దియా అధికార గణం యుద్ధం ప్రకటించింది.

కాగా, కూల్చివేతలు ఇంతటితో ఆగిపోవని వివిధ స్వచ్ఛంద సంస్థల కార్యకర్తలు చెబుతున్నారు. లాకేపల్లి, భాయ్‌భాయ్ కాలనీ, సుభాస్‌పల్లి, బాస్తుహర కాలనీ వంటి అన్ని మురికికాలనీలనూ కూల్చివేయడానికి కుట్ర జరిగిందంటున్నారు. మజ్దూర్‌పల్లి, శ్రామిక్‌కాలనీలు కేవలం 19 ఎకరాల స్థలంలోనే విస్తరించివుండగా, లీజు ఒప్పందంలో 80 ఎకరాల స్థలమని పేర్కొనడంలోనే ఈ కుట్ర దాగుందని పేర్కొంటున్నారు.

విచిత్రమేమిటంటే, బెంగాల్‌లో సుదీర్ఘకాలం కొనసాగిన లెఫ్ట్ ఫ్రంట్ పాలనను కూలదోయడంలో తృణమూల్ అధినేత్రి మమతా బెనర్జీకి ఇతోధికంగా తోడ్పడినవి సింగూరు, నందిగ్రాం ఉద్యమాలు. ఈ రెండు ఉద్యమాలు కూడా అభివృద్ధి ప్రాజెక్టుల పేరుతో మూలవాసులను నిర్వాసితులను చేయడానికి వ్యతిరేకంగా సాగిన ఉద్యమాలు. ఈ ఉద్యమాల్లో మమత కీలక పాత్ర పోషించారు. బుద్ధదేబ్ సర్కారుపై సమరశంఖం పూరించారు. మావోయిస్టులతో సైతం దోస్తీ చేసి పోరాటాన్ని క్రియాశీలంగా నడిపించారు. చివరకు ఆ ప్రాజెక్టులను రద్దు చేయించారు. ఇప్పుడు నోనదంగాలోనూ సింగూరులో, నందిగ్రాంలో జరిగిందే జరుగుతున్నదని బెంగాల్ మేధావిలోకం కోడై కూస్తున్నది. ప్రత్యామ్నాయం చూపకుండా వేలాది మంది నిరుపేదలను నిరాశ్రయులను చేయడం అక్రమమంటున్నది. సింగూరుకో న్యాయం, నోనదంగాకో న్యాయమా అని ప్రశ్నిస్తున్నది. ప్రతిపక్షంలో ఉండగా నిర్వాసితుల పక్షాన నిలబడ్డ మమత అధికారంలోకి రాగానే కార్పొరేట్లకు అనుకూలంగా మారి అభివృద్ధి జపం చేయడమేమిటని నివ్వెరపోతున్నది. లెఫ్ట్ ఫ్రంట్ ప్రభుత్వ ముసుగు తొలగడానికి దశాబ్దాలు పడితే, మమత తృణమూల్ అసలురంగు కేవలం ఏడాదికాలంలోనే బయటపడిందని విమర్శిస్తున్నది.

అయితే, ఇది ఒక్క నోనదంగా సమస్య కానే కాదు. అభివృద్ధి పేరిట, సుందరీకరణ పేరిట దేశంలోని అన్ని నగరాల్లోనూ మురికివాడల్లో నివసించే పేదలను నిరాశ్రయులు చేసే ప్రక్రియ ప్రపంచీకరణానంతర కాలంలో విచ్చలవిడిగా కొనసాగుతోంది. నగరాల నడిమధ్యలో గల మురికివాడల స్థానంలో కార్పొరేట్ షాపింగ్‌మాళ్లు వెలుస్తున్నాయి. ప్రశ్నించిన నిర్వాసితులపై రాజ్యం ఉక్కుపాదం మోపుతోంది. ఢిల్లీలోని ఆనంద్‌పర్బత్ ప్రాంత మురికివాడలను ఇటీవల తొలగించగా, ఘర్ బచావో మోర్చా ఏర్పడి పోరాటం

కొనసాగిస్తున్నది. బెంగుళూరులోని ఇజిపురాలోనూ మార్చ్‌లో మురికివాడలను కూల్చివేయగా నిర్వాసితులు సంఘటితమై ఉద్యమించారు. ముంబయిలోని ధరావి, గోలిబార్, నేతాజీనగర్, పడాల్‌వస్తిలో, చెన్నైలోని మాంబలం, నోచికుప్పంలో, ఇతర అనేక నగరాల్లోని మురికివాడల్లో ఇలాంటి అనేక ఘటనలు గతంలో జరిగాయి. ప్రస్తుతం జరుగుతున్నాయి. మన హైదరాబాద్‌లో సైతం భీంరావుబాడ, నాగమయ్యకుంట, బతుకమ్మకుంట, శంకర్‌నగర్ తదితర మురికివాడల్లో కూల్చివేతలు కొనసాగాయి. ఒకచోట ఆశ్రయం కోల్పోయిన పేదలు మరోచోట మరో మురికివాడలో తలదాచుకుంటున్నారు.

2010లో నేషనల్ శాంపిల్ సర్వే ఆర్గనైజేషన్(ఎన్‌ఎస్‌ఎస్ఓ) సేకరించిన వివరాల ప్రకారం దేశంలోని 5వేల 161 పట్టణాలు, నగరాల్లో 49 వేల మురికివాడలున్నాయి. వీటిల్లో సుమారు 9కోట్ల 30 లక్షల మంది ప్రజలు దుర్భర పరిస్థితుల్లో బతుకులీడుస్తున్నారు. 2001 జనాభా లెక్కల ప్రకారం ముంబయిలో అత్యధికంగా 64లక్షల 75వేల మంది, రాజధాని ఢిల్లీలో 18లక్షల 51వేల మంది, కోల్‌కటాలో 14లక్షల 85వేల మంది, చెన్నైలో 8లక్షల 20వేల మంది, మన హైదరాబాద్‌లో 6లక్షల 27వేల మంది, బెంగుళూరులో 4లక్షల 31వేల మంది మురికివాడల్లో నివసిస్తున్నారు. ఇక మన రాష్ట్రంలోని వివిధ పట్టణాలు, నగరాల్లో 51లక్షల 87వేల మంది మురికివాడల్లో బతుకుతున్నారు. ఆందోళన కలిగించే విషయమేమిటంటే రోజురోజుకు ఈ మురికివాడల్లో నివసించే జనాభా పెరుగుతోంది. 1981లో 2కోట్ల 79లక్షల మందిగా ఉన్న ఈ జనాభా 2011 నాటికల్లా మూడు రెట్లు పెరగడం గమనార్హం. ఈ ధోరణిని గమనించే కాబోలు కేంద్ర గృహ, పట్టణప్రాంత పేదరిక నిర్మూలన శాఖ మంత్రి కుమారి సెల్జా 2010 సెప్టెంబర్‌లో ఓ సంచలన ప్రకటన చేశారు. ఐదేళ్ల కాలంలో సాధించాలని యూపీఏ లక్ష్యంగా పెట్టుకున్న మురికివాడల రహిత భారత్ అనేది సమీప భవిష్యత్‌లో సాకారం కావడం అసాధ్యమని తేల్చిచెప్పారు.

ఇప్పటికైనా పాలకులు తమ విధానాలను మార్చుకోవాలి. నగరాల సుందరీకరణ పేరిట మురికివాడలను ఖాళీ చేయించడం, కార్పొరేట్ సంస్థలకు, రియల్ వ్యాపారులకు ప్రభుత్వ స్థలాలను కట్టబెట్టడం మానుకోవాలి. మురికివాడల్లో నివసిస్తున్న వేలాది మంది కూడా ఈ దేశ పౌరులేనని గుర్తించాలి. ఆశ్రయం పొందే హక్కు జీవించే హక్కులో భాగమేనని, మురికివాడల్లో నివసించే వారిని బలవంతంగా వెళ్లగొట్టడం తగదంటూ గతంలో సుప్రీంకోర్టు ఇచ్చిన రూలింగ్‌ను శిరసావహించాలి. నోటిఫైడ్ స్లమ్స్ అభివృద్ధి కోసం భారీగా నిధులు కేటాయించి అన్ని సౌకర్యాలు కలిగిన కాలనీలుగా మార్చాలి. రాజీవ్ ఆవాస్ యోజనలో ఎలాంటి అవకతవకలు జరగకుండా చర్యలు తీసుకోవాలి.

నాన్–నోటిఫైడ్ స్లమ్స్‌ను స్థానిక పరిస్థితులను బట్టి చట్టబద్ధం చేయాలి. లేదంటే అక్కడ నివసిస్తున్న పేదలకు ప్రత్యామ్నాయ గృహ వసతి కల్పించిన తర్వాతే ఖాళీ చేయించాలి. దేశంలో డజన్ల కొలదిగా ఉన్న నోనదంగాలపై మమత చూపించాలి.

*(నమస్తే తెలంగాణ, 29–05–2012)*

# త్వరలో కొత్త భూ'తర్పణ' చట్టం..

ఈ నెల చివరివారంలో ప్రారంభం కానున్న పార్లమెంటు వర్షాకాలపు సమావేశాల్లో కొత్త భూసేకరణ, పునరావాస చట్టం ఓటింగుకు రానున్నది. 1894లో బ్రిటిష్ వాళ్లు ప్రవేశపెట్టిన పాత చట్టంలోని లొసుగులను సవరించే ఉద్దేశంతో తెస్తున్న ఈ నూతన చట్టం సైతం లోపభూయిష్టంగా, ప్రజావ్యతిరేకంగా ఉందన్న విమర్శలు వెల్లువెత్తు తున్నాయి. ముఖ్యంగా ప్రజాప్రయోజనాలను నిర్వచించే విషయంలో బ్రిటిష్ చట్టాన్నే అనుసరించడం పట్ల నిరసన వ్యక్తమవుతోంది. గత సంవత్సరం సెప్టెంబర్ 7న కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి జైరాం రమేశ్ ఈ ప్రతిపాదిత బిల్లును లోక్‌సభలో ప్రవేశపెట్టగా అధ్యయనం కోసం దానిని స్టాండింగ్ కమిటీకి నివేదించింది. బిల్లులోని అంశాలను కూలంకషంగా పరిశీలించిన స్టాండింగ్ కమిటీ కొన్ని మార్పులను సూచించింది. లాభం ప్రాతిపదికగా పనిచేసే కంపెనీలకు, పబ్లిక్–ప్రైవేట్ భాగస్వామ్య సంస్థలకు ప్రభుత్వాలు భూమిని సేకరించి పెట్టడం తగదని, బహిరంగ మార్కెట్‌లో నేరుగా అవి కొనుక్కునే విధంగా చట్టాన్ని సవరించాలని అభిప్రాయపడింది. భూమిని సేకరించే విషయంలో, నష్టపరిహారాన్ని, పునరావాసాన్ని నిర్ణయించడంలో రాష్ట్ర ప్రభుత్వాలకు, ముఖ్యంగా స్థానిక గ్రామసభలకు విస్తృత అధికారాలివ్వాలని, అప్పుడే రైతులకు న్యాయం జరుగుతుందని పేర్కొంది. దేశమంతా ఒకే తరహా పునరావాస ప్యాకేజీని రుద్దడం తగదని సలహా ఇచ్చింది. సెజ్‌ల కోసం, రైల్వేలైన్ల కోసం, జాతీయ రహదారుల కోసం చేసే భూసేకరణను కూడా ప్రస్తుత చట్ట పరిధిలోకి తేవాలని, సేకరించిన భూమిని సంబంధిత అవసరాల కోసం పదేళ్ల లోపు వినియోగించని పక్షంలో ఆ భూమిని పాత యజమానులకు అప్పగించే విధంగా చట్టాన్ని మార్చాలని సిఫారసు చేసింది.

అయితే, కమిటీ ఇచ్చిన సలహాలను, సూచనలను కేంద్రం పూర్తిగా పెడచెవిన పెట్టింది. ప్రైవేట్ కంపెనీలకు అనుకూలంగా ఉండే బిల్లునే చట్టరూపంలో ఆమోదించడానికి నిశ్చయించుకుంది. పేదల భూములను పెద్దలకు, విదేశీ గద్దలకు

అప్పనంగా కట్టబెట్టే యూపీఏ సర్కారు విధానాలను పలువురు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. అపార ఖనిజసంపదలున్న భారతావనిని కార్పొరేట్లకు అప్పగించే కుట్రలో భాగంగానే కొత్త చట్టం వస్తోందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పురాతన కాలంలో ప్రజలందరి ఉమ్మడి ఆస్తిగా ఉన్న భూమికి రాచరిక యుగంలో తొలిసారిగా యాజమాన్య హక్కు అమలులోకి వచ్చింది. సైనికబలంతో ఒక ప్రాంతాన్ని జయించిన రాజు తన బంధుగణానికి, సేనాధిపతులకు, అనుచరులకు, ఇష్టులకు, సేవలు చేసిన వారికి మాన్యాలు, రాజ్యాలు అప్పగించడం ప్రారంభమైంది. ఆ మాన్యాల రైతుల నుంచి వీళ్లు శిస్తు, కౌలు వసూలు చేసుకునేవారు. బ్రిటిష్ వాళ్లు వచ్చాక పట్టాదారు హక్కుపత్రం (టైటిల్‌డీడ్) విధానాన్ని ప్రవేశపెట్టారు. భూముల అమ్మకాలు, కొనుగోళ్లు మొదలయ్యాయి. ఆ కాలంలో నామమాత్రపు ధరలే ఉండేవి. స్వాతంత్ర్యానంతరం ప్రత్యేకించి పంచవర్ష ప్రణాళికలు, హరితవిప్లవం నేపథ్యంలో ఈ ధరల్లో పెరుగుదల నమోదైంది. ప్రపంచీకరణ, ప్రైవేటీకరణల ఫలితంగా 1990ల తర్వాత పట్టణాల్లో రియల్ ఎస్టేట్ ఆకాశాన్ని తాకింది. పల్లెల్లో సైతం భూముల ధరలు అనూహ్యంగా పెరుగుతున్నాయి. అటవీ, పర్వత ప్రాంతాలు తప్ప వృథా భూములన్నవి నేడు దాదాపుగా లేవు. అవి కూడా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధీనంలోనే ఉన్నాయి.

ప్రైవేట్ యాజమాన్యం కింద ఉన్న భూముల్లో అభివృద్ధి ప్రాజెక్టుల స్థాపన ప్రతిపాదనల నేపథ్యంలో భూసేకరణ చట్టాలు అవసరమయ్యాయి. ముఖ్యంగా అప్పటి విప్లవాత్మక ఆవిష్కరణల్లో ఒకటైన రైల్వేల కోసం ప్రైవేట్ వ్యక్తుల భూములు స్వాధీనం చేసుకోవడం తప్పనిసరైంది. 1894లో బ్రిటిష్ ప్రభుత్వం ఆమోదించిన భూసేకరణ చట్టంలో ఈ మేరకు పలు అంశాలను పొందుపర్చారు. (గనులకు భూసేకరణ కోసం 1885లోనే విడిగా చట్టం తెచ్చారు.) అభివృద్ధి ప్రాజెక్టుల కోసం, ప్రభుత్వ రంగ సంస్థలతో పాటు ప్రైవేటు కంపెనీల కోసం భూమిని సేకరించేందుకు ఇందులో వీలు కల్పించారు. ఈ చట్టం ప్రకారం ఓ ప్రైవేట్ కంపెనీ కోసం సైతం ప్రభుత్వం భూమిని సేకరించి పెట్టవచ్చు. అందుకు స్థానిక ప్రజల సమ్మతి అక్కరలేదు. సామాజిక, పర్యావరణ ప్రభావాలను పట్టించుకోనక్కరలేదు. మార్కెట్ విలువపై ఆధారపడి అప్పటికి ఆ భూమిని ఏ రకంగా వినియోగించుకుంటున్నారనే విషయాన్ని బట్టి కేవలం నష్టపరిహారం మాత్రమే చెల్లిస్తారు. పునరావాసం ఊసే లేదు. సేకరించిన భూమిలో సంబంధిత ప్రాజెక్టును చేపట్టకున్నా పూర్వపు యజమానికి తిరిగి దఖలు పర్చడం ఉండదు. ఈ చట్టాన్ని అస్త్రంగా ఉపయోగించుకుని ప్రభుత్వాలు దాదాపు అన్ని సందర్భాల్లోనూ బల ప్రయోగంతోనే భూసేకరణ చేస్తుండేవి.

గమనించాల్సిన విషయమేమిటంటే, స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత కూడా ఏ

ప్రభుత్వమూ ఒక సమగ్ర భూసేకరణ చట్టాన్ని తేలేకపోయాయి. అవసరాల మేరకు 1956లో జాతీయ రహదారుల కోసం, 1962లో అణువిద్యుత్ ప్రాజెక్టుల కోసం, 1989లో రైల్వేల కోసం, 2005లో సెజ్ (ప్రత్యేక ఆర్థిక మండళ్లు)ల కోసం భూసేకరణ చట్టాలను ఆమోదించాయి. తదనంతర కాలంలో ఈ చట్టాలకు సవరణలు సైతం తెచ్చాయి. అయితే, 1894 చట్టం సహా ఈ చట్టాలన్నీ అరకొరగా ఉన్నాయని, పలు అంశాల్లో స్పష్టత కొరవడి దుర్వినియోగమవుతున్నాయని, నష్టపరిహారం విషయంలో ప్రాంతానికో న్యాయం జరుగుతోందన్న విమర్శలు వచ్చాయి. ఉదహరణకు కోస్తాలో సేకరించిన భూములకు ఇచ్చే పరిహారంతో పోల్చితే తెలంగాణ భూములకు చాలా తక్కువ చెల్లిస్తున్నారు. ఎల్లంపల్లి ప్రాజెక్టు కోసం సేకరించిన భూములకు ఆదిలాబాద్‌లో ఒక రకంగా, కరీంనగర్‌లో ఒక రకంగా పరిహారం ఇచ్చారు. ఇక పునరావాసం, ఉపాధి కల్పన తదితర డిమాండ్లపై అనేక చోట్ల దశాబ్దాలుగా ఆందోళనలు కొనసాగుతుండడం మనం చూస్తూనేవున్నాం.

బ్రిటిష్ కాలం నాటి చట్టాన్ని ఇప్పటికీ సంస్కరించకపోవడంపై సర్వత్రా నిరసనలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో కేంద్రం 2007లో భూసేకరణ, పునరావాసంలపై రెండు విడి విడి బిల్లులను సభలో ప్రవేశపెట్టింది. వీటిని స్టాండింగ్ కమిటీలకు నివేదించగా అవి కొన్ని మార్పులు సూచించాయి. ఈ లోపు 14వ లోక్‌సభ 2009లో రద్దు కావడంతో ఈ బిల్లులకు కాలం చెల్లింది. తిరిగి అధికారంలోకి వచ్చిన యూపీఏ 2011లో రెండు విడి బిల్లులను ఒక్కటిగా చేసి ప్రస్తుత బిల్లును సభ ముందుంచింది. అయితే, ఈ బిల్లులోనూ ముఖ్యమైన లోపాలున్నాయనేది ఇప్పుడు జరుగుతున్న చర్చ. ఒక సమగ్ర చట్టం తేవడమే ప్రభుత్వ లక్ష్యమైతే జాతీయ రహదారులు, రైల్వేలు, అణు ప్రాజెక్టులు, సెజ్‌లు తదితర 16 రకాల విడివిడి భూసేకరణ చట్టాలను కొత్త చట్టం పరిధిలో ఎందుకు చేర్చలేదన్నది వివాదాస్పదమైంది. ఈ 16 చట్టాల్లో భూసేకరణకు సంబంధించి తప్ప బాధితుల పునరావాసం, ఉపాధికి వీలు కల్పించే నిబంధనలు లేకపోవడం గమనార్హం.

వీటికితోడు మరికొన్ని విడి చట్టాలను ఆమోదించే అధికారాన్ని సైతం కేంద్రానికి కొత్త చట్టం కల్పించింది. పబ్లిక్ అవసరాల కోసం కాకుండా ప్రైవేట్ అవసరాల కోసం భూమిని సేకరించినప్పుడు బాధిత ప్రజానీకంలో 80శాతం అందుకు సమ్మతించాలని కొత్త చట్టం చెబుతోంది. బాధిత భూయజమానులని కాకుండా బాధిత ప్రజలని పేర్కొనడంలో మతలబు ఉంది. ఉదహరణకు ఓ ప్రైవేట్ విద్యుత్ ప్లాంటు భూసేకరణ కోసం భూమిని కోల్పోనున్న రైతులు కాకుండా ఆయా గ్రామాల ప్రజలందరిలో 80శాతం అంగీకరిస్తే చాలు భూస్వాధీనం చేసుకోవచ్చన్నమాట. ప్రజాభిప్రాయ సేకరణ కూడా

గ్రామసభ ఆధ్వర్యంలో కాకుండా అధికారుల నేతృత్వంలో జరుగుతుంది. అనగా భూయజమానులంతా వ్యతిరేకించినప్పటికీ ఓ ప్రైవేటు కంపెనీ లాభాల కోసం భూములను లాక్కునేందుకు కొత్త చట్టం సర్కారుకు అధికారమిస్తుంది.

భూవిలువను, దానిపై గల ఇతర ఆస్తుల విలువను అప్పటి మార్కెట్ రేటు ప్రకారం లెక్కకట్టాలని కొత్త చట్టం చెబుతోంది. స్టాంపు చట్టం ప్రకారం అక్కడి భూముల రిజిస్ట్రేషన్‌కై పాటిస్తున్న రేటు.. ఆ ప్రాంత భూముల్లో మూడేళ్లుగా అత్యధిక ధరకు అమ్ముడైన టాప్ ఫిఫ్టీ రిజిస్ట్రేషన్ల సరాసరి.. ఈ రెంటిలో ఏది ఎక్కువైతే దానిని మార్కెట్ రేటుగా నిర్ణయిస్తారు. పట్టణాల్లో అయితే ఇంతే మొత్తాన్ని, పల్లెల్లోనైతే ఈ మొత్తానికి రెట్టింపును భూయజమానికి చెల్లించాల్సివుంటుంది. చాలాసార్లు రిజిస్ట్రేషన్ విలువలు నిజవిలువతో పోల్చితే తక్కువే ఉంటాయి కనుక యజమానులకు అన్యాయం జరిగే ఆస్కారం ఉంటుందని విశ్లేషకులు చెబుతున్నారు.

మరో వివాదాస్పద అంశం ప్రభుత్వంతో సంబంధం లేకుండా ప్రైవేట్ కంపెనీలు స్వయంగా చేపట్టే భూ కొనుగోళ్లు. పట్టణాల్లో 50 ఎకరాలు, పల్లెల్లో వంద ఎకరాలు దాటి కొన్న పక్షంలో బాధిత కుటుంబాలకు పునరావాసం, ఉపాధి కల్పన బాధ్యత ఆయా కంపెనీలపై ఉంటుందని కొత్త చట్టం పేర్కొంటోంది. అయితే, వేరు వేరు కంపెనీల పేర్లతో ముక్కలు ముక్కలుగా పై సీలింగ్ వర్తించకుండా భూములు కొని కంపెనీలు పునరావాసాన్ని గాలికొదిలేసే వీలుంది. ఇక, ప్రతి భూసేకరణకూ సామాజిక ప్రభావ అధ్యయనం తప్పనిసరి చేసిన ఫలితంగా పబ్లిక్ టాయిలెట్ల, బస్‌షెల్టర్ల నిర్మాణం వంటి చిన్న చిన్న పనుల్లో అనవసర జాప్యం జరిగే అవకాశముంది. మొత్తంగా కొత్త చట్టం కార్పొరేట్ ఫ్రెండ్లీగా ఉందన్న విమర్శలు సర్వత్రా వినబడుతున్నాయి. ప్రపంచీకరణ పేరిట దేశాన్ని బహుళజాతి కంపెనీలకు కట్టబెట్టే, అభివృద్ధి నెపంతో జీవన విధ్వంసం సృష్టించే ప్రక్రియకు ఈ చట్టం ఊతమిస్తుందని మేధావులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రజాప్రయోజనాలకు ఇచ్చిన నిర్వచనాన్ని మార్చడం ద్వారా పారిశ్రామికీకరణ, ప్రైవేటీకరణ, పట్టణీకరణ విధానాలకు భూసేకరణను మన్మోహన్ సర్కారు చట్టబద్ధం చేయబోతోందని అభిప్రాయపడుతున్నారు. కొత్త చట్టం కొండను తవ్వి ఎలుకను పట్టిందంటున్నారు. బాధితుల పునరావాసం అంశాన్ని చేర్చడం ద్వారా విప్లవాత్మక సంస్కరణకు పూనుకున్నామని ఊదరగొడుతున్న ప్రభుత్వం సెజ్‌ల పేరిట వేలాది ఎకరాలను విదేశీ కంపెనీలకు కట్టబెట్టడాన్ని కొత్త చట్టం పరిధిలోకి ఎందుకు తేలేదని ప్రశ్నిస్తున్నారు. ఈ అన్ని అంశాలను, పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ సూచనలను దృష్టిలో పెట్టుకుని ప్రతిపాదిత బిల్లులో తగిన మార్పులు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

***(నమస్తే తెలంగాణ, 17-07-2012)***

# జీవ వైవిధ్యాన్ని కాపాడుకుందాం!

2012 అక్టోబర్ ఒకటిన మన హైదరాబాద్ నగరంలో జీవ వైవిధ్యంపై ప్రపంచ స్థాయి సదస్సు ప్రారంభం కానున్నది. 19 రోజుల పాటు కొనసాగే ఈ సమావేశానికి 194 దేశాలకు చెందిన సుమారు పది వేల మంది ప్రతినిధులు హాజరు కానున్నారు. జీవ వైవిధ్య ఒడంబడిక (కాన్వెన్షన్ ఆన్ బయోలాజికల్ డైవర్సిటీ)లో భాగంగా భాగస్వామ్య పక్షాలకు (కాన్ఫరెన్స్ ఆఫ్ పార్టీస్–కాప్) సంబంధించి ఇది 11వ సమావేశం. 1–5 తేదీల మధ్య జీవ భద్రత విషయమై కార్టజినా ప్రొటోకాల్‌పై సభ్యదేశాల ప్రతినిధి బృందాల మధ్య చర్చలు జరుగుతాయి. అనంతరం 8వ తేదీ నుంచి జీవ వైవిధ్యంపై ప్రధాన ఎజెండా చేపట్టనున్నారు. చివరి మూడురోజుల్లో జరిగే అత్యున్నత స్థాయి సమావేశంలో వివిధ దేశాల అధినేతలు, పర్యావరణ, అటవీ శాఖ మంత్రులు, ప్రపంచ బ్యాంకు ప్రతినిధులు హాజరై అనేక కీలక నిర్ణయాలు తీసుకుంటారు. స్వాతంత్ర్యానంతరం మన దేశంలో జరుగుతున్న మొట్టమొదటి అంతర్జాతీయ సదస్సు కావడంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వహణను ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నాయి. సదస్సు నిర్వహణ కోసం కేంద్రం రూ.300 కోట్లు మంజూరు చేయగా, కిరణ్ సర్కారు సైతం దానికి తీసిపోకుండా రూ.125 కోట్లు కేటాయించింది. నగరాన్ని యుద్ధప్రాతిపదికన సుందరంగా తీర్చిదిద్దే పనిలో జీహెచ్ఎంసీ నిమగ్నమైంది.

20వ శతాబ్దం చివరి అంకాన ప్రపంచీకరణ, ప్రైవేటీకరణ, సరళీకరణ విధానాలకు ప్రపంచ దేశాలు పెద్దపీట వేయడం వేగవంతమైంది. లాభాల వేటలో పడిన మానవుడు పుడమిని ఒకేసారి మింగేసే ప్రయత్నం చేస్తున్నాడు. భవిష్యత్ తరాల మనుగడను ఏమాత్రం దృష్టిలో పెట్టుకోకుండా అభివృద్ధి పేరిట విచ్చలవిడిగా వనరులను కొల్లగొడుతున్నాడు. ఫలితంగా జీవన సమతౌల్యం దెబ్బతింటున్నది. ఒకప్పుడు నీటితో, పచ్చని అడవులతో మాత్రమే కప్పబడివున్న భూగోళం క్రమేపీ ఎడారులుగా, కాంక్రీట్ జంగిల్‌గా మారుతున్నది. అతివృష్టి లేదంటే అనావృష్టి ఆనవాయితీ అయింది. వానాకాలం ఎండలు, ఎండాకాలం వానలు సాధారణమయ్యాయి. భూగర్భ జలం, భూసారం

తగ్గుతున్నది. జల, వాయు, శబ్ద, ఆహార కాలుష్యం పెరుగుతున్నది. ఉష్ణోగ్రతల్లో వస్తున్న మార్పులు ఓజోన్ పొరను నష్టపరుస్తున్నాయి. వృక్ష, జంతు జాతులకు చెందిన అనేక అరుదైన తెగలు నశిస్తున్నాయి. ప్రకృతి విపత్తులకు బలయ్యే మానవుల సంఖ్య బాగా పెరుగుతున్నది. అభివృద్ధి పేరిట నిర్వాసితులుగా మారుతున్న మూలవాసులు అస్తిత్వం కోల్పోతున్నారు.

ఈ పరిణామాల నేపథ్యంలోనే మానవుల మనుగడకు మూలమైన ధరిత్రిని, జీవ భద్రతను, వైవిధ్యాన్ని కాపాడుకోవాలన్న డిమాండు ప్రపంచవ్యాప్తంగా మొదలైంది. అనేక మంది సామాజిక, జీవ, రసాయన, పర్యావరణ శాస్త్రవేత్తలు, మేధావులు మానవజాతికి సమీప భవిష్యత్తులోనే పొంచివున్న ముప్పును ఆధారాలతో సహా వెలుగులోకి తెచ్చారు. భూమిని, భూమిపై ఉన్న జీవజాలాన్ని కాపాడాలంటూ పలు దేశాల్లో ఉద్యమాలు వెల్లువెత్తిన ఫలితంగా ఐక్యరాజ్యసమితి రంగంలోకి దిగింది. 1972లో స్వీడన్‌లోని స్టాక్‌హోంలో మానవ పరిసరాలకు సంబంధించిన సమావేశం నిర్వహించింది. పర్యావరణ, జీవజాతుల పరిరక్షణకు వీలుగా వ్యాపార కార్యకలాపాలను నియంత్రించే విధానాలకు రూపకల్పన చేసింది. అనేక దేశాలు ఈ ఒప్పందంపై సంతకాలు చేసినప్పటికీ ఆచరణలో పెట్టకపోవడంతో పరిస్థితి ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందమైంది. 1987లో సమితి మరోసారి పూనుకుని పర్యావరణం–అభివృద్ధి అంశంపై అంతర్జాతీయ సమావేశాన్ని నిర్వహించింది. దీనికి కొనసాగింపుగానే 1988లో ఐక్యరాజ్యసమితి పర్యావరణ కార్యక్రమానికి(యూఎన్‌ఈపీ) శ్రీకారం చుట్టింది. భవిష్యత్ తరాల మనుగడకు విఘాతం కలుగజేయకుండానే మానవుల జీవన పరిస్థితులను మెరుగుపర్చుకునే దిశలో ప్రపంచాన్ని నడిపించడం ఈ సంస్థకు లక్ష్యంగా నిర్దేశించింది. మరోవైపు ప్రపంచ దేశాలచే ఒక జీవ వైవిధ్య ఒడంబడికను ఆమోదింపజేసేందుకు ప్రయత్నాలు ఆరంభించింది.

ఈ ప్రయత్నాలు సఫలమై యూఎన్‌ఈపీ ఆధ్వర్యంలో 1992లో చరిత్రాత్మక రియో ఎర్త్ సమ్మిట్ (ధరిత్రి సదస్సు) జరిగింది. బ్రెజిల్‌లోని రియో డి జనీరోలో జరిగిన ఈ సదస్సులో 172 దేశాల ప్రతినిధులు పాల్గొన్నారు. అప్పటి మన ప్రధాని పీ వీ నర్సింహారావు సహా 108 దేశాల అధినేతలు హాజరై ప్రసంగించారు. విషపదార్థాలను విరజిమ్మే ఉత్పత్తి ప్రక్రియల పైన, వాతావరణ కాలుష్యానికి కారణమవుతున్న సంప్రదాయ ఇంధన వనరుల పైన, నీటి కొరత పైన సదస్సులో చర్చ జరిగింది. క్యోటో ప్రోటోకాల్‌గా చెప్పుకునే వాతావరణ మార్పుల ఒడంబడిక కుదిరింది. పర్యావరణానికి నష్టం కలుగజేసే ఎలాంటి కార్యకలాపాలను మూలవాసుల భూముల్లో చేబట్టబోమని తీర్మానించారు. గమనించాల్సిన విషయమేమిటంటే ఈ సదస్సులోనే జీవ వైవిధ్య ఒడంబడికను సంతకాల

కోసం ప్రపంచ దేశాల ముందుంచారు. 168 దేశాలు ఒడంబడికపై అక్కడికక్కడే సంతకాలు చేయగా తర్వాతి కాలంలో మరో 26 దేశాలు ఇందులో చేరాయి. 1993 డిసెంబర్ 29 నుంచి ఈ ఒడంబడిక అమలులోకి వచ్చింది. ఇందులో భాగంగానే భాగస్వామ్య పక్షాల సమావేశాలు జరుగుతున్నాయి. మొదటి సమావేశం 1994లో బహమాస్‌లో జరగ్గా ప్రస్తుతం హైదరాబాద్‌లో 11వ సమావేశం జరగనుంది.

ప్రస్తుత సమావేశంలో చర్చించడానికి తయారుచేసిన ఎజెండాలో జీవ వైవిధ్యం, వాతావరణ మార్పులు, కాలుష్యం, అరుదైన జీవజాతులకు పొంచివున్న ముప్పు, అడవుల సంరక్షణ వంటి పలు అంశాలున్నాయి. వీటిపై వివరంగా చర్చ జరిగే అవకాశముంది. అయితే గత పది సమావేశాల్లోనూ ఈ అంశాలపై తీవ్రస్థాయిలోనే చర్చ జరిగింది. అనేక తీర్మానాలు సైతం చేశారు. విషాదకరమైన విషయమేమంటే సమావేశంలో ఆయా తీర్మానాలను ఏకగ్రీవంగా ఆమోదించిన దేశాలేవీ ఆ తర్వాత వాటిని పట్టించుకున్న పాపాన పోలేదు. మన దేశం విషయానికే వస్తే, రియో సమ్మిట్, బహమస్ నుంచి మొదలుకొని నగొయ 10వ సమావేశం వరకూ అన్ని సమావేశాల్లోనూ అభివృద్ధి ముసుగులో జీవ వైవిధ్యానికి జరుగుతున్న నష్టంపై ఘాటైన ఉపన్యాసాలిచ్చిన మన అధినేతలు, మంత్రులు స్వదేశంలో మాత్రం పూర్తిగా అందుకు విరుద్ధమైన విధానాలను అమలు చేస్తున్నారు. అగ్రరాజ్యం అమెరికా-ప్రపంచ బ్యాంకుల మాయలో పడి, పర్సెంటేజీల మత్తులో జోగుతూ మూలవాసుల, ఆదిమ తెగల అస్తిత్వానికి, అటవీ సంపదకు, పర్యావరణానికి ముప్పు చేకూర్చేలా గనుల తవ్వకాలకు, అభివృద్ధి ప్రాజెక్టులకు అనుమతులు మంజూరు చేస్తున్నారు. దేశ వనరులను బహుళజాతి కంపెనీలకు అప్పనంగా కట్టబెడుతున్నారు. స్థానికుల, మేధావుల, ప్రజాసంఘాల నిరసనను పోలీసు పద్ధతిలో పరిష్కరిస్తున్నారు.

ఫలితంగా నేడు పల్లెల, పట్టణాల రూపురేఖలే మారిపోయాయి. ఒకప్పుడు ప్రజల సంస్కృతీ సంప్రదాయాల్లో భాగమనుకున్న అనేకం నేడు గత స్మృతులయ్యాయి. గుట్టలు మాయమై మైదానాలు వెలుస్తున్నాయి. పచ్చని పంట పొలాల మధ్యలో ఓపెన్‌కాస్ట్ మట్టిగుట్టలు ప్రత్యక్షమవుతున్నాయి. చెరువులు లేఅవుట్లుగా మారుతున్నాయి. వర్షించే మేఘాలని భ్రమపడే స్థాయిలో వాయుకాలుష్యం, నదులను డ్రైనేజీలని పొరబడే రీతిలో జలకాలుష్యం, చెవులు గింగురుమనే శబ్దకాలుష్యం పట్టణాలను పట్టి పీడిస్తున్నాయి. కొండల్లో ఉండాల్సిన చిలువలు పేలుళ్ల ప్రకంపనలకు ఊళ్ల దారి పట్టి ప్రాణం తీసుకుంటున్నాయి. అడవిని ఏలాల్సిన పులులూ, చిరుతలూ, ఎలుగుబంట్లూ జనావాసాల్లోకి వచ్చి బందీ అవుతున్నాయి. కోతుల దండు గ్రామాలపై దండెత్తింది. రామచిలుకలు బోనుల్లో నిలబడి సామాన్యుల బతుకు జోస్యం చెబుతున్నాయి. కోయిలలు,

ఊరపిచ్చుకలు, సీతాకోకచిలుకలు, మిడతలు, ఆరుద్రలు, ఇంకా అనేక ప్రాణులను పాఠ్యపుస్తకాల్లో, ఫొటోల్లో చూసుకోవాల్సిన పరిస్థితి దాపురించింది. అలా అని మానవజాతిని వదిలేస్తున్నారా అంటే అదీ లేదు. వనరుల వేటలో పడిన కార్పొరేట్ల ధాటికి ఓ అబూజ్‌మాడ్.. మరో నియాంగిరి.. ఇంకో సుర్జాగఢ్ అస్తిత్వం కోల్పోతున్నాయి. పురాతనమైనవిగా భావించే మాడియా గోండులు, డోంగ్రియా, కుటియా కోందులు తదితర ఆదివాసీ తెగల ఉనికి ప్రశ్నార్థకంగా మారింది.

పర్యావరణ సమతౌల్యంతో, కాలుష్యరహిత పరిసరాలతో, జీవన వైవిధ్యంతో ప్రాణకోటి విలసిల్లాలన్నా, మానవులు సుఖశాంతులతో ప్రశాంతంగా బతకాలన్నా అగ్రరాజ్యాలు సహా ప్రపంచ దేశాలు తమ విధానాలను విప్లవాత్మకంగా మార్చుకోవాలి. అభివృద్ధి పేరిట ధరిత్రికి, జీవజాతులకు ముప్పు వాటిల్లజేయడం మానుకోవాలి. బయట నీతులు చెప్పి ఇంట్లో గోతులు తవ్వడం ఆపేయాలి. హైదరాబాద్ సమావేశానికి హాజరయ్యే నేతలు ఇక్కడ భారీ సందేశాత్మక ఉపన్యాసాలివ్వడం కాదు.. స్వదేశానికి వెళ్లాక కాప్-11 తీర్మానాలను చిత్తశుద్ధితో అమలుచేయాలి. జీవ వినాశనానికి కారణమవుతున్న చట్టాలకు, విధానాలకు స్వస్తి చెప్పాలి. మొదటి అంతర్జాతీయ సదస్సుకు ఆత్మీయ ఆతిథ్యమిస్తున్న సందర్భాన్ని పురస్కరించుకుని మన కేంద్ర ప్రభుత్వం మూలవాసుల అస్తిత్వానికి, పర్యావరణానికి చేటు చేకూర్చే భారీ ప్రాజెక్టులను, బహుళజాతి కంపెనీలతో కుదుర్చుకున్న ఎంఓయూలను రద్దు చేస్తున్నట్లు ప్రకటించాలి. ప్రజలు, ప్రజాస్వామికవాదులు, మేధావులు ఈ డిమాండుతో దేశవ్యాప్తంగా వివిధ రూపాల్లో నిరసన కార్యక్రమాలు చేపట్టాలి.

***(నమస్తే తెలంగాణ, 11-09-2012)***

# అణు విద్యుత్‌తో అనర్థాలే అధికం!

జీవ వైవిధ్యాన్ని కాపాడుకుందామంటూ కాప్-11 సదస్సుకు ఆతిథ్యమిస్తున్న మన సర్కారు తమిళనాడులోని కూడంకుళంలో మానవ మనుగడకు ప్రమాదకరమని భావిస్తున్న అణు విద్యుత్ ప్రాజెక్టును యుద్ధప్రాతిపదికన ప్రారంభించే పనిలో పడింది. స్థానికుల తీవ్ర నిరసనను సైతం పట్టించుకోకుండా పోలీసు, పారా మిలిటరీ బలగాల సహాయంతో అణురియాక్టర్లలో ఇంధనం నింపే కార్యక్రమాన్ని కొనసాగిస్తోంది. ప్రాజెక్టు పరిసర గ్రామాలకు చెందిన సుమారు నలభై వేల మంది ప్రజానీకం గత వారం రోజులుగా తమ ఇళ్లకు తాళం పెట్టి విద్యుత్ కేంద్రం ఎదుట బైఠాయించినా కనికరించకుండా పాశవిక అణిచివేతకు పూనుకుంటున్నది. లాఠీలను, బాష్పవాయు గోళాలను, చివరకు తూటాలను ప్రయోగించడానికి తెగబడింది. సంబంధిత ఘటనల్లో ఇప్పటికే ఇద్దరు మత్స్యకారులు చనిపోగా స్త్రీలు, పిల్లలు సహా పలువురు గాయపడ్డారు. అనేక మందిని పోలీసులు అరెస్టు చేశారు. అయినా ఉద్యమకారులు వెనక్కి తగ్గకుండా శాంతియుతంగా తమ నిరసనను కొనసాగిస్తున్నారు. నీళ్లలో నిలబడి జలసత్యాగ్రహానికి పూనుకుంటున్నారు. వీరికి మద్దతుగా తమిళనాడు అంతటా ఆందోళనలు మిన్నంటాయి. ప్రభుత్వ వైఖరిపై దేశవ్యాప్తంగా ప్రజాస్వామికవాదులు, పర్యావరణవేత్తలు, మేధావులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. అభివృద్ధి చెందిన దేశాలు అణువిద్యుత్‌కు ప్రాధాన్యం తగ్గిస్తూ ప్రత్యామ్నాయాలు వెదుక్కుంటున్న సమయాన మన పాలకులు అది లేనిదే దేశాభివృద్ధి సాధ్యం కాదన్నట్లు మాట్లాడడం విడ్డూరమని పేర్కొంటున్నారు. అణువిద్యుత్ తయారీలో వెలువడే రేడియేషన్, వ్యర్థ పదార్థాలు మానవాళికే కాకుండా చేపలు తదితర జీవజాతికి సైతం చేటు చేస్తాయని హెచ్చరిస్తున్నారు.

తిరునల్వేలి జిల్లా కూడంకుళం–ఇదింతకరాయ్ గ్రామాల పరిధిలో అణువిద్యుత్ కేంద్రాన్ని నిర్మించాలని 1988లో ప్రతిపాదించారు. సోవియట్ యూనియన్ క్రియాశీల సహకారంతో రెండు రియాక్టర్లను నెలకొల్పి రెండువేల మెగావాట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేయాలనుకున్నారు. తర్వాతి కాలంలో ఈ సామర్థ్యాన్ని ఆరు రియాక్టర్లు.. 9200

మెగావాట్ల విద్యుత్‌కు పెంచారు. సోవియట్ యూనియన్ కుప్పకూలిపోవడం, రాజీవ్‌గాంధీ హత్య జరగడం తదితర పరిణామాల నేపథ్యంలో ప్రాజెక్టు అమలులో తీవ్ర జాప్యం జరిగింది. 1997లో దేవేగౌడ ప్రధానిగా ఉన్న కాలంలో ఫైళ్లు మళ్లీ కదిలి పనులు మొదలయ్యాయి. 2011 జూలైకల్లా ఈ పనులన్నీ పూర్తయి రియాక్టర్ టెస్ట్‌రన్ నిర్వహించారు. ఈ రన్ సందర్భంగా ప్లాంట్ నుంచి దట్టమైన పొగ, భారీ శబ్దాలు రావడంతో స్థానికులు తీవ్ర భయాందోళనలకు లోనయ్యారు. అప్పటి వరకూ అణుశక్తి వ్యతిరేక ప్రజా ఉద్యమం (పీఎంఏఎన్‌ఈ) నేతృత్వంలో కొనసాగిస్తున్న ఉద్యమాన్ని మరింత ఉధృతం చేశారు. సభలు, ర్యాలీలు, రోడ్ల దిగ్బంధాలు, రిలే, ఆమరణ దీక్షలకు పూనుకున్నారు. ఈ నిరసనల మూలంగా ప్రాజెక్టుకు తాత్కాలికంగా బ్రేక్ పడినా ఈ సంవత్సరం జూన్‌లో తిరిగి పనులు వేగం పుంజుకున్నాయి. ఆగస్టు 31న మద్రాసు హైకోర్టు సైతం ప్రాజెక్టులోని యూనిట్-1, 2ల ప్రారంభానికి గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడంతో ఇంజినీర్లు మొదటి రియాక్టర్‌లో ఇంధనం నింపే ప్రక్రియకు శ్రీకారం చుట్టారు.

ఈ పరిణామంతో స్థానికులు కలవరపడ్డారు. తమ నిరసనను లెక్కచేయకపోవడం పట్ల ఆగ్రహించారు. తుది సమరానికి సిద్ధమై సెప్టెంబర్ 9 ఆదివారం నగారా మోగించారు. ఎన్నడూ ఇళ్లకు తాళం వేయడం ఎరుగని ఇదింతకరాయ్ గ్రామస్తులు ఆ రోజు ఉదయమే తమ ఇళ్లకు తాళాలు వేసి బయలుదేరారు. పరిసర గ్రామాల ప్రజలు వారితో కలిశారు. మహిళలు, పిల్లలు ముందు నడుస్తుండగా దారిలో ఉన్న చర్చిలో ప్రార్థనలు ముగించుకుని కేంద్రం ఎదుటికి వచ్చి బైఠాయించారు. ప్లాంట్ లోపలికి చొచ్చుకెళ్లాలన్న ఆందోళనకారుల ప్రయత్నాలను మొదటి రోజు ప్రభుత్వ బలగాలు తిప్పికొట్టాయి. రెండవ రోజు కొంతమంది మత్స్యకారులు పడవల్లో సముద్రం వైపు నుంచి వచ్చి చొరబాటుకు యత్నించడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. అప్పటికే సంఘటనాస్థలిలో మకాం వేసిన కలెక్టర్, ఎస్పీ తదితర అధికారులు మరికొన్ని బలగాలను రప్పించి ఉద్యమకారులపై దాడికి పూనుకున్నారు. గర్భిణులని కూడా చూడకుండా మహిళలను, చిన్నపిల్లలను చితకబాదారు. బాష్పవాయు గోళాలను ప్రయోగించారు. ఈ ఘటనలో పలువురు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు అనేక మందిని అరెస్టు చేశారు. పీఎంఏఎన్‌ఈ నేత ఉదయ్‌కుమార్‌ను అరెస్టు చేయడానికి ప్రయత్నించగా ప్రజలు ఆయనను తప్పించారు. గత గురువారం నుంచీ జలసత్యాగ్రహం చేస్తూ వింతరీతిలో నిరసన తెలుపుతున్నారు.

ఇంత జరిగినా సర్కారు మాత్రం మొండివైఖరినే ప్రదర్శిస్తున్నది. ప్లాంటు నిలుపుదలకు ససేమిరా అంటున్నది. కూడంకుళం ఉద్యమం వెనకాల విదేశీ శక్తుల హస్తం ఉన్నదని గతంలో ఆరోపించిన ప్రధాని మన్మోహన్‌సింగ్ అణువిద్యుత్ కేంద్రాలను

మూసేయడం దేశానికి హానికరమని ఇటీవల పార్లమెంటులో చేసిన ప్రసంగంలో పేర్కొన్నారు. ఆయన మాటలు వాస్తవ విరుద్ధమని అణువిద్యుత్‌పై ఇటీవలికాలంలో ప్రపంచ దేశాలు అనుసరిస్తున్న వైఖరే చెబుతున్నది. చెర్నోబిల్, ఫుకుషిమా అణు ప్రమాదాల అనంతరం అనేక పెద్ద దేశాలు తమ అణువిద్యుత్ ఉత్పత్తి కార్యక్రమాలను నిలిపేయడమో లేక కుదించుకోవడమో చేస్తున్నాయి. జల, సౌర, పవన విద్యుత్ ప్రాజెక్టులకు ప్రాధాన్యమిస్తున్నాయి. తమ దేశంలో ఉన్న మొత్తం 54 రియాక్టర్లనూ జపాన్ మూసేసింది. 2022 కల్లా అన్ని అణు విద్యుత్ కేంద్రాలనూ మూసేస్తామని జర్మనీ ప్రకటించింది. గంటకు 22వేల మెగావాట్ల పవనవిద్యుత్‌ను తయారుచేసి రికార్డులకెక్కింది. చెర్నోబిల్ తర్వాత అణు కార్యక్రమాన్ని వాయిదా వేసుకున్న ఇటలీ 2010లో తిరిగి ఆ ప్రయత్నాలు చేయగా, దేశవ్యాప్తంగా నిర్వహించిన రెఫరెండంలో 90 శాతం ప్రజలు వ్యతిరేకించడంతో వెనకడుగు వేసింది. ఇక ప్రపంచంలోనే అత్యధికంగా రికార్డు స్థాయిలో మొత్తం ఉత్పత్తిలో 78శాతం అణువిద్యుత్‌నే తయారుచేస్తున్న ఫ్రాన్స్ కూడా 2025 కల్లా దానిని 50శాతానికి తగ్గిస్తానని ప్రకటించింది. తన వద్ద గల 104 రియాక్టర్ల పనితీరును సమీక్షించాలని అమెరికా నిర్ణయించింది. స్విట్జర్లాండు సహా పలు దేశాలు ఇదే బాటన పయనిస్తున్నాయి.

తన ప్రసంగంలో ప్రధాని మరో అబద్ధమాడారు. దేశంలోని ఆరు అణువిద్యుత్ కేంద్రాల్లో 19 రియాక్టర్లు పనిచేస్తున్నాయని, ఇప్పటివరకు ఎక్కడా చిన్న ప్రమాదమూ జరగలేదని పేర్కొన్నారు. కాని వాస్తవాలు మరోలా ఉన్నాయి. ఉత్తర్‌ప్రదేశ్‌లోని నరోరా ప్లాంటులో 1993లో మెకానికల్ టర్బైన్ బ్లేడ్ ఫెయిలై చెర్నోబిల్ లాంటి ఘటన తృటిలో తప్పింది. కర్నాటకలోని కైగా ప్లాంటులో 1994లో 134 టన్నుల బరువున్న పైకప్పు (డోమ్) 30 మీ. ఎత్తు నుంచి రియాక్టర్‌పై కూలింది. పలు సాంకేతిక సమస్యల మూలంగా రాజస్థాన్‌లోని రావల్‌భట్టా, తమిళనాడులోని కల్పాక్కం కేంద్రాల్లోని రియాక్టర్ల ఉత్పత్తి స్థాయిని తగ్గించారు. గుజరాత్‌లో కాక్రపార్ కేంద్రంలో 1991లో అగ్నిప్రమాదం సంభవించగా, 94లో వరదలు ముంచెత్తాయి. ఇక 1969లోనే పనిచేయడం ఆరంభించిన తారాపూర్ రియాక్టర్లు పాతబడిపోయి అధిక రేడియేషన్‌ను వెలువరిస్తున్నాయని గుర్తించి ఉత్పత్తి స్థాయిని తగ్గించారు.

అణు కేంద్రాల నుంచి వెలువడే రేడియేషన్ మూలంగా పరిసరాల్లో నివసించే ప్రజలకు క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులు సంక్రమిస్తున్నాయన్న విషయాన్ని కూడా మన అణుశక్తి విభాగం(డీఏఈ) దాచిపెడుతున్నది. ఈ విభాగం ఆధ్వర్యంలో డా. మంజులా దత్తా చేసిన అధ్యయనంలో కల్పాక్కం ప్లాంటుకు దూరంగా ఉన్న గ్రామాలతో పోలిస్తే పరిసర గ్రామాల్లో 400శాతం అధికంగా క్యాన్సర్, టీబీ, సంతానలేమి, గుండెపోటు, మధుమేహం తదితర వ్యాధిగ్రస్తులున్నారని తేలింది. డా. పుహలేంది

నేతృత్వంలో కొనసాగిన మరో అధ్యయనంలో అణుకేంద్రాలకు 500 కి.మీ.ల దూరంలో నివసిస్తున్నవారితో పోలిస్తే 40 కి.మీ.ల పరిధిలో నివసిస్తున్న ప్రజల్లో థైరాయిడ్ సమస్యలు అధికంగా ఉన్నట్లు గుర్తించారు. ఈ కేంద్రాల్లో పనిచేస్తున్న ఉద్యోగుల్లో ఎక్కువ మంది మల్టీపుల్ మైలోమా(బోన్‌మారో క్యాన్సర్)తోనే చనిపోతున్నట్లు కూడా ఈ అధ్యయనం తేల్చింది. అయితే, ఈ అధ్యయనాల నివేదికలను వేటినీ అణుశక్తి విభాగం బహిర్గతం చేయకపోవడం గమనార్హం.

వాస్తవాలు ఇలా ఉండగా కూడంకుళం ప్రజలు అణువిద్యుత్ కేంద్రంపై అనవసర భయాలు, అపోహలు కలిగివున్నారని, విదేశీ శక్తుల కుట్రలకు బలై నిరసనోద్యమాలు చేపడుతున్నారని ప్రభుత్వ వర్గాలు ఆరోపించడం అన్యాయం. ఇప్పటికైనా పాలకులు కళ్లు తెరిచి జాతీయ విద్యుత్ విధానాన్ని సమూలంగా సమీక్షించాలి. చెర్నోబిల్ లేదా ఫుకుషిమా లాంటిది ఒక్క ఘటన జరిగినా జాతికి పెనుప్రమాదమని గుర్తించాలి. అణువిద్యుత్‌పై ఆధారపడే ప్రణాళికలకు స్వస్తి చెప్పాలి. కూడంకుళం, జైతాపూర్ సహా కొత్త ప్రాజెక్టులను రద్దు చేయాలి. పాతవాటిని దశలవారీగా ఉపసంహరించుకోవాలి. ప్రత్యామ్నాయ ఇంధన వనరులపై దృష్టి పెట్టాలి. నిపుణుల అంచనా ప్రకారం మన దేశంలో ఒక లక్షా 48వేల 700 మెగావాట్ల జలవిద్యుత్‌ను ఉత్పత్తి చేయడానికి సరిపడా జలవనరులున్నాయి. అంతే కెపాసిటీ కలిగిన థర్మల్ యూనిట్లను నెలకొల్పడానికి అవసరమైనంత బొగ్గు, సహజవాయువూ ఉంది. సంవత్సరం పొడుగూతా సుమారు 300 రోజులు ఎండలు కాచే మన భూభాగంపై 500 కోట్ల మెగావాట్ల సౌర విద్యుత్‌ను, బలంగా వీచే గాలుల సాయంతో లక్షలాది మెగావాట్ల పవన విద్యుత్‌ను తయారుచేసుకోవచ్చునని అధ్యయనాలు చెబుతున్నాయి. ఈ వనరులపై ఆధారపడుతూ మానవాళికీ, జీవజాతులకూ, పర్యావరణానికీ చేటు చేయని విధానాలను మన పాలకులు అనుసరిస్తారని ఆశిద్దాం. జీవవైవిధ్య సదస్సు జరుగుతున్న సందర్భాన నిలదీద్దాం.

***(నమస్తే తెలంగాణ, 20-09-2012)***

# ఆదివాసులపై మరో ఆక్రమణ..

మావోయిస్టు కార్యకలాపాలకు పేరుగాంచిన మహారాష్ట్రలోని గడ్చిరోలి జిల్లా ఇటీవల మరోసారి వార్తల్లోకెక్కింది. గత బుధవారం రాత్రి తొమ్మిది గంటలకు ఈ జిల్లాకు చెందిన ఏటపల్లి తాలూకాలోని సుర్జాగఢ్ గుట్టల ప్రాంతంలో ముగ్గురు వ్యక్తులను నక్సల్స్ నరికి చంపారని అన్ని పత్రికలు ప్రముఖంగా ప్రచురించాయి. చనిపోయిన ముగ్గురిలో ఒకరు ప్రముఖ బహుళజాతి సంస్థ లాయిడ్స్ స్టీల్ కంపెనీకి ఉన్నతస్థాయి అధికారి కావడం విశేషం. 5వేల కోట్ల టర్నోవర్ కలిగిన ఈ కంపెనీ ప్రధానంగా ఉక్కు సంబంధిత పరిశ్రమలను కలిగివుంది. అధికారవర్గాల సమాచారం ప్రకారం ఈ కంపెనీకి వైస్‌ప్రెసిడెంట్ అయిన జస్పాల్ థిల్లాన్, లాయిడ్స్‌కు అనుబంధంగా ఉన్న హేమలతా మినరల్స్ ఎండీ ఆంధ్రప్రదేశ్‌కు చెందిన మల్లికార్జున్‌రెడ్డి కలిసి స్థానిక పోలీస్‌పటేల్ రాజు సడిమెక్ మధ్యవర్తిత్వంలో మావోయిస్టులతో చర్చలు జరిపేందుకని మంగేర్ గ్రామానికి వెళ్లారు. చర్చల్లో ఏం జరిగిందో తెలియదు కానీ వారిని వదిలిపెట్టి ఓ గంటలో తిరిగివచ్చిన కారు డ్రైవర్‌కు మూడు శవాలు కనిపించాయి. లాయిడ్స్ కంపెనీ సుర్జాగడ్ గుట్టల్లో ఇనుప ఖనిజం మైనింగ్ కాంట్రాక్ట్ కోసం తన మరో అనుబంధ కంపెనీ గడ్చిరోలి మెటల్స్ అండ్ మైనింగ్ ప్రై. లిమిటెడ్ ద్వారా ప్రయత్నిస్తున్నదని, ఈ ప్రయత్నంలోనే మావోయిస్టులను కలిసేందుకు వెళ్లారని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి.

ఆదివాసీ ప్రాంతాల్లో మైనింగ్ కార్యకలాపాలను వ్యతిరేకిస్తున్న మావోయిస్టులను ఒప్పించేందుకు చేసిన ప్రయత్నాల్లో భాగంగానే ఈ ఘటన జరిగిందని సమాచారం. గతంలో బల్లార్‌పూర్ పేపర్ మిల్లు(బిల్ట్)లో ఉన్నతాధికారిగా పనిచేసిన థిల్లాన్‌కు నక్సలైట్లతో బాగా పరిచయముందని, ఆ నమ్మకంతోనే వారిని కలువడానికి వెళ్లాడని అంటున్నారు. ఆదివాసీ ప్రాంతాల్లో మైనింగ్ కార్యకలాపాలకు వ్యతిరేకమని బహిరంగంగానే ప్రకటించిన మావోయిస్టులు ఈ ముగ్గురిని ఎలాంటి చర్చలు లేకుండానే చంపేశారని అధికారవర్గాలు వివరించాయి.

మహారాష్ట్రకు తూర్పున ఛత్తీస్‌గఢ్ సరిహద్దులో ఉన్న జిల్లా గడ్చిరోలి. మనకు

కరీంనగర్ జిల్లా మహదేవపూర్ ప్రాంతం నుంచి ఎక్కడ గోదావరి దాటినా ఈ జిల్లానే వస్తుంది. ఎనభై శాతం ప్రాంతం అడవులు, గుట్టలతో కూడుకొనివున్న ఈ జిల్లాలో అపార ఖనిజసంపద వుంది. జిల్లా మధ్యభాగంలో నెలకొనివున్న సుర్జాగఢ్ గుట్టలు ప్రత్యేకించి ఇనుప ఖనిజం నిల్వలకు ప్రసిద్ధిగాంచాయి. ఈ గుట్టల్లో ఇనుము నిక్షేపాలు వందల మిలియన్ల టన్నుల్లోనే ఉంటాయని సెంట్రల్ జియలాజికల్ ప్రొగ్రామింగ్ బోర్డు (సీజీపీబీ) కమిటీ జరిపిన అధ్యయనంలో తేలింది. విలువైన ఈ నిక్షేపాలపై కన్నేసిన డజనుకు పైగా బహుళజాతి కంపెనీల్లో లాయిడ్స్ ఒకటి. ఈ కంపెనీకి వార్ధా, చంద్రపూర్ జిల్లా గుగ్గుస్‌లలో ఉక్కు, స్పాంజ్ ఐరన్ కర్మాగారాలున్నాయి. ఈ కర్మాగారాలకు కావాల్సిన ముడిఇనుము సరఫరాలో కొరతనెదుర్కొంటున్న నేపథ్యంలోనే లాయిడ్స్ కంపెనీ సుర్జాగఢ్ గుట్టలపై దృష్టి సారించింది. తనకూ అక్కడ క్యాప్టివ్ మైన్స్ కావాలని పైరవీలు ప్రారంభించింది. ప్రభుత్వవర్గాల ఆమోదం దొరికిందనుకున్న సమయంలో మావోయిస్టుల గ్రీన్‌సిగ్నల్ కోసమూ ప్రయత్నిస్తోంది.

సుర్జాగఢ్ సంపదపై కన్నేసిన కంపెనీల్లో లాయిడ్స్ ఒంటరిగా లేదు. ఇప్పటికే జేఎస్‌డబ్ల్యు ఇస్పాట్ స్టీల్ లిమిటెడ్ అనే మరో భారీ కంపెనీ ఇక్కడ మైనింగ్ కోసం అనుమతులు సంపాదించింది. జిందాల్ సోదరులు నవీన్, సజ్జన్‌లు నడిపిస్తున్న ఈ కంపెనీ దేశంలోని అతిపెద్ద బహుళజాతి కంపెనీల్లో ఒకటిగా పేరుగాంచింది. సుర్జాగఢ్ గుట్టల్లోని దంకోడ్వాడ్వి ప్రాంతంలోని 751.04 హెక్టార్ల విస్తీర్ణంలో గనుల తవ్వకానికి ఈ కంపెనీ కేంద్ర ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకుంది. ఇరవై ఏళ్ల పాటు అమలయ్యే లీజులో ఏటా 5.5 మిలియన్ టన్నుల ఇనుపఖనిజాన్ని వెలికితీయడం, ఇక్కడే క్రషింగ్ అండ్ స్క్రీనింగ్ ప్లాంట్ నెలకొల్పడం ఈ ఒప్పందంలో భాగం. ఇక్కడి నుంచి వెలికితీసే ఖనిజాన్ని మహారాష్ట్రలోని రాయ్‌గఢ్ జిల్లా డోల్విలో జేఎస్‌డబ్ల్యు ఇస్పాట్ నెలకొల్పిన ఉక్కు ఫ్యాక్టరీకి తరలిస్తారు. ఇప్పటికే ఈ మైనింగ్ పర్యావరణంపై పడేసే ప్రభావం గురించిన అధ్యయనం జరిపి నివేదికను ప్రభుత్వానికి అందజేశారు. నియమానుసారం జరగాల్సిన బహిరంగ విచారణను సైతం గత నెల 8న నిర్వహించారు. త్వరలోనే మహారాష్ట్ర పర్యావరణ నియంత్రణ మండలి(పీసీబీ) ఈ మైనింగ్ ప్రాజెక్టుకు తన ఆమోదాన్ని తెలుపుతుందన్న ఆశాభావాన్ని జేఎస్‌డబ్ల్యు ఇస్పాట్ ప్రతినిధి రాజు మలానీ వ్యక్తం చేశారు.

ఇక్కడ మనం ఒక కీలక అంశాన్ని గమనించాలి. గట్ట, గడ్డెవాడ పంచాయతీలకు చెందిన సుమారు 17 ఆదివాసీ పల్లెల ప్రజలను నిర్వాసితులను చేసే ఈ ప్రాజెక్టును ఆమోదించేముందు కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలు స్థానికులను కనీసంగా కూడా సంప్రదించలేదు. మే 8న ఈ పల్లెలకు 70 కి.మీ.ల దూరంలో ఉన్న ఆళ్లపల్లి పట్టణంలో నిర్వహించిన ప్రజాభిప్రాయ సేకరణలో బాధిత ప్రజలెవరూ పాల్గొనకపోవడం గమనార్హం.

ఈ ప్రజాభిప్రాయసేకరణ గురించిన ప్రకటనను స్థానికంగా అందుబాటులో లేని ఒక ఆంగ్ల, మరో మరాఠీ దినపత్రికల్లోనే ప్రచురించారు. ఏ ఊర్లోనూ నోటీసులు అంటించలేదు. గోండి భాష తప్ప మరో భాష రాని స్థానికులకు ఇప్పుడిప్పుడే అసలు విషయం తెలుస్తున్నది. ప్రజాభిప్రాయ సేకరణ విషయం తెలిసిన వెంటనే గట్ట గ్రామసభ మే 1న సమావేశమై మైనింగ్ ప్రాజెక్టును వ్యతిరేకిస్తూ తీర్మానించింది. బహిరంగ విచారణను తాము బహిష్కరిస్తున్నామని, వెంటనే రాష్ట్ర ప్రభుత్వం తనిచ్చిన అనుమతిని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేసింది. అయినా జిల్లా కలెక్టర్ కాని, రెవెన్యూ యంత్రాంగం కాని ఈ విషయం అసలే పట్టించుకోలేదు. ప్రజాభిప్రాయ సేకరణలో ప్రజలు ప్రాజెక్టుకు అనుకూలంగానే ఉన్నట్లు మహారాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక పంపింది. పైగా ఈ ప్రాజెక్టు మూలంగా స్థానికంగా అభివృద్ధి జరుగుతుందని, చదువుకున్న యువకులకు ఉద్యోగాలు లభిస్తాయని, విద్యా వైద్య వసతులు సమకూరుతాయని, రోడ్లు వేస్తారని జోరుగా ప్రచారం చేస్తోంది.

నిజానికి ఈ ప్రాజెక్టు మూలంగా 17 ఆదివాసీ గ్రామాలకు చెందిన సుమారు 8 వేల మంది ప్రజలు జీవనోపాధి కోల్పోతారు. వీరంతా మాడియా గోండ్ తెగకు చెందినవారు. భారత్‌లోనే అత్యంత ఆదిమజాతుల్లో ఒకటైన ఈ తెగ ప్రజలు ప్రధానంగా అడవిపైనే ఆధారపడి బతుకుతారు. రోజంతా అడవిలో సంచారం.. రాత్రికి ఆటా పాటలతో వీరి జీవితం చాలా ఆహ్లాదకరంగా సాగిపోతుంది. పండ్లు-ఫలాల సేకరణ, వెదురు నరకడం, తునికాకు తెంపడం, జంతువుల వేట, వ్యవసాయం వీరి ప్రధాన వ్యాపకాలు. అడవులు, గుట్టలు లేకుండా వీరి మనుగడ అసాధ్యం. మైనింగ్ మూలంగా కేటాయించిన ప్రాంతంలోని అడవి పూర్తిగా నాశనం కావడమే కాకుండా మరో పది కిలోమీటర్ల పరిధిలో పర్యావరణం నాశనమవుతుందని నిపుణులు చెబుతున్నారు. నేల, నీరు, గాలి పూర్తిగా కలుషితమవుతాయని, మనుషులకే కాకుండా జంతుజాలానికీ ముప్పేనని వారంటున్నారు.

మరోవైపు, ఈ అడవుల్లో కోతులు, కొండముచ్చులు, జింకలు, బెట్టుడతలు, కుందేళ్లు, ముంగీసలు, అడవిపిల్లులు, రేసుకుక్కలు, నక్కలు, ఝూడుంలు(యాంట్ ఈటర్స్), ముళ్లపందులు విస్తృతంగానూ, అంతరించే ప్రమాదమున్న జాబితాలో గల పులులు, చిరుతలు, ఎలుగుబంటులు, తోడేళ్లు, అడవిబర్రెలు, నాలుగు కొమ్ముల జింకలు అక్కడక్కడా కనిపిస్తాయి.

ఇక ఈ ప్రాజెక్టు వల్ల స్థానికంగా అభివృద్ధి జరుగుతుందన్నదీ ఉత్తదే. ఇక్కడి ఆదివాసుల్లో చదువుకున్నవాళ్లు పెద్దగా లేరు కనుక ఉద్యోగాలు రావడం భ్రమే. క్రషింగ్ అండ్ స్క్రీనింగ్ ప్లాంట్ వల్ల కూడా కాలుష్యం తప్ప మరేముండదు. అలాగే ప్రాజెక్టు

కోసం సేకరించే రెండు వేల ఎకరాలే కాకుండా మైనింగ్ ప్రక్రియలో బయటపడే ఓవర్‌బర్డెన్, రోడ్లు, నిల్వలు వగైరా అవసరాలకు మరెన్నో ఎకరాలను అనధికారికంగా ఉపయోగించుకోవడం జరుగుతుంది కనుక ఈ 17 గ్రామాల ప్రజలు అన్ని రకాలుగా ఉపాధి కోల్పోతారు. వ్యవసాయం చేద్దామంటే భూములు లేక, అడవులూ లేక చివరకు ఆదివాసులంతా రోజుకూలీలుగా మారి ఆకలితో అలమటిస్తారు.

ఈ ప్రమాదాన్ని గుర్తించిన స్థానికులు మైనింగ్ ప్రాజెక్టును వ్యతిరేకిస్తున్నారు. ముప్పై ఏళ్లుగా ఈ ప్రాంత ప్రజల జీవితాలతో పెనవేసుకుపోయిన మావోయిస్టుల నాయకత్వంలో ఉద్యమిస్తున్నారు. శాంతియుత పోరాటాలను అనుమతించని పరిస్థితుల్లో స్థానికులు ఐక్యమై అన్ని కంపెనీల కార్యకలాపాలను, రోడ్ల నిర్మాణాన్ని అడ్డుకుంటున్నారు. వీరి నిరసనలపై ప్రభుత్వాలు ఉక్కుపాదాన్ని మోపుతున్నాయి. ప్రజాభిప్రాయసేకరణ సందర్భంగా సైతం భారీయెత్తున పోలీసు బలగాలను, కమాండోలను దించారు. మైనింగ్‌ను వ్యతిరేకించే ప్రజాప్రతినిధులను సైతం బెదిరింపులకు గురిచేస్తున్నారు. భవిష్యత్తులో మైనింగ్ కార్యకలాపాలకు ఆటంకం కలిగిస్తారనే ఉద్దేశంతో ఇప్పటి నుంచే మావోయిస్టుల అణచివేతకు చర్యలు చేపడుతున్నారు. సుర్జాగఢ్ పరిసర గ్రామాల్లో కొత్తగా వందలాది పారామిలిటరీ బలగాలతో క్యాంపులు పెడుతున్నారు. ఈ నేపథ్యంలోనే థిల్లాన్, మరో ఇద్దరి హత్య జరిగింది.

ఆదివాసీప్రాంతాలను అభివృద్ధి చేసే ముసుగులో స్థానిక వనరులను బహుళజాతి కంపెనీలకు కట్టబెట్టే కుట్రలను ప్రజలు, ప్రజాస్వామికవాదులు వ్యతిరేకించాలి. ఇప్పటికే ఛత్తీస్‌గఢ్, ఒరిస్సా, జార్ఖండ్ రాష్ట్రాల అటవీప్రాంతాల్లోని లక్షలాది ఎకరాలను మైనింగ్ ఎంఓయూల పేరిట దేశ, విదేశీ కంపెనీలకు అప్పగించారు. అడవులను ధ్వంసం చేసి పర్యావరణ సమతుల్యతను దెబ్బతీస్తున్నారు. వాయు, జల, శబ్ద కాలుష్యానికి పాల్పడుతున్నారు. వందలాది పల్లెలను మరోచోటికి తరలిస్తున్నారు. డోంగ్రియా, కుటియా కోందులు, అబూజ్‌మాడియాల వంటి అరుదైన ఆదిమతెగల అస్తిత్వానికి ముప్పు తెస్తున్నారు. వానాకాలంలో ఎండలు, ఎండాకాలంలో వానలు, రుతువుల తారుమారు వంటివన్నీ అడవుల విధ్వంసం ఫలితమే. మనం ఇంకా నిర్లక్ష్యం చేస్తే భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన గాలిని, నీటిని, కనీస జీవన వనరులను సైతం అందించలేని పరిస్థితులు రావడం ఖాయం. అందుకే ప్రపంచీకరణ విధానాల్లో భాగంగా జరుగుతున్న ఈ ఘోరకలిని ఆపడానికి ప్రతి ఒక్కరూ రంగంలోకి దిగాలి. మావోయిస్టులను పారదోలేందుకని చేపట్టిన ఆపరేషన్ గ్రీన్‌హంట్ నిజానికి బహుళజాతి కంపెనీల వనరుల దోపిడికి మార్గం సుగమం చేయడానికేనని గుర్తించాలి. మధ్యభారత అడవులను, సహజవనరులను కాపాడుకోవడానికి సమష్టిగా ఉద్యమించాలి.

***(నమస్తే తెలంగాణ, 17-06-2013)***

# అభివృద్ధి విలయతాండవం..

ఉత్తరాఖండ్ ప్రకృతి బీభత్సం జాతిని కుదిపేస్తున్నది. వివిధ రాష్ట్రాలకు చెందిన వందలాది యాత్రికులను, వేలాది స్థానికులను బలిగొన్న ఈ జలవిలయం ఉత్తరకాశీ, చమోలీ, రుద్రప్రయాగ జిల్లాలను సర్వనాశనం చేసింది. ఉగ్రరూపం దాల్చిన నదుల తాకిడికి రహదారులు, వంతెనలు ఆనవాలు లేకుండా కొట్టుకుపోయాయి. అనేక బహుళ అంతస్తుల భవనాలు పేకమేడల్లా కూలిపోయాయి. రోజులు గడుస్తున్న కొలదీ మృతుల సంఖ్య ఆందోళనకర స్థాయిలో పెరుగుతున్నది. కేదార్‌నాథ్ పరిసరాల్లో కుప్పలు కుప్పలుగా మృతదేహాలు పడివున్నాయనీ, కుళ్లిపోతున్నాయనీ వార్తలు వస్తున్నాయి. గత్యంతరం లేని పరిస్థితుల్లో వాటికి ఎక్కడికక్కడే దహనసంస్కారాలు నిర్వహించడానికి అధికారయంత్రాంగం ప్రయత్నిస్తున్నది. చార్‌ధామ్‌గా ప్రసిద్ధిగాంచిన కేదార్‌నాథ్, గంగోత్రి, యమునోత్రి, బద్రీనాథ్ పుణ్యక్షేత్రాలను దర్శించుకుందామని వెళ్లిన అనేక మంది భక్తుల్లో కొందరు ఇప్పటికీ తమ స్వస్థలాలను చేరుకోలేదు. వారికోసం బంధుమిత్రులు ఆశతో ఎదురుచూస్తున్నారు. భారతసైన్యం, వాయుసేన, పారామిలిటరీ బలగాలు పగలూ రాత్రనకుండా శిథిలాల్లో చిక్కుకుపోయిన అభాగ్యులను రక్షించడానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నాయి. కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలు సైతం పునరావాస చర్యలపై కేంద్రీకరించాయి.

ప్రకృతి ప్రళయాలు భారత్‌కు కొత్తకాదు. కోస్తా తీరంలో, గుజరాత్ కచ్‌లో తుపానులు రావడం మనకు మామూలే. భారీ భూకంపాలు వచ్చి వేలాది మందిని బలిగొనడమూ తెలుసు. ప్రారంభంలో ప్రాణనష్టాలు అధికంగా ఉన్నా ఆ తర్వాత అనుభవంతో, నూతన టెక్నాలజీల ఆవిష్కరణతో, ముందు జాగ్రత్తలతో సాధ్యమైనంత తక్కువ నష్టంతో వీటినుంచి బయటపడుతున్నాం. అయితే, ఉత్తరాఖండ్ విషయంలో మాత్రం ఇలా జరగలేదు. దేశంలోని మిగతా ప్రాంతాలతో పోలిస్తే ఇక్కడ వరదలు, భూకంపాలు వచ్చే అవకాశాలు ఎక్కువని తెలిసినా ఎలాంటి ముందు జాగ్రత్తలు తీసుకోలేదు. నష్టనివారణ చర్యలు చేపట్టలేదు. కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలు ఉదాసీనవైఖరిని అవలంబిస్తున్నాయని, పైగా అభివృద్ధి పేరిట హిమాలయాల ఉనికికి భంగం కలిగించే,

నదీప్రవాహాలను కట్టడి చేసే, పర్యావరణానికి చేటుచేసే విధానాలకు పెద్దపీట వేస్తున్నాయని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఫలితంగానే వేలాదిమంది బలయ్యారని చెబుతున్నారు.

ఈ వాదనలో వాస్తవముంది. పర్యావరణ నిపుణులు చెబుతున్న ప్రకారం హిమాలయాలు ప్రపంచంలోనే అతితక్కువ వయస్సున్న పర్వతశ్రేణులు. సహజంగానే వీటి అంతర్భాగంలో కదలికలు, మార్పులు ఎక్కువగా ఉంటాయి. ఫలితంగానే భూకంపాలు రావడం, కొండచెరియలు విరిగిపడడం, మట్టికోతకు గురికావడం వంటివి జరుగుతుంటాయి. హిమాలయ పర్వత ప్రాంతాలైన ఉత్తరాఖండ్, హిమాచల్‌ప్రదేశ్, జమ్మూ-కాశ్మీర్, సిక్కిం తదితర రాష్ట్రాల్లో ప్రకృతి బీభత్సాలు ఎక్కువగా రావడానికి కారణమిదే. దాదాపు ప్రతీ సంవత్సరం ఇక్కడ వరదలు వస్తుంటాయి. కొండచెరియలు విరిగిపడుతుంటాయి. మట్టి కూలుతుంటుంది. భూమి కంపిస్తూవుంటుంది. అనేక మంది చనిపోతుంటారు. ఒక్క భూకంపాల మూలంగానే 1991లో 2వేల మంది, 99లో 103 మంది, 2005లో 80వేల మంది(పాకిస్తాన్‌తో కలిపి) చనిపోవడం గమనార్హం. వరదల మూలంగా జరిగే ప్రాణనష్టం, ఆస్తినష్టం కూడా చాలా ఎక్కువే. ఈ ప్రత్యేక పరిస్థితుల రీత్యా హిమాలయాల్లో నివసించే ప్రజల జీవనవిధానం ప్రత్యేకరీతిలో ఉంటుంది. శతాబ్దాలుగా మార్కెట్ వ్యవస్థతో వీరికి అసలు సంబంధం ఉండేది కాదు. అన్నీ కొండలు, లోయలే కావడంతో రోడ్డు రవాణా సౌకర్యం అసలు ఉండేది కాదు. ప్రజలు కాలినడకనో, గుర్రాలు, గాడిదలపైనో తమ ప్రయాణాలు కొనసాగించేవారు. చిన్న చిన్న ఇళ్లు.. పరిమితంగా పంటపొలాలు.. వర్షాధారమైన వ్యవసాయం.. గొర్రెల పెంపకం, ప్రకృతి అందాలు.. ఆటలు.. పాటలే లోకంగా ఇక్కడి ప్రజలు జీవించేవారు. మంచుకొండలపై వెలసిన పుణ్యక్షేత్రాలను సందర్శించడానికి యేటా వచ్చే యాత్రికులకు ఉన్నంతలో సౌకర్యాలు కల్పించి తృణమో పణమో పొందడం కూడా ఇక్కడి వాళ్లకు అలవాటే.

1990ల వరకూ ఉత్తరాఖండ్ ఇలాగే ఉండేది. అటు తర్వాత దేశంలోకి ప్రపంచీకరణ, ప్రైవేటీకరణ, సరళీకరణ విధానాలు ప్రవేశించాయి. 2000 సంవత్సరంలో ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడిన తర్వాత ఉత్తరాఖండ్‌లో అభివృద్ధి వేగవంతమైంది. వరసగా పగ్గాలు చేబట్టిన కాంగ్రెస్, బీజేపీ ప్రభుత్వాలు ఇక్కడ మెండుగా ఉన్న జల, ఖనిజ, అటవీ సంపదపైనే దృష్టి సారించాయి. ప్రజలకు మౌలిక సౌకర్యాల కల్పన కోసమేనంటూ పలు అభివృద్ధి ప్రాజెక్టులను చేపట్టాయి. ముఖ్యంగా ఇక్కడ సంవత్సరమంతా పారే జీవనదులు పుష్కలంగా ఉండడంతో జలవిద్యుత్‌పై కేంద్రీకరించాయి. అలకానంద, మందాకిని, నందాకిని, భగీరథి, ధౌలిగంగ, భిలన్‌గంగ నదులపై సుమారు 70 జలవిద్యుత్

కేంద్రాలు నిర్మించి 10వేల మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తికి పథకాలు రచించాయి. వీటిలో కొన్ని ఇప్పటికే పూర్తికాగా, మరికొన్ని ఇంకా నిర్మాణదశలో ఉన్నాయి. ఒక విద్యుత్ కేంద్రం పరిధి ముగుస్తుందో లేదో మరో కేంద్రం మొదలయ్యే పరిస్థితి ఈ నదులపై ఉంది. తక్కువ పెట్టుబడులు, ఎక్కువ లాభాల ప్రాతిపదికన ఈ విద్యుత్ ప్రాజెక్టులను చేపట్టిన గుత్తేదార్లు నిబంధనలు గాలికి వదిలేశారు. టన్నెళ్ల, రిజర్వాయర్ల నిర్మాణం కోసం విచ్చలవిడిగా పేలుళ్లు, తవ్వకాలు జరిపారు. కొండలను తొలిచారు. బండలను పగలేశారు. మట్టిని ఎత్తిపోశారు. నదుల దిశలను మార్చి రిజర్వాయర్లకు మళ్లించారు. కిందికి దూకిన జలాలను మళ్లీ వెంటాడి కాస్త దూరంలో మరోచోట మళ్లీ ఆపారు. భగీరథి పయనంలో 80 శాతం, అలకానంద ప్రవాహంలో 65 శాతం, మిగతా నదులన్నీ 90 శాతం ఇలా ప్రభావితమయ్యాయని విశ్లేషకులు అంచనా వేశారు. ఫలితంగా కొండల అంతర్భాగంలో అలజడి, కదలిక ఎక్కువై ఇటీవలికాలంలో భూకంపాలు, కొండచెరియలు విరిగిపడడం తరచూ జరుగుతోందని వివరించారు. మొన్నటి విలయంలో కూడా అధిక వర్షపాతంతో వరదలు వచ్చి నదులు పొంగిపొర్లగానే భారీయెత్తున కొండచెరియలు విరిగిపడడం ప్రారంభమైందని తెలిపారు. ఇందుమూలంగానే ఎక్కువ మంది ప్రాణాలు కోల్పోయారని గుర్తు చేశారు.

అభివృద్ధి రూపంలో ఉత్తరాఖండ్‌కు ఎదురైన మరో విపత్తు పర్యాటకరంగం. 1990ల కంటే ముందు ఇక్కడికి వచ్చే యాత్రికుల సంఖ్య చాలా తక్కువగా ఉండేది. 2000 నుంచి ఈ సంఖ్య బాగా పెరుగుతూవస్తున్నది. గత పది సంవత్సరాల్లో యాత్రికుల సంఖ్య 155 శాతం పెరిగిందని అధికారులు గుర్తించారు. వారి లెక్కల ప్రకారం ప్రస్తుతం ఉత్తరాఖండ్‌లోని వివిధ పుణ్యక్షేత్రాల, పర్యాటకస్థలాల సందర్శనకు ప్రతియేటా వస్తున్న టూరిస్టుల సంఖ్య రెండు కోట్ల 80లక్షలు. పెరిగిన టూరిజం భారీగా ఆదాయం సమకూర్చినప్పటికీ మరో రూపంలో నష్టానికీ కారణమవుతున్నది. టూరిజం అభివృద్ధి పేరిట రహదారుల, భవనాల, వంతెనల నిర్మాణం కొండల్లో అలజడిని రేపుతున్నాయి. ఈ రోడ్లపై తిరిగే తేలికపాటి, భారీ వాహనాల సంఖ్య కూడా బాగా పెరగడంతో సమస్య తీవ్రరూపం దాల్చుతోంది.

టూరిజంతోనే వచ్చిన మరో సమస్య అక్రమ నిర్మాణాలు. నదీ తీరానికి 200 మీటర్ల పరిధిలో ఎలాంటి నిర్మాణాలు చేపట్టరాదని ప్రభుత్వ ఆదేశాలు ఉన్నప్పటికీ ఎక్కడంటే అక్కడ విచ్చలవిడిగా హోటళ్లు, లాడ్జీలు, గెస్ట్‌హౌజ్‌లు వెలుస్తున్నాయి. ప్రభుత్వపరంగా యాత్రికుల కోసం తగినన్ని హోటళ్లను నిర్మించకపోవడంతో ప్రైవేటు వ్యక్తులు ఈ వ్యాపారానికి ఎగబడుతున్నారు. గంగ, సోంగ్, భగీరథి, అలకానంద, మందాకిని నదీతీరాల వెంట మనం వేలాది అక్రమ నిర్మాణాలను గమనించవచ్చు.

మొన్నటి జలవిలయంలో కేదార్‌నాథ్ వద్ద అనేక మంది అభాగ్యులు ఇలాంటి అక్రమ నిర్మాణాల కిందపడి ప్రాణాలు కోల్పోయినవారేనన్న విషయం మర్చిపోరాదు.

ఆందోళన కలిగించే మరో అంశం గనులు, క్వారీల పేరిట ఇక్కడ విచక్షణారహితంగా కొనసాగుతున్న తవ్వకాలు. ఉత్తరాఖండ్ రాష్ట్రంగా మారాక రియల్ ఎస్టేట్ బాగా పెరిగింది. డెహ్రాడూన్‌తో పాటు ఇతర పట్టణాల్లో భవనాలు, రోడ్లు, వంతెనల నిర్మాణం ఉధృతమైంది. ఈ నిర్మాణాల కోసమే కాకుండా పొరుగు రాష్ట్రాలైన ఉత్తరప్రదేశ్, రాజధాని ఢిల్లీలకు సైతం ఇసుక సరఫరా ఇక్కడి నుంచే కొనసాగుతోంది. రాష్ట్రంలోని 12 జిల్లాల్లో పారుతున్న 49 చిన్నా పెద్దా నదులు, వాగుల నుంచి ప్రతి రోజూ వేలాది టన్నుల ఇసుకను తోడేస్తున్నారు. బండరాళ్లను కంకరగా మార్చి తీసుకెళుతున్నారు. అధికారిక లెక్కల ప్రకారమే 2000-2010 మధ్య 9వేల 641 ఎకరాల విస్తీర్ణంలో మైనింగ్, క్వారీయింగ్‌కు అనుమతులనిచ్చారు. ఇదికాకుండా మరో 3వేల 971 ఎకరాల్లో తవ్వకాలు జరపడానికి 2012 చివరలో టెండర్లు పిలిచారు. ఫలితంగా నదుల ఉనికికి, అడవులకు, పర్యావరణానికి ప్రమాదం వాటిల్లుతున్నది.

చివరగా ఒక ముఖ్యమైన విషయం. రోజురోజుకు వేడెక్కుతున్న వాతావరణం హిమాలయాలకు పెనుముప్పుగా పరిణమించింది. పరిశ్రమలు, వాహనాల నుంచి వెలువడే కాలుష్యం, అడవుల నరికివేత, కాంక్రీట్ జంగిల్ విస్తరణ తదితర కారణాల మూలంగా ఇప్పటికే భారత ఉపఖండంలో వాతావరణం మారిపోతున్నది. ప్రత్యేకించి ఉత్తరాఖండ్‌లో ఈ పరిణామం తక్షణ ముప్పునకు దారితీసింది. హిమాలయాల్లోనే పడమటి భాగంలో మంచుకొండలు (గ్లేసియర్లు) యథాతథంగా ఉండగా, తూర్పున మాత్రం క్రమక్రమంగా కరుగుతున్నాయని, భారీ సరస్సులు ఏర్పడడమే కాకుండా నదుల ప్రవాహం అనూహ్యంగా పెరిగిపోతోందని నిపుణులు చెబుతున్నారు. వాతావరణం వేడెక్కడం పెరిగిన కొలదీ వానాకాలమంతా విస్తరించి పడాల్సిన వానలు తక్కువ రోజుల్లో ఎక్కువతీవ్రతతో కురుస్తాయని, కుంభవృష్టిలు, మేఘాలు బద్దలు కావడం సాధారణమవుతాయని వారంటున్నారు. మరోవైపు, ఎండాకాలం ఎండలు మరింత మండిపోతాయని వారంటున్నారు. మొన్న కేదార్‌నాథ్ ప్రాంతంలో జరిగిందిదేనని స్పష్టం చేస్తున్నారు.

ఇప్పటికైనా ఉత్తరాఖండ్, ఢిల్లీ పాలకులు మేల్కోవాలి. అభివృద్ధిని ప్రజల బాగోగులతో, సంక్షేమంతో మేళవించాలి. మానవ మనుగడకే ముప్పు తెచ్చే అభివృద్ధి ప్రాజెక్టులను తిరస్కరించాలి. భవిష్యత్ తరాల కోసం అడవులను, సహజవనరులను, పర్యావరణాన్ని కాపాడుకోవాలి. హిమాలయ పర్వతశ్రేణులపై సమగ్ర అధ్యయనానికి ఆదేశించాలి. అన్ని రకాల మైనింగ్‌ను, క్వారీలను నిషేధించాలి. విద్యుత్‌కేంద్రాల,

రహదారుల, వంతెనల నిర్మాణాన్ని పర్యావరణ శాఖ పకడ్బందీగా పర్యవేక్షించేలా చూడాలి. నదీతీరాల వెంట ఉన్న అక్రమనిర్మాణాలను కూల్చేయాలి. అప్పుడే ఏడాది పొడుగునా కేదార్‌నాథ్, బద్రీనాథ్, గంగోత్రి తదితర పుణ్యక్షేత్రాలకు వెళ్లే యాత్రికులకు, స్థానికులకు రక్షణ ఉంటుంది.

***(నమస్తే తెలంగాణ, 01-07-2013)***

# నియాంగిరి కొండల్లో అవతార్ కథ..

మీరు అవతార్ సినిమా చూశారా! క్రీస్తుశకం 2150 నాటికి భూగర్భంలో గల అన్ని వనరులూ హరించుకుపోగా, ఉనోబ్టానియం అనే విలువైన ఖనిజం మెండుగా ఉన్న పండోరా గ్రహంపై కన్నేసిన మానవుల కథ అది. ఆ గ్రహంపై నవీ పేరున్న భారీ విచిత్రకాయం కలిగిన మూలవాసులు నివసిస్తారు. వీళ్లు ప్రకృతి ప్రేమికులు. అడవిపై ఆధారపడి జీవిస్తారు. కొండదేవతను ఆరాధిస్తారు. ఆ దేవత కొలువైన పర్వతశ్రేణుల్లో భారీ ఖనిజనిల్వలున్నట్లు గుర్తించిన మానవులు వాటిని చేజిక్కించుకోవడానికి పకడ్బందీ వ్యూహం రచిస్తారు. నవీలను పోలిన మానవ అవతారాలను సృష్టించి ఆ గ్రహంపైకి పంపుతారు. తర్వాతి క్రమంలో ఇరువర్గాల మధ్య భీకర పోరాటం జరుగుతుంది. అయితే, మానవుల టీంతో పాటు వెళ్లిన హీరో నవీ తెగకు చెందిన యువతితో ప్రేమలో పడతాడు. ప్రకృతితో ముడివడిన ఆ తెగ ప్రజల జీవనాన్ని, అస్తిత్వాన్ని గుర్తిస్తాడు. తమ స్వార్థంకోసం వారిని ఆ కొండల నుంచి తరిమేయడం అన్యాయమని భావిస్తాడు. తన పై అధికారుల ఆజ్ఞలను ధిక్కరించి వారి పక్షాన నిలబడతాడు. ఎన్నో మలుపులు.. మరెన్నో భీకరపోరాటాలు.. ప్రాణనష్టాల అనంతరం చివరకు నవీ తెగనే విజయం వరిస్తుంది. హీరోను తమలో ఒకడిగా కలుపుకున్న మూలవాసులు మానవులను భూగ్రహానికి తరిమికొడతారు. ఇదీ క్లుప్తంగా అవతార్ కథ.

ఇదంతా ఎందుకు చెప్పాల్సివచ్చిందంటే సరిగ్గా అవతార్ సినిమా కథను తలపించే కథ ఒకటి ఒరిస్సా రాష్ట్రంలోని నియాంగిరి కొండల్లో దశాబ్దకాలంగా ఆవిష్కృతమవుతోంది. ఈ కొండల గర్భాన విరివిగా ఉన్న బాక్సైట్ నిల్వలపై లక్షన్నర కోట్ల రూ.లకు పైబడిన ఆస్తులు కలిగిన బహుళజాతి సంస్థ వేదాంత కన్నుపడింది. ఎలాగైనా ఈ ఖనిజ వనరులను చేజిక్కించుకుని మరిన్ని లక్షల కోట్లు ఆర్జించడానికి ఆ కంపెనీ పథకాలు రచించింది. 2003లో ఒరిస్సా ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకుంది. భారీగా నిధులు వెచ్చించి పర్యావరణ ప్రభావ అధ్యయన నివేదికలను తనకు అనుకూలంగా రాబట్టుకుంది. ప్రజలు లేని ప్రజాభిప్రాయ సేకరణ తతంగాన్ని

నిర్వహింపజేసింది. విస్తృతంగా లాబీయింగ్ చేసి చివరకు కేంద్ర పర్యావరణ శాఖ నుంచి తాత్కాలిక అనుమతిని సైతం సంపాదించింది. లాంజిగఢ్‌లో రెండువేల ఎకరాల స్థలంలో అల్యూమినియం శుద్ధి కర్మాగారాన్ని నెలకొల్పింది. ఇక నియాంగిరి కొండలపై తవ్వకాలు మొదలుకావడమే తరువాయి.

అవతార్‌లో లాగా హీరో కాదు కాని పీయూసీఎల్ తదితర ప్రజాసంఘాలు స్థానిక ఆదివాసుల పక్షాన నిలిచాయి. అభివృద్ధి పేరిట తమ బతుకులపై సాగుతున్న ఆక్రమణను ఎలా ఎదుర్కోవాలో తెలియక సతమతమవుతున్న డోంగ్రియా కోందులను జాగృతం చేశాయి. వారి తరఫున సుప్రీంకోర్టుకు వెళ్లాయి. కోర్టు తాత్కాలిక స్టేను మంజూరుచేసింది. అయితే, పర్యావరణానికి చేటుచేయబోమని, పూర్తిస్థాయిలో పునరావాసం కల్పిస్తామని, స్థానికుల సంక్షేమానికి తమదే పూచీ అంటూ వేదాంత చేసిన వాదనలతో చివరకు అత్యున్నత న్యాయస్థానం ఏకీభవించింది. లాభాల్లో ఐదు శాతం వాటాను స్థానికుల అభివృద్ధికి కేటాయించాలనే షరతుపై మైనింగ్‌ను అనుమతించవచ్చంటూ 2008 ఆగస్టులో ఆదేశాలు జారీ చేసింది. కోర్టులతో అయ్యేపని కాదని ఆలస్యంగానైనా తెలుసుకున్న డోంగ్రియాలు నియాంగిరి సురక్షా సమితిని ఏర్పాటుచేసుకుని పోరాటం మొదలుపెట్టారు. నిరసన సభలు, ధర్నాలు, ఊరేగింపులు, బంద్‌లు నిర్వహించారు. వేదాంత పంపిన ఆదివాసేతర గూండాల దాడులను ఎదుర్కొంటూ ముందుకు సాగారు. వీరికి సంఘీభావంగా గ్రీన్ కలహంది, కలహంది సచేతన్ నాగరిక్ మంచ్ వంటి పౌరసంస్థలు సైతం ఏర్పడి ఉద్యమంలో చేరాయి. పలువురు మేధావులు, సామాజిక కార్యకర్తలు, పర్యావరణ నిపుణులు రంగంలోకి దిగారు. వేదాంత తలపెట్టిన ప్రాజెక్టు అభివృద్ధికి మించి జీవన విధ్వంసాన్ని సృష్టిస్తుందని, పర్యావరణానికి ప్రమాదమని, భూగర్భ జలాలు అడుగంటుతాయని, జంతుజాలం నశిస్తుందని, ఇప్పటికే అల్యూమినియం కర్మాగారం వల్ల వెలువడిన కాలుష్యం, పోగుబడిన వ్యర్థ పదార్థాలు ఇందుకు సాక్ష్యమని గొంతెత్తారు. ఫలితంగా అంతర్జాతీయ సమాజం స్పందించింది. మానవ హక్కుల సంస్థ ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్, సర్వైవల్ ఇంటర్నేషనల్ వేదాంత మైనింగ్ కార్యకలాపాలను వ్యతిరేకించాయి. చర్చ్ ఆఫ్ ఇంగ్లండ్ సహా బ్రిటన్‌కు చెందిన పలు వ్యాపార సంస్థలు వేదాంత నుంచి తమ షేర్లను ఉపసంహరించుకున్నాయి.

ఫలితంగా కేంద్రం దిగివచ్చింది. వేదాంత మైనింగ్ మూలంగా స్థానికంగా వాటిల్లే నష్టాన్ని అంచనా వేయడానికి ఎన్ సీ సక్సేనా నేతృత్వంలో కమిటీ వేసింది. ఈ కమిటీ 2010 ఆగస్టు 16న నివేదికను సమర్పించింది. అటవీ సంరక్షణా చట్టాన్ని, అటవీ హక్కుల చట్టాన్ని, పర్యావరణ పరిరక్షణ చట్టాన్ని, వేదాంత కంపెనీ ఉల్లంఘించిందని, రాష్ట్ర ప్రభుత్వ అధికారులు ఆ సంస్థతో కుమ్మక్కయ్యారని పేర్కొంది. నియాంగిరిలో

మైనింగ్ వల్ల రెండు అతి పురాతన తెగల అస్తిత్వానికి ప్రమాదమేర్పడుతుందని తేల్చింది. ఈ నివేదిక ఆధారంగా వేదాంత కంపెనీకి ఇచ్చిన పర్యావరణ అనుమతులను రద్దు చేస్తున్నట్లు కేంద్ర మంత్రి జైరాం రమేష్ ప్రకటించారు. అయితే, వేదాంత తిరిగి సుప్రీంను ఆశ్రయించింది. రెండు సంవత్సరాలకు పైగా విచారణ కొనసాగిన అనంతరం 2013 ఏప్రిల్ 18న తుదితీర్పు వెలువడింది. నియాంగిరిపై మైనింగ్‌ను అనుమతించే అధికారం కేవలం స్థానికులకే ఉందని స్పష్టం చేసింది. అటవీభూములపై, పవిత్రస్థలాలపై ఆదివాసులకే యాజమాన్యహక్కులను కల్పించాలని ఆదేశించింది. మైనింగ్ అంశాన్ని పల్లిసభ(గ్రామ్‌సభ)లకు వదిలేయాలని సూచించింది. ప్రస్తుతం ఈ గ్రామ్‌సభలు నిర్వహించే పనిలో రాష్ట్ర ప్రభుత్వ అధికారులు ఉంటే, తమకు అనుకూలంగా తీర్మానాలు చేయించుకుని మైనింగ్ ప్రారంభించే ప్రయత్నాల్లో వేదాంత కంపెనీ నిండా మునిగివుంది.

ఇక్కడ డోంగ్రియా కోందు తెగ గురించి ప్రత్యేకంగా చెప్పుకోవాలి. అవతార్ సినిమాలోని విచిత్ర నవీ తెగ కంటే కూడా డోంగ్రియా కోందులు విశేష జీవనవైవిధ్యాన్ని కలిగియున్నారు. అబూజ్‌మాడ్ గోండుల్లాగే వీరిది అతి పురాతన తెగ. ప్రొటోఆస్ట్రలాయిడ్ జాతికి చెందిన ఈ తెగను అంతరించిపోతున్న తెగగా సర్వైవల్ ఇంటర్నేషనల్ గుర్తించింది. వీళ్లు కుయి భాషను మాట్లాడుతారు. ప్రధానంగా కలహంది, కోరాపుట్, రాయగఢ జిల్లాల్లో విస్తరించివున్న నియాంగిరి కొండల్లో నివసిస్తారు. కొండలపై నివసిస్తారు కనుక వీరిని డోంగ్రియా (డోంగర్ అంటే గుట్ట)లని, పారే సెలయేళ్ల పక్కన ఇళ్లు నిర్మించుకుంటారు కనుక ఝుర్నియా(ఝురణ్ అంటే సెలయేరు)లని వ్యవహరిస్తారు. వీరి జీవనవిధానం, సంస్కృతి సంప్రదాయాలు విభిన్నమైనవి. వైవిధ్యంతో కూడుకున్నవి. ప్రకృతితో విడదీయరాని సంబంధం కలిగివున్నట్టివి. కొండవాలున పోడు వ్యవసాయం, జంతువుల, చేపల వేట, పండ్లు ఫలాల సేకరణ వీరి ఆర్థిక వ్యవస్థలో ముఖ్యభాగం. మామిడి, పనస, అనాస, బత్తాయి, బొప్పాయి ఫలాలు అడవుల్లో విరివిగా లభిస్తాయి. మొన్నమొన్నటి వరకూ వీరికి బయటి మార్కెట్‌తో అసలు సంబంధం ఉండేది కాదు. టీవీలు, బైక్‌లు, కార్లు, మొబైళ్లు తదితర ఆధునిక వస్తువులు వీరి ఇళ్లలో మచ్చుకైనా కనిపించవు. ప్రతి డోంగ్రియా గ్రామంలోనూ మండల్(గ్రామపెద్ద), జాని(పూజారి), బెజుని(మంత్రగాడు), బారిక్(వార్తాహరుడు) ఉంటారు. వీరే గ్రామవ్యవహారాలను చూసుకుంటారు.

మాడ్ గోండుల్లో లాగే వీరిలో కూడా గోటుల్ ఆచారం ఉంది. దాశాల(నిద్రాశాల)గా పిలిచే ఈ కమ్యూనిటీ క్లబ్బులో పెళ్లికాని బాలబాలికలు, యువతీయువకులూ సభ్యులుగా ఉంటారు. సభ్యుల్లో సీనియర్ అయిన ఓ అమ్మాయి లేదా అబ్బాయి దాశాలకు లీడర్లుగా వ్యవహరిస్తారు. వీరు జూనియర్లకు తెగ సంస్కృతి సంప్రదాయాలను, ఆచార వ్యవహారాలను, ఇతర లోకజ్ఞానాన్ని నేర్పుతారు. పగలంతా తల్లిదండ్రులతో పాటు

ఉండే పిల్లలు సాయం సమయం కాగానే దాశాల వద్దకు చేరుతారు. గానాబజానా, ఆటపాటల్లో నిమగ్నమవుతారు. చివరకు అలసిపోయి ఏ రాత్రికో నిద్రిస్తారు. ఈ క్రమంలో వయసు వచ్చిన యువతీ యువకుల మధ్య ప్రేమ ఏర్పడడం, సన్నిహితం కావడం అత్యంత సహజంగా జరుగుతుంది. ఇలా ఇష్టపడి ఒక్కటైన జంటలకు తెగపెద్దలు మాట్లాడి పెళ్లి చేస్తారు. అయితే, ఒకే కుదురు/ఇంటి పేరు కలిగిన వారి మధ్య వివాహ సంబంధాలు నిషేధం. అలాగే ఇక్కడ వరకట్నం కాకుండా కన్యాశుల్కం పద్ధతి అమలవుతోంది. వరుడే వధువు తండ్రికి నిర్ణీత మొత్తంలో నగదు రూపేణా కాని, వస్తువుల రూపేణా కాని చెల్లిస్తాడు. డోంగ్రియాల వేషధారణ విచిత్రంగా ఉంటుంది. పురుషులు పంచె, షర్టు ధరించగా, స్త్రీలు రంగురంగుల వస్త్రాలనేకం కలిపి కట్టుకుంటారు. స్త్రీ పురుషులిరువురూ ఆభరణాల ప్రియులే కావడం విశేషం. ముక్కుకు, చెవులకు, చేతులకు, మెడలో ఇత్తడి, ఇండాలియం, స్టీలుతో చేసిన దండలు, కంటెలు, రింగులు, గాజులు, ముక్కుపుడకలు ధరిస్తారు. మగవాళ్లు సైతం ముక్కుపోగు పెట్టుకోవడం, వెంట్రుకలు పెంచి క్లిప్పులు వాడడం, మెడలో దండలు వేసుకోవడం, పచ్చబొట్లు పొడిపించుకోవడం గమనార్హం.

ఇక వీరి మతవిశ్వాసాలు కూడా భిన్నంగానే ఉంటాయి. వివిధ రకాల చెట్లు, జంతువుల రూపంలోనే వీరి దేవతలు ఉంటాయి. పంటలు, ఫలాలు ఇచ్చే భూదేవత.. ఆపదల నుంచి కాపాడే కొండదేవత.. ఇలా అనేక దేవతలను వీరు కొలుస్తారు. నియాం పేను (నియాం దేవుడు) ఈ తెగ దైవం. ఈ నియాం పేను కొలువై ఉన్న కొండను సైతం మైనింగ్‌లో భాగంగా తవ్వేస్తారన్న విషయం డోంగ్రియాలను కలవరపరిచింది. (అవతార్ సినిమాలో సైతం ఇలాగే జరుగుతుంది) తమ ఇష్ట దైవాన్ని రక్షించుకోవడానికి వాళ్లు ఏం చేయడానికైనా సిద్ధపడ్డారు. విన్నవించారు. ఉద్యమించారు.. కోర్టుకెళ్లారు.. మేధావుల శరణుజొచ్చారు.. చివరకు అవతార్ సినిమా తీసిన ప్రముఖ హాలివుడ్ దర్శకుడు, రచయిత జేమ్స్ కామెరాన్‌కు ఈ విధంగా అప్పీల్ చేశారు. మీ అవతార్ సినిమా ఓ కల్పన కావచ్చు.. కానీ అది నిజం.. నియాంగిరి కొండల్లో డోంగ్రియా కోందు తెగ ప్రమాదంలో పడింది. వారి పవిత్ర పర్వతాన్ని మైనింగ్ పేరిట వేదాంత కంపెనీ సర్వనాశనం చేస్తోంది. మీరైనా కాపాడండి..!

డోంగ్రియాలను ఆదుకోవడానికి దేవుడే దిగివస్తాడో లేక కామెరాన్ మరో సినిమా తీస్తాడో తెలియదు కాని భారత్‌లోని ప్రజాస్వామిక శక్తుల ముందు మాత్రం ఓ కర్తవ్యం మిగిలివుంది. ప్రపంచీకరణ పేరిట అడవులను, సహజ వనరులను మింగేసే పాలకుల కుట్రలను ఓడించండి.. బహుళజాతి సంస్థలకు వ్యతిరేకంగా ఉద్యమిస్తున్న మూలవాసులకు బాసటగా నిలవండి.. డోంగ్రియా కోందులను రక్షించండి..

***(నమస్తే తెలంగాణ, 15-07-2013)***

# రెండవ భాగం

# రాజ్యం.. విప్లవం

# పౌరులపై 'సాయుధ' చట్టం?!

ఇరోం షర్మిల చాను.. ఈ పేరు వినని వారు అరుదు. మణిపూర్ రాష్ట్రానికి చెందిన ఈ మహిళ 2000 నవంబర్ 3వ తేదీ నుంచి ఆమరణ నిరాహారదీక్ష చేస్తూ సంచలనం సృష్టిస్తున్నది. ఆ రాష్ట్రంలోని మలోం గ్రామ సమీపాన ఓ బస్టాపు వద్ద నిలబడివున్న ప్రయాణికులపై అస్సాం రైఫిల్స్ జవాన్లు విచక్షణారహితంగా కాల్పులు జరిపి 10 మందిని పొట్టనబెట్టుకున్న ఘటన నేపథ్యంలో మరుసటి రోజు షర్మిల తన దీక్షను మొదలుపెట్టింది. ఎవరిని కాల్చుతున్నామో కూడా పట్టించుకోకుండా ప్రజలపై గుళ్ల వర్షాన్ని కురిపించే అధికారాన్ని జవాన్లకు దఖలుపర్చిన సాయుధ బలగాల ప్రత్యేకాధికారాల చట్టాన్ని ఎత్తివేయాలని డిమాండ్ చేస్తున్నది. నాటినుంచి ఆమె పోలీసుల నిర్బంధంలోనే ఉన్నది. భారత శిక్షాస్మృతిలోని 309 సెక్షన్ ప్రకారం ఆత్మహత్యాయత్నం కింద ఆమెపై నేరం మోపారు. ఈ నేరం కింద ఏడాది పాటు జైలుశిక్ష విధించవచ్చు. శిక్ష విధించడం, విడుదలైన రోజునే మళ్లీ లాంఛనంగా అరెస్టు చేయడం, తిరిగి ఏడాది శిక్ష వేయడం.. ఇలా పదకొండేళ్లుగా ఇంఫాల్‌లోని జవహర్‌లాల్ నెహ్రూ ఆస్పత్రి షర్మిల పాలిట జైలుగా మారింది. ముక్కులో చొప్పించిన పైపుల ద్వారా బలవంతంగా ఆమె శరీరంలోకి ద్రవపదార్థాలు పంపిస్తున్నారు. పౌరుల ప్రాణాలతో చెలగాటమాడుతున్న పాశవిక చట్టాన్ని రద్దు చేసేవరకు తన దీక్షను విరమించేది లేదని ఆమె చెప్తోంది.

షర్మిల దీక్షతో సాయుధ బలగాల ప్రత్యేకాధికారాల చట్టం(ఆర్మ్‌డ్ ఫోర్సెస్ స్పెషల్ పవర్స్ యాక్ట్ ) వార్తల్లోకెక్కింది. 1958 మే 22న ఆర్డినెన్స్‌గా అమల్లోకి వచ్చి ఆ తర్వాత పార్లమెంటు ఆమోదించిన ఈ చట్టం సైజులో చాలా చిన్నది. అధికారాల విషయంలో అతి పెద్దది. ఒకే పేజీలో, కేవలం ఆరు సెక్షన్లలో భారత సాయుధ బలగాలకు అపరిమితమైన అధికారాలను ఇది కట్టబెట్టింది. కల్లోలిత ప్రాంతంగా రాష్ట్ర గవర్నర్ లేదా కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన ఓ ప్రాంతంలో పనిచేస్తున్న పారా మిలిటరీ లేదా ఆర్మీకి చెందిన కమీషన్‌డ్, నాన్ కమీషన్‌డ్, వారంట్ అధికారులకు కార్యనిర్వాహక అధికారాలే కాకుండా మెజిస్టీరియల్ అధికారాలను కూడా ఈ చట్టం కల్పించింది.

చట్టాన్ని ఉల్లంఘిస్తున్నారని లేదా ఉల్లంఘించే అవకాశముందని తాము భావిస్తే చాలు.. ఎవరిపైనైనా కాల్పులు జరపవచ్చు. చంపవచ్చు. ఐదుగురి కంటే ఎక్కువ మంది గుమికూడరాదనే నిబంధనను అతిక్రమించినా బలప్రయోగం చేయవచ్చు. సాయుధులు దాగివున్నారని లేదా మందుగుండు దాచారని భావించిన నివాసాలను ధ్వంసం చేయవచ్చు. నేరం చేశాడని భావించిన ఏ వ్యక్తినైనా వారంట్ లేకుండా అరెస్టు చేయవచ్చు. ఈ చట్ట పరిధిలో చర్యలకు పాల్పడిన వారిని ప్రాసిక్యూట్ చేసే అధికారం రాష్ట్ర ప్రభుత్వాలకు లేదు. కేంద్ర ప్రభుత్వం మాత్రమే విచారణకు అనుమతించాలి.

కల్లోలిత ప్రాంతంగా ప్రకటించడానికి ఒక రాష్ట్రంలో లేదా రాష్ట్రంలోని ఒక ప్రాంతంలో నెలకొని ఉండాల్సిన పరిస్థితులపై ఈ చట్టంలో ఎలాంటి వివరణా లేదు. శాంతి భద్రతల పరిస్థితి క్షీణించిందన్న కారణంతో రాష్ట్ర గవర్నర్ కాని, కేంద్ర ప్రభుత్వం నేరుగా కాని ఒక ప్రాంతాన్ని కల్లోలితంగా ప్రకటించి మిలిటరీని దించవచ్చు. ఆయా రాష్ట్రాల శాసనవ్యవస్థల ప్రసక్తి లేకుండానే గవర్నర్ సైనిక బలగాలకు అపరిమితమైన అధికారాలను కట్టబెట్టవచ్చు. శత్రుదేశంపై యుద్ధం ప్రకటించాలన్నా అంతర్జాతీయ సమాజానికి కారణాలు చెప్పాల్సివున్న నేటికాలంలో తనదే అయిన రాష్ట్రంలో మిలిటరీని దించడానికి ఓ పెన్నుపోటు సరిపోవడం భారత ప్రజాస్వామ్యానికే చెల్లుతుంది.

53 ఏళ్లుగా ఈశాన్య రాష్ట్రాల్లో, 1990 నుంచి జమ్మూ–కాశ్మీర్‌లో ఈ చట్టం అమలులో ఉన్నది. ఆరు నెలలు లేదా ఏడాదికి ఒకసారి ఈ చట్టాన్ని కేంద్రం సూచన మేరకు ఆయా రాష్ట్రాల గవర్నర్లు పొడిగిస్తున్నారు. ఉగ్రవాదుల ఆగడాలు మితిమీరిపోయాయని, దేశభద్రతకు ప్రమాదముందని, స్థానిక పోలీసు బలగాలు అదుపు చేయలేకపోతున్నాయని ఈ చట్టాన్ని అమలు చేస్తున్నారు. ఈ విధంగా రాష్ట్రాల్లో సైనిక పాలన సాగుతున్నది. హక్కుల ఉల్లంఘనలు విచ్చలవిడిగా సాగుతున్నాయి. ఈ రాష్ట్రాల్లో సైనిక, పారామిలిటరీ బలగాల చేతిలో వేలాది మంది మరణించారు. కస్టడీ చావులు, మహిళలపై అత్యాచారాలు నిత్యకృత్యమయ్యాయి. గ్రామాలను చుట్టుముట్టి సోదా పేరిట ప్రజల ఆస్తులను లూటీ చేయడం సాధారణమైంది.

రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా జీవించే హక్కును, భావ ప్రకటన స్వేచ్ఛను, శాంతియుతంగా సమావేశమయ్యే స్వేచ్ఛను, దేశంలో ఎక్కడైనా సంచరించే, ఏ వృత్తినైనా ఏ మతాన్నైనా స్వీకరించే వీలును, విచక్షణారహిత అరెస్టుల నుంచి రక్షణను ఈ చట్టం పౌరుల నుంచి హరిస్తున్నదని హక్కుల సంఘాలు ఆరోపిస్తున్నాయి. నేరం చేశాడని నిరూపితమయ్యే వరకు ఒక వ్యక్తిని నిరపరాధిగానే భావించాలని మన సాధారణ చట్టాలు చెబుతుండగా ఏ ఆధారం లేకుండా ఓ వ్యక్తిని అరెస్టు చేసే అధికారాన్ని, బలప్రయోగం

చేసైనా నేరాన్ని ఒప్పించే వీలును ఈ ప్రత్యేక చట్టం కల్పిస్తున్నదని వీరు చెబుతున్నారు. పైగా శత్రు సైన్యాలను మట్టుబెట్టడంలో ఆరితేరివుండే సైనికులకు శాంతి భద్రతల సమస్యను, రోజువారీ వ్యవహారాలను అప్పగించడం వల్ల వాళ్లు ప్రతి ఒక్కరినీ శత్రువులుగా, ఉగ్రవాదులుగా చూసే అవకాశం ఎక్కువని, ఫలితంగానే ఈశాన్యంలో, కాశ్మీర్‌లో బూటకపు ఎన్‌కౌంటర్లు, పౌరులపై కాల్పులు, వేధింపులు, ఇతర హక్కుల ఉల్లంఘనలు విచ్చలవిడిగా జరుగుతున్నాయని స్పష్టం చేస్తున్నారు.

ఐక్యరాజ్యసమితి మానవ హక్కుల సంఘం కూడా ఈ చట్టాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నది. వలసవాద యుగానికి చెందిన కాలం చెల్లిన ఈ చట్టాన్ని వెంటనే ఎత్తివేయాలని సమితికి చెందిన మానవ హక్కుల కమిషనర్ నవనీతం పిళ్ళై డిమాండ్ చేశారు. అధికార దుర్వినియోగానికి, అణచివేతకు, వివక్షకు ఈ చట్టం సాధనంగా మారిందని హ్యూమన్ రైట్స్ వాచ్, ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ వ్యాఖ్యానించాయి. కాశ్మీర్‌లో మానవ హక్కుల ఉల్లంఘనలను అంతర్జాతీయ రెడ్‌క్రాస్ ధృవీకరించింది. భారత రక్షణ వ్యవహారాల అధ్యయన సంస్థ(ఐడీఎస్ఏ) సైతం సైనిక బలగాలు హద్దుమీరి అధికార దుర్వినియోగం చేస్తున్నాయని స్థానికులు విశ్వసిస్తున్నారని తన నివేదికలో పేర్కొంది. తన లీకులతో సంచలనాలు సృష్టిస్తున్న వికీలీక్స్ సాయుధబలగాల ప్రత్యేకాధికారాల చట్టం విషయంలో కూడా నమ్మలేని కొన్ని నిజాలను బహిర్గతం చేసింది. ఈశాన్యంలో, కాశ్మీర్‌లో నిర్బంధితులను తీవ్రంగా కొట్టడం, కరెంట్ షాక్ ఇవ్వడం సాధారణమైందని, మహిళలపై అత్యాచారాలు పెరిగిపోయాయని, మణిపూర్‌లో అస్సాం రైఫిల్స్ దౌర్జన్యాలను ఆ రాష్ట్ర గవర్నరే స్వయంగా అంగీకరించారని ఈ కేబుల్స్ వెల్లడిస్తున్నాయి.

ఈశాన్యంలోను, జమ్మూ-కాశ్మీర్‌లోను నిరసన వెల్లువ పెల్లుబికింది. మెజారిటీ ప్రజల అభిప్రాయంతో నిమిత్తం లేకుండా భారత ప్రభుత్వం తమ రాష్ట్రాలను కుట్రపూరితంగా ఆక్రమించడమే కాకుండా ప్రజల ఆకాంక్షలను సైనికంగా అణచివేయడానికి వ్యతిరేకంగా ఈశాన్యంలో ఎన్నో పోరాట సంస్థలు పుట్టుకొచ్చాయి. సాయుధ బలగాల ప్రత్యేకాధికారాల చట్టాన్ని ఎత్తివేయాలని ఉద్యమాలు చేశాయి. 2000లో షర్మిల దీక్ష, 2004లో మరో మణిపురీ మహిళ మనోరమను అస్సాం రైఫిల్స్ బలగాలు బంధించి అత్యాచారం చేసి చంపడం నేపథ్యంలో ఈ చట్టాన్ని వెంటనే ఎత్తివేయాలన్న డిమాండ్ తీవ్రమైంది. ఫలితంగా కేంద్ర ప్రభుత్వం స్పందించి ఈ చట్టంలోని అమానవీయ అంశాలపై విచారణ జరిపి నివేదిక ఇచ్చేందుకు జస్టిస్ బీ పీ జీవన్‌రెడ్డి నేతృత్వంలో ఐదుగురు సభ్యుల కమిషన్‌ను ఏర్పాటుచేసింది. 2005 జూన్ 6న కమిషన్ తన నివేదికను ప్రభుత్వానికి సమర్పించింది. కమిషన్ నివేదిక ఆధారంగా ఈ చట్టాన్ని మానవీయం చేస్తామని 2006 డిసెంబర్‌లో ప్రధాని ప్రకటించారు. అయితే

ఐదేళ్లు గడిచినా ఇప్పటికీ మన్మోహన్ హామీ బుట్టదాఖలే అయింది. ఈ చట్టం ఎత్తివేతను రక్షణ మంత్రి, సైనికాధికారులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్టు సమాచారం.

ఇంత దుర్మార్గమైన చట్టం మరొకటి లేదని అంతర్జాతీయ సమాజం, దేశీయ మానవ హక్కుల సంస్థలు కోడై కూస్తున్నా కేంద్ర ప్రభుత్వం ప్రతి సంవత్సరం పొడిగిస్తూనే ఉన్నది. ఇటీవలికాలంలో ఈశాన్య రాష్ట్రాల్లో మామూలు పరిస్థితులు నెలకొన్నాయని కేంద్ర హోం శాఖ వర్గాలు సైతం అంగీకరిస్తున్నాయి. గత పదేళ్లలో ఈ రాష్ట్రాల్లో జరిగిన హింస కూడా తక్కువే. అనేక పోరాట సంస్థలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో ఒప్పందాలు కుదుర్చుకుని సాయుధ పోరాట విరమణను ప్రకటించాయి. కాశ్మీర్‌లో సైతం ఉగ్రవాదుల చర్యలు తగ్గిన ఫలితంగా సర్కారు పాక్షికంగా బలగాలను ఉపసంహరించుకున్నది. ఈ నేపథ్యంలో సాయుధ బలగాల ప్రత్యేకాధికారాల చట్టాన్ని ఎత్తివేసే విషయంలో మన్మోహన్ ప్రభుత్వం చర్యలు చేబట్టాలి. పౌరుల ప్రజాస్వామిక ఆకాంక్షలను గౌరవించి అన్ని రంగాల్లో న్యాయం చేసినప్పుడే శాంతి నెలకొంటుందని గుర్తించాలి.

***(నమస్తే తెలంగాణ, 03-01-2012)***

# రాష్ట్రాల హక్కులపై 'ఉగ్ర' కేంద్రం..

టెర్రరిస్టు కార్యకలాపాలను సమర్థవంతంగా అణచివేసే ఉద్దేశంతో జాతీయ ఉగ్రవాద వ్యతిరేక కేంద్రాన్ని (ఎన్‌సీటీసీ) ఏర్పాటుచేస్తూ ఫిబ్రవరి 3న కేంద్ర ప్రభుత్వం ఒక నోటిఫికేషన్ జారీ చేసింది. ఇంటెలిజెన్స్ బ్యూరో (ఐబీ) డైరెక్టర్ పర్యవేక్షణలో సర్వస్వతంత్రంగా పనిచేసే ఈ కేంద్రానికి ఉగ్రవాదుల కార్యకలాపాలపై గూఢచర్యం నెరపడంతో పాటు దేశంలో ఎక్కడైనా సోదాలు చేసే, ఎవరినైనా అరెస్టు చేసే అధికారాలను కట్టబెట్టడం వివాదాస్పదమైంది. ఇది ఫెడరల్ స్ఫూర్తికి, ప్రజాస్వామిక విలువలకు విరుద్ధమని పలువురు విమర్శించారు. ఉగ్రవాద నిర్మూలన పేరుతో రాష్ట్రాల అధికారాలను కబళించే ప్రయత్నాలను తాము సహించబోమని కాంగ్రేసేతర పార్టీలకు చెందిన ముఖ్యమంత్రులు హెచ్చరించారు. ఉగ్రవాద నిర్మూలనకు తాము వ్యతిరేకం కాదని, తమను ఏమాత్రం సంప్రదించకుండా కేంద్రం ఇలా ఏకపక్షంగా వ్యవహరించడం అన్యాయమని వారు ఆరోపించారు. వెంటనే ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కేంద్రం చర్యను వ్యతిరేకించిన వారిలో యూపీఏ కూటమికి చెందిన బెంగాల్ సీఎం మమతా బెనర్జీతో పాటు బీహార్, ఒరిస్సా, మధ్యప్రదేశ్, గుజరాత్, తమిళనాడు, కర్నాటక, జార్ఖండ్, హిమాచల్‌ప్రదేశ్, ఉత్తరాఖండ్, త్రిపుర రాష్ట్రాల ముఖ్యమంత్రులు ఉన్నారు. ఈ వ్యతిరేకత నేపథ్యంలో అన్ని రాష్ట్రాల ప్రతినిధులతో సంప్రదించి వారు ఆమోదించిన తర్వాతే నోటిఫికేషన్‌ను అమలు చేస్తామని ప్రధాని మన్మోహన్ సింగ్ ప్రకటించారు. ఉగ్రవాద వ్యతిరేక కేంద్రం పని చేయడం ఆరంభించే మార్చి 1వ తేదీ లోపలే ఈ సంప్రదింపుల ప్రక్రియను ముగించాల్సిందిగా హోం మంత్రి చిదంబరానికి సూచించారు. కాగా, ఉగ్రవాద నిర్మూలన మనందరి సమష్టి బాధ్యతగా గుర్తించాలని, రాష్ట్ర ప్రభుత్వాలతో సంప్రదించకుండా నిర్ణయాలు చేయాలన్నది కేంద్రం ఉద్దేశం కానేకాదని ఎన్‌సీటీసీ లక్ష్యాలను వివరిస్తూ చిదంబరం తాజాగా ఆయా ముఖ్యమంత్రులకు లేఖ రాశారు. త్వరలోనే రాష్ట్రాల డీజీపీల, ఉగ్రవాద వ్యతిరేక విభాగాధిపతుల సమావేశం ఏర్పాటుచేసి అపోహలను తొలగిస్తామని వివరించారు.

26/11(2008) ముంబై దాడుల నేపథ్యంలో ఈ ఉగ్రవాద వ్యతిరేక కేంద్రానికి బీజాలు పడ్డాయి. 9/11(2001) దాడుల అనంతరం అమెరికా ఏర్పాటుచేసిన ఎన్‌సీటీసీని స్ఫూర్తిగా తీసుకున్న చిదంబరం మన దేశంలో కూడా అలాంటి బలమైన వ్యవస్థ అవసరమని భావించారు. బ్రిటన్, ఆస్ట్రేలియా, జర్మనీ, సింగపూర్ తదితర దేశాల్లో ఏర్పాటు చేసిన ఉగ్రవాద వ్యతిరేక కేంద్రాల విధి విధానాలను అధ్యయనం చేసి ప్రతిపాదనలు రూపొందించారు. ఈ యేడాది జనవరి రెండో వారంలో సమావేశమైన భద్రతా వ్యవహారాల కేబినెట్ కమిటీ ఈ ప్రతిపాదనలపై చర్చించి ఆమోదం తెలిపింది. నోటిఫికేషన్‌లో పేర్కొన్న వివరాల ప్రకారం ఉగ్రవాద నిర్మూలనలో ఎన్‌సీటీసీకి విస్తృతాధికారాలు ఉంటాయి. ఐబీలో అడిషనల్ డైరెక్టర్ స్థాయి అధికారి దీనికి నేతృత్వం వహిస్తారు. పలువురు జాయింట్ డైరెక్టర్లు ఇతనికి సహకరిస్తారు. దేశవ్యాప్తంగా 500 టీంలను, రాష్ట్ర స్థాయి ఎస్‌సీటీసీలను ఏర్పాటుచేస్తారు. ఎన్‌సీటీసీలో పని చేయడం కోసం అధికారులను, సిబ్బందిని ఐబీ, రా(రీసెర్చ్ అండ్ ఎనాలిసిస్ వింగ్), జాయింట్ ఇంటెలిజెన్స్ కమిటీ, త్రివిధ దళాలకు చెందిన గూఢచార సంస్థలు, జాతీయ సాంకేతిక పరిశోధన సంస్థ(ఎన్‌టీఆర్‌ఓ), డైరెక్టర్ జనరల్ ఆఫ్ మిలిటరీ ఇంటెలిజెన్స్, సెంట్రల్ బోర్డ్ ఆఫ్ డైరెక్ట్ టాక్సెస్(సీబీడీటీ), సెంట్రల్ ఎకనామిక్ ఇంటెలిజెన్స్ బ్యూరో, నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరోల నుంచి రిక్రూట్ చేసుకుంటారు. టెర్రరిస్టుల, వారి అనుచరుల, మద్దతుదారుల, స్నేహితుల, కుటుంబసభ్యుల కార్యకలాపాల గురించిన సమాచారాన్ని సేకరించడం, విశ్లేషించడమే కాకుండా చట్ట వ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టం(యూఏపీఏ–1967)లోని సెక్షన్ 43(ఎ) ప్రకారం అనుమానితులను అరెస్టు చేసే, ఉగ్రవాదుల స్థావరాలుగా భావించిన స్థలాలను సోదా చేసే అధికారం కూడా ఈ కేంద్రానికి ఉంటుంది. ఇందుకోసం ఎన్‌ఎస్‌జీ, నావికాదళ ప్రత్యేక బలగాలు, సీఆర్‌పీఎఫ్‌కు చెందిన కోబ్రా దళాలు సహా అన్ని రకాల కమాండో బలగాల, కోవర్ట్ ఆపరేషన్స్ నిర్వహించే రహస్య సంస్థల సేవలను వాడుకోవచ్చు.

దేశంలోని అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల ప్రభుత్వ యంత్రాంగం, విదేశాల్లోని భారత రాయబార కార్యాలయ అధికారులు ఎన్‌సీటీసీకి సహకరించాల్సివుంటుంది. డాక్యుమెంట్లు, రహస్య నివేదికలు, రాతప్రతులు, కంప్యూటరైజ్డ్ డాటా తదితర ఏ రూపంలో ఉన్న సమాచారాన్నైనా అడిగిన వెంటనే అందించాల్సివుంటుంది. సీబీఐ, ఎన్‌ఐఏ(నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ), నాట్‌గ్రిడ్(నేషనల్ ఇంటెలిజెన్స్ గ్రిడ్), ఎన్‌టీఆర్‌ఓ, డీఆర్‌ఐ(డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్), పారా మిలిటరీ, రాష్ట్రాల పోలీసు బలగాలు సైతం ఎన్‌సీటీసీ అడిగిన సమాచారాన్ని వెంటనే ఇవ్వాల్సివుంటుంది. ఈ కేంద్రానికి ఎప్పటికప్పుడు సలహాలు, సూచనలు ఇవ్వడానికి

వివిధ రాష్ట్రాల ఉగ్రవాద వ్యతిరేక విభాగాల అధిపతులు సభ్యులుగా ఉండే స్టాండింగ్ కౌన్సిల్‌ను ఏర్పాటుచేస్తారు. ఈ కౌన్సిల్ తరచూ సమావేశమవుతూ ఉగ్రవాదుల నుంచి పొంచి వున్న ముప్పును అంచనా వేస్తుంది. రోజువారీగా వీడియో కాన్ఫరెన్సులు నిర్వహిస్తూ దేశంలోని వివిధ ప్రాంతాల్లో పరిస్థితిని సమీక్షిస్తుంది.

వచ్చిన చిక్కల్లా ఎన్‌సీటీసీ విధి విధానాలతోనే. మాతృ సంస్థ ఐబీకి సైతంలేని కార్యనిర్వాహక అధికారాలను ఎన్‌సీటీసీకి కట్టబెట్టడం వ్యతిరేకతకు కారణమైంది. కేంద్రస్థాయిలో సీబీఐ, ఎన్ఐఏలకు, రాష్ట్రస్థాయిలో పోలీసులకు మాత్రమే ఇప్పటివరకు పౌరులను అరెస్టు చేసే, సోదాలు నిర్వహించే అధికారాలున్నాయి. మరే సంస్థకూ లేవు. ఆ మాటకొస్తే అమెరికన్ ఎన్‌సీటీసీకి సైతం ఇలాంటి అధికారాలు లేవు. ఎన్‌సీటీసీ లాంటి గూఢచార సంస్థకు అనుమానితులను అరెస్టు చేసే అధికారమిస్తే అది దుర్వినియోగమవుతుందని, ఉగ్రవాద నిర్మూలనకు బదులుగా రాజకీయ ప్రత్యర్థులను దెబ్బతీయడానికి అస్త్రంగా మారుతుందని పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు. ఏ పార్టీ అధికారంలో ఉన్నప్పటికీ దేశంలో ఇప్పటివరకు జరిగిన గూఢచర్యమంతా ప్రతిపక్షాలే లక్ష్యంగా కొనసాగిందని గతంలో ఐబీలో పనిచేసిన ఎం కె ధర్ తను రాసిన పుస్తకంలో పేర్కొన్నారు. ఎమర్జెన్సీలో కొనసాగిన ఆకృత్యాలను విచారించిన షా కమిషన్ నివేదిక సైతం ఇదే విషయాన్ని ధృవీకరించింది. రాజకీయ ప్రత్యర్థుల వేధింపు కోసం ఇందిరాగాంధీ సీబీఐతో పాటు ఐబీని విచ్చలవిడిగా వాడుకున్నారని తేల్చిచెప్పింది. అరెస్టు చేసే అధికారాలు లేని సమయంలోనే ఆధికార పార్టీకి ఐబీ అలా ఉపయోగపడితే ఇప్పుడు అదే సంస్థ అధిపతి కింద పనిచేసే ఎన్‌సీటీసీ ఉగ్రవాద కార్యకలాపాల అణచివేత పేరిట రాజకీయ ప్రత్యర్థులను వేధించదనే గ్యారంటీ ఎక్కడుందని విశ్లేషకులు ప్రశ్నిస్తున్నారు.

విమర్శలకు తావిచ్చిన మరో అంశం ఫెడరల్ సూత్రాల ఉల్లంఘన. మమత మొదలు జయలలిత వరకు పలువురు ముఖ్యమంత్రులు ఎన్‌సీటీసీపై తమ విమర్శను ఈ అంశంపైనే ఎక్కుపెట్టారు. పైకి చెప్పకపోయినా కొందరు కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల సీఎంలు కూడా ఈ విషయంలో తమ వ్యతిరేకతను వ్యక్తం చేశారని సమాచారం. రాజ్యాంగంలో పేర్కొన్న ప్రకారం శాంతిభద్రతల అంశం పూర్తిగా రాష్ట్రాలకు సంబంధించిన విషయం. సీబీఐ సైతం ఆయా రాష్ట్రాల అంగీకారంతోనే కేసుల విచారణ చేబడుతుందన్న విషయం అందరికీ తెలిసిందే. 2008లో ప్రత్యేకచట్టం ద్వారా ఏర్పరచిన ఎన్ఐఏ మాత్రమే దేశ సమగ్రతకు, భద్రతకు భంగం కలిగించే కార్యకలాపాలపై ఏ రాష్ట్రంలోనైనా దర్యాప్తు చేబట్టే అధికారాన్ని కలిగివుంది. ఎన్ఐఏ దర్యాప్తు సంస్థ కాగా ఎన్‌సీటీసీ గూఢచార సంస్థ అనీ, గూఢచార సంస్థకు దేశవ్యాప్త అరెస్టు అధికారాలను

అప్పగించడం ప్రపంచంలో ఎక్కడా లేదని సీపీఐ అగ్రనేత డి రాజా విమర్శించడం గమనార్హం. ఎన్ఐఏ చట్టం సైతం ముంబై దాడుల నేపథ్యంలో, ఒక భావోద్వేగవాతావరణంలో ఆమోదించబడిందని, ఫెడరల్ స్ఫూర్తికి వ్యతిరేకంగా ఉన్న ఆ చట్టాన్ని సమీక్షించాల్సిన అవసరముందని ఆయన అభిప్రాయపడ్డారు.

ఎన్సీటీసీపై వాద ప్రతివాదాలెలా ఉన్నా ఉగ్రవాద నిర్మూలన పేరిట గతంలో అమలులోకి వచ్చిన చట్టాలన్నీ ప్రజాస్వామ్య విలువల ఉల్లంఘనలకు తావిచ్చాయన్నది కఠోర వాస్తవం. కాంగ్రెస్ ప్రభుత్వం తెచ్చిన టాడా, ఎన్డీఏ సర్కారు ఆమోదించిన పోటా ఇలాంటి ఆరోపణల నేపథ్యంలోనే రద్దయ్యాయి. 1958 నుంచి ఈశాన్యంలో, కాశ్మీర్‌లో అమలవుతున్న సాయుధ బలగాల ప్రత్యేకాధికారాల చట్టంపై సైతం ఇవే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి, ఏ కారణాలు చెప్పి ఏర్పాటుచేసినా ప్రస్తుత ఎన్సీటీసీ కూడా ఇలాగే అప్రతిష్ఠపాలు కాకతప్పదు.

రాష్ట్రాల అధికారాలకే కాకుండా పౌరహక్కులకు సైతం ముప్పుగా మారనున్న ఎన్సీటీసీ నోటిఫికేషన్‌ను కేంద్రం వెంటనే వెనక్కి తీసుకోవాలి. ప్రజల ప్రజాస్వామిక ఆకాంక్షలను తీర్చకుండా, వారెదుర్కుంటున్న మౌలిక సమస్యలకు పరిష్కారం చూపకుండా కొత్తగా ఎన్ని చట్టాలను తెచ్చినా, బలగాలకు ఎన్ని అధికారాలను కట్టబెట్టినా ఉగ్రవాదాన్ని నిర్మూలించడం సాధ్యం కాదు. అంతర్గత భద్రతకు అత్యంత ప్రమాదకారిగా పరిణమించిందని ప్రధాని చెప్పిన వామపక్ష తీవ్రవాదానికైనా, జాతుల స్వయంనిర్ణయాధికారాన్ని డిమాండు చేస్తూ ఈశాన్యంలో, కాశ్మీర్‌లో సాయుధంగా పోరాడుతున్న సంస్థలకైనా ప్రజల్లో నెలకొన్న అసంతృప్తే పునాది. దేశీయంగా అసంతృప్తి లేకుండా పొరుగు దేశాలు టెర్రరిజాన్ని ప్రేరేపించడం సాధ్యం కాదు. అలాంటి అసంతృప్తికి, అలజడికి కారణమైన సమస్యలను పరిష్కరించడం వదిలేసి, అభివృద్ధిలో అణగారిన వర్గాలను భాగస్వాములు చేయడం మానేసి ఉద్యమాలపై ఉగ్రవాద ముద్రవేసి సైనికంగా అణచివేయజూడడం భారత్ లాంటి ప్రజాస్వామిక, సమాఖ్య రాజ్యాంగం కలిగివున్న దేశానికి సమంజసం కాదు.

***(నమస్తే తెలంగాణ, 28-02-2012)***

# స్వార్థం.. ఉద్యమాలపై అస్త్రం..

ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బిలాస్‌పూర్ జిల్లా ఎస్‌పీ రాహుల్ శర్మ గత వారం తన సర్వీస్ పిస్టల్‌తో కాల్చుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆత్మవిశ్వాసం, ధైర్యసాహసాలు మెండుగా ఉంటాయని భావించే ఓ పోలీసు ఉన్నతాధికారి ఆత్మహత్యకు పాల్పడడం, పైగా తన చావుకు అధికారుల మానసిక వేధింపులే కారణమని సూసైడ్ నోట్ రాయడం సంచలనం సృష్టించింది. 2002 బ్యాచ్‌కు చెందిన శర్మ గతంలో బస్తర్‌లోని దంతేవాడ జిల్లా ఎస్‌పీగా పనిచేస్తూ మావోయిస్టు ఉద్యమ అణచివేతలో ప్రతిభ కనబర్చిన అధికారిగా పేరు తెచ్చుకున్నాడు. ఆ కాలంలోనే ప్రముఖ రచయిత్రి అరుంధతీ రాయ్ బస్తర్ అడవులకు వెళ్లడం, ఆ క్రమంలో ఎస్‌పీ శర్మను కలువడం తటస్థించింది. అప్పటికే మావోయిస్టు దళాల వెంట తిరిగి వారి కార్యకలాపాలను అధ్యయనం చేసిన రాయ్ ఉద్యమానికి సంబంధించిన వివిధ అంశాలపై శర్మను ఇంటర్వ్యూ చేయగోరింది. అందుకు శర్మ సమ్మతించి ఆమె అడిగిన ప్రశ్నలకు సూటిగా, కుండబద్దలు కొట్టినట్లుగా సమాధానాలిచ్చాడు. ఢిల్లీ జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయంలో చదివిన తనకు మావోయిస్టు ఉద్యమం వెనకాల ఉన్న సామాజిక, ఆర్థిక కారణాలు తెలుసునని వివరించాడు. తన సంభాషణను ముగిస్తూ దంతేవాడలో యుద్ధ పరిస్థితులు పోయి శాంతి నెలకొనడానికి ఒకే ఒక్క మార్గముందని, అక్కడి ఆదివాసీలకు స్వార్థం నేర్పితే చాలని చమత్కరించాడు.

దివంగత శర్మ ఆ మాటలు ఏ ఉద్దేశంతో అన్నాడో కాని వర్తమాన కాలంలో అవి అక్షరసత్యాలని మాత్రం చెప్పవచ్చు. 1980ల చివరన అగ్రరాజ్యం అమెరికా సారథ్యాన బహుళజాతి కంపెనీల దన్నుతో, ఆయా దేశాల పాలకవర్గాల అండతో ప్రవేశపెట్టిన ప్రపంచీకరణ, సరళీకరణ, ప్రైవేటీకరణ విధానాలు క్రమంగా సగటు మానవుడిలో స్వార్థాన్ని పెంచుతున్నాయి. పక్కనున్న వారి సంగతిని వదిలేసి ఎవరి బతుకు గురించి వారు ఆలోచించడమే మంచిదన్నది నేర్పుతున్నాయి. మానవజన్మ ఎత్తిందే అనుభవించడానికని, ఏ పని చేస్తున్నావన్నది, ఎవరి పొట్ట కొడుతున్నావన్నది ముఖ్యం

కాదని, సంపాదించడమన్నదే అసలు విషయమన్న మర్మాన్ని విప్పి చెబుతున్నాయి. ఫలితంగా సమాజంలో అవినీతి, అక్రమాలు, లంచగొండితనం, ఆశ్రితపక్షపాతం పెచ్చరిల్లిపోయింది. స్వార్థమన్నది కొందరు వ్యక్తుల్లో ఆస్తుల సంపాదన రూపంలో ఉంటే మరికొందరిలో పదవులు పొందడం రూపంలో ఉంది. ఈ రెండు రకాల స్వార్థం లేదనుకున్న వారిలో కీర్తికండూతి ఉండనేవుంది. ఈ మూడు రకాల స్వార్థం బడుగు, మధ్యతరగతి వర్గాల్లోకి, చదువుకున్న విద్యావంతుల్లోకి చాప కింద నీరులా వ్యాపించడం అన్ని రకాల ఉద్యమాలపై ప్రత్యక్షంగా, పరోక్షంగా ప్రభావం చూపింది. ఫలితంగా ప్రపంచవ్యాప్తంగా వివిధ దేశాల్లో ఉవ్వెత్తున ఎగసిన ఉద్యమాలు గత 20 ఏళ్ల కాలంలో క్రమంగా నీరుగారిపోతున్నాయి. విప్లవోద్యమాలే కాకుండా అస్తిత్వ పోరాటాలు సైతం బలహీనపడుతున్నాయి.

శర్మ ప్రస్తావించిన మావోయిస్టు ఉద్యమాన్నే పరిశీలిద్దాం. 1960ల చివరన నక్సల్బరీలో నిప్పు రగిలినప్పుడు, ఆ నిప్పు దావానలమై మొదట శ్రీకాకుళాన్ని ఆ తర్వాతకాలంలో ఉత్తర తెలంగాణను, దండకారణ్యాన్ని, బీహార్, బెంగాల్‌లను చుట్టుముట్టినప్పుడు పోరాటాలను ముందుండి నడిపినవాళ్లు సమాజం గురించి తప్ప మరో ఆలోచన లేని ఉడుకు రక్తమున్న యువకులు. స్వంత ఆస్తులనూ, కుటుంబాలనూ వదిలి ఉద్యమంలో దూకినవాళ్లు. వాళ్లు పనిచేసిన కార్యక్షేత్రమూ లాభాలే ప్రాతిపదికగా నడిచే పెట్టుబడిదారీ సమాజం కాదు. శ్రీకాకుళం గిరిజనులైనా, ఉత్తర తెలంగాణ రైతులైనా, దండకారణ్య గోండులైనా నిష్కల్మష మనస్తత్వంతో నిష్కళంక జీవితాలను గడుపుతున్నవారే. సమూహమే సర్వస్వంగా బతుకుతున్నవారే. తాము ఎంత దారిద్ర్యంలో బతికినా, తినడానికి తిండి కూడా లేకపోయినా ఇంటికి వచ్చిన అపరిచితులను సైతం ఆత్మీయంగా పలకరించి అన్నం పెట్టడం, ఇరుగుపొరుగు బాధలను తమ బాధలుగా భావించడం వారి నైజంగా ఉండింది. అలాంటి చోట తమ బతుకులను మార్చుకోవడం ఎలాగో తెలుపడంకోసం వచ్చిన అన్నలను వాళ్లు అక్కున చేర్చుకున్నారు. పోలీసులు వేధించినా, చిత్రహింసలు పెట్టినా పార్టీ ఆనుపానులు బయట పెట్టలేదు. పలు ఘటనల్లో నక్సలైట్లను పోలీసుల నుంచి తప్పించడానికి తమ ప్రాణాలను సైతం పణంగా పెట్టారు. ఓ జగిత్యాల తల్లి, మరో గడ్చిరోలి చెల్లి విప్లవకారులను తమ కుటుంబసభ్యుల కంటే కూడా ఆప్యాయంగా, ఉన్నతంగా చూసేవారంటే వారిలో సామాజిక స్పృహ ఎంతగా ఉండేదో అర్థం చేసుకోవచ్చు.

1990ల వరకూ ఉన్న పరిస్థితి ఇది. అప్పుడే దేశంలో సంస్కరణల శకం ఆరంభమైంది. 1991లో పీవీ-మన్మోహన్ ద్వయం ముందుకు తెచ్చిన ఆర్థిక విధానాలు పల్లెల్లో, పట్టణాల్లో పెనుమార్పులు తెచ్చాయి. అన్ని రంగాల్లో విదేశీ బహుళజాతి కంపెనీల

ప్రవేశం, ప్రభుత్వ సంస్థల నుంచి పెట్టుబడుల ఉపసంహరణ, సెజ్‌ల ఏర్పాటు, లాభాల వేటకు నాంది పలికింది. అభివృద్ధి ప్రాజెక్టులు, సంక్షేమ పథకాలు రాజకీయ నాయకులకు, అధికారులకు కోట్లు కురిపిస్తే కాంట్రాక్టులు, సబ్‌కాంట్రాక్టులు, చిన్నచిన్న పనులు పొంది అక్రమాల రుచిమరిగిన ఒక కొత్త వర్గం పల్లెపల్లెనా పుట్టుకొచ్చింది. సామాజిక, ఆర్థిక సమీకరణాలు మారిపోయాయి. ఇక ఇంటింటా కలర్ టీవీలు, మొబైల్ ఫోన్లూ వచ్చి మధ్య తరగతికి కొత్త బంగారులోకాలను పరిచయం చేశాయి. స్థానిక సంస్కృతి, సంప్రదాయాలు వెనుకపట్టు పట్టాయి. బడుగు, బలహీనవర్గాలు సైతం పశ్చిమ సంస్కృతి ప్రభావానికి లోనయ్యాయి. పునాదితో పాటుగా ఉపరితలమూ క్రమంగా మారింది. డబ్బుకు సమాజం దాసోహమంది. నువ్వు బాగుంటే చాలు కదా! పక్కోడి సంగతి నీకెందుకనేవాళ్లు పెరిగారు.

ఈ పరిణామం సహజంగానే మైదానప్రాంతాల్లో, పట్టణాల్లో మొదట ప్రభావం చూపించింది. క్రమంగా అటవీ-ఆదివాసీ ప్రాంతాలకు విస్తరిస్తోంది. తెలంగాణలో, ఆంధ్రలో విప్లవోద్యమం బలహీనపడడాన్ని మనం ఈ నేపథ్యంలోనే అర్థం చేసుకోవాలి. అప్పటి వరకు భూస్వాముల తొత్తులు, విలాసాలకు అలవాటుపడిన కొందరు లంపెయిన్లు తప్ప నక్సలైట్ల గురించిన సమాచారమిచ్చేవారే దొరకని పరిస్థితి గ్రామాల్లో ఉండేది. ఏ పోరాటం మొదలుపెట్టినా ప్రజలు విస్తృతంగా పాల్గొనేవారు. అలాంటిచోట పోలీసులు ఊరూరా ఇన్ఫార్మర్లను తయారుచేసుకోగలిగారు. పార్టీ లోపలే కోవర్టులను ప్రవేశపెట్టగలిగారు. స్వార్థచింతన పెరిగిన మధ్యతరగతి, విద్యార్థి, ఉద్యోగ, మేధావి వర్గాలు నక్సలైట్లంటే సదభిప్రాయం ఉన్నప్పటికీ ఉద్యమాన్ని పట్టించుకోవడం మానేశాయి. సమస్య తమదైతే తప్ప ఎందుకు రిస్క్ తీసుకోవాలన్న ధోరణిని కనబర్చాయి.

ఈ సామాజిక మార్పును తమకు అనుకూలంగా మలుచుకున్న పోలీసులు తమ ఎత్తుగడలు మార్చారు. త్రిముఖ వ్యూహాన్ని అనుసరించారు. దళాల వేటను తీవ్రస్థాయిలో కొనసాగిస్తూనే సానుభూతిపరులను, మిలిటెంట్లను అదివరకటిలా వేధించడం, భయపెట్టడం మానేసి బుజ్జగించే విధానాలను అనుసరించారు. లొంగిపోయిన వారికి విలాస జీవితాలను చవిచూపారు. ఈ విధానాలు మంచి ఫలితాలనిచ్చి మైదాన ప్రాంతాల నుంచి మావోయిస్టులు తమ దళాలను, కార్యకలాపాలను ఉపసంహరించుకునేలా చేశాయి. దండకారణ్యం, జార్ఖండ్ రాష్ట్రాల్లో పరిస్థితి వేరు. అక్కడి అటవీ-ఆదివాసీ ప్రాంతాల్లో 'బహుళజాతి' అభివృద్ధి, పశ్చిమ సంస్కృతి చొరబడింది తక్కువ. ఇప్పటికీ అక్కడ వ్యక్తి కేంద్రంగా ఆలోచించే మనస్తత్వం ప్రజానీకానికి అలవడలేదు. మా ఊరు, మా తెగ, మా సమాజం అన్న భావన బలంగా ఉంది. పరిష్కరించాల్సిన సమస్యలూ బోలెడున్నాయి. శతాబ్దాలుగా వారిని పట్టించుకున్న నాథుడు లేదు. వనరులను దోచడం

తప్ప ప్రభుత్వాలు చేసిందేమీలేదు. అలాంటి సమయంలో మేమున్నామంటూ వచ్చిన దాదాలు దేవుళ్లుగా మారారు. వారి దళాలు బెటాలియన్లకు ఎదిగాయి. ఊరూరా జనతన సర్కా ర్లు ఏర్పడి స్వయంపాలన సాగిస్తున్నాయి. దినదినం విప్లవోద్యమం మరింత బలపడుతోంది. రాహుల్ శర్మ ఎస్పీగా పనిచేస్తున్న దంతేవాడ జిల్లాలో పరిస్థితి ఇదే.

రాయ్‌తో శర్మ చేసిన వ్యాఖ్యలను మనం ఈ నేపథ్యంలోనే చూడాలి. అటవీ-ఆదివాసీ ప్రాంతాల్లో మావోయిస్టు ఉద్యమాన్ని అణచివేయడానికి కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలు ఇప్పుడు ఈ ఎత్తుగడలనే అవలంబిస్తున్నాయి. ఓ వైపు ఆపరేషన్ గ్రీన్‌హంట్‌ను చేబట్టి మరోవైపు అమాయక ఆదివాసులకు స్వార్థం నేర్పే పనిని యుద్ధప్రాతిపదికన నిర్వహిస్తున్నాయి. అభివృద్ధి పథకాల పేరుతో ఊరూరా రోడ్లు వేస్తున్నారు. సంక్షేమ కార్యక్రమాలంటూ కలర్ టీవీలు అమరుస్తున్నారు. ఉద్యోగాల కల్పన పేరుతో చదువుకున్న యువకులను పోలీసులుగా, హోంగార్డులుగా, ఎస్పీఓలుగా రిక్రూట్ చేసుకుంటున్నారు. ప్రజాసేవ ముసుగులో స్వచ్ఛంద సంస్థలను రప్పిస్తున్నారు. మొన్నటి వరకూ బయటి ప్రపంచపు వాసనలు తెలియని అబూజ్‌మాడ్‌పైనా ఈ పరిణామాలు వేగంగా చోటుచేసుకుంటున్నాయి.

భారత్‌లోనే కాదు.. ప్రపంచవ్యాప్తంగా ఉద్యమాల పరిస్థితి ప్రస్తుతం ఇలాగే వుంది. ప్రపంచీకరణ తదనంతర పరిణామాలను అర్థం చేసుకుని విశ్లేషించడంలో, అందుకు తగినట్లు వ్యూహం-ఎత్తుగడల్లో మార్పులు చేసుకోవడంలో విప్లవపార్టీలు వెనక బడుతున్నాయనే ఆరోపణుంది. ఆ పార్టీలు ఈ పరిణామాలపై సీరియస్‌గా దృష్టి పెట్టి ప్రపంచీకరణ సమాజంలో తెచ్చిన ఆర్థిక మార్పులను, ఉపరితల సంస్కృతిని అధ్యయనం చేసి తగిన విధానాలను రూపొందించాలి. అమెరికాతో సహా సామ్రాజ్యవాద దేశాల్లో సైతం రోజురోజుకు సంక్షోభం తీవ్రతరమవుతున్న తరుణంలో కాలం చెల్లిన పెట్టుబడిదారీ వ్యవస్థకు తామే ప్రత్యామ్నాయమన్న విషయాన్ని ఆచరణలో రుజువుచేయాలి. వినూత్న ఎత్తుగడలతో ఉద్యమాలకు నూతన జవసత్వాలు అందించాలి. స్వార్థమే మానవాళికి పరమార్థం కారాదని, ప్రజల కోసం పనిచేయడం హిమాలయాలకన్నా ఘనమన్న సూక్తి వెలుగులో సమాజాన్ని నడిపించాలి.

***(నమస్తే తెలంగాణ, 20-03-2012)***

# నక్సల్స్‌పై 'మానవ రహిత' యుద్ధం..

మావోయిస్టుల వేటలో మానవ రహిత విమానాలను వినియోగించాలని ఇటీవల కేంద్రం నిర్ణయించింది. ఇందుకు సంబంధించి రెండేళ్ల క్రితమే ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బస్తర్ ప్రాంతంలో ప్రయోగాత్మక పరీక్షలు కొనసాగాయి. దంతేవాడ జిల్లా చింతల్‌నార్ గ్రామంలో మావోయిస్టులు చేసిన భీకర దాడిలో 76 మంది సీఆర్‌పీఎఫ్ జవాన్లు మరణించిన నేపథ్యంలో మొట్టమొదటిసారిగా 2010 ఏప్రిల్ 14న అమెరికా తయారీ టీ–హెచ్‌ఎంఏవీ రకం మానవ రహిత విమానాన్ని బస్తర్ అడవుల మీదుగా 8 గంటల పాటు తిప్పారు. విమానం పంపిన చిత్రాలు, వీడియో ఫుటేజీ ఆధారంగా మావోయిస్టుల స్థావరాలను, కదలికలను, వాళ్లు అమర్చిన మందుపాతరలను ఏ మేరకు గుర్తించవచ్చునో అంచనా వేశారు. ఫలితాలు సంతృప్తికరంగా లేకపోవడంతో 'రా' ఆధ్వర్యంలో పనిచేసే జాతీయ సాంకేతిక పరిశోధనా సంస్థ(ఎన్‌టీఆర్‌ఓ) వద్ద ఉన్న మరికొన్ని రకాల విమానాలను సైతం ఈ అడవులపై ప్రయోగించి చూశారు. ఈ విమానాల సాంకేతిక వ్యవస్థలేవీ దట్టంగా ఉన్న చెట్టూ చేమల్లోకి చొచ్చుకుపోయి నక్సల్స్ కదలికలను పసిగట్టలేకపోయాయి.

కాగా, 2011 డిసెంబర్‌లో ఇజ్రాయెల్‌లో తయారైన హెరాన్ మానవ రహిత విమానాలను హైదరాబాద్‌లోని బేగంపేట విమానాశ్రయం నుంచి ఛత్తీస్‌గఢ్, ఒరిస్సా, గడ్‌చిరోలి, ఏటూరు నాగారం అడవులపై పలుమార్లు ప్రయోగించి చూడగా సంతృప్తికరమైన ఫలితాలు వెలువడినట్లు అధికారులు గుర్తించారు. దీంతో హెరాన్ రకం విమానాలను మావోయిస్టుల వేటలో వినియోగించాలని కేంద్ర హోం శాఖ నిర్ణయించింది. భద్రతా వ్యవహారాల కేబినెట్ కమిటీ ఇందుకు పచ్చజెండా ఊపింది. ఛత్తీస్‌గఢ్‌లోని కాంకేర్‌లో ఉన్న జంగిల్ వార్‌పేర్ స్కూలు నుంచి, జగ్దల్‌పూర్ విమానాశ్రయం నుంచి ఈ విమానాలు పనిచేస్తాయి. కాగా, రాజమండ్రి సమీపంలో కొత్తగా నిర్మిస్తున్న మధురపూడి విమానాశ్రయంలో రూ 30 కోట్ల విలువ చేసే ఒక మానవ రహిత హెరాన్ విమానాన్ని మోహరిస్తున్నట్లు, దీని సహాయంతో విశాఖ

ఏజెన్సీలోనూ, ఆంధ్ర-ఒరిస్సా సరిహద్దు(ఏఓబీ)ప్రాంతంలోనూ మావోయిస్టుల ఆట కట్టించనున్నట్లు మన రాష్ట్ర డీజీపీ దినేష్‌రెడ్డి ఈ జనవరిలో ప్రకటించారు. ఈ విమానం సేకరించిన సమాచారం ఆధారంగా కమాండో బలగాలను వెంటనే సంఘటనాస్థలానికి చేరవేసేందుకు వీలుగా ఓ ఎంఐ-17 రకం హెలికాప్టర్‌ను సైతం అందుబాటులో ఉంచనున్నట్లు ఆయన తెలిపారు.

ప్రపంచవ్యాప్తంగా ఇప్పుడు యుద్ధశాస్త్రంలో మానవ రహిత విమానాల యుగం నడుస్తోంది. అన్‌మాన్‌డ్ ఏరియల్ వెహికిల్ (యుఏవీ) లేదా డ్రోన్‌గా పిలిచే ఈ రకం విమానాలను మొట్టమొదట 1916లో అమెరికా కనుగొంది. ప్రాబల్య శక్తులుగా ఉన్న అనేక దేశాలు ప్రస్తుతం ఈ విమానాలను తయారుచేస్తున్నప్పటికీ అమెరికా, ఇజ్రాయెల్‌లు ఈ రంగంలో పేరుపొందాయి. తొలిదశలో ఈ విమానాలను శత్రు బలగాల మోహరింపులను, కదలికలను, మందుపాతరలను పసిగట్టడానికి, వారి సమాచార వ్యవస్థను ట్యాప్ చేయడానికి వినియోగించినా తర్వాతి కాలంలో శత్రు స్థావరాలపై బాంబులు, క్షిపణుల ప్రయోగానికి కూడా పనికివచ్చేలా అభివృద్ధి చేశారు. ఆయా రకాలను బట్టి ఈ విమానాలు 4 వేల అడుగుల నుంచి 40 వేల అడుగుల ఎత్తు వరకు జెట్ ఇంజిన్ సాయంతో ఆకాశంలో ఎగురుతూ వాటిలో అమర్చిన ఇన్‌ఫ్రారెడ్ కెమెరాలు, రాడార్లు, సెన్సర్లు, స్కానర్ల సాయంతో శత్రువు గురించిన సమాచారాన్ని లైవ్‌గా గ్రౌండ్ స్టేషన్‌కు పంపిస్తాయి. గ్రౌండ్ స్టేషన్‌లో ఉండే సిబ్బంది ఈ విమానాల విన్యాసాలను అదుపుచేస్తారు. లక్ష్యాల ధ్వంసానికి క్షిపణులు, బాంబులను ప్రయోగించే మానవ రహిత విమానాలను అన్‌మాన్‌డ్ కంబాట్ ఏరియల్ వెహికిల్ (యుసీఏవీ) అనీ, టార్గెట్‌తో పాటు తామూ ధ్వంసమయ్యే విమానాలను కమికాజెలనీ, అతి తక్కువ బరువు కలిగిన తేలికరకం విమానాలను మైక్రో ఏరియల్ వెహికిల్ (ఎంఏవీ) అనీ, తక్కువ ఎత్తులో ఎక్కువ కాలం గాలిలో ఎగిరే రకాలను మేల్ (మీడియం ఆల్టిట్యూడ్ లాంగ్ ఎండ్యూరెన్స్)లనీ వ్యవహరిస్తారు.

1999లో కార్గిల్ యుద్ధానంతరం మన దేశం మానవ రహిత విమానాల ఆవశ్యకతను గుర్తించింది. పార్లమెంటు భవనంపై 2002లో ఉగ్రవాదులు చేసిన దాడి నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం ఇజ్రాయెల్ నుంచి వంద సెర్చర్, హెరాన్ రకం యుఏవీలను, హార్పీ, హరోప్ రకం కమికాజెలను కొనుగోలు చేసింది. ఆ దేశ సహకారంతో మన రక్షణ శాఖ ఆధ్వర్యంలో పనిచేసే డీఆర్‌డీఓ లక్ష్య, నిశాంత్, రుస్తోం, పవన్, గగన్ వంటి పలు రకాల యుఏవీలను అభివృద్ధి చేయడానికి కృషి చేస్తోంది. వీటిలో కొన్ని విజయవంతంగా పరీక్షలు పూర్తి చేసుకోగా మరికొన్ని ఇంకా ప్రయోగాత్మక దశలో ఉన్నాయి. భారత సైన్యాన్ని 21వ శతాబ్దపు అవసరాలకు దీటుగా ఆధునీకరించేందుకు

వచ్చే 12 ఏళ్లలో సుమారు 10 లక్షల కోట్ల రూపాయలు ఖర్చు చేయాలని ప్రభుత్వం తలపెట్టగా ఈ మొత్తంలో అధిక భాగాన్ని మానవ రహిత విమానాల కొనుగోలుకు, అభివృద్ధికి కేటాయించాలని నిర్ణయించడం గమనార్హం. ప్రస్తుతం భారత వైమానిక దళం వంద సెర్చర్ యుఏవీలతో పాక్, చైనా, నేపాల్, బర్మా, బంగ్లా సరిహద్దుల్లో సమాచార సేకరణ, నిఘా కార్యకలాపాలను నిర్వర్తిస్తోంది. నౌకాదళం కొచ్చి, పోరుబందరు రేవుల్లో రెండు స్క్వాడ్రన్ల యుఏవీలను మోహరించి తీర ప్రాంతాల గస్తీ కోసం వినియోగిస్తోంది. సైన్యం సైతం 6–8 యుఏవీలు కలిగిన ఏడు దళాలను ఏర్పాటు చేసుకోవడానికి పావులు కదుపుతోంది. 12వ పంచవర్ష ప్రణాళిక ముగిసే నాటికి జమ్మూ–కాశ్మీర్, ఈశాన్య రాష్ట్రాల్లో కార్యకలాపాలు నిర్వహిస్తోన్న ప్రతి బెటాలియన్ ఆధీనంలోనూ ఓ ఎంఏవీ ఉండేలా ప్రతిపాదనలు రూపొందించింది.

యుఏవీలను ఉపయోగించి పాక్–ఆఫ్ఘాన్ సరిహద్దుల్లో తాలిబన్, అల్ ఖాయిదా ఉగ్రవాదుల స్థావరాలను ధ్వంసం చేయడంలో ఇటీవలి కాలంలో అమెరికా సాధించిన విజయాలు నక్సల్స్ వేటలో మానవ రహిత విమానాలను వినియోగించవచ్చన్న ఆలోచనలకు బీజం వేశాయి. భారత అంతర్గత భద్రతకు వామపక్ష తీవ్రవాదం అత్యంత ప్రమాదకరంగా పరిణమించిందని స్వయానా ప్రధాని మన్మోహన్ సింగ్ ప్రకటించడం 'బహుళజాతి' మిత్రుడైన హోం మంత్రి చిదంబరాన్ని సహజంగానే ఉత్సాహపరచింది. తన మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఖనిజ వనరులు అధికంగా గల మధ్య భారత అడవుల్లో ఆపరేషన్ గ్రీన్‌హంట్‌ను ప్రారంభించాడు. అది అనుకున్న ఫలితాలను సాధించకపోగా మావోయిస్టుల దాడుల్లో భారీ సంఖ్యలో జవాన్లను కోల్పోతుండడంతో దిక్కుతోచని పరిస్థితుల్లో యుఏవీల మోహరింపునకు తెరతీశాడు. శత్రు దేశాల బలగాలపై ప్రయోగించాల్సిన అస్త్రాన్ని తన స్వంత ప్రజలపై సంధించడానికి సిద్ధపడ్డాడు. ఈ విమానాలను నక్సల్స్ సమాచార సేకరణకే కాకుండా అవసరమైతే వారి స్థావరాలపై బాంబు దాడులు చేయడానికి కూడా వాడుకోవాలని ఆయన వాదించినట్లు, అందుకు కేబినెట్ కమిటీ నిరాకరించినట్లు సమాచారం. గ్రీన్‌హంట్‌లో భాగంగా సైన్యాన్ని దింపడాన్ని గతంలో వ్యతిరేకించిన త్రివిధ దళాధిపతులు, రక్షణ మంత్రి ఆంటోనీ తదితరులు యుఏవీలను దాడుల కోసం వాడవద్దని, ప్రస్తుతానికి సమాచార సేకరణకు మాత్రమే పరిమితం చేయాలని షరతు విధించినట్లు తెలుస్తోంది. ఈ మేరకు కేంద్ర హోం శాఖ రెండు హెరాన్ మేల్ విమానాలను ఇజ్రాయెల్ నుంచి కొనుగోలు చేసి ఛత్తీస్‌గఢ్, ఆంధ్రప్రదేశ్‌లకు కేటాయించింది.

ఇక్కడ మనం ఒక విషయాన్ని గమనించాలి. ప్రిడేటర్ యుఏవీలతో తాలిబన్–అల్‌ఖాయిదా స్థావరాలపై అమెరికా చేసిన దాడుల్లో ఉగ్రవాదులే కాకుండా వేలాది

మంది ప్రజలు చనిపోయారు. 40వేల అడుగుల ఎత్తున విహరించే విమానం నేలపై సంచరించే మానవుల్లో ఉగ్రవాదులు ఎవరు? మామూలు పౌరులు ఎవరన్న విషయంలో స్పష్టమైన సమాచారం అందించే అవకాశం లేదు. డాటాను విశ్లేషించే సిబ్బంది ఏమాత్రం పొరబడినా సామాన్య ప్రజలు సమిధలుగా మారతారు.

2011 డిసెంబర్ రెండవ వారంలో దంతేవాడలో జరిగిన ఓ ఘటన మన భవిష్యత్ చిత్రపటాన్ని ఆవిష్కరిస్తుంది. పరీక్ష కోసం పంపిన యుఏవీ జిల్లాలోని తెరివాల్ గ్రామ పరిసర అడవుల్లో మావోయిస్టుల క్యాంపు ఉన్నట్లు గుర్తించింది. కొన్ని గుడిసెలు, టెంట్లు ఉన్నాయని, ఎక్కువ సంఖ్యలో మనుషులు తిరుగుతున్నారని అది పంపిన విజువల్స్ ఆధారంగా అంచనా వేశారు. ఈ సమాచారం ఆధారంగా కొన్ని బలగాలను హుటాహుటిన కాలిదారిన పంపిన అధికారులు హెలికాప్టర్లలో కమాండోలను సైతం రంగంలో దించారు. తీరా అక్కడకు వెళ్లి చూస్తే అదో ఆదివాసీ గ్రామం. అకస్మాత్తుగా సాయుధ జవాన్లు దండెత్తడంతో బెంబేలెత్తారు. చివరకు తమ పరువును నిలుపుకోవడానికి పోలీసులు అక్కడో మావోయిస్టు ఆయుధ డంపును సృష్టించాల్సివచ్చింది. రాబోవు కాలంలో నక్సల్ ప్రాబల్య ప్రాంతాల్లో ఏం జరగబోతోందో ఈ ఘటన మనకు తెలియజెబుతుంది.

ఉద్యమాల అణచివేత పేరిట, ఉగ్రవాద నిర్మూలన పేరిట ఇప్పటి వరకు మన దేశంలోని వివిధ ప్రాంతాల్లో సైనిక, పారా మిలిటరీ, పోలీసు బలగాలు చేబట్టిన చర్యలన్నింటిలోనూ అకృత్యాలు, అరాచకాలు, మానవ హక్కుల ఉల్లంఘనలు జరిగాయన్న ఆరోపణలున్నాయి. ఉద్యమకారుల చేతుల్లో ప్రభుత్వ బలగాలు దెబ్బతిన్నప్పుడల్లా మామూలు ప్రజలు సమిధలు కావడమూ మనకు తెలుసు. ఒక సింగారం, ఒక గోంపాడు, ఒక సింగనమడుగులో ఇదే జరిగింది. కాశ్మీర్‌లోను, ఈశాన్యంలోను ఇలాంటి ఎన్నో ఘటనలు జరిగాయి. ఆపరేషన్ గ్రీన్‌హంట్‌లో భాగంగా ఆగస్టు 10, 2009 నుంచి డిసెంబర్ 31, 2010 వరకు ఒక్క దండకారణ్యంలోనే 181 మంది నిరాయుధులు ప్రభుత్వ బలగాల చేతిలో ప్రాణాలు కోల్పోయారని పౌరహక్కుల సంఘాల నివేదికలు చెబుతున్నాయి. యుక్తాయుక్త విచక్షణ కలిగిన మానవమాత్రులు పాల్గొంటున్న చర్యల్లోనే పరిస్థితి ఇలా ఉంటే కేవలం యంత్రాలు ఇచ్చిన సమాచారంతో హెలికాప్టర్లలో వెళ్లిన బలగాలు విచక్షణారహితంగా జరిపే కాల్పులు ఎలాంటి ఉల్లంఘనలకు దారితీస్తాయో, ఎవరి ప్రాణాలను బలి తీసుకుంటాయో చెప్పడం కష్టం. చిదంబరం ఆలోచన ప్రకారం రేపు ఈ మానవ రహిత విమానాలను బాంబులు వేయడానికి, దాడులకు సైతం వాడితే పరిణామాలు ఎంత భయంకరంగా ఉండగలవో మేధావులు, ప్రజాస్వామికవాదులు ఆలోచించాలి.

మధ్యభారతంలో అపారంగా నిక్షిప్తమై ఉన్న ఖనిజనిల్వలను బహుళజాతి కంపెనీలకు అప్పనంగా కట్టబెట్టే క్రమానికి అడ్డుపడుతున్న విప్లవోద్యమం లక్ష్యంగా ప్రస్తుత యూపీఏ ప్రభుత్వం పనిచేస్తున్నది. మన్మోహన్ వ్యాఖ్యలనైనా, చిదంబరం చేతలనైనా, గ్రీన్‌హంట్ లక్ష్యాలనైనా మనం ఈ నేపథ్యంలోనే అర్థం చేసుకోవాల్సివుంటుంది. ఒక్క దండకారణ్యంలోనే 60వేల సంఖ్యలో పారా మిలిటరీ బలగాలను దించినా, వైమానిక దళ సేవలను వినియోగించుకున్నా, శిక్షణ పేరుతో సైన్యాన్ని అందుబాటులో ఉంచినా సాధించలేని ఫలితాలను మానవ రహిత విమానాల ద్వారా సాధిస్తామనుకోవడం భ్రమే. విస్తృత ప్రజానీకం మద్దతు ఉన్నంతవరకు మావోయిస్టుల కార్యకలాపాలను నియంత్రించడం ఎవరి తరమూ కాదు. ప్రజల అవసరాలను, ఆకాంక్షలను పట్టించుకుని, వారెదుర్కొంటున్న మౌలిక సమస్యలను పరిష్కరించినప్పుడు ఉద్యమాలు వాటంతటవే సమసిపోతాయి. ఆ దిశలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తాయని, అణచివేతకు కేటాయించే భారీ నిధులను ఆదివాసీల అభివృద్ధికి ఖర్చు చేస్తాయని, అందుకనుగుణంగా తమ ప్రణాళికలను మార్చుకుంటాయని ఆశిద్దాం.

***(నమస్తే తెలంగాణ, 03-04-2012)***

# నక్సలిజంపై ఇక 'కార్పొరేట్' వార్..

నక్సలిజాన్ని అంతమొందించడంలో బహుళజాతి కంపెనీల సాయం పొందాలని కేంద్రం నిర్ణయించింది. మొన్నటి బడ్జెట్‌లో ఆర్థిక మంత్రి ప్రణబ్ ముఖర్జీ ప్రస్తావించిన భారత్ రూరల్ లైవ్‌లీహుడ్ ఫౌండేషన్ (బీఆర్ఎల్ఎఫ్) ఇందుకు ఉద్దేశించిన ప్రతిపాదనే. దేశంలోని 170 గిరిజన జిల్లాల అభివృద్ధిలో పౌర సమాజం భాగస్వామ్యాన్ని పెంచేందుకు ఈ సంస్థను ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. నక్సల్ ఉద్యమానికి వెన్నుదన్నుగా నిలుస్తున్నవి ప్రధానంగా ఆదివాసీ ప్రాంతాలేనని గుర్తించిన ప్రభుత్వం కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి జైరాం రమేష్ చొరవతో ఈ ఫౌండేషన్‌కు శ్రీకారం చుట్టింది. మొత్తంగా కనీసం వేయి కోట్లు సేకరించ తలపెట్టి కార్పస్ ఫండ్‌గా రూ. 200 కోట్లు కేటాయించింది. మిగతా నిధులను కార్పొరేట్ కంపెనీల నుంచి విరాళాలుగా స్వీకరించాలని నిర్ణయించారు. ఈ మేరకు ఇటీవల జైరాం టాటా, రిలయెన్స్, విప్రో, ఇన్ఫోసిస్ వంటి బడా వ్యాపార సంస్థలకు లేఖలు రాశారు. ఫౌండేషన్ లక్ష్యాన్ని, విధి విధానాలను అందులో ఆయన వివరించారు. ఫౌండేషన్ ప్రభుత్వ సంస్థలా కాకుండా పూర్తి స్వయంప్రతిపత్తితో పనిచేస్తుందని తెలిపారు. చైర్మన్, పూర్తికాలం పనిచేసే సీఈఓ రోజువారీ కార్యకలాపాలను పర్యవేక్షిస్తారని వివరించారు. రూ.200 కోట్లు విరాళంగా ఇచ్చే ప్రతి కంపెనీ ప్రతినిధిని బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్‌లో చేర్చుతామన్నారు. వ్యవసాయం, నీటి వనరుల నిర్వహణ, చేపల పెంపకం, పాడి అభివృద్ధి, అటవీ ఉత్పత్తులు, నైపుణ్యాల మెరుగుదల తదితర రంగాల్లో ఫౌండేషన్ పని చేస్తుందని, స్థానిక ఎన్‌జీఓలకు ఈ పనులపై పర్యవేక్షణ బాధ్యతను అప్పగిస్తామని వివరించారు. బహుళజాతి కంపెనీలు తమ సామాజిక బాధ్యతను విస్మరించరాదని గుర్తు చేస్తూ కనీస వసతులు కూడా కరువైన స్థితిలో మావోయిస్టు ఉద్యమానికి ఆకర్షితులవుతున్న ఆదివాసులను అభివృద్ధి బాట పట్టించడంలో తమకు సహకారాన్ని అందించాల్సిందిగా అర్థించారు.

పైకి ప్రజాసేవ కోసం ఏర్పరుస్తున్న స్వచ్ఛంద సంస్థలా కనబడుతున్న ఈ ఫౌండేషన్ స్థాపన వెనకాల నిజానికి వేరే కారణాలున్నాయి. దేశ అంతర్గత భద్రతకు అతిపెద్ద

ముప్పుగా వామపక్ష తీవ్రవాదం పరిణమించిందని ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ మూడేళ్ల కిందట ప్రకటించినప్పటి నుంచి నక్సలైట్లపై ప్రత్యేకించి మావోయిస్టులపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ద్విముఖ వ్యూహంతో పూర్తి స్థాయి యుద్ధాన్ని ప్రకటించాయి. ఒకవైపు మావోయిస్టు శ్రేణులను సైనికంగా అణచివేస్తూనే ఇంకోవైపు నక్సల్ ప్రాబల్య ప్రాంతాల్లో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం ద్వారా ప్రజలను ఉద్యమానికి దూరం చేయడం ఈ ద్విముఖ వ్యూహం లక్ష్యం. అణచివేత వ్యూహానికి కేంద్ర హోం మంత్రి చిదంబరం నేతృత్వం వహిస్తే అభివృద్ధి బాటకు జైరాం రమేష్ సారథ్యం స్వీకరించారు. చిదంబరం పర్యవేక్షణలో ఇప్పటికే మధ్య భారతంలో ఆపరేషన్ గ్రీన్‌హంట్ కొనసాగుతోంది. లక్ష సంఖ్యలో పారా మిలిటరీ బలగాలు దండకారణ్యాన్ని, జంగల్‌మహల్‌ను, సరాండా అడవులను, ఏఓబీని చుట్టుముట్టాయి. అడవులను, గ్రామాలను జల్లెడ పడుతున్నాయి. అగ్రనేత కిషన్‌జీ మొదలుకొని పలువురు మావోయిస్టు నేతలను, కార్యకర్తలను మట్టుబెట్టాయి. వందల సంఖ్యలో తమ జవాన్లను సైతం కోల్పోయాయి. 2009 నవంబర్ నుంచి ఈ పోరు భీకరంగా కొనసాగుతూనేవుంది.

మరోవైపు, అభివృద్ధి నినాదంతో జైరాం నక్సల్ ప్రాంతాల్లో పర్యటిస్తూ మావోయిస్టులకు వ్యతిరేకంగా ప్రజలను కూడగట్టే ప్రయత్నం చేస్తున్నారు. గ్రీన్‌హంట్‌తో పాటే ఇంటిగ్రేటెడ్ యాక్షన్ ప్లాన్ (ఐఏపీ) పేరుతో నక్సల్ ప్రాంతాల అభివృద్ధి పథకాన్ని ప్రవేశపెట్టారు. రూ. 3500 కోట్లు ఖర్చు చేశారు. అయినా ఆ పథకం అనుకున్న ఫలితాలను సాధించలేకపోయిందనే చర్చ అధికార వర్గాల్లో ఉంది. ఈ నేపథ్యంలోనే ఇప్పుడీ ఫౌండేషన్ ప్రతిపాదన రూపుదిద్దుకుంది.

బహుళజాతి కంపెనీలు బీఆర్ఎల్ఎఫ్‌కు దండిగా నిధులు సమకూరుస్తాయని జైరాం చాలా నమ్మకంగా ఉన్నారు. ఇందుకాయన చెబుతున్న కారణాలు రెండు. సామాజిక బాధ్యత నెరవేర్చడం ద్వారా ఇంటా బయటా ఈ కంపెనీల ప్రతిష్ఠ పెరుగుతుంది. ప్రభుత్వ పథకాల్లో భాగస్వాములు కావడం ద్వారా వివిధ ప్రాంతాల్లో పని చేస్తున్న ప్రభుత్వేతర సంస్థలతో, స్థానిక సంఘాలతో, ప్రజలతో సత్సంబంధాలు ఏర్పడతాయి. ఫలితంగా ఈ కంపెనీలు ఆయా ప్రాంతాల్లో తమ వ్యాపార కార్యకలాపాలను నిరాటంకంగా కొనసాగించవచ్చు.

మంత్రి పైకి చెప్పకపోయినా ఈ రెండు కారణాలకు మించిన బలమైన కారణం మరొకటుంది. మావోయిస్టు ప్రాబల్య ప్రాంతాలైన ఛత్తీస్‌గఢ్, ఒరిస్సా, జార్ఖండ్ రాష్ట్రాలు ఖనిజవనరులకు పేరెన్నికగన్నవి. దేశంలో ఉన్న మొత్తం ఖనిజవనరుల్లో సింహభాగం ఈ రాష్ట్రాల్లోనే ఉండడం విశేషం. ఇనుము, బాక్సైట్, మాంగనీస్, రాగి, బొగ్గు, జిప్సం, యురేనియం, లైమ్‌స్టోన్, కొరండమ్, డైమండ్ తదితర విలువైన ఖనిజాలు ఇక్కడ

పుష్కలంగా ఉన్నాయి. ఒక్క ఒరిస్సాలోనే రెండు వందల లక్షల కోట్ల బాక్సైట్ నిల్వలు ఉన్నాయంటే మధ్యభారతం ఎంత విలువైనదో మనం అర్థం చేసుకోవచ్చు.

టాటా, జిందాల్, మిట్టల్, ఎస్సార్, హిందాల్కో, వేదాంత, పోస్కో వంటి అనేక బహుళజాతి కంపెనీలు ఈ ప్రాంతాల్లో విస్తృతంగా మైనింగ్, పారిశ్రామిక కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయి. 2009 సెప్టెంబర్ నాటికే ఇక్కడ రూ.8 లక్షల 73 వేల 896 కోట్ల విలువ చేసే ప్రాజెక్టులకు వివిధ కంపెనీలు ఆయా రాష్ట్ర ప్రభుత్వాలతో ఎంఓయూలు కుదుర్చుకున్నాయి. ఈ కంపెనీలన్నింటికీ స్థానికంగా ఉధృతంగా కొనసాగుతున్న మావోయిస్టు ఉద్యమమే ప్రధాన శత్రువు. ఎందుకంటే వీరు చేపట్టిన ప్రాజెక్టుల మూలంగా నిర్వాసితులయ్యే బాధితుల పక్షాన నిలబడడమే కాకుండా అడవిపై, అడవిలోని వనరులపై ఆదివాసీలకే హక్కుందని మావోయిస్టులు పోరాడుతున్నారు. అవకాశం చిక్కినప్పుడల్లా వీరి ఆస్తులపై దాడులకు పాల్పడుతున్నారు. నక్సల్స్ దాడుల మూలంగా కేవలం పవర్, స్టీల్ ప్లాంట్లలోనే రూ.20 వేల కోట్ల పెట్టుబడులు స్తంభించిపోయాయని అనధికార వర్గాల అంచనా.

అనగా మావోయిస్టు ఉద్యమం వల్ల ఎక్కువగా నష్టపోతున్నది ఈ బహుళజాతి కంపెనీలేనన్నది స్పష్టం. వాస్తవానికి కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ గ్రీన్‌హంట్ ప్రారంభించడం వెనకాల ఈ కంపెనీల ప్రోద్బలమే దాగుందని మావోయిస్టు పార్టీ మొదలుకొని అరుంధతీరాయ్ లాంటి మేధావుల వరకు అనేకులు ఆరోపిస్తున్న విషయం తెలిసిందే. మధ్య భారత వనరులపై కన్నేసిన ఈ సంస్థలు అమెరికా తదితర దేశాలచే, ప్రపంచబ్యాంకు వంటి సంస్థలచే భారత ప్రభుత్వంపై ఒత్తిడి పెంచడమే కాకుండా యూపీఏ సర్కారుతో లోపాయికారీ ఒప్పందం కుదుర్చుకున్నాయని వీరు ఆరోపిస్తున్నారు. అయితే ఇంతకాలం తెర వెనుక ఉండి పాత్ర పోషించిన ఈ కంపెనీలను ఫౌండేషన్ ప్రతిపాదనతో జైరాం తెర ముందుకు తెస్తున్నారు. ఆయన ఆశించిన విధంగానే ఈ ఫౌండేషన్‌కు ఆయా కంపెనీలు భారీగా నిధులు సమకూరుస్తాయనే విషయంలో ఎలాంటి సందేహాలూ లేవు. వేయి కోట్లు కాస్తా రేపు పది వేల కోట్లకు పెరగవచ్చు కూడా.

ప్రశ్నల్లా ఈ ఫౌండేషన్ ద్వారా విడుదలైన నిధులు వెనుకబడిన ఆదివాసీ ప్రజల జీవన స్థితిగతులను మెరుగుపరచడానికి ఉపయోగపడతాయా అని. ఎందుకంటే ఇప్పటివరకు గిరిజన ప్రాంతాల అభివృద్ధి కోసమని ప్రభుత్వాలు విడుదల చేసిన ఏ నిధులూ వారి బతుకులను మార్చేందుకు ఉపయోగపడలేదు. ఐఏపీ పేరుతో విడుదలైన 3500 కోట్లు కూడా కేవలం రోడ్లు, వంతెనలు, పోలీస్ స్టేషన్లు, ప్రభుత్వ భవనాల నిర్మాణానికి ఖర్చు చేశారే తప్ప ఏ ఒక్క పైసా స్థానికులకు మౌలిక వసతులను కల్పించడానికి ఖర్చు చేయలేదు. గతంలో మహారాష్ట్రలోని గడ్‌చిరోలి జిల్లాలో వాటర్‌షెడ్

పేరిట సర్కారు మంజూరు చేసిన నిధులతో ఆయా గ్రామాల్లో కమ్యూనిటీ భవనాలు నిర్మించి అందులో కలర్ టీవీలు అమర్చిన సంగతి అక్కడి ప్రజలు ఇంకా మరచిపోలేదు.

ఇప్పుడు కొత్తగా ఏర్పాటుచేస్తున్న ఈ భారత్ ఫౌండేషన్ నిధులు కూడా ఆదివాసుల తలరాతలను మార్చడానికి వినియోగించే దాఖలాలు కనిపించడం లేదు. ఎందుకంటే, జైరాం చెప్పిన ప్రకారమే ఫౌండేషన్ నిధులు ఆయా రాష్ట్ర ప్రభుత్వాలకు కాకుండా నేరుగా స్థానికంగా పనిచేస్తున్న ప్రభుత్వేతర సంస్థలు, పౌరసంఘాలకు విడుదలవుతాయి. ఆ సంస్థల ద్వారానే వివిధ ప్రజావసరాలకు, పనులకు ఖర్చు చేస్తారు. అనగా ఫౌండేషన్ పెద్దలు అర్హులని భావించిన వారికి ఈ పనులు దక్కుతాయన్నమాట. ఇక్కడే ప్రభుత్వ కుట్ర బహిర్గతమవుతోంది. ఇప్పటి వరకు గిరిజన పల్లెల్లో మావోయిస్టులదే రాజ్యం కనుక, వారి కదలికలను గురించిన సమాచారమిచ్చే మానవమాత్రుడే లేడు కనుక స్వచ్ఛంద ముసుగులో నిధులు వెదజల్లి తమకు అనుకూలమైన ఒక వర్గాన్ని తయారు చేసుకోవడానికి ప్రయత్నిస్తారు. అలాగే ఆదివాసుల్లో చదువుకున్న వారిని, నిరుద్యోగులను చేరదీసి వివిధ పథకాల పేరుతో వారికి విలాస జీవితాన్ని అలవాటు చేస్తారు. ఒక్కమాటలో చెప్పాలంటే నిష్కల్మషంగా, అమాయకంగా బతుకుతున్న ఆదివాసీలకు స్వార్థం నేర్పుతారు. అప్పుడిక చట్టం తన పని తాను చేసుకువెళుతుంది.

వెనుకబడిన ప్రాంతాల, ఆదివాసుల అభివృద్ధి ద్వారానే నక్సలైటు ఉద్యమాన్ని రూపుమాపవచ్చని కేంద్ర ప్రభుత్వం నిజంగానే నమ్మితే అది అభినందించాల్సిన విషయమే. అలాంటప్పుడు మధ్యభారతంలో కొనసాగుతున్న ఆపరేషన్ గ్రీన్‌హంట్‌ను వెంటనే ఆపేయాలి. ఓ చేత్తో అన్నం ముద్దను అందిస్తూ మరో చేత్తో రైఫిల్ బాయ్‌నెట్‌ను ఎక్కుపెట్టే విధానాలకు పాలకులు స్వస్తి చెప్పాలి. మావోయిస్టులతో కాల్పుల విరమణను ప్రకటించి వారు సహా విప్లవ గ్రూపులన్నింటిని వెంటనే శాంతి చర్చలకు ఆహ్వానించాలి. మధ్యభారతంలోని ఖనిజవనరుల విషయంలో వివిధ బహుళజాతి కంపెనీలతో కుదుర్చుకున్న అన్ని ఎంఓయూలను పునస్సమీక్షించాలి. అభివృద్ధి ఫలాలను స్థానికులకు అందించే మినరల్ పాలసీని ప్రకటించాలి. స్వదేశీ బాటలో దేశాన్ని పారిశ్రామికీకరించాలి. పేదరిక నిర్మూలనకు, మౌలిక వసతుల కల్పనకు బడ్జెట్‌లలో, పంచవర్ష ప్రణాళికల్లో భారీగా నిధులు కేటాయించాలి. ప్రభుత్వ పథకాలను పారదర్శకంగా అమలుచేయాలి. అప్పుడు మావోయిజం, నక్సలిజం వాటంతటవే సమసిపోతాయి.

***(నమస్తే తెలంగాణ, 24-04-2012)***

# సోని సోరి.. రాజ్యహింసకు పరాకాష్ఠ..

"యువరానర్! ఈ రోజు నేను బతికున్నానంటే అది మీ పుణ్యమే. తగిన సమయంలో మీరు జోక్యం చేసుకున్నందునే పోలీసు చిత్రహింసల గాయాల నుంచి నేను కోలుకున్నాను. అయితే, ఢిల్లీ ఎయిమ్స్ ఆస్పత్రి నుంచి తిరిగి వచ్చిన తర్వాత పరిస్థితి మళ్లీ మొదటికొచ్చింది. రాయ్‌పూర్ జైలులో నాపై వేధింపులు, చిత్రహింసలు రెట్టింపయ్యాయి. ఒంటరి సెల్‌లో నగ్నంగా కూర్చోబెడుతున్నారు. తనిఖీల పేరుతో శరీరభాగాలను తడుముతున్నారు. బూతులు తిడుతున్నారు. ఆకలితో మాడ్చుతున్నారు. మందులు తేవడం లేదు. ఆస్పత్రికి తీసుకెళ్లడం లేదు. నువ్వు నక్సలైటువు.. ద్రోహివంటూ చిత్రవధ చేస్తున్నారు. నా మానమర్యాదలను మంటగలుపుతున్నారు. నేనేం తప్పు చేశాను యువరానర్? నా హక్కుల రక్షణకై గొంతెత్తడమే నేరమా? పోలీసుల అకృత్యాలను మీ దృష్టికి తేవడమే ద్రోహమా? ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వానికి నాపై ఎందుకింత కక్ష? ఇంతకంటే మీరు నాకు మరణశిక్ష వేసినా బాగుండు.. ప్లీజ్.. నాపై దయుంచండి.. ఇక్కడ నన్ను చంపేటట్టున్నారు.. కాపాడండి!"

పోలీసుల దౌష్ట్యానికి బలైన ఆదివాసీ మహిళ సోని సోరి జైలు నుంచి సుప్రీంకోర్టుకు ఇటీవల రాసిన లేఖ సారాంశమిది. పది నెలలకు పైగా ఛత్తీస్‌గఢ్ పోలీసుల చేతుల్లో నరకయాతన అనుభవిస్తున్న ఈ ప్రభుత్వోపాధ్యాయురాలిపై 2011 సెప్టెంబర్ చివరలో మావోయిస్టు పార్టీకి కొరియర్‌గా పనిచేస్తోందన్న ఆరోపణలను పోలీసులు నమోదు చేశారు. మేనల్లుడు లింగారాం కొడాపె తదితరులతో కలిసి మైనింగ్ కంపెనీ ఎస్సార్ నుంచి ఆమె రూ. 15 లక్షలు స్వీకరించి నక్సలైట్లకు చేరవేసిందని కేసు పెట్టి వారంటు జారీ చేశారు. తనకే పాపం తెలీదన్న సోని మొరను ఎవరూ ఆలకించకపోవడంతో జాతీయ మీడియాను ఆశ్రయించింది. తనపై పోలీసులు మోపిన ఆరోపణలన్నీ పచ్చి అబద్ధాలని మొత్తుకుంది. కొందరు మిత్రుల సలహా మేరకు ఢిల్లీ వెళ్లింది. ఛత్తీస్‌గఢ్ పోలీసుల నుంచి రక్షణ కోరుతూ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేయ సిద్ధమైంది. ఈ లోపలే ఉప్పందుకున్న ఆ రాష్ట్ర పోలీసులు దేశ రాజధానిలో అక్టోబర్ 4న ఆమెను

అరెస్టు చేశారు. అక్కడి కోర్టులో పోలీసు కస్టడీకి అనుమతి పొంది 7న దంతేవాడకు తీసుకువచ్చారు. రెండు రోజుల పాటు లాకప్‌లో నిర్బంధించి తీవ్రమైన చిత్రహింసలకు గురి చేశారు. లైంగికదాడికి పాల్పడ్డారు. జననాంగంలోకి బలవంతంగా లాఠీలను, రాళ్లను చొప్పించారు. కరెంటు షాకులిచ్చారు. తిండి పెట్టకుండా ఆకలికి మాడ్చారు. తమకు వ్యతిరేకంగా సుప్రీంకోర్టుకు వెళతావా అంటూ దంతేవాడ ఎస్పీ అంకిత్ గార్గ్ ఆమెపై విరుచుకుపడ్డాడు. బట్టలు విప్పించి బూతుపదజాలంతో అవమానించాడు. తీవ్ర గాయాలతో నడవలేని స్థితిలో ఉన్న సోనిని పోలీసులు కోర్టులో ప్రవేశపెట్టారు. ఆమె పూర్తి ఆరోగ్యంతో ఉన్నట్లు, ఎలాంటి గాయాలు లేనట్లు ప్రభుత్వాస్పత్రి వైద్యులు ఇచ్చిన ధ్రువీకరణ పత్రాన్నే మేజిస్ట్రేట్ నమ్మారు. జ్యుడీషియల్ కస్టడీకి ఆదేశించి రాయపూర్ జైలుకు పంపారు.

చేయని నేరానికి తనకీ శిక్ష ఏమిటంటూ, తనపై థర్డ్ డిగ్రీ పద్ధతులను ప్రయోగించిన పోలీసుల పాశవికత్వాన్ని నిరసిస్తూ సోని అక్టోబర్ 11న జైలులోనే ఆమరణ నిరాహార దీక్ష ప్రారంభించింది. ఎవరూ పట్టించుకోపోవడంతో కొద్ది రోజుల్లోనే ఆమె ఆరోగ్య పరిస్థితి క్షీణించింది. పోలీసు హింస, ఆమరణ దీక్ష సోనిని మృత్యువు అంచుల్లోకి తీసుకెళ్లాయి. చివరకు కోర్టు ఆదేశాల మేరకు అదే నెల 26న ఆమెను జైలు అధికారులు కోల్‌కతా హాస్పిటల్‌కు తరలించారు. అక్కడ పలు వైద్య పరీక్షలు నిర్వహించిన డాక్టర్లు ఆమె జననాంగంలో, రెక్టమ్‌లో మూడు రాళ్లను గుర్తించి తొలగించారు. వెన్నెముకపై, ఇతర శరీరాంగాలపై గాయాలను కనుగొన్నారు. నెల రోజుల చికిత్స అనంతరం తిరిగి సోని రాయ్‌పూర్ జైలుకు చేరింది. అయితే, ఛత్తీస్‌గఢ్ సర్కారు ఆదేశాల మేరకు జైలు అధికారులు ఆమెను హింసించడాన్ని కొనసాగించారు. తిండి పెట్టకుండా, డాక్టర్లు రాసిన మందులు అందించకుండా చీటికి మాటికి నక్సలైటువంటూ వేధించారు. రివ్యూ కోసం నెల తర్వాత కోల్‌కతాకు తీసుకెళ్లాల్సివుండగా పట్టించుకోలేదు. తీవ్ర రక్తస్రావమవుతున్న పరిస్థితుల్లో సోని ఫిబ్రవరి 8న మరోసారి ఆమరణ దీక్షకు పూనుకుంది. 19 రోజులు కొనసాగిన ఈ దీక్ష ఫలితంగా దంతేవాడలోని సెషన్స్ కోర్టు స్పందించింది. రాయ్‌పూర్‌లోని ప్రభుత్వాస్పత్రిలో చికిత్స అందించాలని ఆదేశించింది. విషాదకరమైన విషయమేమిటంటే ఇదే ఆస్పత్రి వైద్యులు అక్టోబర్ 10న తీవ్రగాయాలతో, విషమించిన ఆరోగ్యంతో పోలీసులు సోనిని తీసుకువస్తే, ఆమె పూర్తి ఆరోగ్యంగా ఉందని, నొప్పి నటిస్తోందని నివేదికలిచ్చారు. ఈసారి కూడా వాళ్లు పోలీసుల సూచనలనే పాటించారు. సోనికి అరకొర వైద్యం చేసి జైలుకు పంపించారు.

అయితే, బాహ్య ప్రపంచంలో అప్పటికే సోని ఉదంతం ప్రాచుర్యంలోకి వచ్చింది. సుప్రీంకోర్టు సహా వివిధ కోర్టులకు, మానవ హక్కుల కమిషన్‌కు ఆమె పెట్టుకున్న

పిటిషన్లు వాస్తవాలను బహిర్గతం చేశాయి. అక్టోబర్‌లోనే జాతీయ మానవ హక్కుల కమిషన్(ఎన్‌హెచ్‌ఆర్‌సీ) ఈ ఘటనపై విచారణకు ఆదేశించగా, ఈ విషయంలో దేశ ప్రధానమంత్రి చొరవ చూపాలని జనవరిలో హ్యూమన్ రైట్స్ వాచ్ కోరింది. ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ సైతం సోనిని బంధించడం ఆలోచనలను బంధించడమేనని వ్యాఖ్యానించింది. రాజ్యహింసతో పాటు మావోయిస్టుల హింసనూ వ్యతిరేకిస్తున్న మహిళను ఇబ్బందులపాలు చేయడం అన్యాయమని పేర్కొంది. బేషరతుగా ఆమెను విడుదల చేయాలంటూ ఉద్యమించాల్సిందిగా అంతర్జాతీయ మహిళా దినోత్సవ సందర్భంగా మార్చ్ 8న పిలుపునిచ్చింది. సోని ఆరోగ్య పరిస్థితి క్షీణిస్తుండడంపై ఆందోళన వ్యక్తం చేస్తూ చామ్‌స్కీ, అరుంధతీరాయ్, అరుణారాయ్, ప్రశాంత్‌భూషణ్ సహా 250 మంది మేధావులు, సామాజిక కార్యకర్తలు మన్మోహన్‌సింగ్‌కు లేఖ రాశారు. సోని విడుదలను డిమాండు చేస్తూ దేశవ్యాప్తంగా మహిళా సంఘాలు ఆందోళనకు దిగాయి. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పెల్లుబికిన ఈ నిరసన ఫలితంగా చివరకు సుప్రీంకోర్టు జోక్యం చేసుకుంది. ఢిల్లీలోని ఎయిమ్స్ ఆస్పత్రికి ఆమెను తరలించాల్సిందిగా ఆదేశించింది. అలా మే 10న ఎయిమ్స్‌లో చేరిన సోని తీవ్ర అనారోగ్యంతో బాధ పడుతున్నట్లు వైద్యులు గుర్తించారు. ఐదు వారాల పాటు చికిత్స చేసి రాయ్‌పూర్‌కు పంపించారు. అయితే, జైలులో సీన్ మళ్లీ రిపీటవుతోందనడానికి సోని సుప్రీంకోర్టుకు తాజాగా రాసిన పై లేఖే సాక్ష్యం.

సోనిపై ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం ఎందుకు కక్షగట్టింది? బుద్ధిగా ఉద్యోగం చేసుకుంటోన్న ఇద్దరు పిల్లలున్న ఓ అమాయక ఆదివాసీ మహిళను ఎందుకు వేధిస్తోంది? కోర్టుల ఆదేశాలను ధిక్కరించి, జైలు మాన్యువల్స్‌ను తుంగలో తొక్కి అమానవీయ పద్ధతులు ఎందుకు అవలంభిస్తోంది? మావోయిస్టులకు సహకరిస్తున్నాడంటూ ఆమె భర్తను సంవత్సరకాలంగా జైలులో ఎందుకు పెట్టింది? మేనల్లుడిపై నేరస్తుడి ముద్ర ఎందుకు వేసింది? మావోయిస్టులు ఇన్ఫార్మరువంటూ తండ్రిని కాల్చి గాయపర్చితే, తన అరెస్టుతో తల్లిని సైతం కోల్పోయిన సోని చేసిన నేరం ఏమిటి? ఇవన్నీ అంతుచిక్కని ప్రశ్నలు. అంతం లేని వ్యథలు.

అయితే, ఇలాంటి వ్యథలను అనుభవించడంలో సోని ఒంటరి కాదు. మధ్యభారత వనరులను బహుళజాతి కంపెనీలకు అప్పనంగా కట్టబెట్టడాన్ని అడ్డుకుంటున్న మావోయిస్టులను నిర్మూలించే లక్ష్యంతో ఆపరేషన్ గ్రీన్‌హంట్ ప్రారంభమైనప్పటి నుంచీ రాజ్యం బాధితులు పెరిగారు. ఛత్తీస్‌గఢ్‌తో పాటు ఒరిస్సా, జార్ఖండ్, బీహార్, బెంగాల్, మహారాష్ట్రలలో మానవహక్కులకు తీవ్ర విఘాతం ఏర్పడింది. లక్షకు పైగా బలగాలను దించి నక్సల్స్ వేట ముసుగులో డజన్ల కొలదీ అమాయకుల ప్రాణాలను హరిస్తున్నారు.

బూటకపు ఎన్‌కౌంటర్లు చేస్తున్నారు. బాసగూడెం లాంటి మారణకాండలకు పాల్పడుతున్నారు. మానవరహిత యుద్ధానికి తెగబడుతున్నారు. కూంబింగుల పేరిట ఊళ్లను ఖాళీ చేయిస్తున్నారు. ఇళ్లను తగులబెడుతున్నారు. దొరికిన వారిని చితకబాదుతున్నారు. కేసులు పెట్టి జైళ్లు నింపుతున్నారు. సల్వాజుడుంను సుప్రీం నిషేధిస్తే కోబ్రా బెటాలియన్‌గా మార్చి జనం పైకి వదిలారు. ఈ అకృత్యాలను వెలుగులోకి తెస్తుందనే భయంతో మీడియానూ నిషేధించారు.

ఇక మిగిలింది హక్కుల సంఘాలు, కార్యకర్తలు.. వీరిని నయానో భయానో అదుపులో పెట్టకపోతే మానవహక్కుల ఉల్లంఘనంటూ గొంతు చించుకుని అరుస్తారని, అంతర్జాతీయ సమాజం దృష్టిలో భారత్ ప్రతిష్ఠను దిగజారుస్తారని రాజ్యం అప్రమత్తమైంది. ఇందులో భాగంగానే హక్కుల నేత బినాయక్‌సేన్‌పై అక్రమ కేసులు బనాయించి జైలుకు పంపారు. కళాకారుడు జీతన్ మరాండికి చేయని నేరం అంటగట్టి ఉరిశిక్ష విధించారు. జర్నలిస్టు సీమా ఆజాద్‌కు, ఆమె భర్త విశ్వవిజయ్‌కు కేవలం నిషేధిత సాహిత్యం కలిగివున్నందుకు మావోయిస్టు ముద్ర వేసి యుఏపీఏ కింద యావజ్జీవ కారాగారం విధించారు. రాజ్యం కర్కశత్వానికి ఇవి కొన్ని ఉదహరణలు మాత్రమే. సోని వ్యథాభరిత గాథ వెనకాల కారణమూ ఇదే. దంతేవాడ జిల్లాలోని జాబెలి గ్రామంలో స్కూలు టీచర్‌గా ఉంటూ పోలీసుల, కోబ్రా బలగాల అరాచకాలను ప్రశ్నించింది. వనరుల దోపిడికై తిష్ఠ వేసిన కార్పొరేట్లకు ఊడిగం చేస్తున్న స్థానిక నేతల వైఖరిని ఎండగట్టింది. అదే పాలకుల కంటగింపునకు కారణమైంది.

సొంత ప్రజలపైనే యుద్ధానికి తెగబడిన విధానాలకు యూపీఏ సర్కారు ఇకనైనా స్వస్తి పలకాలి. ఆదివాసుల హననానికి కారణమవుతున్న గ్రీన్‌హంట్‌ను నిలిపేయాలి. బూటకపు ఎన్‌కౌంటర్లకు, మారణకాండలకు ఫుల్‌స్టాప్ పెట్టాలి. హక్కుల కార్యకర్తలపై వేధింపులను ఆపాలి. సోని సోరిని వెంటనే జైలు నుంచి విడుదల చేసి మెరుగైన వైద్యచికిత్స అందించాలి. ఈ ఉదంతంపై సుప్రీంకోర్టు న్యాయమూర్తిచే స్వతంత్ర విచారణకు ఆదేశించాలి. లేనిపక్షంలో ఈ దేశంలో కొనసాగుతున్నది ప్రజాస్వామ్యం కాదని, సామ్రాజ్యవాదుల-బహుళజాతి కంపెనీల సేవలో తరించే నియంతృత్వ ప్రభుత్వమే ఇక్కడ రాజ్యమేలుతున్నదని ప్రజలు భావిస్తారు.

***(నమస్తే తెలంగాణ, 21-08-2012)***

# జర్నలిస్టు లింగారాం కథ.. మరో వ్యథ..

దంతేవాడకు చెందిన ఆదివాసీ ఉపాధ్యాయురాలు సోని సోరి వ్యథాభరిత గాథను చదివిన వారికి ఆమెతో పాటు అదే కేసులో పోలీసులు ఇరికించిన లింగారాం కొడాపె గుర్తుండేవుంటాడు. సోనికి స్వయానా మేనల్లుడైన పాతికేళ్ల లింగారాందీ చేయని నేరానికి రాజ్యం ఉక్కుపాదం కింద నలిగిపోతున్న చరిత్రే. మురియా ఆదివాసీగా పుట్టడం.. అదీ మావోయిస్టులకు ప్రభుత్వ బలగాలకు యుద్ధం నడుస్తున్న దంతేవాడ జిల్లాలో పుట్టడం ఆతడి తప్పు కాకపోయినా శిక్ష మాత్రం అనుభవిస్తున్నాడు. యే జల్.. జంగల్.. జమీన్ హమారా.. అంటూ వచ్చిన దాదాలు తొలుత లింగారాంను తమ వైపు ఆకర్షించేందుకు విఫలయత్నం చేశారు. మీ చిత్తశుద్ధి మంచిదే కాని మార్గంపై అనుమానాలున్నాయంటూ సున్నితంగా తిరస్కరించాడు. హింస ఎవరు చేసినా తప్పన్నాడు. అయితే, పోలీసులు ఊరుకోలేదు. నీకు నక్సల్స్‌తో సంబంధాలున్నాయని వేధించారు. లేవని తాము నమ్మాలంటే ఎస్పీఓ (స్పెషల్ పోలీస్ ఆఫీసర్)గా చేరమన్నారు. మావోయిస్టు గెరిల్లా కావడానికి ఇష్టపడని లింగారాం పోలీసుల తరఫున పనిచేయడానికీ సమ్మతించలేదు. తనను బలవంతం చేయడం అన్యాయమన్నాడు. తిరగబడ్డాడు. అంతే.. రాజ్యం కన్నెర్రజేసింది. 40 రోజులు లాకప్‌లో బంధించింది. హక్కుల గురించి మాట్లాడతావా.. నువ్వు కచ్చితంగా నక్సలైటువేనంటూ పోలీసులు లాఠీలు ఝుళిపించారు. చెప్పరాని హింసలు పెట్టారు. కోర్టు జోక్యంతో విడుదలై ఢిల్లీకి పారిపోయి జర్నలిస్టు శిక్షణ పొందుతుంటే మావోయిస్టు అధికార ప్రతినిధివన్నారు. ఆజాద్‌కు వారసునిగా ప్రకటించారు. దంతేవాడకు వచ్చిన వెంటనే అరెస్టు చేశారు. మైనింగ్ కంపెనీ ఎస్సార్ నుంచి రూ. 15 లక్షలు తీసుకుని మావోయిస్టులకు చేరవేశాడని ఆరోపించారు. రాజ్యాన్ని కూలదోయడానికి కుట్ర చేస్తున్నాడంటూ చట్టవ్యతిరేక కార్యకలాపాల నివారణ చట్టం(యూఏపీఏ) కింద కేసు పెట్టారు. సంవత్సరకాలంగా జైలులో బంధించారు.

కొకొండ బ్లాక్‌లోని సమేలి గ్రామంలో కాస్త కలిగిన కుటుంబంలోనే 1987లో పుట్టాడు లింగారాం. తండ్రి మద్రూరాం మూడు సార్లు గ్రామ సర్పంచుగా ఎన్నికయ్యారు.

చిన్నాన్న మాజీ ఎమ్మెల్యేగా పనిచేశారు. డిగ్రీ వరకు చదివిన లింగారాంకు ఎప్పటికైనా మంచి జర్నలిస్టు కావాలన్న కోరిక వుండేది. గ్రామంలోకి తరచూ వచ్చే నక్సల్స్ ఆశయం పట్ల అంతగా అవగాహన లేకపోయినా ఆదివాసుల కోసం పనిచేస్తున్నవారిగా సానుభూతి చూపించేవాడు. ఇది పోలీసులకు కంటగింపయింది. ప్రమాదాన్ని గ్రహించిన లింగారాం తండ్రి కొడుకుచే చదువు మాన్పించి జీపు కొనిచ్చాడు. దాన్ని నడుపుకుంటూ బతుకుతున్నా పోలీసులు వదలలేదు. మావోయిస్టుల్లో కలిశాడంటూ ప్రచారం చేయసాగారు. 2009 ఆగస్టు 14న లింగారాం కోసం మేనత్త సోని ఇంటిపై దాడి చేశారు. అక్కడ చిక్కకపోవడంతో అదే నెల 31న స్వగ్రామం సమేలిని చుట్టుముట్టి పట్టుకున్నారు. దంతేవాడకు తీసుకెళ్లి లాకప్‌లో బంధించారు. మావోయిస్టునని ఒప్పుకొమ్మని లేదంటే ఎస్పీఓగా చేరమని ఒత్తిడి చేశారు. లింగారాం ససేమిరా అనడంతో చిత్రహింసలు పెట్టారు. తమ్ముని జాడ తెలుపాలని లింగారాం అన్న బిలాస్‌పూర్ హైకోర్టులో సెప్టెంబర్ 18న హెబియస్ కార్పస్ పిటిషన్ దాఖలు చేయడంతో వివిధ స్టేషన్లు తిప్పారు. చివరకు అక్టోబర్ 6న హైకోర్టులో హాజరుపరచారు. కోర్టు లింగారాంను విడుదల చేసింది.

ఈ ఘటన లింగారాం జీవితాన్ని మలుపు తిప్పింది. స్థానికంగా ఉంటే పోలీసుల నుంచి వేధింపులు తప్పవని భావించి ఢిల్లీ పయనమయ్యాడు. ఓ ఎన్‌జీఓ భవనంలో ఆశ్రయం సంపాదించాడు. మల్టీమీడియా జర్నలిజంలో శిక్షణ కోసం నొయిడాలోని ఓ సంస్థలో చేరాడు. ఢిల్లీ జీవితం లింగారాంలోని నిశ్శబ్దాన్ని, ఆత్మన్యూనత భావాన్ని ఛేధించింది. అనేక మంది జర్నలిస్టులతో, మేధావులతో పరిచయాన్నీ, ప్రజాస్వామిక చైతన్యాన్నీ పెంచింది. ఛత్తీస్‌గఢ్ పోలీసుల అరాచకాలను, అక్కడి ఆదివాసుల వెతలను జాతికి వెల్లడించే ఉద్దేశంతో భూసేకరణ, వనరుల దోపిడి, ఆపరేషన్ గ్రీన్‌హంట్‌పై 2010 ఏప్రిల్‌లో నిర్వహించిన స్వతంత్ర ప్రజా ట్రిబ్యునల్‌లో లింగారాం పాల్గొన్నాడు. స్వామి అగ్నివేశ్ తదితరుల సమక్షంలో మావోయిస్టుల అణచివేత పేరిట తన ప్రాంతంలో కొనసాగుతున్న దమనకాండను బహిర్గతం చేశాడు. తనను ఏ విధంగా పోలీసులు చిత్రవధ చేసిందీ కళ్లకు కట్టినట్లు వర్ణించాడు. అభివృద్ధి పేరుతో వెచ్చిస్తున్న డబ్బు నేతల జేబుల్లోకే వెళుతోందని ఆరోపించాడు. ఆయుధాలు పట్టకుండా, నక్సలైటు కాకుండా లేదంటే ఎస్పీఓగా చేరకుండా ఈ దేశంలో గౌరవంగా బతికే హక్కు ఆదివాసులకు లేదా? అని ప్రశ్నించాడు.

లింగారాం ఆవేదన దేశ ప్రజలకు వినిపించిందో లేదో కాని ఛత్తీస్‌గఢ్ పోలీసులకు మాత్రం బాగా వినిపించింది. లింగారాం అడ్రస్ చెప్పమంటూ వాళ్లు మేనత్త సోనిని వేధించారు. అలా చేస్తే నీ భర్తను జైలు నుంచి విడుదల చేస్తామని ఆశపెట్టారు. వినకపోవడంతో లింగారాంకు నక్సల్స్‌తో సంబంధాలున్నాయని, వారి పనిలో

ఆంధ్రప్రదేశ్, గుజరాత్ తదితర రాష్ట్రాలు తిరుగుతున్నాడని రాసివున్న పత్రాలపై బలవంతంగా సంతకాలు చేయించుకున్నారు. స్థానిక కాంగ్రెస్ నేత అవధేశ్ గౌతమ్ ఇంటిపై 2010 జూలైలో మావోయిస్టులు చేసిన దాడిలో లింగారాం పాల్గొన్నాడని ఆరోపించారు. లింగారాం మావోయిస్టు కమాండరని, ఢిల్లీ, గుజరాత్‌లలో ఆయుధ శిక్షణ పొందాడని, చనిపోయిన ఆజాద్ స్థానంలో త్వరలో మావోయిస్టు అధికార ప్రతినిధిగా బాధ్యతలు చేపట్టనున్నాడని డీఐజీ కల్లూరి ప్రకటన విడుదల చేశారు. అయితే, స్వామి అగ్నివేశ్, ప్రశాంత్‌భూషణ్‌లతో కలిసి ఢిల్లీలో విలేకరుల సమావేశం నిర్వహించిన లింగారాం ఈ ఆరోపణలను ఖండించాడు. తాను సగటు ఆదివాసీ యువకుడినని, జర్నలిజం కోర్సు చదువుతున్నానని, తనకు నక్సల్స్‌తో ఎలాంటి సంబంధాలు లేవని స్పష్టం చేశాడు.

జర్నలిజం కోర్సు పూర్తి కావడంతో 2011 ఏప్రిల్‌లో లింగారాం దంతేవాడకు తిరిగివచ్చాడు. అదే సమయంలో తాడిమెట్ల ఆంబుష్ అనంతరం మూడు పరిసర గ్రామాల్లో ప్రభుత్వ బలగాలు సృష్టించిన విధ్వంసకాండను దృశ్యీకరించాడు. దెబ్బలు తిన్న వ్యక్తులను, అత్యాచారానికి గురైన మహిళలను కలిశాడు. ఇంటర్నెట్ పోర్టల్ సీజీనెట్ స్వరకు పనిచేయడం ఆరంభించాడు. ఈ క్రమంలో స్వామి అగ్నివేశ్‌తో కలిసి జూన్‌లో బస్తర్ డివిజనల్ కమిషనర్ శ్రీనివాసులును, దంతేవాడ కలెక్టర్‌ను, ఎస్పీని కలిశాడు. తనను పోలీసులు మావోయిస్టుగా అనుమానించడం వల్లే భయంతో ఢిల్లీ పోయానని, ఇకముందు ఫ్రీలాన్స్ జర్నలిస్టుగా పనిచేస్తూ బతుకుతానని విన్నవించాడు. ఆగస్టు 15 స్వాతంత్ర్యదినోత్సవాన మావోయిస్టులు లింగారాం గ్రామంలో నల్లజెండా ఎగురవేయగా, వారిముందే దానిని లింగారాం తీసేశాడు. ఇప్పటికి జరుగుతున్న మారణకాండ చాలని, వెళ్లిపోండని ప్రార్థించాడు.

మరోవైపు, లింగారాం తీసిన తాడిమెట్ల వీడియోలు బయటి ప్రపంచంలో కలకలం సృష్టించాయి. సీఆర్‌పీఎఫ్, ఛత్తీస్‌గఢ్ పోలీసుల అమానుషత్వాన్ని బయటపెట్టాయి. ఈ పరిణామాలపై రమణ్‌సింగ్ సర్కారు ఆగ్రహించడంతో పోలీసు అధికారులు లింగారాంకు, ఆతనికి సపోర్టుగా నిలుస్తున్న సోనికి తగిన గుణపాఠం చెప్పాలని నిర్ణయించారు. ఒకే దెబ్బకు రెండు పిట్టలన్న చందంగా ఎస్సార్ కేసుకు పథకరచన చేశారు. సెప్టెంబర్ 9న లింగారాంను వాళ్ల గ్రామం సమేలిలో అరెస్టు చేసి 10న పాల్నార్ గ్రామ సంతకు తీసుకెళ్లారు. ఎస్సార్ కంపెనీకి కాంట్రాక్టర్‌గా ఉన్న బీ కే లాలాను కూడా తీసుకొచ్చి డబ్బుల డ్రామా ఆడారు. వీరిద్దరు డబ్బులు మార్చుకుంటుండగా రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నామని, మూడవ వ్యక్తి సోని సోరి పారిపోయిందని ప్రకటించారు.(ఆ తర్వాత ఆమెనూ అరెస్టు చేశారు) యూఏపీఏ కింద కేసు నమోదు చేసి జైలులో బంధించారు.

ఇదీ జర్నలిస్టు కావాలనుకున్న ఆదివాసీ యువకుడు లింగారాం కథ. ఈ కథకు ముగింపూ అతనే రాశాడు. భారతప్రజలనుద్దేశించి జైలునుంచి అతడు ఇటీవల పంపిన బహిరంగ లేఖలోని ముఖ్యాంశాలను చదివితే ప్రజాస్వామ్యం సిగ్గుపడక తప్పదు. "జర్నలిస్టుగా నా సమాజానికి, సంస్కృతికి సేవ చేయాలని ఆశిస్తే పోలీసులు నన్ను మావోయిస్టు ఆజాద్‌కు వారసుడినని ప్రకటించారు.. వారి అనుమానాలను నివృత్తి చేద్దామని దంతేవాడకు వస్తే యూఏపీఏ కేసు పెట్టి టెర్రరిస్టుగా మార్చేశారు.. జైలులో తిండి పెట్టకుండా మాడ్చుతున్నారు.. అదేమని ప్రశ్నిస్తే బట్టలూడదీసి కొడుతున్నారు.. జడ్జికి చెప్పినందుకు దంతేవాడ జైలు నుంచి జగ్దల్‌పూర్ జైలుకు మార్చారు.. దారిలోనే ఎన్‌కౌంటర్ చేయాల్సిందని కామెంటు చేస్తున్నారు.. జైళ్లలో వందలాది ఆదివాసులు చిన్నచిన్న కేసుల్లో బెయిలు లేకుండా సంవత్సరాలు గడిపేస్తున్నారు.. జవాన్ల చేతుల్లో అత్యాచారానికి గురైన మహిళలు జైలుకు వచ్చి శిశువులకు జన్మనిస్తున్నారు.. ఉగ్రవాదం పేర నాడు సిక్కులను ఎలా చంపేశారో ఇప్పుడు నక్సలైట్ల పేరుతో ఆదివాసులను అలానే నాశనం చేస్తున్నారు.. డబ్బున్న వారికే ఈ దేశంలోని నాలుగు ఎస్టేట్లూ (శాసన, కార్యనిర్వాహక, న్యాయ వ్యవస్థలు, మీడియా) తోడ్పడతాయి.. వీటి గురించి మా ప్రజలకు తెలువదు.. కొంచెం తెలిసిన కారణంగా నేను జైలులో ఉన్నాను.."

"స్వతంత్ర జర్నలిస్టునైన నా స్వేచ్ఛను రాజ్యం హరించింది. నా లేఖ మూలంగా ఆదివాసులపై దౌర్జన్యాలు మరింత పెరగనూవచ్చు. నన్నూ ఏమైనా చేయవచ్చు. చంపేస్తే పైలోకాలకు వెళ్లి సృష్టికర్తను నిలదీయాలనుంది. ఈ నేలపై మూలవాసులకు జీవించే హక్కు లేదా అని అడగాలనివుంది.. సత్యం, అహింస మార్గంలో పయనించిన నేను సర్వం కోల్పోయాను. ఎల్లెడలా గాంధీ ఫొటోలు పెట్టుకుని పూజించే ప్రభుత్వాలు.. ఆయన మార్గాన్ని అనుసరించిన పాపానికి నన్ను జైల్లో పెట్టాయెందుకని..?"

మన దగ్గర సమాధానముందా..?

***(నమస్తే తెలంగాణ, 04-09-2012)***

# నాట్‌గ్రిడ్‌తో ప్రైవసీకి భంగం

రాష్ట్రపతి.. ప్రధానమంత్రి.. కేబినెట్ కార్యదర్శి.. గవర్నర్.. ముఖ్యమంత్రి.. చీఫ్ సెక్రెటరీ.. ఆ మాటకొస్తే దేశంలోనే అత్యధిక వేతనం పొందుతున్న ప్రభుత్వోద్యోగి ఎవరో కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి జితేంద్రసింగ్ గత బుధవారం లోక్‌సభలో వెల్లడించారు. ఆయన పేరు కెప్టెన్ రఘురామన్. నేషనల్ ఇంటెలిజెన్స్ గ్రిడ్ (నాట్‌గ్రిడ్)కు సీఈఓగా వ్యవహరిస్తున్నారు. నెలకు రూ. 10 లక్షల జీతం, సకల సౌకర్యాలు, ఇతర భత్యాలు తీసుకుంటున్నారు. ప్రైవేట్ కార్పొరేట్లకు సేవలందించి ప్రతిఫలం పొందే స్వేచ్ఛనూ ఆయనకు ప్రభుత్వం కల్పించింది. అయితే రామన్ జీతభత్యాల కంటే కూడా ఎక్కువ ఆసక్తిని కలిగించే విషయాలెన్నో ఆయన పనిచేసే నాట్‌గ్రిడ్‌లో ఉన్నాయి. 26/11 ముంబయి దాడుల నేపథ్యంలో ఉగ్రవాదుల ఆటకట్టించే లక్ష్యంతో ఏర్పాటుచేసిన ఈ సంస్థ దేశ పౌరులందరి వ్యక్తిగత వివరాలను, కదలికలను, కార్యకలాపాలను, లావాదేవీలను ఒక్కచోట చేరుస్తుంది. చిత్రగుప్తుని చిట్టా లాంటి సమాచార సముద్రాన్ని సృష్టిస్తుంది. ఏ రోజుకారోజు వివరాలను అప్‌డేట్ చేస్తూ ఇంటెలిజెన్స్ ఏజెన్సీలకు, ఉగ్రవాద వ్యతిరేక సంస్థలకు, పోలీసు, మిలిటరీ బలగాలకు, ఇతర ప్రభుత్వ విభాగాలకు అందుబాటులో ఉంచుతుంది. అంతర్జాతీయ అనుసంధానం పూర్తయిన తర్వాత అమెరికా, యూరోపు దేశాలు సైతం ఈ సమాచారాన్ని పొందే వీలుంటుంది.

హైదరాబాద్‌లోని బంజారాహిల్స్‌లో నివసించే ఓ వ్యక్తి కార్యకలాపాలను, కదలికలను అమెరికాలోని పెంటగాన్ హెడ్‌క్వార్టర్స్‌లో కూర్చున్న అధికారి పరిశీలించవచ్చు. పర్యవేక్షించవచ్చు. ఒక అంచనా ప్రకారం నాట్‌గ్రిడ్ పూర్తి స్థాయిలో పనిచేయడం ప్రారంభిస్తే అప్పుడు మనకంటూ ప్రైవసీ అనేది మిగిలుండదు. ఎవరికి కాల్ చేశాం.. ఏమేం మాట్లాడాం.. ఎలాంటి ఎస్సెమ్మెస్‌లు పంపించాం.. నెట్‌లో ఏ సైట్‌ను ఓపెన్ చేశాం.. ఎవరితో చాటింగ్ చేశాం.. ఆన్‌లైన్ లావాదేవీలేమిటి.. ఏ బ్యాంకులో ఎంత డబ్బుంది.. ఎప్పుడెప్పుడు ఏ ఏటీఎంలోంచి ఎంత డబ్బు తీశాం.. ఎక్కడెక్కడ తిరిగాం.. క్రెడిట్ కార్డుతో ఏం కొన్నాం.. మన ఆదాయమెంత.. అప్పులెంత..

ఐటీ రిటర్నుల్లో ఏ వివరాలిచ్చాం.. ఎక్కడ ఇల్లూజాగా కొన్నాం.. ఏ కంపెనీలో షేర్లు సంపాదించాం.. ఇలాంటి వివరాలన్నీ నాట్‌గ్రిడ్ వద్ద లభ్యమవుతాయి. అనగా మనకు మాత్రమే తెలుసనుకున్న రహస్యాలు ఇకముందు మనవి కాకుండా పోతాయి. పరులకు తెలుస్తాయి. గమనించాల్సిన విషయమేమిటంటే ఉగ్రవాదాన్ని సమర్థవంతంగా ఎదుర్కొనే పేరిట ప్రభుత్వం ఇదంతా చేస్తోంది. అయితే, తమ చేతుల్లో పడిన సమాచారాన్ని ఆయా ఏజెన్సీలు, సంస్థలు ఎంతమేరకు కాపాడతాయి? కింది స్థాయి సిబ్బంది దుర్వినియోగం చేయకుండా ప్రభుత్వం తీసుకుంటున్న జాగ్రత్తలేమిటి? వ్యక్తిగత రహస్యాలు అవాంఛనీయ శక్తుల చేతుల్లోకెళితే పౌరుల పరిస్థితేమిటన్నది ఇక్కడ ఆలోచించాల్సిన విషయం.

కేంద్ర ఆర్థిక మంత్రి చిదంబరం చొరవతో మూడేళ్ల కిందట నాట్‌గ్రిడ్ రూపుదిద్దుకుంది. 2008లో ముంబైపై ఉగ్రవాదులు భీకరదాడికి పూనుకున్న నేపథ్యంలో ఆయన అంతర్గత భద్రతపై అప్పట్లో ఓ సిద్ధాంత పత్రాన్ని సమర్పించారు. ఉగ్రవాద దాడులు జరిగినప్పుడు వాటిని ఎదుర్కోవడంలో, తిప్పికొట్టడంలో మనకున్న సమర్థత వాటిని ముందే పసిగట్టడంలో, దాడులను నివారించడంలో లేదని అందులో తేల్చిచెప్పారు. దేశపౌరులందరి సమగ్ర సమాచార సేకరణ యంత్రాంగంగా నాట్‌గ్రిడ్‌ను, ఉగ్రవాదులపై దాడులను కేంద్రస్థాయిలో సమన్వయించడానికి ఎన్‌సీటీసీ (జాతీయ ఉగ్రవాద వ్యతిరేక కేంద్రం)ని ప్రతిపాదించారు. నాట్‌గ్రిడ్ లాంటి నిర్మాణముంటే పాక్-అమెరికన్ జాతీయుడైన లష్కరె ఉగ్రవాది డేవిడ్ హెడ్లీ కదలికలను ముందే పసిగట్టేవాళ్లమని, ముంబై దాడులను నివారించగలిగేవాళ్లమని వాదించారు. ఆయన వాదనతో సర్కారు పెద్దలు ఏకీభవించారు. అలా 2009 డిసెంబర్ 1న నాట్‌గ్రిడ్ ఏర్పాటును భద్రతా వ్యవహారాల కేబినెట్ కమిటీ ప్రకటించింది. ఇందుకు రూ. 2800 కోట్లు ఖర్చవుతుందని, 300 మంది సిబ్బంది అవసరమవుతారని అంచనావేసింది. సైన్యం నుంచి రిటైరై మహీంద్రా స్పెషల్ సర్వీస్ గ్రూపులో సాఫ్ట్‌వేర్ నిపుణునిగా పనిచేస్తున్న రామన్‌ను సీఈఓగా నియమించింది. 2011 మార్చికల్లా దీనికి సంబంధించిన డీటేల్డ్ ప్రాజెక్టు రిపోర్టు తయారైంది. ప్రైవసీ ఉల్లంఘన విషయంలో కొన్ని శాఖల అభ్యంతరాల మూలంగా కాస్త జాప్యమైనా చివరకు జూన్‌లో కేంద్రం ఈ ప్రాజెక్టుకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఆయేటి బడ్జెట్‌లో రూ. 39.75 కోట్లు, 2012 జూన్ 14న మరో 1100 కోట్ల నిధులను కేంద్ర ప్రభుత్వం కేటాయించడంతో పనులు వేగం పుంజుకున్నాయి.

మొదటి రెండు దశల్లో అన్ని రకాల టెలికాం, ఇంటర్నెట్, బ్యాంకింగ్ సేవలను, బీమా, ఇంకమ్‌టాక్స్, స్టాక్‌మార్కెట్, విదేశీ కరెన్సీ, ఆర్‌టీఏ, రిజిస్ట్రేషన్, రైల్వే, విమానయాన, ట్రాన్స్‌పోర్ట్, పాస్‌పోర్ట్-వీసా, ఎన్నికల కమిషన్, ట్రాఫిక్, పోలీస్ తదితర

21 రంగాల సమాచారాన్ని అనుసంధానిస్తారు. తదుపరి ప్రైవేట్ కంపెనీల, సంస్థల సమాచారాన్ని జోడిస్తారు. దేశ పౌరులందరికీ ప్రత్యేక గుర్తింపు నెంబర్ ఇచ్చే లక్ష్యంతో కొనసాగుతున్న ఆధార్ ప్రాజెక్టు, 2011 జనాభా లెక్కల సేకరణలో భాగంగా రూపొందిస్తున్న నేషనల్ పాపులేషన్ రిజిస్టర్ నిజానికి నాట్‌గ్రిడ్‌కు వెన్నెముకగా పనిచేస్తాయి. ఫలితంగా ఒక వ్యక్తి గుర్తింపు నెంబర్‌ను ఫీడ్ చేయగానే ఆ వ్యక్తికి సంబంధించిన సమగ్ర సమాచారం కంప్యూటర్ స్క్రీన్‌పై ప్రత్యక్షమవుతుంది. అతడు నెట్‌లో ఏ సైట్ దర్శిస్తున్నాడు? ఫోన్లో ఎవరితో మాట్లాడుతున్నాడు? ఎక్కడికి ప్రయాణిస్తున్నాడు? ఎవరితో లావాదేవీలు నెరుపుతున్నాడు? భూములేమైనా కొంటున్నాడా? వంటి వివరాలన్నీ వెంటదివెంట లైవ్‌గా తెలుసుకోవచ్చు. ఆధార్ ప్రక్రియలో భాగంగా ప్రస్తుతం సేకరిస్తున్న పౌరుల ఫొటోలు, వేళ్ల ముద్రలు, ఐరిస్ స్కాన్‌లు నేరస్తులను ఇట్టే గుర్తించడానికి, హౌజ్‌హోల్డ్ సర్వేలో భాగంగా సేకరించిన ఆయా వ్యక్తుల ఇళ్ల జీపీఎస్ రికార్డులు వారిని వెంటనే పట్టేయడానికి ఉపకరిస్తాయి.

ఇదంతా చెప్పుకోవడానికి బాగానే ఉంది. హోంశాఖ అధికారులు చెబుతున్నట్లుగా ఉగ్రవాదుల ఆటకట్టించడానికీ పనికిరావచ్చు కూడా. అయితే, ప్రతి వ్యక్తి జీవితంలోనూ ఆటుపోట్లుంటాయి. తప్పొప్పులుంటాయి. తనకు మాత్రమే తెలిసిన, తెలువాల్సిన రహస్యాలనేకం ఉంటాయి. గత జీవితంలో ఒకరు జైలుకు పోవచ్చు. మరొకరు ప్రియురాలితో రొమాంటిక్ చాటింగ్ చేయవచ్చు. ఇంకొకరు నిషేధించిన సంస్థతో సంబంధాలు నెరపవచ్చు. ఇవన్నీ ప్రభుత్వ సంస్థలకు, పోలీసు–ఇంటెలిజెన్స్ ఏజెన్సీలకు తెలవాలని ఎవరూ కోరుకోరు. మన రాజ్యాంగం సైతం ఆర్టికల్ 21 రూపంలో పౌరులందరికీ జీవించే స్వేచ్ఛను, వ్యక్తిగత స్వాతంత్ర్యాన్ని కాపాడుకునే హక్కును ప్రసాదించింది. ఉన్నికృష్ణన్ వర్సెస్ స్టేట్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ కేసులో సుప్రీంకోర్టు సైతం ప్రైవసీ హక్కు జీవించే హక్కులో విడదీయరాని భాగమని నొక్కిచెప్పింది. మేనకాగాంధీ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా కేసులో మరో తీర్పును వెలువరిస్తూ ఈ హక్కుకు లోబడే ఆయా ప్రభుత్వాలు చట్టాలను, విధానాలను రూపొందించాలని సూచించింది. కనుక, నాట్‌గ్రిడ్ పేరుతో కేంద్రం తలపెట్టిన ప్రాజెక్టు భవిష్యత్తులో కచ్చితంగా పౌరుల ప్రైవసీ హక్కును హరిస్తుంది.

విచిత్రమేమిటంటే నాట్‌గ్రిడ్‌కు సంబంధించి ఇప్పటివరకూ సర్కారు ఎలాంటి చట్టమూ చేయలేదు. కేవలం కేబినెట్ నిర్ణయాలుగానే ఇదీ, ఆధార్ ప్రాజెక్టూ అమలవుతున్నాయి. ఈ ప్రాతిపదిక పైనే కొన్ని మంత్రిత్వ శాఖలు నాట్‌గ్రిడ్‌కు అభ్యంతరం చెప్పాయి. వారి అభ్యంతరంలో వాస్తవముంది. ఎందుకంటే మన దేశంలో ఇప్పటి వరకూ పౌరుల ప్రైవసీపై చర్చ జరగలేదు. అమెరికా తదితర పశ్చిమ దేశాల్లో ఈ

అంశంపై స్పష్టమైన చట్టాలున్నా మన పాలకులు పట్టించుకోలేదు. పైగా స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచీ వివిధరూపాల్లో పౌరుల జీవించే స్వేచ్ఛపై, భావప్రకటనా స్వేచ్ఛపై దాడిచేస్తూ వస్తున్నారు. అధికారపార్టీ పెద్దలు తమ శత్రువులనుకున్న వ్యక్తుల ఫోన్ల టాపింగ్ ఇలాంటిదే. పోలీసుల ద్వారా కాల్ రికార్డింగ్, బ్యాంకు లావాదేవీల వివరాలను సైతం రాబట్టుకుంటున్నారు. పలుమార్లు ఇది బహిర్గతమై దేశంలో దుమారాన్ని సృష్టించింది. పార్లమెంటు దద్దరిల్లింది. ఈ నేపథ్యంలో వచ్చిందే 2008-ఇన్ఫార్మేషన్ టెక్నాలజీ యాక్ట్. ఈ చట్టం ప్రకారం ఎలాంటి వారంటు, కోర్టు ఆదేశం లేకుండా కమ్యూనికేషన్ వ్యవస్థను ప్రభుత్వం నిర్దేశించిన అధికారులు ట్యాప్ చేయవచ్చు. రికార్డు చేయవచ్చు. ఆయా సంస్థల కంప్యూటర్ల నుంచి డాటాను పొందవచ్చు. ఒక సీఐ స్థాయి పోలీసు అధికారి తలుచుకుంటే ఏ ప్రముఖ వ్యక్తి కాల్స్‌నైనా ట్యాప్ చేసి ఎంతటి సంచలనాలకు కారణం కావచ్చునో సీబీఐ జేడీ లక్ష్మీనారాయణ ఉదంతం మనకు పరిచయం చేసింది కూడా. రేపు నాట్‌గ్రిడ్ పూర్తిస్థాయిలో పనిచేయడం ఆరంభిస్తే ఇంతకు మించిన సంచలనాలెన్నింటినో మనం చూడకతప్పదు. సంచలనాలే కాదు.. బ్లాక్‌మెయిళ్లూ, కిడ్నాపింగులూ, దోపిడీలూ, సెక్స్ స్కాంలూ, అవమానం భరించలేక ఆత్మహత్యలూ పెరగక తప్పదు.

ఇప్పటికైనా భారత ప్రభుత్వం మేల్కొనాలి. పౌరుల ప్రైవసీపై దాడి చేసే నాట్‌గ్రిడ్ ప్రాజెక్టును రద్దు చేయాలి. ఇప్పటికే ఉనికిలో ఉన్న రా, ఐబీ, జేఐసీ, ఎన్‌టీఆర్ఓ, ఈడీ, ఆర్ఐ తదితర ఇంటెలిజెన్స్ సంస్థలను సమర్థవంతంగా పనిచేయించాలి. ఈ సంస్థల మధ్య సమాచారం ఇచ్చిపుచ్చుకునే తత్వాన్ని పెంచాలి. విదేశీయుల రాకపోకల వివరాలను కలిగివుండే ఇమ్మిగ్రేషన్ బ్యూరో ఐబీ కంట్రోలులోనే ఉన్నప్పటికీ టెర్రరిస్టు హెడ్లీ కదలికలను ఆ సంస్థ పసిగట్టలేకపోయిందన్న అంశాన్ని గుర్తించాలి. వ్యవస్థల వైఫల్యాలను సరిదిద్దడం గాలికి వదిలేసి ఘటన జరిగినప్పుడల్లా ఒక కొత్త సంస్థను సృష్టించడం మానేయాలి. విలువైన ప్రజాధనాన్ని వృథా చేసే ఇలాంటి విధానాలకు పాలకులు ఇకనైనా స్వస్తి పలకాలని ప్రజలు, ప్రజాస్వామికవాదులు, మేధావులు డిమాండు చేయాలి. నిరసన తెలపాలి.

***(నమస్తే తెలంగాణ, 28-08-2012)***

# పౌరులపై నిఘా నేత్రం

పౌరుల ప్రైవసీపై కేంద్రం మరో అస్త్రం సంధించింది. టెర్రరిస్టు, విచ్ఛిన్నకర కార్యకలాపాలను అదుపు చేసే నెపంతో ఫోన్ కాల్స్, ఎస్సెమ్మెస్‌లు, ఈ–మెయిళ్లు, వెబ్ బ్రౌజింగ్‌లపై నిఘా పెట్టింది. ఇందుకోసం ఇండియన్ సెంట్రల్ మానిటరింగ్ సిస్టమ్ (భారత కేంద్ర పర్యవేక్షక వ్యవస్థ–ఐసీఎంఎస్)ను ఏర్పాటు చేస్తున్నది. గత సంవత్సరం డిసెంబర్‌లో ఐటీ మంత్రి మిలింద్ దేవ్‌రా ఐసీఎంఎస్ ఏర్పాటును పార్లమెంటులో ప్రకటించారు. అప్పటి నుంచి సాగుతున్న ప్రయత్నాలు మొన్నటి ఏప్రిల్‌లో ఒక కొలిక్కి వచ్చాయి. ప్రయోగాత్మకంగా ఫోన్లపై, వెబ్‌సైట్లపై పర్యవేక్షణ మొదలైంది. ఈ ఆగస్టు నుంచి ఐసీఎంఎస్‌ను పూర్తి స్థాయిలో పనిచేయిస్తామని, త్వరలోనే ఐటీ, టెలికాం శాఖల అధికారులతో సమీక్ష సమావేశాన్ని ఏర్పాటుచేయనున్నట్లు కేంద్ర హోం శాఖ కార్యదర్శి ఆర్ కే సింగ్ తెలిపారు. ఈ ఏర్పాటుతో ఇకముందు నిఘా సంస్థలు ఫోన్ ట్యాపింగ్ కోసం ప్రైవేటు ఆపరేటర్లను సంప్రదించాల్సిన అవసరముండదని, కావాల్సిన సమాచారాన్ని నేరుగా ఒక్క బటన్ నొక్కి పొందవచ్చునని వివరించారు. ఈ విషయంలో ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, అమలులో ఉన్న చట్టాల ప్రకారమే ఐసీఎంఎస్ పని చేస్తుందని హామీ ఇచ్చారు. అయితే, మానవహక్కుల సంఘాలు ఆయన హామీతో సంతృప్తి చెందడంలేదు. ఐసీఎంఎస్ ఏర్పాటు పౌరుల హక్కులకు భంగకరమని, ఎలాంటి ప్రైవసీ చట్టాలు లేని భారత్‌లో ఈ వ్యవస్థ దుర్వినియోగం కావడం ఖాయమని వాదిస్తున్నాయి.

ఐసీఎంఎస్ ఏర్పాటుకు నేపథ్యం 26/11 ముంబై దాడులు. మొబైల్ ఫోన్లను, ఇంటర్‌నెట్‌ను విస్తృతంగా వినియోగించి ఉగ్రవాదులు ఆ దాడులకు ప్లాన్ చేయడం అప్పట్లో కేంద్ర నిఘా వర్గాలను అబ్బురపరిచింది. అనుమానిత వ్యక్తుల కాల్స్‌ను, మెయిళ్లను చెక్ చేసే వ్యవస్థ కనుక ఉంటే ఇలాంటి దాడులను నిరోధించవచ్చునని పలువురు సైనిక నిపుణులు అభిప్రాయపడ్డారు. అప్పటి హోం మంత్రి చిదంబరం సైతం ఈ విషయంపై అధ్యయనం జరిపి అంతర్గత భద్రతపై ఒక సిద్ధాంతపత్రాన్ని

సమర్పించారు. ఉగ్రవాదుల దాడులను ఎదుర్కోవడంలో మనకున్న సమర్థత, అలాంటి దాడులను ముందే పసిగట్టడంలో లేదని ఆయన అందులో పేర్కొన్నారు. దేశపౌరులందరి సమగ్ర సమాచార సేకరణ యంత్రాంగంగా నాట్‌గ్రిడ్ (నేషనల్ ఇంటెలిజెన్స్ గ్రిడ్)ను, ఉగ్రవాదులపై అణచివేత చర్యలను కేంద్రస్థాయిలో సమన్వయించడానికి ఎన్‌సీటీసీ (జాతీయ ఉగ్రవాద వ్యతిరేక కేంద్రం)ని ప్రతిపాదించారు. ఆ సమయంలోనే రూపుదిద్దుకున్న మరో ఆలోచన పౌరుల ఫోన్ కాల్స్‌ను, ఎస్సెమ్మెస్‌లను, వెబ్ కార్యకలాపాలను పర్యవేక్షించే ఒక వ్యవస్థ ఏర్పాటు. ఈ దిశలోనే ఐటీ యాక్ట్-2000కు 2008లో ఒకసారి, 2011లో మరోసారి సవరణలు చేశారు. ఈ సవరణల ప్రకారం దర్యాప్తు అధికారులు తగిన కారణాలు చూపించి పౌరులెవరి ఫోన్‌కాల్ రికార్డులు, మెసేజ్‌లనయినా ఆయా టెలికామ్ సంస్థల నుంచి పొందవచ్చు. ఇందుకోసం డీఎస్పీ స్థాయి పోలీసు అధికారి అనుమతి తీసుకోవాల్సివుంటుంది. అయితే, ఈ పద్ధతిలో పొందే సమాచారానికి కొన్ని పరిమితులుండడంతో 2011లో ఈ ఐసీఎంఎస్‌కు రూపకల్పన జరిగింది.

ఐసీఎంఎస్ ప్రత్యేకత ఏమిటంటే కావాల్సిన సమాచారాన్ని రియల్ టైం(ఎప్పటికప్పుడు)లో అందించగలగడం. అనగా మనం మాట్లాడుతున్న ఒక కాల్‌ను అదే సమయంలో నిఘా అధికారులు వినవచ్చు. వెబ్‌లో బ్రౌజ్ చేస్తున్న సైట్‌ను వెంటనే పసిగట్టవచ్చు. పంపిన మెయిల్‌ను ఉన్నపళంగా చదివేయవచ్చు. మన లాగిన్ వివరాలు, ఐపీ అడ్రస్‌ను కనిపెట్టవచ్చు. రూ. 400 కోట్లకు పైగా ఖర్చయ్యే ఈ ప్రాజెక్టులో భాగంగా టెలిఫోన్ కాల్ ఇంటర్సెప్షన్ సిస్టమ్ (టీసీఐఎస్)ను, ఆకాశంలో ఇంటర్సెప్టార్లను ఏర్పాటు చేస్తారు. ఇది వాయిస్ కాల్స్, విడియోకాల్స్, ఎస్సెమ్మెస్, ఎమ్మెమ్మెస్, జీపీఆర్ఎస్, ఫ్యాక్స్ సందేశాలను, 2జీ, 3జీ, జీఎస్ఎం, సీడీఎంఏ సిగ్నళ్లను ట్యాప్ చేస్తుంది. ఇక గూగుల్, మైక్రోసాఫ్ట్, యాహూ, ఆపిల్, ఫేస్‌బుక్, ట్విట్టర్, స్కైప్ వంటి అమెరికన్ సర్వీస్ ప్రొవైడర్ల ద్వారా నడిచే సోషల్ నెట్‌వర్క్‌లను ఛేదించడంలో మరో సంస్థ ఎన్‌టీఆర్ఓ (నేషనల్ టెక్నికల్ రీసెర్చ్ ఆర్గనైజేషన్) నిమగ్నమైవుంది. ఇప్పటికే రెడిఫ్‌మెయిల్, సిఫీ వంటి దేశీయ నెట్‌వర్క్‌ల్లోకి ఈ సంస్థ చొరబడగలిగింది. ఈ అన్ని మార్గాల్లో ట్యాప్ చేసిన సమాచారాన్ని సమన్వయించడానికి న్యూఢిల్లీలోని మెహ్రౌలి-గుర్గాం రోడ్డులో ప్రధాన కార్యాలయాన్ని, దేశం నలుమూలలా నాలుగు చోట్ల రీజనల్ హబ్‌లను ఏర్పాటుచేస్తున్నారు. రా (రీసెర్చ్ అండ్ ఎనాలిసిస్ వింగ్), సీబీఐ(సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్), ఎన్‌ఐఏ (నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ, ఐబీ (ఇంటెలిజెన్స్ బ్యూరో, సీబీడీటీ (సెంట్రల్ బోర్డ్ ఆఫ్ డైరెక్ట్ టాక్సెస్), ఎన్‌సీబీ (నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో), ఈడీ (ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్), ఆదాయపు పన్నుశాఖ, డిఫెన్స్ ఇంటెలిజెన్స్ ఏజెన్సీ తదితర

తొమ్మిది సంస్థలు ఐసీఎంఎస్ ద్వారా సమాచారాన్ని పొందవచ్చు. సెబి(సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజెస్ బోర్డ్ ఆఫ్ ఇండియా)ని సైతం ఇందుకు అనుమతించాలని ఆలోచిస్తున్నారు.

ఇక అసలు విషయానికి వద్దాం. ఐసీఎంఎస్ మూలంగా ఇప్పటి వరకూ మనకు మాత్రమే తెలుస్తాయనుకున్న విషయాలు ఇక మీదట ప్రభుత్వాలకు, నిఘా సంస్థలకు చేరతాయన్నది ఇక్కడ గమనించాల్సిన అంశం. మనం ఫేస్‌బుక్‌లో చాటింగ్ చేస్తాం.. ట్విట్టర్‌లో కామెంట్లు రాస్తాం.. గూగుల్‌లో మెయిళ్లు పంపుతాం.. ఫోన్‌లో మిత్రులతో మాట్లాడతాం.. మెస్సేజ్‌లు పంపుతాం.. విచ్చలవిడిగా కామెంట్లు చేస్తాం.. వ్యక్తులను నిందిస్తాం.. నేతలను తిడతాం.. ప్రభుత్వాల విధానాలను దుయ్యబడతాం.. ఓ గర్ల్ ఫ్రెండ్‌తో అనురాగాలు పంచుకుంటాం,, మరో పార్టీతో సంబంధాలు పెంచుకుంటాం.. ఇంకో ఉద్యమసంస్థతో అభిప్రాయాలు కలబోసుకుంటాం.. ఇవన్నీ ఇకముందు మనకూ అవతలి వారికే కాకుండా బయటివాళ్లకూ తెలుస్తాయి. అలాగైతే కొంపలు మునుగుతాయి కదా! అంటారా.. ఆ విషయాన్నే మానవ హక్కుల సంఘాలు ఎత్తిచూపుతున్నాయి. ఒక వ్యక్తి స్వేచ్ఛను హరించే అధికారం ప్రభుత్వానికి సైతం లేదని, రాజ్యాంగం భారత పౌరులందరికీ భావప్రకటనా హక్కును ప్రసాదించిందని మొత్తుకుంటున్నాయి. ఇప్పటికే హ్యూమన్ రైట్స్ వాచ్ సంస్థ ఐసీఎంఎస్ ప్రాజెక్టును వ్యతిరేకించింది. ఈ ప్రతిపాదనను విరమించుకోవాలని పలువురు మేధావులు కేంద్రప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. నెటిజన్లు సైతం స్టాప్ ఐసీఎంఎస్ పేరిట బ్లాగును నిర్వహిస్తూ ఐసీఎంఎస్‌కు వ్యతిరేకంగా ప్రజాభిప్రాయాన్ని కూడగడుతున్నారు.

ఉగ్రవాదాన్ని ఎదుర్కొనే పేరుతో ముందుకుతెస్తున్న ఈ ప్రాజెక్టుపై ప్రజల్లో కాని, పార్లమెంటులో కాని ఎలాంటి చర్చ పెట్టకుండా భారత ప్రభుత్వం అమలుచేయజూస్తున్నది. ఇప్పటికే వందలాది కోట్ల రూపాయలు వెచ్చించి పౌరుల చిట్టాను భద్రపరిచే ఆధార్ ప్రాజెక్టును, ఆ వివరాలను నిఘా సంస్థలకు లింకు చేసే నాట్‌గ్రిడ్‌ను యూపీఏ ప్రభుత్వం దొడ్డిదారిన ప్రవేశపెట్టింది. ఇప్పుడీ ఐసీఎంఎస్ రూపంలో పౌరుల ప్రైవసీపై దాడి చేయజూస్తున్నది. అమలులో ఉన్న చట్టాల ప్రకారమే ఈ సంస్థ పనిచేస్తుందని చెబుతున్నా ఇటీవల కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవహరిస్తున్న తీరు, పౌరహక్కుల నేతలను, ఉద్యమ కార్యకర్తలను జైలుపాలు చేస్తున్న వైనం పలు అనుమానాలకు తావిస్తున్నది. ప్రభుత్వానికి వ్యతిరేకంగా వ్యాఖ్యలు, రచనలు, కామెంట్లు చేస్తున్నారని పలువురిపై రాజద్రోహం కేసును (సెక్షన్ 124ఏ), చట్టవ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టం(యూఏపీఏ )ను మోపుతున్నారు. పౌరహక్కుల నేత బినాయక్‌సేన్, ప్రముఖ రచయిత్రి అరుంధతీరాయ్, కార్టూనిస్టు అసీమ్ త్రివేది, జర్నలిస్టులు సీమా ఆజాద్, ఆమె భర్త విశ్వవిజయ్, నిరంజన్

మహాపాత్ర, కమలేశ్ పైంక్రా, లక్ష్మణ్‌చౌదరి, సైంటిస్టు గోపాల్, ప్రొఫెసర్లు నిషా బిస్వాస్, కనిష్క చౌదరి, విద్యార్థిని దేబాలినా చక్రవర్తి వంటి వారెందరినో కేవలం వారి రాజకీయాభిప్రాయాల ప్రాతిపదికన వేధింపులకు గురిచేశారు. కేసులు పెట్టి జైలుకు పంపారు. రేపు ఐసీఎంఎస్ అమలులోకి వస్తే తమ విధానాలను వ్యతిరేకించే ఏ వ్యక్తినైనా జైలుకు పంపగలిగే అద్భుతమైన ఆయుధం పాలకుల చేతికి వస్తుంది. బాల్‌థాకరేపై ఫేస్‌బుక్‌లో కామెంట్లు పెట్టినందుకు ఇద్దరు ముంబై యువతులను పోలీసులు అరెస్టు చేయడం గురించి మనం ఇటీవల పేపర్లలో చదివివున్నాం. ఇలాంటి అరెస్టులు భవిష్యత్తులో బాగా పెరిగే అవకాశముంది. ప్రత్యేకించి వివిధ ఉద్యమాల్లో పనిచేస్తున్న కార్యకర్తలను, నేతలను వారి ఫోన్ సంభాషణలు, కామెంట్లు, మెయిళ్ల ఆధారంగా చీటికి మాటికి కేసుల్లో ఇరికించి వేధింపులకు గురిచేసే ప్రమాదముంది.

పౌరుల ప్రైవసీ రక్షణకై తగిన చట్టాలు లేని పరిస్థితుల్లో కేవలం ప్రభుత్వాజ్ఞల మేరకు ఏర్పాటు చేసిన ఐసీఎంఎస్‌ను దేశప్రజలందరూ వ్యతిరేకించాలి. తమ ఫోన్లపై, మెయిళ్లపై, బ్రౌజింగ్‌పై ప్రభుత్వవర్గాలు నిఘా పెట్టడాన్ని, వ్యక్తిగత విషయాలు తెలుసుకోవడాన్ని తీవ్రంగా పరిగణించాలి. భావప్రకటనా స్వేచ్ఛ పరిరక్షణ కోసం ఉద్యమించాలి. పాలకులు తమ రాజకీయ ప్రత్యర్థులను దెబ్బతీయడానికి ట్యాపింగ్‌ను అస్త్రంగా చేసుకునే అవకాశం ఉంది కనుక అన్ని పార్టీలు సైతం ఈ అంశంపై పార్లమెంటులో సమగ్రంగా చర్చించాలని డిమాండ్ చేయాలి. ఉగ్రవాదం అణచివేత పేరుతో ఇలా రోజుకో సంస్థను, వ్యవస్థను ఏర్పాటుచేయడానికి బదులు ఇప్పటికే అపరిమిత అధికారాలున్న రా, ఐబీ, సీబీఐ తదితర ఇంటెలిజెన్స్ సంస్థలను సమర్థవంతంగా పనిచేయించడంపై, వివిధ విభాగాల మధ్య సమన్వయాన్ని పెంపొందించడంపై కేంద్రీకరించాలని సూచించాలి.

***(నమస్తే తెలంగాణ, 09-07-2013)***

# ఈశాన్యంలో మావోయిస్టులు

జాతుల తిరుగుబాట్లకు ప్రసిద్ధిగాంచిన ఈశాన్య రాష్ట్రాలు తాజాగా మావోయిస్టుల రంగప్రవేశంతో మరోసారి వేడెక్కాయి. దశాబ్దాలుగా సాయుధ ఉద్యమాలు నడిపిన అనేక సంస్థలు ఇటీవలికాలంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో శాంతి ఒప్పందాలు కుదుర్చుకుని పోరాటాలను విరమించాయి. ఈ నేపథ్యంలో మావోయిస్టు పార్టీ ఈ రాష్ట్రాల్లో ప్రవేశించడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఘనమైన పోరాట చరిత్ర కలిగిన ఈశాన్య ప్రాంత ఆదివాసుల్లో ఏర్పడిన ఖాళీని భర్తీ చేసి వారిని విప్లవ పోరాటాల వైపు మళ్లించడమే లక్ష్యంగా ఈ రాష్ట్రాల్లో భారత కమ్యూనిస్టు పార్టీ(మావోయిస్టు) తన కార్యకలాపాలను ఉధృతం చేసిందని పరిశీలకులు భావిస్తున్నారు. ఆయా రాష్ట్రాల్లో జాతుల స్వయం నిర్ణయాధికారం కోరుతూ ఉద్యమాలు నిర్వహిస్తున్న సంస్థలతో ఒకవైపు సన్నిహిత సంబంధాలు నెరుపుతూనే, కొన్ని ప్రాంతాల్లో స్వయంగా ఉద్యమాలు నిర్వహించడానికి ఆ పార్టీ సమాయత్తమవుతోంది. ఈస్టర్న్ రీజనల్ బ్యూరో సారథ్యంలో అప్పర్ అస్సాం లీడింగ్ కమిటీ(యూఏఎల్‌సీ) ఈ కార్యకలాపాలకు నేతృత్వం వహిస్తోంది. అభివృద్ధి ప్రాజెక్టుల పేరుతో స్థానిక ఆదివాసులకు నిలువ నీడ లేకుండా చేస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలు, అనుసరిస్తున్న దమననీతికి వ్యతిరేకంగా పోరాటాలు నిర్మించడానికి మావోయిస్టులు ప్రయత్నిస్తున్నారు.

అస్సాంలో బృహత్ నదీబాంధ్ ప్రతిరోధ్ మంచ్(భారీతరహా డ్యాంల ప్రతిఘటన వేదిక)ను స్థాపించి పలు జిల్లాల్లో విప్లవ పోరాటాలకు బాటలు వేశారు. తేయాకు తోటల్లో పనిచేసే కార్మికుల్లోకి వెళ్లడమే కాకుండా విద్యార్థి యువకులను, గిరిజనులను ఆకర్షించడం కోసం ఈ రాష్ట్రంలో పలు ప్రజాసంఘాలను సైతం స్థాపించారని సమాచారం. తన నియోజకవర్గంలో మావోయిస్టుల కదలికలు పెరుగుతున్న దృష్ట్యా కల్లోలిత ప్రాంతంగా ప్రకటించాలని లోహిట్ జిల్లాకు చెందిన ఓ ఎమ్మెల్యే రాష్ట్ర శాసనసభలో డిమాండ్ చేశారు. అరుణాచల్‌ప్రదేశ్‌లోని దిబాంగ్ లోయలో నెలకొల్పుతున్న 3000 మెగావాట్ల దిగువ సుబన్సిరి జల విద్యుత్ ప్రాజెక్టుకు వ్యతిరేకంగా మావోయిస్టులు

స్థానికులను సమీకరించి క్రిషక్ ముక్తి సంగ్రామ్ సమితి(కేఎంఎస్ఎస్)ని ఏర్పాటుచేశారు. సాయుధ తిరుగుబాట్లకు నెలవైన మణిపూర్, నాగాలాండ్ రాష్ట్రాల్లో సైతం పలు సాయుధ పోరాట గ్రూపులతో మావోయిస్టులు కలిసి పని చేస్తూనే.. స్వతంత్ర అస్తిత్వం కోసం సర్వశక్తులు ఒడ్డుతున్నారు. ఇక వివిధ సంస్థలతో ద్వైపాక్షిక, త్రైపాక్షిక సమావేశాలకు మిజోరం షెల్టర్ జోన్‌గా ఉపయోగపడుతోంది. ఈ పరిణామాలన్నింటిని జాగ్రత్తగా గమనిస్తోన్న కేంద్ర హోంశాఖ అప్రమత్తంగా ఉండాల్సిందిగా ఇటీవల ఈశాన్య రాష్ట్రాల పోలీసు, పారామిలిటరీ బలగాలను హెచ్చరించింది. గత డిసెంబర్‌లో మేఘాలయ రాజధాని షిల్లాంగ్‌లో వివిధ రాష్ట్రాల పోలీసు ఉన్నతాధికారుల సమావేశాన్ని నిర్వహించిన ఇంటెలిజెన్స్ బ్యూరో (ఐబీ) మావోయిస్టుల కట్టడికి అనుసరించాల్సిన వ్యూహాల రచనకు కసరత్తు చేసింది. నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ(ఎన్ఐఏ) మావోయిస్టుల కార్యకలాపాలపై దృష్టిని కేంద్రీకరించింది. ఈశాన్య రాష్ట్రాల్లో మావోయిస్టుల ఉనికి నిజమేనని కేంద్ర రక్షణ శాఖ సహాయ మంత్రి పల్లంరాజు సైతం ఒప్పుకున్నారు.

మావోయిస్టుల ఈశాన్య ప్రవేశానికి సుదీర్ఘ చరిత్ర ఉంది. పీపుల్స్‌వార్ సంస్థాపకుడు, నక్సలైట్ అగ్రనేత కొండపల్లి సీతారామయ్య 1980లో రూపొందించిన గెరిల్లా జోన్ డాక్యుమెంటులోనే ఈ ప్రస్తావన ఉంది. ఉత్తర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటాలను రక్షించుకోవడానికి ఉద్యమం దండకారణ్యానికి విస్తరించాలని చెబుతూ.. భారత విప్లవానికి ఆదిలాబాద్ నుంచి ఈశాన్య భారతం దాకా విస్తరించిన దట్టమైన అడవులే కీలకమని ఆయన అందులో ప్రస్తావించారు. ఆ తర్వాత నక్సలైట్ ఉద్యమ విస్తరణ అంతా కొండపల్లి చూపిన బాటలోనే నడిచిందని చెప్పవచ్చు. బస్తర్, గడిచిరోలి జిల్లాలగుండా గోందియా, రాజనంద్‌గావ్, దుర్గ్, బాలాఘాట్ జిల్లాలకు పీపుల్స్‌వార్ దళాల కార్యకలాపాలు వేగంగా విస్తరించాయి.

1998లో సీపీఐ(ఎంఎల్) పార్టీ యూనిటీతో, 2004లో మావోయిస్టు కమ్యూనిస్టు సెంటర్(ఎంసీసీ)తో విలీనం జరిగి మావోయిస్టుపార్టీగా అవతరించిన తర్వాత, దండకారణ్యానికి ఒరిస్సా, జార్ఖండ్, బీహార్, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాలతో లింకు ఏర్పడింది. దండకారణ్యం (ఆంధ్రప్రదేశ్–మహారాష్ట్ర–ఛత్తీస్‌గఢ్), ఏఓబీ (ఆంధ్ర–ఒరిస్సా), జంగల్‌మహల్(జార్ఖండ్–ఒరిస్సా–బెంగాల్), బీజే (బీహార్–జార్ఖండ్) సరిహద్దులు గెరిల్లా విప్లవ కేంద్రాలుగా మారాయి. దీంతో తెలంగాణ నుంచి బెంగాల్ అడవుల దాకా దళాలు సాయుధ ఫార్మేషన్లుగా చేరుకునే సౌలభ్యం ఏర్పడింది. ఇక మిగిలింది ఈశాన్యమే. అక్కడికి కూడా విస్తరించి ఎందరెందరో విప్లవకారులు కన్న కలలను సాకారం చేయడానికి, విశాలమైన ఎర్ర కారిడార్‌ను నిర్మించి భారత నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని విజయవంతం చేసే దిశలో ముందుకు సాగడానికి మావోయిస్టు పార్టీ పక్కా వ్యూహాన్ని

రచించింది. ఆ దిశలో అడుగులు వేస్తోంది.

ఏడుగురు అక్కాచెల్లెళ్లుగా కూడా పిలిచే ఈశాన్య రాష్ట్రాల్లోకి మావోయిస్టుల విస్తరణ ఇటీవల కేంద్ర బలగాల చేతిలో అసువులు బాసిన పొలిట్‌బ్యూరో సభ్యుడు మల్లోజుల కోటేశ్వర్‌రావు అలియాస్ కిషన్‌జీ ఆధ్వర్యంలోనే జరిగింది. కేంద్ర కమిటీకి చెందిన ఈస్టర్న్ రీజనల్ బ్యూరో చీఫ్‌గా ఉంటూ ఆయన అస్సాం, అరుణాచల్‌ప్రదేశ్, మణిపూర్ తదితర రాష్ట్రాల్లో విస్తృతంగా పర్యటించారు. ఉల్ఫా మొదలుకొని ఎన్ఎస్‌సీఎన్ (ఐఎం) వరకు వివిధ పోరాట సంస్థలకు చెందిన కీలక నేతలను కలిశారు. పలు సంస్థలతో స్నేహపూర్వక ఒప్పందాలను కుదుర్చుకున్నారు. భారత ప్రభుత్వంపై ఉమ్మడి పోరాటానికి కార్యాచరణ ప్రణాళికలను రూపొందించారు. ఈ క్రమంలోనే మార్క్సిజం లెనినిజం మావోయిజం సిద్ధాంతానికి కట్టుబడివున్న శక్తులను కూడగట్టారు. మావోయిస్టు అప్పర్ అస్సాం లీడింగ్ కమిటీని ఏర్పరచారు.

ఇంటెలిజెన్స్ వర్గాల సమాచారం ప్రకారం అస్సాంలో పరేశ్ బారువా నేతృత్వంలో పని చేస్తున్న ఉల్ఫా చర్చల వ్యతిరేక వర్గంతో, ఆదివాసీ పీపుల్స్ ఆర్మీ (ఏపీఏ)తో, నేషనల్ డెమోక్రటిక్ ఫ్రంట్ ఆఫ్ బోడోల్యాండ్ (ఎన్‌డీఎఫ్‌బీ)లోని ఒక వర్గంతో మావోయిస్టులు సత్సంబంధాలు నెలకొల్పుకున్నారు. ఈ సంస్థల నుంచి ఆయుధాలు, సైనిక శిక్షణ తదితర విషయాల్లో సహకారం తీసుకుంటూ వారికి బెంగాల్, జార్ఖండ్‌లోని అడవుల్లో ఆశ్రయం కల్పిస్తున్నారని పోలీసులు చెబుతున్నారు. టిన్సూకియా, శివసాగర్, గోల్‌పారా, కోక్రఝార్, ధూబ్రి, కామ్‌రూప్, సోనిత్‌పూర్, దర్రాంగ్ జిల్లాల్లో యూఏఎల్‌సీ నాయకత్వంలో స్వయంగా కార్యకలాపాలు ప్రారంభించారు. అస్సాం స్టూడెంట్స్ యూత్ ఆర్గనైజేషన్, అస్సాం చాయ్ జనజాతి సురక్ష సమితి, ఆల్ ఆదివాసీ నేషనల్ లిబరేషన్ ఆర్మీ వంటి సంస్థలు వాస్తవానికి మావోయిస్టులకు కవర్ సంఘాలుగా పని చేస్తున్నాయని రాష్ట్ర ముఖ్యమంత్రి తరుణ్ గొగోయ్ ఆరోపిస్తున్నారు. భారత ప్రభుత్వ బలగాల దాడులను సంయుక్తంగా తిప్పికొట్టే లక్ష్యంతో మణిపూర్‌లోని పీపుల్స్ లిబరేషన్ ఆర్మీ (పీఎల్ఏ), పీపుల్స్ రెవల్యూషనరీ పార్టీ ఆఫ్ కాంగ్లీపాక్ (ప్రిపాక్), యునైటెడ్ నేషనల్ లిబరేషన్ ఫ్రంట్ (యూఎన్ఎల్ఎఫ్)లతో, నాగాల పోరాట సంస్థ ఎన్ఎస్‌సీఎన్ (ఐఎం)తో మావోయిస్టులు ఒప్పందాలు కుదుర్చుకున్నారు.

ఈశాన్యంలో మావోయిస్టులు నిలదొక్కుకోవడానికి కారణాలు చాలా ఉన్నాయి. జాతుల స్వయంనిర్ణయాధికారం కోసం దశాబ్దాలుగా పోరాడిన పలు సంస్థలు భారత ప్రభుత్వంతో ఒప్పందాలు కుదుర్చుకుని చేతులెత్తేయడంతో ఆదివాసీలు దిక్కుతోచని స్థితిలో పడ్డారు. మౌలిక సమస్యలు పరిష్కారం కాకుండానే పోరాట విరమణ చేయడాన్ని వ్యతిరేకించి మావోయిస్టుల వైపు ఆకర్షితులవుతున్నారు. పైగా ప్రతి సంస్థలోనూ శాంతి

చర్చలను వ్యతిరేకించే వర్గమొకటి పుట్టుకొచ్చి పోరాట కొనసాగింపులో మావోయిస్టుల సాయాన్ని అర్థిస్తున్నది. అస్సాం, అరుణాచల్‌ప్రదేశ్ రాష్ట్రాల్లో చిన్నవి, పెద్దవి కలిసి వంద వరకు డ్యాంలు నిర్మిస్తున్నారు. ఈ డ్యాంల కారణంగా నిర్వాసితులైన ప్రజల పక్షాన పోరాడే నాథుడు కరువయ్యాడు. ఈ పరిస్థితులన్నీ మావోయిస్టులకు అనుకూలంగా మారాయి. మరోవైపు, ఇటీవల ఛత్తీస్‌గఢ్, ఒరిస్సా, జార్ఖండ్, బెంగాల్‌లో పోలీసు, పారా మిలిటరీ బలగాలపై చేసిన భారీ దాడులతో మావోయిస్టుల ప్రతిష్ఠ జాతీయంగా, అంతర్జాతీయంగా పెరిగింది. ఫలితంగా రాజ్యంతో పోరాటానికి సిద్ధమైన ప్రతి ఒక్కరూ మావోయిస్టుల వైపు చూసే స్థితి ప్రస్తుతం దేశంలో నెలకొన్నది.

జాతుల ఆకాంక్షను, అస్తిత్వాన్ని, ప్రజల మౌలిక సమస్యలను పట్టించుకోకుండా పాలకులు కుంభకోణాల్లో నిండా మునిగినంతకాలం మావోయిస్టు ఉద్యమం కొనసాగుతూనే వుంటుంది. ఒకచోట అణచివేయబడినా మరోచోట మొదలవుతుంది. ఆంధ్రప్రదేశ్‌లో పూర్తిగా బలహీనపడిన కాలంలోనే.. ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్, ఒరిస్సాలలో విప్లవోద్యమం మరింత బలపడడానికి, బెంగాల్, ఈశాన్యాలకు విస్తరించడానికి కారణమిదేనని గుర్తించాలి. భారీ ఎన్‌కౌంటర్లు, పోలీసు బలగాలపై దాడులు జరిగినప్పుడల్లా చర్చల మంత్రం వల్లించడం, యథాప్రకారం సైనిక పద్ధతుల్లో ఉద్యమ నిర్మూలనకు ప్రయత్నించడం ప్రభుత్వాలు ఇకనైనా ఆపేయాలి. కిషన్‌జీ మరణించిన వారానికి మావోయిస్టులను మరోసారి చర్చలకు ఆహ్వానించిన హోం మంత్రి చిదంబరం మొదట మధ్య భారతంలో కొనసాగుతున్న గ్రీన్‌హంట్‌ను నిలిపివేయాలి. మధ్యవర్తులుగా వ్యవహరిస్తున్న స్వామి అగ్నివేశ్ లాంటి సామాజిక కార్యకర్తలు, మేధావుల సహకారంతో దేశంలో ఏకైక అతిపెద్ద పోరాట సంస్థగా నిలిచిన సీపీఐ(మావోయిస్టు) పార్టీతో చిత్తశుద్ధితో శాంతి చర్చలకు చొరవ చూపాలి.

***(నమస్తే తెలంగాణ, 07-02-2012)***

# బూర్జువా సైన్యంలో మావోయిస్టులు

ప్రపంచంలో ఇదివరకు ఎక్కడా జరగని అద్భుతం ఇప్పుడు నేపాల్‌లో ఆవిష్కృతమవుతోంది. దశాబ్దం పాటు ఒకరినొకరు చంపుకునే పనిలో నిమగ్నమై కనీసం 13వేల ప్రాణాలు బలికావడానికి కారణమైన వైరి పక్షాలు త్వరలో ఒకే సంస్థలో కదం కదం కలిపి దేశరక్షణ విధులను నిర్వర్తించబోతున్నాయి. యునిఫైడ్ కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ నేపాల్(మావోయిస్టు) నేతృత్వంలోని పీపుల్స్ లిబరేషన్ ఆర్మీ (పీఎల్ఏ)కి చెందిన తొమ్మిది వేల మందికి పైగా గెరిల్లా సైనికులు ప్రభుత్వ సైన్యంలో భాగమయ్యే ప్రక్రియ ఇటీవల అక్కడ మొదలైంది. ఇందుకోసం ఏర్పరచిన ఆర్మీ ఇంటిగ్రేషన్ స్పెషల్ కమిటీ మావోయిస్టు గెరిల్లాలకు మూడు ఆప్షన్లనిచ్చింది. ప్రభుత్వ సైన్యంలో చేరడం, స్వచ్ఛందంగా పదవీ విరమణ చేయడం, పునరావాస ప్యాకేజీ పొందడం.. మొత్తం 16వేల 982 మంది గెరిల్లాల్లో 9వేల 690 మంది సైన్యంలో చేరడానికి నిశ్చయించుకోగా, ఏడువేల 286 మంది పదవీ విరమణకు ఇష్టపడ్డారు. ఆరుగురు మాత్రం పునరావాస ప్యాకేజీ వైపు మొగ్గుచూపారు. పదవీ విరమణను ఎంచుకున్న వారికి చెక్కుల పంపిణీ కార్యక్రమం గత నెల 11న ముగియగా పునరావాస ప్యాకేజీని ఎంచుకున్న ఆరుగురికి కూడా జీవనోపాధి కల్పించారు. ప్రభుత్వ బలగాల్లో చేరడానికి నిర్ణయించుకున్న గెరిల్లాలకు పోస్టింగ్ ఇచ్చే క్రమం ప్రస్తుతం కొనసాగుతోంది.

మావోయిస్టులకు అఖిల పక్షాలకు మధ్య కుదిరిన ఒప్పందం ప్రకారం ఈ గెరిల్లాల కోసం నేపాల్ సైన్యంలో ఒక ప్రత్యేక డైరెక్టరేట్‌ను ఏర్పరుస్తారు. పీఎల్ఏకు చెందిన వ్యక్తికి బ్రిగేడియర్ లేదా కల్నల్ హోదా కల్పించి ఈ డైరెక్టరేట్‌కు అధిపతిని చేస్తారు. వివిధ స్థాయిల్లో ఉన్న ఇతర కమాండర్లకు కూడా తగిన ర్యాంకులు కల్పిస్తారు. ప్రస్తుతానికి వీరిని అభివృద్ధి ప్రాజెక్టుల పర్యవేక్షణకు, పరిశ్రమల భద్రతకు, అడవుల రక్షణకు ఉపయోగిస్తూ భవిష్యత్తులో పూర్తి స్థాయి సైనికులుగా ఉపయోగించుకుంటారు.

తుపాకీ గొట్టం ద్వారానే రాజ్యాధికారం సిద్ధిస్తుందని భూస్వాములు, పెట్టుబడిదారులపై వర్గపోరు కొనసాగించిన మావోయిస్టులు బూర్జువా సైన్యంలో

భాగమయ్యే క్రమానికి పెద్ద చరిత్రే ఉంది. మొన్నటి వరకు రాచరిక పాలనలో మగ్గిన నేపాల్‌లో 1940లలో ప్రజాస్వామ్య పునరుద్ధరణ కోసం ఉద్యమాలు మొదలయ్యాయి. ఉద్యమ జోరుకు అప్పటి రాజు త్రిభువన్ తలొగ్గి ప్రజాస్వామిక ప్రభుత్వ ఏర్పాటుకు అంగీకరించినా అది మూణ్నాళ్ల ముచ్చటే అయింది. 1959 – 89 వరకు పార్టీ రహిత పంచాయితీ పద్ధతిలో ఎన్నికలు జరుగుతూ రాజ్యాంగబద్ధ రాచరిక పాలన కొనసాగింది. 1990లో నేపాలీ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మరోసారి ఉద్యమం తీవ్రతరం కాగా త్రిభువన్ మనుమడు బీరేంద్ర రాజ్యాంగ సంస్కరణలకు అంగీకరించి బహుళ పక్ష పార్లమెంటరీ పద్ధతిలో పాలన సాగించడానికి ఒప్పుకున్నారు. అయితే, 1991–2008 వరకు 17 ఏళ్ల కాలంలో 13 ప్రభుత్వాలు మారి వరుస రాజకీయ సంక్షోభాలతో దేశ ఆర్థిక వ్యవస్థ దివాళా తీసింది.

నేపాలీ ఫ్యూడల్ సమాజంలో నెలకొన్న దోపిడీ, అణచివేత, నిరంకుశత్వాలపై పోరాడే లక్ష్యంతో 1994లో కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ నేపాల్(మావోయిస్టు) ఏర్పడింది. 1996 ఫిబ్రవరి 13 నుంచి నూతన ప్రజాస్వామిక విప్లవ కోసం దేశవ్యాప్తంగా ప్రజాయుద్ధాన్ని ప్రారంభించింది. రాజు నియంతృత్వ విధానాలకు వ్యతిరేకంగా ప్రజలను సమీకరించింది. ప్రజాస్వామ్య ఉద్యమాల పేరిట పోరు సలుపుతూ అవకాశవాద పద్ధతుల్లో ప్రభుత్వాలనేర్పరుస్తున్న బూర్జువా పార్టీల డొల్లతనాన్ని బయటపెట్టింది. వరుస సంక్షోభాలకు కారణం ఈ పార్టీలేనని ప్రకటించి నిజమైన ప్రజాస్వామ్య పునరుద్ధరణ ప్రజాయుద్ధం ద్వారానే సాధ్యమని చాటిచెప్పింది. యువతను పీపుల్స్ లిబరేషన్ ఆర్మీలో పెద్దయెత్తున చేరి రాచరికాన్ని అంతం చేయాల్సిందిగా పిలుపునిచ్చింది.

నేపాలీలు మావోయిస్టుల పిలుపునకు సానుకూలంగా స్పందించారు. 2004 కల్లా ఖాట్మండూ లాంటి నగరాలు, పెద్ద పట్టణాలు తప్ప మిగతా ప్రాంతాలన్నీ గెరిల్లా బలగాల వశమయ్యాయి. ఆరంభంలో రెండు మూడు ప్లాటూన్లుగా ఉండిన పీఎల్ఏ కంపెనీలుగా, బెటాలియన్లుగా అభివృద్ధి చెంది ప్రభుత్వ బలగాలను కంటోన్మెంట్‌లకే పరిమితం చేసే స్థాయికి ఎదిగింది. విప్లవ శక్తులను కట్టడి చేయడంలో నిస్సహాయుడైన రాజు జ్ఞానేంద్ర 2005 ఫిబ్రవరి 1న ప్రధాని షేర్ బహదూర్ దేవ్‌బా ప్రభుత్వాన్ని రద్దు చేసి అన్ని అధికారాలు తన చేతిలోకి తెచ్చుకున్నాడు. ఫలితంగా మరోసారి ప్రజాస్వామ్య పునరుద్ధరణోద్యమానికి తెరలేచింది. ఈ ఉద్యమాన్ని విప్లవోద్యమంతో మేళవించే ఎత్తుగడలను చేపట్టిన మావోయిస్టు పార్టీ చైర్మన్ ప్రచండ అలియాస్ పుష్పకుమార్ దహల్ తమ పంథాను మార్చుకుని సెప్టెంబర్‌లో ఏకపక్ష కాల్పుల విరమణను ప్రకటించారు. ఉద్యమంలో కల్సిరావాల్సిందిగా అన్ని పార్టీలకు విజ్ఞప్తి చేశారు. అటు మావోయిస్టుల సాయుధపోరు, ఇటు అఖిలపక్షాల చట్టబద్ధ ఉద్యమం కలిసి లోక్‌తాంత్రిక్

ఆందోళన్‌గా ఉప్పెనలా ఎగిసింది. చివరకు, 2006 ఏప్రిల్ 24న జ్ఞానేంద్ర దిగివచ్చి తన సార్వభౌమాధికారాన్ని వదులుకుంటున్నట్లు, ప్రతినిధుల సభను పునరుద్ధరిస్తున్నట్లు ప్రకటించారు.

ఈ పరిణామాన్ని నేపాల్ సుదీర్ఘ రాజకీయ చరిత్రలో కీలక మలుపుగా భావించవచ్చు. పునరుద్ధరించిన ప్రతినిధుల సభ ఆ వెంటనే రాజు అధికారాలకు కత్తెర వేస్తూ తీర్మానించింది. దేశాన్ని లౌకిక రాజ్యంగా ప్రకటించింది. జీ పీ కోయిరాలా నేతృత్వంలో ప్రభుత్వాన్ని ఏర్పరచింది. కొత్త రాజ్యాంగాన్ని లిఖించడం కోసం కానిస్టిట్యూషనల్ అసెంబ్లీ (రాజ్యాంగ సభ) ఏర్పాటుచేసి వీలైనంత త్వరగా ఎన్నికలు జరపాలని నిర్ణయించింది. మరోవైపు 2006 సెప్టెంబర్ 21న కోయిరాలా ప్రభుత్వంతో సమగ్ర శాంతి ఒప్పందంపై సంతకాలు చేసిన మావోయిస్టులు ప్రజాస్వామ్య ప్రక్రియలో భాగం కావడానికి అంగీకరించారు. పదేళ్ల అంతర్యుద్ధం ముగిసిందని, మావోయిస్టులు ఇక సాయుధపోరును విరమించి పార్లమెంటరీ బాటలో విప్లవ విజయానికి కృషి చేస్తారని ప్రచండ ప్రకటించారు. 17 వేల బలగాలున్న పీపుల్స్ లిబరేషన్ ఆర్మీ ఫార్మేషన్లను ఐక్యరాజ్యసమితి-నేపాల్ మిషన్ ఆధ్వర్యంలో ప్రత్యేక కంటోన్మెంట్లలో ఉంచడానికి, వారికి నెలవారీ భత్యాలను చెల్లించడానికి నిర్ణయమైంది. కోయిరాలా సర్కారులో మావోయిస్టు నేతలు మంత్రులుగా చేరారు.

తదనంతరం 2008 ఏప్రిల్ 10న రాజ్యాంగ సభకు జరిగిన ఎన్నికల్లో మొత్తం 575 సీట్లకు గాను 220 సీట్లు సాధించి మావోయిస్టులు అతి పెద్ద పార్టీగా నిలిచారు. 601 మంది సభ్యులతో మేలో సమావేశమైన సభ కొన్ని చారిత్రాత్మక నిర్ణయాలు చేసింది. 597-4 మెజారిటీతో రాచరికానికి చరమగీతం పాడి దేశాన్ని ఫెడరల్ రిపబ్లిక్‌గా ప్రకటించింది. రాజు స్థానంలో జూలై 23న నేపాలీ కాంగ్రెస్‌కు చెందిన రాంభరణ్ యాదవ్‌ను దేశాధ్యక్షునిగా ఎన్నుకుంది. మూడు నెలల పాటు అనిశ్చితి కొనసాగిన అనంతరం ఆగస్టు 15న మావోయిస్టు చైర్మన్ ప్రచండ ప్రధానిగా సీపీఎన్(యూఎంఎల్)తో కల్సి సంకీర్ణ ప్రభుత్వం ఏర్పడింది. అయితే, ఆర్మీ చీఫ్ తొలగింపు వివాదం నేపథ్యంలో ప్రచండ ప్రభుత్వం కేవలం తొమ్మిది నెలల్లోనే కుప్పకూలింది. తర్వాత పగ్గాలు చేపట్టిన మిగతా పార్టీల ప్రభుత్వాలు కూడా ఎక్కువ కాలం నిలదొక్కుకోలేకపోయాయి. రెండేళ్లలో రెండు ప్రభుత్వాలు మారి శాంతి ప్రక్రియకు విఘాతమేర్పడే వాతావరణంలో చివరకు 2011 ఆగస్టు 28న మరోసారి రాజ్యాంగసభ మావోయిస్టులవైపే మొగ్గుచూపింది. మదేశీ పార్టీల కూటమి సహకారంతో యూసీపీఎన్ (ఎం) వైస్‌చైర్మన్ బాబూరామ్ భట్టరాయ్ నేపాల్ 36వ ప్రధానిగా బాధ్యతలు చేపట్టారు. ఆ తర్వాత రెండు నెలలకు నవంబర్ 1న ప్రధాన పక్షాలైన నేపాలీ కాంగ్రెస్, కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ నేపాల్(యునిఫైడ్

మార్క్సిస్టు-లెనినిస్టు)లకు, మావోయిస్టులకు మధ్య చారిత్రాత్మక ఏడు సూత్రాల ఒప్పందం జరిగింది. మావోయిస్టు పీఎల్ఏ గెరిల్లాలను నేపాల్ సైన్యంలో చేర్చుకోవడం, వీలైనంత త్వరగా అందరికీ ఆమోదయోగ్యమైన రాజ్యాంగాన్ని లిఖించి, సార్వత్రిక ఎన్నికలు జరిపి ప్రజా ప్రభుత్వాన్ని ఏర్పరచడం ఇందులోని ముఖ్యాంశాలు. ఈ ఒప్పందం వెలుగులోనే ప్రస్తుతం నేపాలీ రాజకీయాలు నడుస్తున్నాయి.

మావోయిస్టుల పార్లమెంటరీ ప్రవేశాన్ని, విప్లవ గెరిల్లా యోధులకు బూర్జువా సైనిక పోస్టింగులను పలువురు వ్యతిరేకించారు. పార్టీ లోపల సైతం ప్రచండ పంథాను వ్యతిరేకించే ఓ బలమైన వర్గం ఉంది. వైస్ చైర్మన్ మోహన్ వైద్య, ప్రధాన కార్యదర్శి రాంబహదూర్ థాపా సీసీ సమావేశాల్లో ప్రచండ విధానాలను తీవ్రంగా విమర్శిస్తున్నారు. అంతర్యుద్ధకాలంలో మావోయిస్టుల నాయకత్వంలో ఆక్రమించిన భూ ములకు పట్టాలిచ్చే చట్టాన్ని ఆమోదించే విషయంలో రాజీ వైఖరి అవలంబిస్తున్నారంటూ ప్రచండపై, ప్రధాని బాబూరామ్‌పై అతివాద వర్గం విరుచుకుపడింది. విప్లవ సిద్ధాంతాలకు తిలోదకాలిచ్చి విలాస జీవితానికి అలవాటుపడ్డారని ఆరోపించింది.

మావోయిజానికి నిజమైన వారసులమని చెప్పుకుంటున్న వివిధ దేశాల విప్లవ పార్టీలు నేపాలీ మావోయిస్టుల పంథాను వ్యతిరేకిస్తున్నాయి. భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) సైతం ప్రచండ పంథాను తూర్పారపట్టింది. గొప్ప విజయాలు సాధించిన నేపాలీ మావోయిస్టులు నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని సామ్రాజ్యవాద శక్తులకు తాకట్టు పెట్టారని విమర్శించింది. విముక్తి ప్రాంతాలను వదిలేసి, ప్రజాసైన్యాన్ని నిరాయుధం చేసి ప్రభుత్వ బలగాల్లో కలిపేయడం అక్కడి ప్రజలకు ద్రోహం చేయడమేనని వ్యాఖ్యానించింది. మితవాద అవకాశవాద రాజకీయాల ప్రచండ పంథాను నిర్ద్వంద్వంగా తిరస్కరించి పోరుబాటను కొనసాగించాల్సిందిగా నేపాల్ విప్లవ శ్రేణులకు పిలుపునిచ్చింది.

విముక్తి ప్రాంతాలను వదిలి ప్రభుత్వ సైన్యంలో చేరడం ద్వారా సరికొత్త ప్రయోగానికి తెరతీసిన నేపాలీ మావోయిస్టు గెరిల్లాల భవిష్యత్తు ఏమిటన్నది ప్రశ్నార్థకంగా మారింది. నూతన ప్రజాస్వామ్యాన్ని 21వ శతాబ్దపు బహుళ పార్టీ ప్రజాస్వామ్యంగా ప్రవచించడం ద్వారా ఎన్నికల్లో పాల్గొని అధికారం చేపట్టిన ప్రచండ పంథా నిజంగా కార్మికవర్గ విప్లవాన్నే తెచ్చిపెడుతుందో లేక మన దేశంలో సీపీఐ, సీపీఎంలలాగా రోజురోజుకు ప్రాభవం కోల్పోతూ ఓట్లకోసం, సీట్లకోసం ప్రాకులాడే పరిస్థితికి దారితీస్తుందో కాలమే సమాధానమివ్వగలదు.

***(నమస్తే తెలంగాణ, 06-03-2012)***

# నేపాల్‌లో చీలిన మావోయిస్టులు

ప్రజాయుద్ధ పంథాను వదిలి పార్లమెంటరీ బాట పట్టి ఎన్నికల్లో గెలిచి అధికార పగ్గాలు సైతం చేపట్టిన నేపాల్ మావోయిస్టులు నిట్టనిలువునా చీలిపోయారు. మావోయిస్టు పార్టీ చైర్మన్ పుష్పకుమార్ దహల్ అలియాస్ ప్రచండ, ప్రధాని బాబూరామ్ భట్టరాయ్‌ల వర్గం అనుసరిస్తున్న నయా రివిజనిస్టు విధానాలను వ్యతిరేకిస్తూ జూన్ 16-18 తేదీల మధ్య ఖాట్మండూ సమీపంలోని బౌద్ధలో సమావేశమైన అసంతృప్త వర్గం మాతృ సంస్థ నుంచి వైదొలిగి కొత్త పార్టీని ఏర్పాటు చేయాలని తీర్మానించింది. కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ నేపాల్-మావోయిస్టు (సీపీఎన్-ఎం) పేరిట కొత్త పార్టీని ఏర్పరుస్తున్నట్లు ప్రకటించింది. నూతన రాజకీయ పంథాను, నిబంధనావళిని ఏకగ్రీవంగా ఆమోదించింది. చైర్మన్‌గా మోహన్ వైద్య అలియాస్ కిరణ్, ప్రధాన కార్యదర్శిగా రామ్‌బహదూర్ థాపా అలియాస్ బాదల్, కార్యదర్శిగా సీ పీ గజూరెల్‌లను ఎన్నుకుంది. పొలిట్‌బ్యూరో, కేంద్రకమిటీలకు సభ్యులను ఎంపిక చేసే అధికారాన్ని తాత్కాలికంగా ఏర్పాటుచేసిన సెంట్రల్ వర్కింగ్ కమిటీకి ఇచ్చింది. వచ్చే ఫిబ్రవరిలో జాతీయ మహాసభలను నిర్వహించాలని నిశ్చయించింది.

కొత్త పార్టీ ఏర్పాటుకు దారితీసిన పరిణామాలను మంగళవారం మీడియాకు వివరించిన చైర్మన్ వైద్య నేపాల్‌లో ప్రజా రిపబ్లిక్ స్థాపనకై తమ పార్టీ పోరాడుతుందని తెలిపారు. సాయుధ ప్రజా తిరుగుబాటే తమ మార్గమని, పార్లమెంటరీ పంథాను అనుసరించబోమని స్పష్టం చేశారు. ప్రచండ, భట్టరాయ్ వర్గాలు విప్లవ సిద్ధాంతాన్ని తుంగలో తొక్కాయని, భారత విస్తరణవాద ప్రభుత్వానికి తొత్తులుగా మారాయన్నారు. మెజారిటీ ప్రతినిధులు వ్యతిరేకించినప్పటికీ 2005 చున్‌వాంగ్ సమావేశంలో ప్రజాయుద్ధం స్థానంలో ప్రజాస్వామిక రిపబ్లిక్ పేరిట బూర్జువా పార్టీలతో ఐక్యసంఘటన ఏర్పాటు ఎత్తుగడలకు పూనుకున్నాయని చెప్పారు. అప్పటి నుంచి తాము పార్టీలోనే అంతర్గత పోరాటం కొనసాగిస్తున్నామని, అయితే అధికార మత్తులో నిండా మునిగిన ప్రచండ తన తప్పులను గుర్తించే స్థితిలో లేడనే నిర్ణయానికి వచ్చి వేర్పాటు సమావేశం

ఏర్పాటు చేశామన్నారు. మాతృ సంస్థతో ఐక్యతా చర్చలకు వెళ్లబోమని, వాళ్లే తమ వద్దకు రావాలని ప్రకటించారు. పాత కేంద్ర కమిటీలోని మూడవ వంతు (77 మంది) సభ్యులు తమతో ఉన్నారని, రాష్ట్ర, జిల్లా స్థాయి కేడర్‌లో మెజారిటీ కొత్తపార్టీలోకి వచ్చారని వివరించారు.

మావోయిస్టుల్లో చీలిక రావడం నేపాల్ రాజకీయాలకే కాకుండా ప్రపంచ కమ్యూనిస్టు ఉద్యమానికి సంబంధించి కీలకమైన పరిణామంగా భావించవచ్చు. 1994లో ఏర్పడిన నేపాల్ కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) 96లో దేశవ్యాప్తంగా ప్రజాయుద్ధాన్ని ప్రారంభించింది. రాజు నియంతృత్వ విధానాలకు వ్యతిరేకంగా పల్లెల్లో, పట్టణాల్లో ప్రజలను కూడగట్టింది. ప్రజాస్వామిక ఉద్యమాల పేరిట అప్పటిదాకా పోరు సల్పుతూ అవకాశవాద పద్ధతుల్లో రాజుతో కుమ్మక్కయి ప్రభుత్వాలనేర్పరుస్తున్న బూర్జువా, రివిజనిస్టు పార్టీల డొల్లతనాన్ని బయటపెట్టింది. వరుస రాజకీయ సంక్షోభాలకు ఈ పార్టీలే కారణమని ప్రకటించి నిజమైన ప్రజాస్వామ్య పునరుద్ధరణ ప్రజాయుద్ధం ద్వారానే సాధ్యమని చాటిచెప్పింది. యువతీ యువకులు ప్రజా విముక్తి సైన్యం(పీఎల్‌ఏ)లో పెద్దయెత్తున చేరి రాచరికాన్ని అంతం చేయాలని పిలుపునిచ్చింది. శతాబ్దాలుగా ఫ్యూడల్ నియంత త్వ పాలనలో మగ్గిన నేపాలీలు మావోయిస్టుల పిలుపునకు సానుకూలంగా స్పందించారు. వారి నాయకత్వంలో కొనసాగిన పలు సామాజిక, ఆర్థిక, రాజకీయ పోరాటాల్లో విస్తృతంగా పాల్గొన్నారు, కొద్ది సంవత్సరాల కాలంలోనే ఆ పార్టీ గ్రామగ్రామానా విస్తరించింది. ప్రజా రాజకీయాధికారాంగాలు, పీపుల్స్ మిలీషియా ఏర్పడ్డాయి. ఆరంభంలో రెండు మూడు ప్లాటూన్లుగా ఉన్న పీఎల్‌ఏ కంపెనీలుగా, బెటాలియన్లుగా అభివృద్ధి చెంది ప్రభుత్వ బలగాలను కంటోన్మెంట్లకు పరిమితం చేసే స్థాయికి ఎదిగింది. 2004 కల్లా యూనిఫైడ్ కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ నేపాల్–మావోయిస్టు(యూసీపీఎన్–ఎం)గా ఏర్పడి ఖాట్మండూ లాంటి నగరాలు, కొన్ని పెద్ద పట్టణాలు మినహా మిగతా ప్రాంతాలన్నింటినీ విముక్తి ప్రాంతాలుగా తన ఆధీనంలోకి తెచ్చుకుంది. ఈ నేపథ్యంలోనే మావోయిస్టులతో పొంచివున్న ముప్పును గ్రహించిన రాజు జ్ఞానేంద్ర 2005 ఫిబ్రవరి 1న ప్రజాస్వామిక పద్ధతిలో ఎన్నికైన అప్పటి షేర్ బహదూర్ దేవ్‌బా ప్రభుత్వాన్ని రద్దు చేసి సైనిక పాలన విధించి సర్వాధికారాలు తన చేతిలోకి తెచ్చుకున్నారు.

ఇక్కడ నేపాల్ రాజకీయ చరిత్రను క్లుప్తంగానైనా చెప్పాలి. క్రీస్తుపూర్వం నుంచీ రాచరిక పాలనలో నలిగిన నేపాల్‌లో 1940లలో మొట్టమొదటిసారిగా ప్రజాస్వామ్య పునరుద్ధరణ ఉద్యమం మొదలైంది. ఉద్యమ జోరుకు తలొగ్గిన అప్పటి రాజు త్రిభువన్ ప్రజాస్వామిక ప్రభుత్వ ఏర్పాటుకు అంగీకరించినా అది మూణ్నాళ్ల ముచ్చటే అయింది.

1959 నుంచి 89 వరకు సుమారు ముప్పై ఏళ్లు పార్టీ రహిత పంచాయతీ పద్ధతిలో ఎన్నికలు జరుగుతూ రాజ్యాంగబద్ధ రాచరిక పాలన కొనసాగింది. 1990లో నేపాలీ కాంగ్రెస్ పార్టీ నేతృత్వంలో మరోసారి ప్రజాస్వామ్య పునరుద్ధరణ ఉద్యమం తీవ్రతరం కాగా, త్రిభువన్ మనుమడు బీరేంద్ర రాజ్యాంగ సంస్కరణలకు అంగీకరించి బహుళపక్ష పార్లమెంటరీ పద్ధతిలో పాలన సాగించడానికి ఒప్పుకున్నారు. 1990 నుంచి 2005 వరకు 14 ఏళ్ల కాలంలో నేపాలీ కాంగ్రెస్, సీపీఎన్(యూఎంఎల్) పార్టీలకు చెందిన 13 ప్రభుత్వాలు అధికారంలో కొనసాగాయి.

థాపా ప్రభుత్వాన్ని రాజు రద్దు చేయగానే దేశంలో మరోసారి ప్రజాస్వామ్య పునరుద్ధరణోద్యమానికి తెర లేచింది. నేపాలీ కాంగ్రెస్, సీపీఎన్(యూఎంఎల్) తదితర ఏడు పార్టీలు కలిసి కూటమిగా ఏర్పడి వీధుల్లోకెక్కాయి. అయితే, దేశ రాజకీయ చిత్రపటంలో ప్రాబల్యశక్తిగా ఎదిగిన మావోయిస్టు పార్టీ భాగస్వామ్యం లేకుండా ఉద్యమం సఫలం కాదని గుర్తించిన కూటమి ఆ పార్టీతో చర్చలకు ముందుకువచ్చింది. మరోవైపు, మావోయిస్టులు సైతం ఈ సంక్షోభ పరిస్థితులను విప్లవానికి అనుకూలంగా మలుచుకోవడం కోసం సెప్టెంబర్‌లో ఏకపక్ష కాల్పుల విరమణను ప్రకటించారు. బూర్జువా పార్టీలతో శాంతి చర్చలకు అంగీకరించారు. 2005 నవంబర్ 22న ఏడు పార్టీల కూటమికి మావోయిస్టులకు మధ్య చారిత్రాత్మక 12 అంశాల ఒప్పందం కుదిరింది. రాచరిక పాలనకు చరమగీతం పాడాలని, ప్రతినిధుల సభను ఎన్నుకుని కొత్త రాజ్యాంగాన్ని రచించి నూతన శకానికి నాంది పలకాలని ఇరు వర్గాలు నిర్ణయించాయి. అటు మావోయిస్టుల సాయుధ ఉద్యమం, ఇటు ఏడు పార్టీల చట్టబద్ధ ఆందోళన కలిసి లోక్‌తాంత్రిక్ ఆందోళన్ ఉప్పెనలా ఎగిసింది. 2006 ఏప్రిల్ 5 నుంచి 19 రోజుల పాటు ఉధృతంగా సాగిన ఈ ఆందోళన చివరకు రాజు దిగివచ్చి తన సార్వభౌమత్వాన్ని వదులుకుంటున్నట్లు, ప్రతినిధుల సభను పునరుద్ధరిస్తున్నట్లు ప్రకటించడంతో విజయవంతంగా ముగిసింది.

ఆ తర్వాతికాలంలో పరిణామాలు వేగంగా జరిగాయి. పునరుద్ధరించిన ప్రతినిధుల సభ ఆ వెంటనే రాజు అధికారాలకు కత్తెర వేస్తూ తీర్మానించింది. దేశాన్ని లౌకికరాజ్యంగా ప్రకటించింది. జీ పీ కోయిరాలా నేతృత్వంలో ప్రభుత్వాన్ని ఏర్పరచింది. కొత్త రాజ్యాంగాన్ని లిఖించడం కోసం కానిస్టిట్యూషనల్ అసెంబ్లీ(రాజ్యాంగసభ)కి వీలైనంత త్వరగా ఎన్నికలు జరపాలని నిర్ణయించింది. సెప్టెంబర్ 21న కోయిరాలా ప్రభుత్వంతో సమగ్రశాంతి ఒప్పందంపై సంతకాలు చేసిన మావోయిస్టులు ప్రజాస్వామ్య ప్రక్రియలో భాగం కావడానికి, ప్రభుత్వంలో చేరడానికి అంగీకరించారు. పదేళ్ల అంతర్యుద్ధం ముగిసిందని, తాము సాయుధపోరును విరమించి పార్లమెంటరీ బాటలో విప్లవ విజయానికి కృషి

చేస్తామని యూసీపీఎన్(ఎం) చైర్మన్ ప్రచండ ప్రకటించారు.

అలా పార్లమెంటరీ పంథాకి మళ్లిన మావోయిస్టులు 2008 ఏప్రిల్ 10న రాజ్యాంగసభకు జరిగిన ఎన్నికల్లో 575 సీట్లకు గాను 220 సాధించి అతిపెద్ద పార్టీగా నిలిచారు. మేలో సమావేశమైన సభ దేశాన్ని ఫెడరల్ రిపబ్లిక్‌గా ప్రకటించింది. రాజు స్థానంలో నేపాలీ కాంగ్రెస్‌కు చెందిన రాంభరణ్‌యాదవ్‌ను అధ్యక్షుడిగా ఎన్నుకుంది. మూడు నెలల అనిశ్చితి తర్వాత ఆగస్టు 15న ప్రచండ ప్రధానిగా సీపీఎన్(యూఎంఎల్)తో కల్సి మావోయిస్టులు ప్రభుత్వాన్ని ఏర్పరచారు. అయితే, సైన్యాధికారి తొలగింపు వివాదంతో కేవలం 9 నెలల కాలంలోనే ఈ ప్రభుత్వం కుప్పకూలింది. ఆ తర్వాత రెండేళ్లలో రెండు ప్రభుత్వాలు మారి శాంతి ప్రక్రియకు విఘాతమేర్పడే వాతావరణంలో 2011 ఆగస్టు 28న మరోసారి రాజ్యాంగసభ మావోయిస్టుల వైపు మొగ్గు చూపింది. మదేశీ పార్టీల సహకారంతో మావోయిస్టు పార్టీ వైస్‌చైర్మన్ బాబురామ్ భట్టరాయ్ నేపాల్ 36వ ప్రధానమంత్రిగా బాధ్యతలు చేపట్టారు. నవంబర్ 1న ప్రధానపక్షాలతో మావోయిస్టులు ఏడు సూత్రాల ఒప్పందం చేసుకున్నారు. వీలైనంత త్వరగా రాజ్యాంగాన్ని రచించి ఆమోదించడం, సార్వత్రిక ఎన్నికలు జరిపి ప్రజాప్రభుత్వాన్ని ఏర్పరచడం, పీఎల్ఏ గెరిల్లాలను నేపాల్ సైన్యంలో చేర్చుకోవడం ఈ ఒప్పందంలోని ముఖ్యాంశాలు.

అయితే, ప్రజాయుద్ధాన్ని దారిమళ్లించి పార్లమెంటరీ బాట పట్టించిన ప్రచండ పంథాను పార్టీలోని ఓ బలమైన వర్గం మొదటినుంచీ వ్యతిరేకిస్తోంది. 21వ శతాబ్దంలో నూతన ప్రజాస్వామ్యమంటే ఫ్యూడల్, సామ్రాజ్యవాద శక్తులకు వ్యతిరేకంగా కలిసివచ్చే బూర్జువా పార్టీలతో సైతం శాంతియుత పద్ధతుల్లో పోటీ పడడమని ప్రవచించిన ప్రచండ విధానాలను అంతర్గతంగా తూర్పారబట్టింది. అయితే రాజ్యాధికారాన్ని కైవసం చేసుకునే స్థాయికి ఎదిగిన ప్రజాయుద్ధాన్ని, ప్రజాసైన్యాన్ని, పార్టీని విచ్ఛిన్నం చేయడం ఇష్టం లేక పార్టీలోనే ఉంటూ పోరాడుతూ వచ్చింది. 2005 చున్‌వాంగ్ సభ నుంచి జరిగిన అనేక సమావేశాల్లో ఈ వర్గం ప్రచండ పంథా విప్లవ వ్యతిరేకమని వాదిస్తూ వచ్చింది. 2011 అక్టోబర్ 2న ఈ వర్గం నేతలు వైద్య, థాపాలు ఒక వివరమైన నోట్ ఆఫ్ డిసెంట్ పెట్టారు. ప్రజల ప్రయోజనాలకు అనుకూలమైన రాజ్యాంగాన్ని రచింపజేయడంలో ప్రచండ విఫలమయ్యారని, రైతులు ఆక్రమించిన భూస్వాముల భూములను, ఆస్తులను చట్టబద్ధం చేయాల్సింది పోయి, వాటిని తిరిగి పాత యజమానులకు అప్పగించజూస్తున్నారని ఆరోపించారు. మదేశీ పార్టీలతో కుదుర్చుకున్న ఒప్పందం పూర్తిగా విప్లవ వ్యతిరేకమని అభిప్రాయపడ్డారు. నాలుగు సంవత్సరాల పాటు కార్మికులు సమ్మె చేయడాన్ని నిషేధించడం ఏ విప్లవం కిందికి వస్తుందని ప్రశ్నించారు. పీఎల్ఏను విడదీసి(రీగ్రూపు చేసి) వివిధ ఆర్మీ యూనిట్లలో కలుపడం, ఆయుధాలను దాచిన

పెట్టెల తాళం చెవులను ఆర్మీ ఇంటిగ్రేషన్ స్పెషల్ కమిటీకి అప్పగించడం ఆత్మహత్యా సదృశ్యమేనన్నారు. ఇప్పటికైనా ప్రచండ తన తప్పుడు విధానాలను మానుకోవాలని, కేంద్రకమిటీ విస్తృత సమావేశంలో చర్చించకుండా రాజ్యాంగ రచన, పీఎల్ఏ విలీనం విషయాల్లో నిర్ణయాలు తీసుకోవద్దని డిమాండ్ చేశారు. అయినా, ప్రచండ–బాబూరామ్ వర్గం తమ విధానాలు మార్చుకోకపోవడంతో ఇంతకాలం ఎదురుచూసిన వైద్య–థాపా వర్గం కేంద్ర, రాష్ట్ర స్థాయి కేడర్ల ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించి కొత్త పార్టీ ఏర్పాటును ప్రకటించింది. కొత్త రాజ్యాంగాన్ని ఆమోదించకుండానే రాజ్యాంగసభను రద్దు చేయడం, కొత్త సభ ఏర్పాటు కోసం వచ్చే నవంబర్ 22న తిరిగి ఎన్నికలు నిర్వహిస్తామని ప్రకటించడం ప్రచండ–బాబూరామ్‌ల విప్లవ వ్యతిరేక కుట్ర ఫలితమేనని ఆరోపించింది. ఉన్నత స్థాయికి ఎదిగిన ప్రజాయుద్ధాన్ని, ప్రజాసైన్యాన్ని బూర్జువా ప్రజాస్వామ్యానికి బలివ్వడం విప్లవ విద్రోహమేనని పేర్కొంది. ప్రచండ వదిలిన మార్గాన్ని తాము కొనసాగిస్తామని, నేపాల్‌లో సాయుధమార్గాన విప్లవం తెస్తామని స్పష్టం చేసింది. మాతృ సంస్థలోని కేడర్ ప్రచండ పంథాలోని తప్పులను గుర్తించి నూతన పార్టీలో సంఘటితం కావాలని పిలుపునిచ్చింది.

అమెరికా తదితర సామ్రాజ్యవాద దేశాలను నేపాల్ పరిణామాలు కుదిపేశాయి. అంతర్జాతీయ పరిశీలకులు, మీడియా నేపాల్ మరో రాజకీయ సంక్షోభంలోకి కూరుకుపోనున్నదని వ్యాఖ్యానించగా, వామపక్ష మేధావులు, పలు దేశాల మావోయిస్టు పార్టీలు ప్రపంచ సోషలిస్టు విప్లవానికి ఈ పరిణామాలు శుభసూచకమని సంబరపడ్డాయి. ప్రచండ పార్లమెంటరీ పంథా శాంతియుత మార్గంలో నేపాల్‌లో విప్లవం తెస్తుందో లేక కొత్తగా ఏర్పడిన మావోయిస్టు పార్టీ సాయుధబాటలో నడిచి ఆ దేశాన్ని విముక్తం చేస్తుందో కాలమే నిర్ణయిస్తుంది.

***(నమస్తే తెలంగాణ, 19-06-2012)***

***పుస్తక సమీక్ష:***

# బస్తర్.. భారత యేనాన్..

"దండకారణ్యం నుంచి, భారతదేశంలోని అరుణారుణ ప్రాంతం నుంచి ఢిల్లీకి తిరిగివస్తుంటే.. నాకు డెబ్బై ఐదు సంవత్సరాల కిందట ఉత్తర షాంగ్సీలోని యేనాన్ నుంచి కొమింగ్‌టాంగ్ రాజధాని సియాన్‌కు తిరిగివచ్చినట్లనిపించింది. కానీ నేనక్కడ నాలుగు నెలలు గడిపి రాలేదు. కేవలం రెండు వారాలు మాత్రమే ఉన్నాను. చైనా విప్లవ కేంద్రమైన పొడి వాతావరణపు ఉత్తర షాంగ్సీకీ ఇవాల్టి భారత విప్లవ కేంద్రమైన దండకారణ్యానికీ, బస్తర్ అడవులకూ తేడాలు ఎన్నైనా ఉండవచ్చు. ప్రస్తుత పోరాటపు పర్యవసానం ఏమైనా కావచ్చు.."

భారత విప్లవోద్యమంపై స్ఫూర్తినిచ్చే పుస్తకం 'భారత్‌పై అరుణతార' రాసిన ప్రసిద్ధ స్వీడిష్ రచయిత యాన్ మిర్దాల్ తన దండకారణ్య పర్యటనను ముగిస్తూ చెప్పిన మాటలివి. అలాంటి భావనలు ఆయనలో కలగడాన్ని ఆ పుస్తకం చదివిన ఎవరూ తప్పు పట్టలేరు. పుస్తకానికి పెట్టిన శీర్షిక, లోపలి పేజీల్లో మిర్దాల్ తడిమిన విషయాలు పాఠకులకు పదే పదే చైనా విప్లవాన్నీ, అమెరికన్ జర్నలిస్టు ఎడ్గార్ స్నో రాసిన 'చైనాపై అరుణతార'నూ గుర్తుకుతెస్తాయి. 1921లో ఏర్పడిన చైనా కమ్యూనిస్టు పార్టీ అనేక ఒడిదుడుకుల మధ్య పురోగమిస్తూ ఒకవైపు సన్‌యెట్‌సేన్ నేతృత్వాన గల కొమింగ్‌టాంగ్ ప్రభుత్వంలో భాగమవుతూనే ఆగ్నేయ చైనాలో పట్టు సాధిస్తుంది. లక్షల్లో ఎర్రసైన్యాన్ని నిర్మిస్తుంది. హునాన్ తదితర రాష్ట్రాల్లో ప్రాబల్యశక్తిగా ఆవిర్భవిస్తుంది. అయితే, చియాంగ్‌కైషేక్ అధికారంలోకి వచ్చిన తర్వాత కమ్యూనిస్టులపై ఊచకోత అమలు చేస్తూ చుట్టివేత-అణచివేత దాడులకు పూనుకున్న నేపథ్యంలో తప్పుడు ఎత్తుగడల మూలంగా నష్టాలపాలవుతుంది. ఈ పరిస్థితుల్లో పార్టీ పగ్గాలను చేపట్టిన మావో సేటుంగ్ బలగాలను కాపాడుకునే లక్ష్యంతో లాంగ్ మార్చ్‌కు పూనుకుంటారు. సుమారు మూడు లక్షల సంఖ్యలో ఉన్న ఎర్ర సైన్యం శత్రుదాడులు, అనేక కష్ట నష్టాల మధ్య 30 వేలకు క్షీణించిన స్థితిలో వాయవ్య చైనాకు చేరుతుంది. షాంగ్సీ-కాన్సు- నింగ్సియా సరిహద్దుల్లో విశాలమైన విముక్తి ప్రాంతాన్ని ఏర్పరుస్తుంది. పార్టీ అధినాయకత్వం ఉత్తర షాంగ్సీలోని

యేనాన్‌ను హెడ్‌క్వార్టర్స్‌గా చేసుకుని పనిచేస్తుంది. 1936 జూలైలో ఎడ్గార్ స్నో ఈ యేనాన్‌కు వెళ్లి మూడు నెలల కాలం పాటు ఉండి మావో, చౌఎన్‌లై, ఛూటే తదితర అగ్రనేతలను కలుస్తారు. ఎర్రసైన్యంతో తిరుగుతారు. చైనా విప్లవోద్యమం గురించి, అక్కడి గ్రామీణ ప్రాంతాల్లో విస్తరిస్తున్న ప్రజారాజకీయాధికారం గురించి అప్పటిదాకా ప్రపంచానికి తెలియని అనేక సంగతులను చైనాపై అరుణతార గ్రంథం ద్వారా వెలుగులోకి తెస్తారు.

సరిగ్గా 74 ఏళ్ల తర్వాత భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) ఆహ్వానం మేరకు 2010 జనవరిలో దండకారణ్యంలోని బస్తర్ ప్రాంతానికి వెళ్లిన జాన్ (స్వీడిష్ సంప్రదాయంలో యూన్) మిర్దాల్ 16 రోజుల పాటు ప్రజావిముక్తి గెరిల్లా సైన్యం(పీఎల్‌జీఏ) దళాలతో కలిసి నడిచారు. పార్టీ ప్రధాన కార్యదర్శి గణపతి సహా పలువురు అగ్రనేతలతో సంభాషించారు. నేటి భారత విప్లవోద్యమ పరిస్థితులు చాలా విషయాల్లో నాటి చైనా పరిస్థితులను పోలివున్నాయని భావించారు. 1925లో భారతదేశంలో కమ్యూనిస్టు పార్టీ ఆవిర్భావం తర్వాత తెలంగాణ తదితర చోట్ల గొప్ప రైతాంగ సాయుధ ఉద్యమాలను నడిపించినప్పటికీ క్రమంగా రివిజనిస్టు రాజకీయాల్లో, పార్లమెంటరీ రొంపిలో చిక్కుకుపోయి నిర్వీర్యమైంది. ఈ పరిస్థితుల్లో చారుమజుందార్ భారత విప్లవానికి సరికొత్త మార్గాన్ని నిర్దేశించారు. ఆయన నాయకత్వంలో ఎగసిన నక్సల్బరీ తిరుగుబాటు దేశవ్యాప్తంగా వేలాది మంది యువతీ యువకులను తట్టిలేపింది. విప్లవ కదనరంగాన దింపింది. శ్రీకాకుళానికి వ్యాపించిన ఉద్యమం అక్కడ నష్టాలకు గురి కాగానే తెలంగాణకు విస్తరించింది. సీపీఐ(ఎంఎల్) పీపుల్స్‌వార్ నాయకత్వాన భూస్వామ్య విధానానికి వ్యతిరేకంగా అనేక పోరాటాలు చేబట్టి ప్రభుత్వ వ్యతిరేక పోరాట స్థాయికి చేరింది. 1990ల నాటికి ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని జిల్లాలకూ వ్యాపించి రాష్ట్ర రాజకీయాల్లో ప్రధాన ప్రతిపక్షంగా అవతరించింది. ఆర్థిక, సామాజిక, రాజకీయ రంగాల్లో అనేక పోరాటాలను చేపట్టింది. వందలాదిగా యువతీ యువకులను తనలో ఇముడ్చుకుంది. ఉత్తర తెలంగాణ, మన్యం, నల్లమలల్లో సంఘటితమై సాయుధ నిర్మాణాలను క్రమక్రమంగా పెంచుకుంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉద్యమం దన్నుగా దేశంలోని అనేక ప్రాంతాల్లో పాగా వేసింది. మరోవైపు, మరో ధారగా చారుమజుందార్ పంథాను ఎత్తిపట్టిన మావోయిస్టు కమ్యూనిస్టు సెంటర్ (ఎంసీసీ), సీపీఐ(ఎంఎల్) పార్టీ యూనిటీలు బీహార్, జార్ఖండ్, బెంగాల్ రాష్ట్రాల్లో బలమైన ఉద్యమాలను నిర్మించాయి. భూమిసేన, సన్‌లైట్‌సేన, లోరిక్‌సేన, రన్వీర్‌సేన వంటి ఫ్యూడల్ సాయుధ మూకల ఆగడాలను సమర్థవంతంగా త్రిప్పికొట్టాయి. ప్రభుత్వ బలగాలను సైతం ప్రతిఘటిస్తూ జార్ఖండ్ అడవులను, జహనాబాద్ మైదానాలను గెరిల్లా జోన్లుగా అభివృద్ధి చేశాయి.

ఆ తర్వాతి దశాబ్దంలో రెండు పరస్పర విరుద్ధ పరిణామాలు సంభవించాయి. విప్లవ క్యాంపునకు అనుకూల పరిణామమేమంటే వివిధ రాష్ట్రాల్లో బలమైన నిర్మాణం కలిగిన పై మూడు ఎంఎల్ పార్టీలు 2004 నాటికల్లా ఒకే పార్టీగా విలీనమయ్యాయి. సమకాలీన ప్రపంచంలోనే అతిపెద్ద మావోయిస్టు పార్టీగా, దేశవ్యాప్త నిర్మాణం కలిగిన సంస్థగా రూపుదిద్దుకున్నాయి. సాక్షాత్తూ ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ నోట వామపక్ష తీవ్రవాదమే దేశ భద్రతకు తీవ్రముప్పుగా పరిణమించిందన్న మాటలు వెలువడడం ఇందుకు నిదర్శనం. నిరాశ పర్చే విషయమేమంటే మైదాన ప్రాంతాల్లో ఉద్యమం బలహీనపడడం. పీపుల్స్‌వార్‌కు బలమైన ఆంధ్రప్రదేశ్‌లో ఆ పార్టీ వెనకడుగు వేసి అనేక ప్రాంతాల నుంచి తన నిర్మాణాలను, దళాలను ఉపసంహరించుకోగా, ఎంసీసీ, పార్టీ యూనిటీలు సైతం గంగా తీర మైదానాల్లో తీవ్ర నష్టాలను చవిచూశాయి.

అయితే, కొత్తగా ఏర్పడ్డ భారత కమ్యూనిస్టు పార్టీ(మావోయిస్టు) ఈ విరుద్ధ పరిణామాలను శాస్త్రీయ పద్ధతిలో విశ్లేషించింది. ప్రపంచీకరణ తదనంతర కాలంలో భారత విప్లవ వ్యూహం–ఎత్తుగడల్లో తేవాల్సిన మార్పులను గుర్తించింది. మార్క్సిజం–లెనినిజం– మావోయిజాన్ని దేశ నిర్దిష్ట పరిస్థితులకు అన్వయించింది. దీర్ఘకాలిక యుద్ధ పంథా ప్రకారం దేశంలోని వెనుకబడిన, మారుమూల అటవీ–ఆదివాసీ ప్రాంతాలు ముందుగా విముక్తమవుతాయని, ఆ తర్వాత క్రమంగా మైదానాల పల్లెలు, పట్టణాలు, అంతిమంగా నగరాలు శత్రు పాలన నుంచి విముక్తి చెందుతాయని చెప్పింది. ఆ ప్రకారం అడవులు, పర్వతాలు దట్టంగా ఉన్న నాలుగు సరిహద్దు ప్రాంతాలను విముక్తి చేసే లక్ష్యంతో ముందుకు సాగాలని లక్ష్య నిర్దేశం చేసుకుంది. ఆంధ్రప్రదేశ్– మహారాష్ట్ర–ఛత్తీస్‌గఢ్ (దండకారణ్యం), ఆంధ్రప్రదేశ్–ఒరిస్సా(ఏఓబీ), బెంగాల్–ఒరిస్సా–జార్ఖండ్ (జంగల్‌మహల్), జార్ఖండ్–బీహార్–ఛత్తీస్‌గఢ్(సరాండా అడవులు) సరిహద్దు ప్రాంతాలపై కేంద్రీకరించింది. ఈ నాలుగు ప్రాంతాలను పూర్తి స్థాయి గెరిల్లా జోన్లుగా అభివృద్ధి చేసేందుకు అవసరమైన చర్యలను చేపట్టింది. దళాలుగా, ప్లాటూన్లుగా విడిగా పని చేస్తున్న పీఎల్‌జీఏ బలగాలను గెరిల్లా జోన్ స్థాయిలో కంపెనీలుగా, బెటాలియన్లుగా సంఘటితం చేసింది. ఈ బలగాల రక్షణలో ప్రజా రాజకీయాధికార అంగాలైన జనతన సర్కార్ల(విప్లవ ప్రజా కమిటీ)ను గ్రామస్థాయిలో, ఏరియా, జిల్లా స్థాయిల్లో ఏర్పాటుచేసింది. విప్లవ శక్తుల అణచివేతకు వచ్చిన పోలీసు, పారామిలిటరీ బలగాలను డజన్ల సంఖ్యలో మట్టికరిపించింది. ఈ క్రమంలో ఒక్కో గెరిల్లా జోన్‌లోని కొన్ని ఏరియాలను శత్రువు ప్రవేశించ వీలుగాని గెరిల్లా బేస్‌లు (స్థావరాలు)గా మార్చుకుంది. దండకారణ్యంలోని బస్తర్‌లో గల సరిగ్గా ఇలాంటి ఒక గెరిల్లా బేస్‌లోనే జాన్ మిర్డాల్ పర్యటించారు. తెలంగాణలో ఓడిపోయిన విప్లవ శక్తులు దండకారణ్యానికి తిరోగమించి అక్కడ విప్లవ

కేంద్రం స్థాపించడాన్ని హునాన్ నుంచి తిరోగమించిన చైనా ఎర్రసైన్యం యేనాన్‌లో పాగా వేయడంతో పోల్చారు.

భారతదేశం, భారతదేశ ప్రజలు, ఇక్కడ కొనసాగుతున్న విప్లవోద్యమం, నక్సల్స్ నిర్మూలన పేరుతో ప్రభుత్వం మధ్యభారతంలో కొనసాగిస్తున్న యుద్ధం తదితర విషయాలను మిర్దాల్ తన పుస్తకంలో తర్కబద్ధంగా విశ్లేషించారు. భారత ప్రజలు పేదవారుగా ఉన్నారు తప్ప ఆ దేశం పేదది కాదని కుండ బద్దలు కొట్టారు. 1940లో రజనీ పామీదత్ రాసిన 'ఇండియా టుడే' గ్రంథాన్ని ఉటంకిస్తూ స్వాతంత్ర్యం వచ్చిందని చెబుతున్న ఈ 65 ఏళ్లలో ఇక్కడ జరిగిన మార్పు శూన్యమని అభిప్రాయపడ్డారు. పేదరికంపై యుద్ధం కాస్తా పేదలపై యుద్ధంగా మారిందని వాపోయారు. దేశ పరిస్థితులను గమనిస్తే రెండు విషయాలు కొట్టొచ్చినట్లు కనబడతాయంటూ ఇక్కడి సహజ సంపద, విస్తారమైన వనరులు ఇవాళ ఉనికిలో ఉన్న యావత్తూ ప్రజానీకానికీ, ప్రస్తుత జనాభాను మించిన జనాభాకూ సరిపోతాయనీ, అయితే, చేతికి అందేంత దూరంలోనే ఉన్న ఈ సిరిసంపదలను పేదలు అందుకోలేకపోతున్నారనీ వివరించారు. ఒకవంక అణ్వాయుధాలు, ఉపగ్రహాలు, అత్యాధునిక పరిశ్రమలు.. మరొకవంక ప్రజల దుర్భర దారిద్ర్యం, వడ్డీ వ్యాపారులకు అప్పు చెల్లించలేక లక్ష మందికి పైన రైతుల ఆత్మహత్యలు ఇక్కడి సమాజ వైచిత్రి అని వర్ణించారు. స్థూలజాతీయోత్పత్తి సాలీనా 8 శాతం వృద్ధిలో ఉన్న దేశంలో 55శాతం మంది అనగా 66కోట్ల మంది పేదరికంలో మగ్గడం అసమంజసమని, ఆకలి సూచికలో సహారా ఎడారి దేశాల కంటే భారత్ దిగువన ఉండడం సిగ్గుచేటని పేర్కొన్నారు.

మారని ఈ పరిస్థితులకు వ్యతిరేకంగా తరాలుగా పోరాటం కొనసాగుతోందని మిర్దాల్ తెలిపారు. బ్రిటిష్ వలస పాలనకు వ్యతిరేకంగా 1857 నుంచి కొనసాగిన జాతీయోద్యమంలో పేదల ఆకాంక్షలు దాగివున్నాయన్న విషయం మరవరాదన్నారు. ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామం ఈస్ట్ ఇండియా కంపెనీ నుంచి అధికారాన్ని బ్రిటిష్ రాచరికానికి దఖలు చేస్తే, ద్వితీయ స్వాతంత్ర్య సంగ్రామంగా పేర్కొంటున్న మలివిడత ఉద్యమం నామమాత్రపు అధికార బదలాయింపును మాత్రమే సాధించగలిగిందని వివరించారు. దేశ ఆర్థిక వ్యవస్థనూ, ప్రభుత్వాల విధానాలనూ ఇప్పటికీ విదేశీ బహుళజాతి కంపెనీలే శాసించడం నిజం కాదా అని ప్రశ్నించారు. ఒక విదేశీ ప్రభుత్వం స్థానంలో దేశీయ ప్రభుత్వం వచ్చి స్వార్థ ప్రయోజనాలన్నిటినీ యథాతథంగా ఉంచినట్లయితే అది కనీసం స్వాతంత్ర్యపు నీడ కూడా కాజాలదంటూ 1933లోనే 'విదర్ ఇండియా' పుస్తకంలో నెహ్రూ పేర్కొన్నారనీ, 2010లో భారత్ పరిస్థితి చూస్తే నిజమైన స్వాతంత్ర్యం రాలేదని ఎవరైనా ఒప్పుకోక తప్పదనీ చెప్పారు. దేశానికి నిజమైన స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు

రావాలంటే తృతీయ, చివరిదైన స్వాతంత్ర్య సంగ్రామం కొనసాగాల్సివున్నదని పరోక్షంగా సూచించారు. మావోయిస్టుల ప్రస్తుత విప్లవ పోరాటం ఆ స్థాయికి చేరాలని ఆకాంక్షించారు. నక్సలైట్ల మార్గంలో భారతదేశంలో ఒక విప్లవాత్మక మార్పు జరగాలని ఆశిస్తున్నాననీ, అయితే ఆ మార్పును చూడడానికి తను జీవించి ఉండననీ అంటూ తన చివరి కోరికను చెప్పకనే చెప్పారు.

మావోయిస్టులకు, ప్రభుత్వ బలగాలకు మధ్య కొనసాగుతున్న అప్రకటిత యుద్ధాన్ని విశ్లేషిస్తూ రచయిత 2010 జూలై 4న హిందుస్థాన్ టైమ్స్‌లో వచ్చిన కథనాన్ని ఉటంకించారు. "ప్రతి ఐదుగురిలో ఒకరు తిరుగుబాటు నీడలో బతుకుతున్న దేశంలో ఇప్పుడొక యుద్ధం మొదలైంది. ఇది కాశ్మీర్ కన్నా, ఇరాక్ కన్నా, ఆఫ్ఘనిస్తాన్ కన్నా కష్టతరమైన యుద్ధం. దుర్భర దారిద్ర్యాన్ని అనుభవించే ప్రజలకు నెలవైన భారతదేశపు భూములు ఆ ఘర్షణకు మహా రణస్థలంగా మారబోతున్నాయి. పరిమాణాన్ని బట్టి చూసినా, జరగబోయే ప్రాంతాన్ని బట్టి చూసినా ఈ యుద్ధం ప్రపంచంలోకెల్లా తిరుగుబాట్ల మీద జరిగిన అత్యంత కఠినతరమైన యుద్ధం కాబోతున్నది. ప్రధాన యుద్ధక్షేత్రమైన ఛత్తీస్‌గఢ్‌లోని బస్తర్ సుదూర, సాంద్ర అరణ్యాలు ప్రపంచంలోకెల్లా అత్యుత్తమమైన ఇనుప ఖనిజానికి కాణాచి. ఈ యుద్ధక్షేత్రం కాశ్మీర్‌లోయతో పోలిస్తే పది రెట్లు ఎక్కువ విశాలమైనది. ఈ ప్రాంతంలోని విస్తారమైన భూభాగాలు గత రెండు దశాబ్దాలుగా తిరుగుబాటుదార్ల ఆధీనంలోనే ఉన్నాయి."

ఈ యుద్ధపు అసలు లక్ష్యాలనూ మిర్దాల్ బయటపెట్టారు. గ్రీన్‌హంట్ నామంతో కొనసాగుతున్న యుద్ధం వెనకాల అమెరికా అగ్రరాజ్యం, ప్రపంచబ్యాంకు, బహుళజాతి కంపెనీల హస్తం ఉందని ఆరోపించారు. ఛత్తీస్‌గఢ్, ఒరిస్సా, జార్ఖండ్ రాష్ట్రాల్లో గల అపార ఖనిజవనరులపై కన్నేసిన దేశ, విదేశాలకు చెందిన కంపెనీలు గత పదేళ్లలో డజన్ల కొలదీ మైనింగ్ ఒప్పందాలను కుదుర్చుకున్నాయని, ఈ రాష్ట్రాల్లో బలంగా ఉన్న మావోయిస్టుల నుంచి పొంచివున్న ముప్పును పసిగట్టి అమెరికా, భారత ప్రభుత్వాల శరణుజొచ్చాయన్నారు. ఫలితంగానే 2010 నవంబర్ 7న తన భారత పర్యటనలో ఒబామా మన్మోహన్‌సింగ్‌తో కలిసి తీవ్రవాద వ్యతిరేక సహకార ఒడంబడికపై సంతకాలు చేశారని వివరించారు. దేశ జనాభాలో 9 శాతం మాత్రమే ఆదివాసులు ఉన్నారని, అయితే అభివృద్ధి పథకాల కోసం సేకరించిన మొత్తం భూముల్లో 40శాతం కన్నా ఎక్కువ ఆదివాసులవేనని తెలిపారు. కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ వెలువరించిన ఓ నివేదిక మధ్యభారతంలో కార్పొరేట్ల భూఆక్రమణను కొలంబస్ తర్వాత ఆదివాసీ భూముల అతిపెద్ద ఆక్రమణగా అభివర్ణించిన సంగతిని గుర్తు చేశారు. గ్రీన్‌హంట్‌లో భాగంగా భారత సాయుధ బలగాల అకృత్యాలను ఆదివాసుల అస్తిత్వంపై జరుగుతున్న దాడిగా

పేర్కొన్నారు. గ్రామాలకు గ్రామాలను తగులబెట్టడం, దొరికిన వారిని దొరికినట్టు కాల్చివేయడం, స్త్రీలపై అత్యాచారాలు దండకారణ్యంలో నిత్యకృత్యమయ్యాయన్నారు. గ్రీన్‌హంట్ ఆపరేషన్ జెనీవా ఒడంబడికకు విరుద్ధమంటూ తమ భూములను, ఆచార సంప్రదాయాలను, స్త్రీలు, పిల్లల మాన మర్యాదలను కాపాడుకునే హక్కు, ఆక్రమణదారులకు వ్యతిరేకంగా తిరగబడే హక్కు స్థానిక ఆదివాసీలకు ఉందన్నారు.

సీపీఐ(మావోయిస్టు)నాయకత్వంలో కొనసాగుతున్న ప్రస్తుత విప్లవ పోరాటాన్ని మిర్దాల్ ప్రజాయుద్ధంగా ప్రకటించారు. ప్రభుత్వ ప్రాంతం నుంచి నక్సల్ ప్రాంతంలో ప్రవేశిస్తున్నప్పుడు దారి పొడవునా మాట్లు ఏర్పాటు చేసివుండడాన్ని గమనించి ఇది ప్రజాయుద్ధమనడానికి ఇవే ప్రబల నిదర్శనాలని పేర్కొన్నారు. గ్రామగ్రామాన స్థానిక మిలీషియా బృందాలు ఎదురుపడడం, జనతన సర్కార్ల ఆధ్వర్యంలో అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగుతుండడం చూసి స్ఫూర్తి పొందారు. పీఎల్‌జీఏ క్యాంపుల్లో సకల సౌకర్యాలు ఉండడం, సోలార్ సెల్స్‌తో కంప్యూటర్లు, ల్యాప్‌టాప్‌లు, ముద్రణాయంత్రాలు నడుస్తుండడం చూసి విముక్తి ప్రాంతాల కల నిజమైందన్నంతగా ఉద్వేగం చెందారు. లక్షల సంఖ్యలో పోలీసు, పారా మిలిటరీ బలగాలను మోహరించినా, వాయుసేన హెలికాప్టర్ల, మానవ రహిత విమానాల సేవలను ఉపయోగించుకున్నా ఉద్యమాన్ని నిర్మూలించలేకపోవడాన్ని నేతల మాటల్లో తెలుసుకున్నారు. మావోయిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి గణపతి ఎంతో పరిణతి చెందిన నాయకునిగా కనిపించారని కితాబిచ్చారు. భారత విప్లవోద్యమ దశ–దిశ విషయంలో అయనకు చాలా స్పష్టత ఉందని మెచ్చుకున్నారు. చారుమజుందార్ సూత్రీకరణలను సరిదిద్దుకోవడంలో, జాతుల పోరాటాలతో మైత్రిని కొనసాగించడంలో, ఎంఎల్ పార్టీల మధ్య ఐక్యత కోసం ఎలాంటి భేషజాలు లేకుండా కృషి చేయడంలో, పారిస్ కమ్యూన్ మొదలు చైనా సాంస్కృతిక విప్లవం వరకు గతానుభవాల నుంచి నేర్చుకోవడంలో మావోయిస్టు నేతలు చాలా వరకు విజయం సాధించారని అభిప్రాయపడ్డారు.

శాంతి చర్చల మూలంగానే ఆంధ్రప్రదేశ్‌లో ఉద్యమం దెబ్బతిన్నదనే విషయంలో అమరుడు ఆజాద్ మాటలను మిర్దాల్ ఉటంకించారు. "మేము ఆ కాలాన్ని మా రాజకీయాలను దేశ ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లడానికి ఉపయోగించుకున్నట్లుగానే ప్రభుత్వం మా అనుపానులను కనిపెట్టడానికి వాడుకున్నది. అయితే, ఆంధ్రప్రదేశ్‌లో మా వెనుకంజకు చర్చలు మాత్రమే కారణం కాదు. అక్కడి మా పార్టీలో అంతర్గతంగా ఉండిన ఎన్నో బలహీనతల ఫలితం అది." అని ఆజాద్ అన్నట్లు రాశారు. ఆ చర్చలు తమకు విలువైన పాఠాలు అందించాయని, భవిష్యత్ చర్చలకు మార్గదర్శకంగా ఉంటాయని చెప్పిన ఆజాద్ స్వయంగా సర్కారు శాంతిమంత్రానికి బలికావడం విషాదకర పరిణామమన్నారు.

మావోయిస్టు ఉద్యమం గురించిన అన్ని కోణాలనూ పుస్తకంలో తడిమిన మిర్దాల్ ఆ పార్టీకి ఒక హెచ్చరికను చేశారు. రాజ్యం ఉక్కుపాదం అత్యంత క్రూరమైనదని, ఎల్లవేళలా జాగరూకతను కనబర్చకపోతే ఓటమి తప్పదన్నారు. దండకారణ్యంలో ఇవాళ పార్టీకి పునాదిగా దళితులూ ఆదివాసులూ ఉన్నారు. వాళ్లు లేచి నిలిచారు. కానీ వాళ్లు దేశ జనాభాలో కేవలం 25 శాతం మాత్రమే. వాళ్లు లేచి నిలిచే లోపల జారిపోతే, ఇతర ప్రాంతాల్లో ప్రజలను పార్టీ సంఘటితం చేయలేకపోతే అప్పుడు ఈ తిరుగుబాటు 25 శాతం ప్రజల విప్లవంగానే మిగిలి, ఇతర దేశాల్లో తమ సహచరులు ఏ వైఫల్యాలను ఎదుర్కొన్నారో అలానే బలి కావచ్చు. మొత్తానికి మొత్తం తుడిచిపెట్టుకుపోవడం ఒక వాస్తవికత కావచ్చన్నారు. ఆ రకంగా 'భారత్‌పై అరుణతార' మావోయిస్టు పార్టీకి ఒక హెచ్చరిక సందేశాన్ని అందించినదని చెప్పవచ్చు. పుస్తకానికి అనుబంధంగా ఇచ్చిన గణపతి, మురళి, సోనులతో మిర్దాల్ జరిపిన సంభాషణలు పాఠకులకు ప్రస్తుత విప్లవోద్యమ వ్యూహం-ఎత్తుగడల విషయంలో స్పష్టతనిస్తాయి. దండకారణ్య ఉద్యమం నేటి స్థాయికి ఎదిగిన క్రమాన్ని తెలుపుతాయి.

మావోయిస్టు ఉద్యమం గురించి ఇన్ని విషయాలు చెప్పిన ఈ పుస్తకంలో ఓ లోపం కనబడుతుంది. ఒక విషయం చెబుతూ అనుకోకుండానే మరో విషయంలోకి వెళ్లడం పాఠకులను కొంత ఇబ్బంది పెడుతుంది. పాత చరిత్ర, ముఖ్యంగా యూరపు పరిణామాలు పదే పదే పునరావృతం కావడం అప్రస్తుతమేమోననిపిస్తుంది. అయితే దీనిని లోపంగా పేర్కొనడం భావ్యం కాదేమో. 1927లో పుట్టి, చిన్న వయస్సులోనే మార్క్స్, ఎంగెల్స్, లెనిన్‌ల రచనలను అవుపోసన పట్టి, ప్రపంచ దేశాలను పలుమార్లు చుట్టి, మావో, చౌఎన్‌లై వంటి మహా నేతలను కలిసి, వామపక్ష ఉద్యమాలతో విడదీయరాని అనుబంధాన్ని, సుదీర్ఘ జీవితానుభవాన్ని సంపాదించిన వ్యక్తికి అది అనివార్యమనిపిస్తుంది. పైగా, 84 ఏళ్ల వయస్సులో, తీవ్రమైన మోకాళ్ల నొప్పులతో బాధపడుతూ కూడా రహస్యంగా, ఒక నిషేధిత పార్టీ ఆధ్వర్యంలో గల ప్రాంతానికి వెళ్లి ఒకరకంగా దుస్సాహసమే చేసిన మిర్దాల్‌ను విమర్శించడం సమంజసమనిపించుకోదు. భారత్‌పై అరుణతార ఇంగ్లీష్ ప్రచురణకర్తలు పుస్తకం వెనుక అట్ట మీద ఉద్యమ పరిచయం రాస్తూ 'ఎన్నో లోపాలున్నప్పటికీ' అని రాస్తే దానిని 'ఎన్నో ఇబ్బందులున్నప్పటికీ' అని మార్చుకొమ్మని మిర్దాల్ పట్టుబట్టినారట. అదే ఈ పుస్తకానికీ వర్తిస్తుంది. ఆ ఇబ్బందిని పక్కన పెడితే 'భారత్‌పై అరుణతార' మేధావులు, ఉద్యమకారులు, సామాజిక కార్యకర్తలు, విద్యార్థులు, విప్లవాభిమానులు అందరూ తప్పక అధ్యయనం చేయాల్సిన పుస్తకం.

***(నమస్తే తెలంగాణ, 25-06-2012)***

# అబూజ్‌మాడ్‌లో ఏం జరుగుతోంది..?

సెరిబ్రల్ మలేరియాతో తెహెల్కా ఫొటోగ్రాఫర్ తరుణ్ శెహ్రావత్ మరణించడంతో అబూజ్‌మాడ్ ప్రాంతం మరోసారి వార్తల్లోకెక్కింది. మహిళా జర్నలిస్టు తుషా మిట్టల్‌తో కలిసి గత ఏప్రిల్‌లో ప్రత్యేక కథనం కోసం శెహ్రావత్ మాడ్ కొండల పైకి వెళ్లారు. వారం రోజుల పాటు తిరిగి అక్కడ జరుగుతున్నదేమిటో తెలుసుకుని బయటకు వచ్చారు. తమతో పాటు మాడ్ వాసుల జీవన పరిస్థితులు, మావోయిస్టుల నేతృత్వంలో అక్కడ ఏర్పడిన జనతన సర్కార్లు, వారికి, పోలీసు బలగాలకు మధ్య జరుగుతున్న యుద్ధం తదితర అంశాలకు సంబంధించిన విలువైన సమాచారం మోసుకువచ్చారు. అయితే, శతాబ్దాలుగా మాడ్‌గోండులను పట్టిపీడిస్తున్న మలేరియా మహమ్మారి వారిని వెన్నంటి వచ్చింది. ఇద్దరూ మంచం పట్టారు. ఆధునిక వైద్యం శెహ్రావత్‌ను కాపాడలేకపోయింది. మే 15న ఆ కలం యోధుడు అంతిమశ్వాస విడిచాడు. కాగా, తుషా మిట్టల్ ఆస్పత్రి బెడ్‌పై మృత్యువుతో పోరాటం కొనసాగిస్తోంది. అబూజ్‌మాడ్‌లో జరుగుతున్నదేమిటో, అక్కడి ప్రజల కష్టాలేమిటో లోకానికి తెలియజెప్పిన ఈ ఇద్దరు జర్నలిస్టుల సాహసాన్ని పత్రికా ప్రపంచం కొనియాడింది. మావోయిస్టు పార్టీ సైతం వీరిని ఆదివాసుల మిత్రులుగా పేర్కొంటూ శెహ్రావత్ కుటుంబానికి సంతాపం తెలిపింది. తుషా త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించింది.

ఒకప్పుడు దుర్భేద్యమైన, సర్వే జరగని ప్రాంతంగా వినుతికెక్కిన అబూజ్‌మాడ్‌కు ఇటీవలికాలంలో సందర్శకులు పెరిగారు. 2009 ఆగస్టు నుంచి కేంద్ర–రాష్ట్ర ప్రభుత్వాలు ఆపరేషన్ గ్రీన్‌హంట్ పేరిట వేలాది పోలీసు పారా మిలిటరీ బలగాలను మోహరించి మావోయిస్టులపై అప్రకటిత యుద్ధాన్ని ఆరంభించిన నేపథ్యంలో సహజంగానే అందరి దృష్టి బస్తర్‌పై పడింది. మనుగడ కోసం ఒకరు, ఆధిపత్యం కోసం మరొకరన్నట్లు ఇరుపక్షాలూ పరస్పరం భారీ దాడులకు పూనుకుంటుండడం, ప్రాణనష్టాలు పెరగడంతో మీడియా కూడా ఈ ప్రాంత పరిణామాలపై కేంద్రీకరించింది. మావోయిస్టు ఉద్యమ ప్రాబల్యం అధికంగా ఉన్న దంతేవాడ, బీజాపూర్, నారాయణ్‌పూర్ జిల్లాలకు జర్నలిస్టుల

రాకపోకలు పెరిగాయి. ఈ సందర్భంగా మావోయిస్టులకు తిరుగులేని కోటగా, ప్రధాన స్థావరంగా ఉన్న అబూజ్‌మాడ్ సహజంగానే అందరినీ ఆకర్షించింది. గౌతం నవలఖా, రాహుల్ పండిత, సత్నామ్‌సింగ్ మొదలు తెహెల్కా బృందం వరకు ఎందరో జర్నలిస్టులు అబూజ్‌మాడ్‌ను సందర్శించారు. ఎన్నో ఆసక్తికరమైన కథనాలను అందించారు.

ఇంతకూ అబూజ్‌మాడ్ చరిత్ర ఏమిటి? అబూజ్‌మాడియాల జీవన విధానం ఎలా ఉంటుంది? సంస్కృతీ సంప్రదాయాల మాటేమిటి? మావోయిస్టులు అక్కడ పాగా ఎలా వేయగలిగారు? ప్రభుత్వ బలగాలు అక్కడికి ఎందుకు చేరుకోలేకపోతున్నాయి? ఇలాంటి అంశాలు మనలో ఆసక్తిని కలుగజేస్తాయి. పన్నెండేళ్ల కిందట కొత్తగా ఏర్పడిన ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో బస్తర్ అతిముఖ్యమైన ప్రాంతం. పూర్తిగా ఆదివాసులు నివసించే ప్రాంతం. అడవులు, నదులు, ఖనిజ వనరులు దండిగా ఉన్న ప్రాంతం. ఒకప్పుడు ఒకే జిల్లాగా ఉన్న బస్తర్‌ను ఇప్పుడు ఏడు జిల్లాలుగా విభజించారు. ఈ ఏడు జిల్లాల్లో ఒకటైన నారాయణపూర్‌తో పాటు మహారాష్ట్రలోని గడిచిరోలి జిల్లా భామ్రాగడ్ తాలూకాలో అబూజ్‌మాడ్ కొండలు విస్తరించివున్నాయి. ఉత్తరం నుంచి దక్షిణానికి 80 కి.మీ.లు, పడమటి నుంచి తూర్పునకు 50 కి.మీ.ల మేరకు వ్యాపించిన మాడ్ ప్రాంతం విస్తీర్ణం 4వేల చదరపు కి.మీ.లు. ఇక్కడున్న చిన్నా పెద్ద పల్లెలు 237 కాగా, జనాభా సుమారు 35వేలు. ఒకే ఒక ఇల్లున్న జనావాసం కూడా ఇక్కడ గ్రామం కిందికే వస్తుంది. వంద ఇండ్లుంటే చాలు దాన్ని పెద్ద గ్రామంగా భావిస్తారు.

ఇక్కడ నివసించే ఆదిమ తెగ పేరు మాడియా గోండులు. వీరి జీవన విధానం, సంస్కృతీ సంప్రదాయాలు విభిన్నమైనవి. వైవిధ్యంతో కూడుకున్నట్టివి. ప్రకృతితో విడదీయరాని సంబంధం కలిగినట్టివి. పోడు వ్యవసాయం, జంతువుల, చేపల వేట, ఆకులు అలములు, పండ్లు ఫలాల సేకరణ వీరి ప్రధాన ఆర్థిక కార్యకలాపాలు. మొన్నమొన్నటి వరకూ వీళ్లు కేవలం ఉప్పు, బాణాలకు వాడే ఇనుపభాగాలు, పంచెల కోసం మాత్రమే గుట్టలు దిగి నారాయణపూర్ అంగడికి వెళ్లేవారు. ఇక వీరి (పోడు)వ్యవసాయం విచిత్రంగా సాగుతుంది. కొండవాలును ఎంచుకుని అక్కడున్న చెట్లను నరికి తగులబెట్టి వానలు పడగానే కొహ్‌లా అనే ధాన్యపు గింజలను చల్లుతారు. అటుపైన ఎలాంటి మానవశ్రమ లేకుండానే చేతికి వచ్చిన పంటను దంచి అన్నంలా వండుకుంటారు. నాగలి దున్నడం వీరికి తెలియదు. బియ్యపన్నంతో పోల్చితే సగం కూడా పోషకవిలువలు లేని కొహ్‌లాను గట్కలా వండుకుంటారు. కూరగా పచ్చి లేదా ఎండిన మాంసం, చేపలు, అడవిలో విస్తృతంగా దొరికే బొప్పాయి, గోంగూర, ఇతర ఆకుకూరలను ఉపయోగిస్తారు. నూనె వాడకం చాలా తక్కువ. నివాసాలు ఎత్తైన ప్రదేశంలో ఉంటాయి. ఎంత ఎత్తులో ఉన్నప్పటికీ సమీపంలోనే అన్ని కాలాల్లో ప్రవహించే చిన్నచిన్న

సెలయేళ్లు ఉంటాయి. అడవిలో దొరికే వెదురుబొంగులు, ఇతర కలప, నదీతీరంలో పెరిగే ఒకరకం గడ్డితో ఇళ్లు నిర్మించుకుంటారు. ఇళ్లు సాధారణంగా చిన్నవిగా ఉండి ఒక జంట నివసించడానికి అనువుగా ఉంటాయి. పెళ్లయిన ప్రతి జంటకూ ఓ ఇంటిని నిర్మించి ఇవ్వడం ఇక్కడ ఆనవాయితీ.

పెళ్లికాని యువతీ యువకులు నిద్రించడానికి ఉద్దేశించిన గోటుల్ ఈ తెగలోని మరో ప్రత్యేకత. ప్రతి పల్లెలోనూ గోటుల్ ఉంటుంది. పాలు మరిచిన పిల్లల నుంచి యుక్తవయస్సు అమ్మాయిలు, అబ్బాయిల వరకు గోటుల్‌లో సభ్యులుగా ఉంటారు. సీనియర్ సభ్యుడొకరు గోటుల్ పెద్దగా ఉంటూ ఇక్కడ జరిగే కార్యకలాపాలను పర్యవేక్షిస్తుంటాడు. పగలంతా తల్లిదండ్రులతో పాటు ఉంటూ రకరకాల పనులు చేసే పిల్లలు సాయం సమయం కాగానే గోటుల్ వద్దకు చేరతారు. ఆటపాటల్లో నిమగ్నమవుతారు. గానాబజానా, డ్యాన్సులు మొదలవుతాయి. చివరకు అలసిపోయి ఏ రాత్రికో నిద్రిస్తారు. ఈ ఆటపాటల క్రమంలో యువతీ యువకుల మధ్య ప్రేమ ఏర్పడడం, సన్నిహితం కావడం సహజంగానే జరుగుతుంది. అలా పరస్పరం ఇష్టపడినవారి మధ్య లైంగిక సంబంధాలు వీరి సమాజంలో తప్పు కాదు. ఇలాంటి జంటలు పెద్దల అంగీకారంతో పెళ్లి చేసుకుని వేరు కాపురం పెడతాయి. పెళ్లయిన మరుక్షణం వీరు గోటుల్ సభ్యత్వం కోల్పోతారు. మాడ్ గుట్టల కింద మైదాన అటవీప్రాంతాల్లో నివసించే మాడియాల్లో కూడా గోటుల్ ఆచారం ఉన్నా రాత్రిపూట ఆటపాటల తర్వాత ఎవరి ఇళ్లకు వారు వెళ్లి నిద్రించడంగా పరిణామం చెందింది. వస్త్రధారణ విషయానికి వస్తే, మావోయిస్టులు ప్రవేశించేవరకూ ఇక్కడి స్త్రీలు పంచె లాంటి ముతక వస్త్రాన్ని నడుముకు చుట్టుకునేవారు. ఛాతీపైన ఎలాంటి ఆచ్ఛాదనా ఉండేది కాదు. ప్రస్తుతం పెళ్లికాని అమ్మాయిలు బ్లౌజులు ధరిస్తున్నారు. ఇక, పురుషులు బుడ్డగోచీ పెట్టుకుంటారు.

మొత్తంగా చూస్తే అబూజ్‌మాడియాల జీవనం దినదినం ప్రకృతితో పోరాటమయమని చెప్పవచ్చు. వెనుకబడిన ఆర్థిక విధానం, పురాతన సంస్కృతితో పాటు ప్రాథమిక సౌకర్యాలు లేని లోటు ఇక్కడ కొట్టొచ్చినట్లు కనబడుతుంది. ఆస్పత్రులు లేవు.. రోడ్లు లేవు.. కరెంటు లేదు.. పాఠశాలలు లేవు.. అన్నింటికంటే ముఖ్యంగా మార్కెట్ లేదు.. దోపిడి లేదు.. ప్రపంచీకరణ వాసనలు లేవు.. స్థానిక వనరులపై కన్నేసిన పరాయిలు లేరు. కారల్ మార్క్స్ చెప్పిన ఆదిమ కమ్యూనిస్టు సమాజం తరహాలో ప్రజలు జీవించేవారు.

1947 తర్వాత అబూజ్‌మాడ్‌లో కొన్ని మార్పులు చోటు చేసుకున్నాయి. భారత ప్రభుత్వ ప్రతినిధులుగా అటవీ, పోలీసు విభాగాలకు చెందిన సిబ్బంది ఇక్కడి పల్లెల్లోకి

రావడం ప్రారంభమైంది. తుపాకులతో భారీ సంఖ్యలో రావడం, ఆదివాసులు సేకరించుకున్న ఇప్పపువ్వు తదితర అటవీ ఉత్పత్తులను, పెంచుకున్న కోళ్లను ఎత్తుకెళ్లడం జరిగేది. 1970లలో అబూజ్‌మాడ్ గుట్టల అంచున ఉత్తరాన దల్లీ–రాజ్హరా ప్రాంతంలో ఇనుప గనుల తవ్వకం మొదలైంది. 80లలో కుతుల్ లాంటి చోట్ల రామకృష్ణ మిషన్ ఆధ్వర్యంలో ఆశ్రమ పాఠశాలలను స్థాపించారు. సోన్‌పూర్, ఛోటాఢోంగర్ వంటి పెద్దగ్రామాలకు మట్టిరోడ్లను నిర్మించారు. అయితే, ఈ పరిణామాలేవీ అబూజ్‌మాడియాల బతుకుల్లో మార్పు తేలేకపోయాయి.

ఈ క్రమంలో 1985లో మాడ్ కొండల పైకి మొట్టమొదటిసారిగా మావోయిస్టులు అడుగుపెట్టారు. అప్పటికి పీపుల్స్‌వార్ పేరుతో ఉన్న ఆ పార్టీ నాయకత్వంలో అటు గడ్‌చిరోలిలోనూ, ఇటు బస్తర్‌లోనూ బలమైన విప్లవోద్యమం కొనసాగుతోంది. ప్రజాసంఘాలు చురుగ్గా పని చేస్తున్నాయి. ఈ నిర్మాణాలే దన్నుగా మాడ్‌లోకి గెరిల్లా దళాలు విస్తరించాయి. మనుగడ కోసం ప్రకృతితో పోరాడుతున్న అబూజ్‌మాడియాలతో చెలిమి చేశాయి. వారిని వేధిస్తున్న అటవీ సిబ్బందిని తరిమికొట్టాయి. ఆధునిక పద్ధతుల్లో వ్యవసాయం చేయడం ఎలాగో చూపాయి. కూరగాయలు పండించడం నేర్పాయి. గోటుల్ వ్యవస్థలో మహిళకు జరుగుతున్న అన్యాయాన్ని అర్థం చేయించాయి. బ్లౌజులు ధరించడాన్ని కేంపెయిన్‌గా కొనసాగించి మహిళల గౌరవాన్ని నిలబెట్టాయి. వారి ఆటల్లో ఆటగా, పాటల్లో పాటగా నిలుస్తూ అభిమానాన్ని చూరగొన్నాయి.

ఈ అభిమానం, ఆత్మీయతలే ప్రాతిపదికగా ఇక్కడ మావోయిస్టులు బలపడ్డారు. దట్టమైన అడవులు, ఎత్తైన కొండలతో స్థానికుల అండ లేకుండా అపరిచితులెవ్వరూ ప్రవేశించ వీలుగాని ఈ ప్రాంతాన్ని సైనిక శిక్షణకు, విశ్రాంతికి, బలగాల సమీకరణకు, నాయకత్వం తలదాచుకోవడానికి విస్తృతంగా వాడుకున్నారు. ఈ విషయాన్ని 1995 నాటికి గాని పోలీసు బలగాలు పూర్తిస్థాయిలో పసిగట్టలేదు. ఆ వెంటనే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అబూజ్‌మాడ్‌పై దృష్టి కేంద్రీకరించాయి. అభివృద్ధి పథకాలు, వ్యవసాయ శిక్షణ పేరుతో, హోంగార్డు ఉద్యోగాల ఎరతో కొంతమంది స్థానిక యువకులను ఇన్ఫార్లర్లుగా మార్చుకోవడానికి ప్రయత్నించాయి. అప్పుడప్పుడు గుట్టల అంచుల్లో ఉన్న గ్రామాలకు పోలీసులు వెళ్లి దాడులు చేయడం, గిరిజనులను నిర్బంధించడం, దళాల గురించి నిర్దిష్ట సమాచారమున్నప్పుడు కాల్పులకు పాల్పడడం చేశాయి. 1996లో వేయి మంది బలగాలకు నాయకత్వం వహించిన అప్పటి బస్తర్ ఎస్పీ 15రోజుల పాటు ఆపరేషన్ నిర్వహించి మొట్టమొదటిసారిగా మాడ్ లోతట్టుకు ప్రవేశించిన అధికారిగా పేరు తెచ్చుకున్నారు.

కాగా, శత్రు ఎత్తుగడల్లో మార్పును గమనించిన మావోయిస్టులు తర్వాతికాలంలో

తమ ఎత్తుగడలనూ మార్చుకున్నారు. అప్పటిదాకా షెల్టర్ జోన్‌గా ఉన్న మాడ్‌ను ఒక ప్రత్యేక డివిజన్‌గా సంఘటితం చేశారు. గ్రామగ్రామాన పార్టీ, ప్రజాసంఘాల నిర్మాణంపై కేంద్రీకరించారు. రాజ్యాధికార అంగాలైన జనతన సర్కార్లను ఏర్పరచారు. స్థానిక యువతీ యువకులను పెద్దయెత్తున దళాల్లో చేర్చుకున్నారు. పీఎల్‌జీఏ దళాలను ప్లాటూన్లుగా, కంపెనీలుగా కలిపేసి చిన్న సంఖ్యలో లోపలికి చొచ్చుకురావడానికి యత్నించిన పోలీసుబలగాలపై ఎప్పటికప్పుడు దాడులు చేస్తూ వచ్చారు. అలా 2008 నాటికి అబూజ్‌మాడ్‌ను పెద్ద సంఖ్యలో వెళితే తప్ప శత్రువు ప్రవేశించ వీలుగాని గెరిల్లా స్థావరంగా అభివృద్ధి చేశారు.

***(నమస్తే తెలంగాణ, 10-07-2012)***

# అబూజ్‌మాడియాలకు ముప్పు!

మధ్యభారతంలో ప్రస్తుతం నెలకొనివున్న యుద్ధవాతావరణం అబూజ్‌మాడ్‌లో పెనుసంక్షోభాన్ని సృష్టించింది. ఇంతకాలం ప్రకృతి ఒడిలో హాయిగా ఆడుతూ పాడుతూ స్వేచ్ఛగా, దర్జాగా బతికిన మాడియా గోండులు ఏ క్షణం ఏం జరుగుతుందో, ఎటువైపు నుంచి ఏ ఆపద ముంచుకురానుందో తెలియక భయంభయంగా బతుకుతున్నారు. ఉధృతంగా సాగుతున్న మావోయిస్టుల కార్యకలాపాలు, ఆ కార్యకలాపాల అణచివేత పేరిట కేంద్ర, రాష్ట్ర బలగాల ముప్పేట దాడులు కలిసి వారి సమాజాన్ని అతలాకుతలం చేస్తున్నాయి. శిక్షణ స్కూలు నెపంతో గుట్టల అంచున భారత సైన్యం పాగా వేసింది. అనునిత్యం ఆకాశంలో హెలికాప్టర్లు, మానవరహిత విమానాలు ఎగురుతున్నాయి. సరుకుల కోసం సంతకు వెళ్లిన వ్యక్తులు అదృశ్యమవుతున్నారు. సీఆర్‌పీఎఫ్, కోబ్రా దళాలు తరచూ వేల సంఖ్యలో కదిలివచ్చి గ్రామాలపై దండెత్తి గుడిసెలను తగులబెడుతున్నాయి. దొరికిన వారందరినీ చితకబాదడం, పారిపో ప్రయత్నిస్తే విచక్షణారహితంగా కాల్చడం, ఆడవాళ్లపై అత్యాచారాలు సర్వసాధారణమయ్యాయి. ఇంకోవైపు, ఇటీవల బలగాలు నిర్వహించిన ఆపరేషన్ హాకా, ఆపరేషన్ విజయ్‌ల అసలు లక్ష్యం మాడ్‌వాసులను భయపెట్టి గుట్టలపై నుంచి పారదోలడమేనంటున్నారు. మరో రెండేళ్లలో ఈ ప్రాంతాన్ని నేరుగా సైన్యమే ఆక్రమించుకుని వామపక్ష తీవ్రవాదంపై భవిష్యత్తులో చేయబోయే అంతిమ యుద్ధంలో హెడ్‌క్వార్టర్స్‌గా ఉపయోగించుకోనుందన్న వార్తలు కూడా వెలువడుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రపంచంలోనే అతి ప్రాచీనమైన తెగగా గుర్తింపు పొందిన అబూజ్‌మాడియాల అస్తిత్వానికి ప్రమాదమేర్పడిందని పలువురు మేధావులు, సామాజిక కార్యకర్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఒకవైపు మూలవాసులకు(ఇండియన్లకు) యూరోపు నుంచి వలస వచ్చిన తెల్లజాతి చేసిన అకృత్యాలు, అన్యాయాలకు గాను బేషరతుగా అమెరికా, ఆస్ట్రేలియా తదితర దేశాల ప్రభుత్వాలు బహిరంగంగా క్షమాపణలు చెబుతున్న కాలంలో భారత పాలకులు ద్రవిడులందరి పూర్వీకులుగా భావిస్తున్న మాడియా తెగపై యుద్ధం ప్రకటించడమేమిటని ప్రశ్నిస్తున్నారు.

మావోయిస్టులపై నిర్ణయాత్మక యుద్ధం చేయాలని కేంద్రం నిశ్చయించడానికి బలమైన కారణాలున్నాయి. 1990ల తర్వాత ప్రపంచీకరణ, ప్రైవేటీకరణ, సరళీకరణ విధానాల నేపథ్యంలో అనేక బహుళజాతి కంపెనీలు మధ్యభారతంలో తిష్ఠ వేశాయి. అక్కడ అపారంగా ఉన్న ఖనిజవనరులపై లెక్కలేనన్ని ఎంఓయూలను ఆయా రాష్ట్ర ప్రభుత్వాలతో కుదుర్చుకున్నాయి. ఈ ప్రాంతంలోని ప్రతి గుట్టపై, ప్రతి చెట్టుపై ఒప్పందాలు ఉన్నాయని ప్రముఖ రచయిత్రి అరుంధతీరాయ్ ఊరికేనే వ్యాఖ్యానించలేదు. 2009 సెప్టెంబర్ నాటికి ఈ ఎంఓయూల విలువ రూ.8 లక్షల 73 వేల 896 కోట్లకు చేరింది. 1/70 చట్టాన్ని అపహాస్యం చేస్తూ గనుల పేరిట, కర్మాగారాల పేరిట, విద్యుత్‌ప్లాంట్ల పేరిట జార్ఖండ్, ఒరిస్సా, ఛత్తీస్‌గఢ్‌లలో వేలాది ఎకరాల ఆదివాసీ భూములను కార్పొరేట్లకు కట్టబెట్టడం మొదలైంది. అభివృద్ధి పేరిట కొనసాగుతున్న ఈ జీవన విధ్వంసానికి వ్యతిరేకంగా సహజంగానే ఈ ప్రాంతాల్లో ప్రాబల్యశక్తిగా ఉన్న మావోయిస్టు పార్టీ స్థానికులను కూడగట్టింది. పనులు మొదలైన ప్రతిచోటా ప్రతిఘటనా పోరాటాలు చేపట్టింది. కార్పొరేట్ ఆస్తులపై, సిబ్బందిపై దాడులు చేసింది. ఫలితంగా అనేక ప్రాజెక్టులు మధ్యలోనే ఆగిపోయాయి. ఈ పరిస్థితిని బేరీజు వేసుకున్న కంపెనీలు మావోయిస్టుల మూలంగా తమ పెట్టుబడులకు పొంచివున్న ప్రమాదం గురించి అగ్రరాజ్యంతో, ప్రపంచబ్యాంకుతో, భారతప్రభుత్వంతో మొరపెట్టుకున్నాయి. పెట్టుబడులకు అనుకూల వాతావరణం కల్పించకుండా దేశ ఆర్థికాభివృద్ధి ఎలా సాధ్యమని నానా యాగీ చేశాయి.

2008 సెప్టెంబర్‌లో అమెరికా వెళ్లివచ్చినప్పటి నుంచి దేశ అంతర్గత భద్రతకు అతిపెద్ద ముప్పు వామపక్ష తీవ్రవాదమేనని ప్రకటిస్తున్న ప్రధానమంత్రి మన్మోహన్‌సింగ్, హోంమంత్రి చిదంబరంల వ్యాఖ్యలను మనం ఈ నేపథ్యంలోనే చూడాల్సివుంటుంది. ఆపరేషన్ గ్రీన్‌హంట్ కార్యక్షేత్రం కూడా మధ్యభారతమే కావడం కూడా యాదృచ్ఛికం కాదు. మన ప్రధాని అమెరికా యాత్ర, ఆ తర్వాత కార్పొరేట్ పెద్దలు, ప్రభుత్వాధికారులు, మిలిటరీ నిపుణులతో కూడిన అమెరికా బృందం ఇక్కడికి వచ్చి ఢిల్లీ, రాయ్‌పూర్‌లలో మంతనాలు సాగించడం ఫలితంగానే ఆపరేషన్ గ్రీన్‌హంట్‌కు రూపకల్పన జరిగిందని మావోయిస్టు పార్టీ ఆరోపించిన విషయాన్ని ఇక్కడ గమనించాలి. మొన్నటి వరకు జమ్మూ–కాశ్మీర్‌లో ఇస్లామిక్ ఉగ్రవాదులతో, ఈశాన్యంలో వేర్పాటువాదులతో పోరాటంలో తీరిక లేకుండా ఉన్న సైనిక, పారామిలిటరీ బలగాలు ఇటీవల అక్కడ పాక్షికంగా ప్రశాంత పరిస్థితులు ఏర్పడి మరోచోట మోహరించడానికి సిద్ధంగా ఉండడం ఇందుకు అనుకూలించింది.

అలా 2009 సెప్టెంబర్‌లో గ్రీన్‌హంట్ మొదలై విరామం లేకుండా కొనసాగుతోంది.

జార్ఖండ్‌లోని సరాండా, గఢ్వా అడవుల్లో, పశ్చిమబెంగాల్‌లోని లాల్‌గఢ్‌లో, ఆంధ్ర–ఒరిస్సా సరిహద్దుల్లో కూడా బలగాల మోహరింపు జరిగినప్పటికీ ఈ ఆపరేషన్ ప్రధాన దిశను మాత్రం బస్తర్ వైపు, అదీ అబూజ్‌మాడ్ కొండల వైపు కేంద్రీకరించారనేది నిర్వివాదాంశం. యుద్ధ ప్రాతిపదికన ఈ ప్రాంతాన్ని సర్వే చేయించడంతో పాటు తొలిసారిగా మానవరహిత విమానాలను సైతం ప్రవేశపెట్టారు. వాయుసేన హెలికాప్టర్ల సహాయాన్ని తీసుకున్నారు. ఒక్క బస్తర్ డివిజన్‌లోనే సుమారు 60వేల పారామిలిటరీ, స్థానిక పోలీసు బలగాలను మోహరించి విస్తృతంగా కూంబింగ్ ఆపరేషన్లు చేపట్టారు. అనేక గ్రామాల్లో మావోయిస్టుల ముద్రవేసి అమాయక గిరిజనులను డజన్ల కొలది బలితీసుకున్నారు. సల్వాజుడుం ముసుగులో బీభత్సకాండ సృష్టించారు.

అయినప్పటికీ గ్రీన్‌హంట్ అనుకున్న ఫలితాలు సాధించలేకపోయింది. ఉద్యమం ఏ మాత్రం బలహీనపడకపోగా, ఏరియా, జిల్లా స్థాయిల్లో జనతన సర్కార్లు ఏర్పడి బస్తర్ సామాజిక, ఆర్థిక కార్యకలాపాలను శాసించే స్థితికి ఎదిగాయి. గెరిల్లాల సంఖ్యతో పోల్చితే ప్రభుత్వ బలగాలకు చెందిన జవాన్లే అధిక సంఖ్యలో ప్రాణాలు కోల్పోయారు. ముఖ్యంగా, చింతల్నార్ తదితర ఘటనల్లో భారీ సంఖ్యలో జవాన్లను కోల్పోతుండడంతో కేంద్రం ఆలోచనలో పడింది. ఈ నేపథ్యంలో కేంద్ర హోం శాఖ 2011 ఆరంభంలో ప్రత్యామ్నాయాలపై దృష్టి పెట్టింది. చిదంబరం లాంటివాళ్లు నేరుగా సైన్యాన్ని రంగంలోకి దింపాలని వాదించగా, ఆంటోనీ తదితరులు ఈ ప్రతిపాదనను వ్యతిరేకించారు. అంతా కలిసి మధ్యేమార్గాన్ని ఆమోదించారు. గ్రీన్‌హంట్ రెండవ దశను ప్రకటించారు. గత మూడేళ్లుగా గ్రీన్‌హంట్ నుంచి నేర్చిన పాఠాలు, కేంద్ర ఇంటెలిజెన్స్ సమాచారం వారిని అబూజ్‌మాడ్‌పైన కేంద్రీకరించేలా చేశాయి. ఈ కొండలను స్వాధీనం చేసుకోవడం ద్వారా బస్తర్ ఉద్యమాన్ని ఆత్మరక్షణలో పడవేయాలని తీర్మానించారు.

అయితే, భవిష్యత్తులో అనుసరించేందుకు సైన్యం ప్రధాన పాత్రగా పకడ్బందీ పథకాన్ని రూపొందించారు. బస్తర్ డివిజనల్ కేంద్రం జగ్దల్‌పూర్‌లో 15 వేల సైన్యంతో ఆర్మీ సబ్ ఏరియా కమాండ్ హెడ్‌క్వార్టర్స్‌ను, భిలాయ్ సమీపంలో వాయుసేన స్థావరాన్ని, బిలాస్‌పూర్‌లో ఆర్మీ బ్రిగేడ్ హెడ్‌క్వార్టర్స్‌ను, అబూజ్‌మాడ్‌పై సైనిక శిక్షణ స్కూలును ఏర్పాటుచేయడానికి నిర్ణయించారు. గత సంవత్సరం జూన్‌లో మూడువేల మంది సైనికులు (ఒక బ్రిగేడ్) శిక్షణ స్కూలు ఏర్పాటు సన్నాహాల్లో భాగంగా బస్తర్‌లోని కొండగాంకు వచ్చి మకాం చేశారు. వీరు ఏర్పాటు చేసుకున్న తాత్కాలిక సైనిక శిబిరానికి మొన్న ఏప్రిల్ రెండవవారంలో అప్పటి ఆర్మీ చీఫ్ వీ కే సింగ్ సైతం వచ్చి ఏర్పాట్లను పర్యవేక్షించారు. హెలికాప్టర్ నుంచి మాడ్ కొండల టెర్రయిన్‌ను సైతం పరిశీలించారు. ఈ సన్నాహాలను గమనిస్తే సమీప భవిష్యత్తులో మావోయిస్టులపై సైన్యాన్ని ప్రయోగించే

సూచనలు కనబడుతున్నాయని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. శిక్షణలో ఉన్న సైనికులు మావోయిస్టులపై ఎలాంటి చర్యలూ చేబట్టబోరని సైన్యాధికారులు పదే పదే స్పష్టం చేస్తున్నప్పటికీ అది నమ్మశక్యంగా లేదని వారంటున్నారు. సుమారు 800 చ.కి.మీ.ల స్కూలు పరిధిలోని అడవుల్లో సంచరించే సైనికులకు మావోయిస్టులు తారసపడ్డా లేక శిక్షణార్థులు హద్దులను దాటి అవతలకు వెళ్లినా ఇరువర్గాల మధ్య ఘర్షణ తప్పదని వివరిస్తున్నారు. కార్యకలాపాల నిబంధనావళి(ఎస్ఓపీ) ప్రకారం ఆర్మీకైనా, వాయుసేనకైనా ఆత్మరక్షణ కోసం కాల్పులు జరిపే వెసులుబాటు ఉంది కనుక ఏం జరుగుతుందో ప్రత్యేకించి చెప్పనక్కరలేదంటున్నారు. ఇప్పటివరకూ దేశంలో జరిగిన నిజమైన, బూటకపు ఎన్‌కౌంటర్లన్నింటికీ ఆత్మరక్షణార్థం జరిపిన కాల్పులే కారణమన్న విషయాన్ని గుర్తు చేస్తున్నారు.

ఇక, అబూజ్‌మాడ్ కొండలను భూతలం నుంచి క్షుణ్ణంగా రెక్కీ చేయడం కోసమే ఈ స్కూలును ఏర్పాటు చేశారన్న వాదన కూడా ప్రచారంలో ఉంది. ఏమైనా ఈ పరిణామాలను, వాదనలను పరిశీలిస్తే మరో రెండు మూడేళ్లలో మాడ్‌లో పూర్తిస్థాయి సైనికచర్య జరగనుందన్న విషయాన్ని అంచనా వేయవచ్చు. అలాంటి పరిస్థితుల్లో అబూజ్‌మాడియాల భవిష్యత్తు ఏమిటన్నది ఇక్కడ ఆలోచించాల్సిన విషయం. స్కూలు పేరుతో వారి మాతృభూమిలో ఐదవ వంతు భూభాగాన్ని లాక్కోనున్న పాలకులు ఈ లోపే వారిని తమ ఇళ్ల నుంచి, ఊళ్ల నుంచి తరిమివేసేందుకు పథకాలు రూపొందిస్తున్నారు. ఇటీవల నిర్వహించిన ఆపరేషన్ హాకా, విజయ్‌లు ఇందులో భాగంగానే కొనసాగాయన్నది స్పష్టమే.

మాడ్ గోండుల అస్తిత్వానికి ముప్పు తెచ్చే పాలకుల కుట్రను ప్రజలు, ప్రజాస్వామికవాదులు వ్యతిరేకించాలి. మావోయిస్టులు అభివృద్ధి నిరోధకులు, ప్రజా వ్యతిరేకులని ప్రభుత్వాలు భావించి, వారిని నిర్మూలించడమే తమ విధానమని ప్రకటించినా ఆ కోపాన్ని అమాయక ఆదివాసులపై, ఓ అరుదైన ప్రాచీన తెగపై చూపించడం అన్యాయం. నక్సలైటు ఉద్యమం శాంతిభద్రతల సమస్య కాదని, సామాజిక, ఆర్థిక కారణాలే ప్రజలను, యువతీ యువకులను మావోయిజం వైపు నెడుతున్నాయని పలు కమిటీలు ఇప్పటికే తేల్చాయి. ప్రధాని సహా పలువురు కేంద్ర మంత్రులు సైతం ఈ విషయాన్ని ఒప్పుకుంటున్నారు. మావోయిస్టు సమస్యకు శాంతిచర్చలే పరిష్కార మార్గమని స్వామి అగ్నివేశ్ లాంటి సామాజిక కార్యకర్తలు ఎప్పటి నుంచో మొత్తుకుంటున్నారు. అయినప్పటికీ పాలకులు కన్ను తెరవకపోవడం దురదృష్టకరం. మావోయిస్టులకు ప్రజల మద్దతే లేకపోతే ఎన్ని వేల బలగాలను దించినా ఉద్యమం బలహీనపడకపోగా కొత్త ప్రాంతాలకు ఎందుకు విస్తరిస్తున్నదో పౌర సమాజం

ఆలోచించాలి. అభివృద్ధి నిరోధకులే అయితే గ్రామాల్లో వ్యవసాయాభివృద్ధికి, చెరువుల నిర్మాణానికి, విద్య, వైద్య వసతుల కల్పనకు ఎందుకు పాటుపడుతున్నారో అర్థం చేసుకోవాలి. అమాయక ఆదివాసీలపై బలగాల దమనకాండను ముక్తకంఠంతో ఖండించాలి. బాసగూడెం లాంటి ఘటనలు పునరావృతం కాకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి తేవాలి.

*(నమస్తే తెలంగాణ, 12-07-2012)*

# మానెసర్ హింసకు కారకులెవరు?

కార్ల తయారీ సంస్థ మారుతి సుజుకి మానెసర్ యూనిట్‌లో ఇటీవల జరిగిన హింసాత్మక ఘటనలు దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించాయి. హక్కుల సాధన కోసం ఉద్యమించిన కంపెనీ కార్మికులకు, మెట్టు దిగని యాజమాన్యానికి మధ్య తలెత్తిన ఘర్షణ కాస్తా జూలై 18న ఉద్రిక్తతలకు దారితీసింది. యాజమాన్యం తరఫున బౌన్సర్లు(ప్రైవేట్ సెక్యూరిటీ) కార్మికులపై విచక్షణారహితంగా దాడి చేయగా, కోపోద్రిక్తులైన కార్మికులు కర్మాగారపు కార్యాలయానికి, మెయిన్ గేటుకు నిప్పు పెట్టారు. ఈ గొడవలో సంస్థకు చెందిన జనరల్ మేనేజర్ అవనీష్ కుమార్ దేవ్ సజీవ దహనం కాగా 100కు పైగా సూపర్‌వైజర్లు, కార్మికులు గాయపడ్డారు. ఈ అల్లర్ల నేపథ్యంలో ఫ్యాక్టరీని లాకవుట్ చేస్తున్నట్లు యాజమాన్యం ప్రకటించింది. కేంద్రపాలిత ప్రాంతం యానాంలో గత జనవరిలో జరిగిన ఘటనల తర్వాత అంతటి స్థాయిలో కొనసాగిన మానేసర్ హింసపై మిశ్రమ స్పందన వెలువడింది. హింస వెనక వామపక్ష తీవ్రవాదుల హస్తం ఉన్నట్లు మారుతి సుజుకి సంస్థ చైర్మన్ ఆర్ సీ భార్గవ ఆరోపించారు. తీవ్రవాదులతో చేతులు కలిపిన కొద్దిమంది కార్మికుల కుట్రపూరిత దుశ్చర్యగా వర్ణించారు. దేశ పారిశ్రామిక ప్రగతి మందగిస్తున్న వేళ ఆర్థిక కార్యకలాపాలకు ఆటంకం కలిగించే ఇలాంటి ఘటనలు జరగడం దురదృష్టకరమని పరిశ్రమ వర్గాలు(అసోచామ్, సీఐఐ)పేర్కొన్నాయి. సమ్మె చేస్తున్న కార్మికలోకంపై ప్రైవేటు సైన్యాన్ని ఉసిగొల్పిన ఫలితంగానే హింస చెలరేగిందని కార్మిక సంఘాలు పేర్కొన్నాయి. హర్యానాను అభివృద్ధికి నమూనాగా చూపిస్తున్న కాంగ్రెస్ ఇప్పుడు తన తల ఎక్కడ పెట్టుకుంటుందని ప్రతిపక్ష బీజేపీ విరుచుకుపడింది. హింసను ఖండించిన వామపక్షాలు పార్లమెంట్ వర్షాకాలపు సమావేశాల్లో ఈ అంశాన్ని ప్రస్తావించాలని నిర్ణయించాయి. కాగా, మానేసర్ ఉదంతం భవిష్యత్ చిత్రపటాన్ని ఆవిష్కరిస్తోందని, బహుళజాతి సంస్థలు పనిస్థలాల్లో పరిస్థితులను మెరుగుపర్చకుండా హక్కులను కాలరాచే పక్షంలో కార్మికులు ట్రేడ్ యూనియన్ రాజకీయాలను వదిలి హింసామార్గాన్ని అవలంభించే ప్రమాదముందని విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు. హింసకు

మారుతి సుజుకి యాజమాన్యమే బాధ్యత వహించాలని వారు అభిప్రాయపడుతున్నారు.

వాస్తవానికి హర్యానాలోని మానెసర్ గత రెండున్నరేళ్లుగా రగులుతోంది. 2006లో ఇక్కడ మారుతి సుజుకి కంపెనీ కార్ల తయారీకి సంబంధించిన రెండవ యూనిట్‌ను (మొదటి యూనిట్ గుర్గావ్‌లో 1980లలో మొదలైంది) నెలకొల్పినప్పటి నుంచీ కార్మికుల్లో అసంతృప్తి ఉంది. మొత్తం మూడు వేల మందిలో రెండు వేల మంది కాంట్రాక్ట్ కార్మికులే కావడం, చీటికి మాటికి వేతనంలో కోతలు, అధ్వాన పని పరిస్థితులు, సూపర్‌వైజర్ల, మేనేజర్ల వేధింపులు వారిని ఊపిరాడకుండా చేశాయి. ఇక్కడ పని చేసే కార్మికులంతా నవయువకులు కావడంతో సహజంగానే తాము ఎదుర్కొంటున్న సమస్యలపై ఉద్యమించడం ఆరంభించారు. నాయకత్వం వహించడానికి కొత్తగా ఓ యూనియన్‌ను ఏర్పాటు చేసుకోయత్నించారు. ఇక్కడే వివాదం మొదలైంది. గుర్గావ్ యూనిట్‌లో అప్పటికే ఏర్పడి కార్యకలాపాలు నిర్వహిస్తున్న మారుతి ఉద్యోగ్ కామ్‌గార్ యూనియనే(ఎంయుకేయు)మానెసర్ కార్మికులకు కూడా ప్రాతినిధ్యం వహిస్తుందని ఒకవైపు యాజమాన్యం, మరోవైపు ఆ యూనియన్ నాయకులు బలవంతంగా వారిని ఒప్పించడానికి ప్రయత్నించారు.

అయితే, యాజమాన్యం తొత్తుగా మారిన ఎంయుకేయు కార్మికుల సమస్యలు పట్టించుకోవడం మానేసిందని, అలాంటి యూనియన్ తమకొద్దని, కొత్త సంఘాన్ని ఏర్పాటు చేసుకుంటామని మానేసర్ కార్మికులు పట్టుబట్టారు. 2010 డిసెంబర్ కల్లా వారి ప్రయత్నాలు ముమ్మరమయ్యాయి. కొత్త యూనియన్‌కు నేతృత్వం వహించడానికి కొంతమంది యువకులు ముందుకువచ్చారు. యాజమాన్యం రంగంలోకి దిగి వారిని నయాన భయాన లొంగదీసుకోజూసింది. ఈ యత్నాలు బెడిసికొట్టాయి. 2011 జూన్ 3న మారుతి సుజుకి వర్కర్స్ యూనియన్ (ఎంఎస్‌డబ్ల్యుయూ) పేరున కొత్త సంఘాన్ని రిజిస్టర్ చేయాల్సిందిగా లేబర్ కమిషనర్‌కు దరఖాస్తు అందింది. ఆ వెంటనే దరఖాస్తుపై సంతకాలు చేసిన 11 మంది కార్మికనేతలను యాజమాన్యం ఉద్యోగాల నుంచి సస్పెండ్ చేసింది. వాళ్ల ఇళ్లకు బౌన్సర్లను పంపి బలవంతంగా తెల్లకాగితాలపై సంతకాలు చేయించుకుంది. ఈ చర్యకు నిరసనగా కార్మికులు సమ్మెకు దిగి ఫ్యాక్టరీలోనే బైఠాయించారు. 13 రోజుల అనంతరం యాజమాన్యం దిగివచ్చి తొలగించిన కార్మికులను తిరిగి పనిలోకి తీసుకుంది. మరోవైపు, చట్ట విరుద్ధంగా సమ్మెకు దిగారని, సంతకాలు చేసిన వారిలో కొందరు ఇప్పటికీ ఎంయుకేయులో సభ్యులని, కొన్ని సంతకాల ఫోర్జరీ జరిగిందని చెబుతూ లేబర్ కమిషనర్ కార్మికుల దరఖాస్తును తోసిపుచ్చారు. అయితే, తదనంతర పరిణామాల్లో కార్మికుల పోరాటానికి తలొగ్గి ఎంఎస్‌డబ్ల్యుయూను ప్రాతినిధ్య సంఘంగా గుర్తించినా పలు సమస్యలపై యాజమాన్య మొండి వైఖరి మాత్రం

కొనసాగింది.

ఈ నేపథ్యంలోనే జూలై 18 ఘటన చోటు చేసుకుంది. ఆ రోజు సాయంత్రం పనిలో ఉన్న ఓ దళిత కార్మికుడిని పైఅధికారి కులం పేరుతో దూషించాడు. ఆ కార్మికుడు అందుకు నిరసన తెలిపాడు. మామూలుగానైతే ఆ అధికారిపై చర్య తీసుకోవాలి. కాని యాజమాన్యం అలా చేయకుండా కార్మికుడినే సస్పెండ్ చేసింది. ఇది అన్యాయమంటూ కార్మికులంతా ఒకచోట గుమికూడారు. ఇదే విషయంపై యూనియన్ నాయకులు హెచ్ఆర్ విభాగంతో చర్చలు జరుపుతున్నారు. ఈ సమయంలో అకస్మాత్తుగా వందలాది మంది బౌన్సర్లు ఫ్యాక్టరీ లోపలికి దూసుకువచ్చారు. గేట్లను మూసేసి కార్మికులను చితకబాదడం మొదలుపెట్టారు. వీరికి సూపర్‌వైజర్లు, మేనేజర్లు తోడయ్యారు. తదుపరి రంగప్రవేశం చేసిన పోలీసులు సైతం కార్మికుల పైననే విరుచుకుపడ్డారు. కార్మికులు తిరగబడ్డారు. ఇలా ఫ్యాక్టరీ ఆవరణ రణరంగంగా మారగా గుర్తు తెలియని వ్యక్తులు కార్యాలయానికి, మెయిన్ గేటుకు నిప్పు పెట్టారు. ఫర్నిచర్ ధ్వంసం చేశారు. ఈ గందరగోళంలోనే జీఎం దేవ్ సహా పలువురికి మంటలు అంటుకుని తీవ్రగాయాలయ్యాయి. నిప్పు పెట్టింది కార్మికులేనని యాజమాన్యం పేర్కొనగా, బౌన్సర్ల రూపంలో వచ్చిన గూండాలే ఈ పని చేశారని ఎంఎస్‌డబ్ల్యుయూ ఆరోపించింది. కాగా, ఘటనపై ప్రాథమిక విచారణ జరిపిన పోలీసులు హింసకు కారకులంటూ ఎంఎస్‌డబ్ల్యుయూ అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి సహా 114 మంది కార్మికులను అరెస్టు చేసి రిమాండుకు పంపారు.

ఇక్కడ మనం కొన్ని విషయాలను గమనించాలి. మానెసర్ ఫ్యాక్టరీలో కార్మికులు కడు దుర్భర పరిస్థితుల్లో పనిచేస్తున్నారు. ఉదయం 5 గంటలకు కంపెనీ బస్సు ఎక్కిన కార్మికుడు సాయంత్రం ఏడు తర్వాత గాని ఇంటికి రాడు. పొద్దున ఆరింటికి ఫ్యాక్టరీ గేటు వద్ద పంచ్ చేయాలి. ఒక్క సెకను లేటుగా వచ్చినా హాఫ్ డే జీతం కట్ చేస్తారు. 6.30కు కార్మికుల చేత ఎక్సర్‌సైజు చేయిస్తారు. సరిగ్గా ఏడు గంటలకు పని చక్రం తిరగడం ప్రారంభమవుతుంది. వరసగా వచ్చే కారు ప్రతి కార్మికుని వద్ద 38 సెకన్లు మాత్రమే ఆగుతుంది. ఆ సమయంలోనే అతడు తాను చేయాల్సిన పని (వెల్డింగ్, అసెంబ్లింగ్, ఫిక్సింగ్) చేయాలి. ఇలా 8 గంటల పాటు అక్కడినుంచి కదలకుండా, చూపు మరల్చకుండా, పక్కవాళ్లతో మాట్లాడకుండా యంత్రంలా వ్యవహరించాలి. పాత రోజుల్లో కొందరు కార్మికులకు ఒకరు చొప్పున రిలీవర్లు ఉండేవాళ్లు. ఇప్పుడదీ లేదు. పొరపాటున ఒక్క కారు మిస్సయినా కార్మికుని వేతనానికి కోత పడుతుంది. ఈ 8 గంటల్లో ఒక టీ బ్రేక్ (7 నిమిషాలు), మరో లంచ్ బ్రేక్ (అరగంట) ఉంటుంది. అప్పుడే బాత్‌రూం తదితర పనులు కూడా చేసుకోవాల్సివుంటుంది. ఇక పర్మనెంట్

కార్మికులు సహా ఎవరికీ క్యాజువల్ లీవులు, సిక్ లీవులు లేవు. కర్మ కాలి ఎవరైనా సెలవు తీసుకుంటే రోజుకు రూ.1500 చొప్పున కట్ చేస్తారు. (చట్టబద్దంగా లీవ్ తీసుకునే హక్కున్నా ఉత్పత్తికి విఘాతం కలుగుతుందని ఈ నిబంధన విధించారని సమాచారం) ఈ లెక్కన నెలకు 16 వేల జీతమున్న చాలా మంది కార్మికులకు 10వేలకు మించి డబ్బులు రావంటే ఆశ్చర్యం కలుగకమానదు. కాంట్రాక్టు కార్మికులకు రోజుకు 200 చొప్పున నెలకు ఆరు వేలు చెల్లిస్తారు. డుమ్మా కొడితే ఆ మేరకు తగ్గుతుంది. మారుతి గుర్గావ్ యూనిట్‌లో కూడా ఇవే పరిస్థితులున్నా అక్కడ పని చేస్తున్న కార్మికులు నలభై పైబడిన వయస్సు వారవడం, గతంలో సమ్మె చేసినప్పుడు యాజమాన్యం వేధింపులకు గురికావడం, ఎంయుకేయు నేతలు అమ్ముడుపోయి కార్మిక ప్రయోజనాలకు ద్రోహం తలపెట్టడం వంటి కారణాల మూలంగా ఉద్యమించడానికి, మరో యూనియన్‌లో సంఘటితం కావడానికి జంకుతున్నారు. ఇందుకు విరుద్ధంగా మానెసర్ కార్మికులందరూ 25 ఏళ్ల లోపు అవివాహిత యువకులు. ఉద్యోగం పోతే కుటుంబాన్ని ఎలా పోషించాలన్న భయం వారికి లేదు. అందుకే పోరాడితే పోయేదేమీ లేదు.. బానిస సంకెళ్లు తప్ప అన్న స్ఫూర్తితో రాజీలేకుండా ఉద్యమిస్తున్నారు. కార్మికుల కనీసహక్కులను గుర్తించి, సమస్యను శాంతియుతంగా పరిష్కరించాల్సిన యాజమాన్యం అరెస్టులు, లాఠీచార్జీలు, వేధింపులు, తొలగింపుల మార్గం అనుసరించడంతోనే ప్రస్తుత పరిస్థితి తలెత్తింది.

ఇప్పటికైనా ప్రభుత్వాలు కళ్లు తెరవాలి. కార్పొరేట్ కంపెనీల్లో పని చేస్తున్న కార్మికుల హక్కుల ఉల్లంఘనను అడ్డుకోవాలి. వారి పని పరిస్థితులు మెరుగుపడేలా చట్టాలు చేయాలి. బౌన్సర్లు, సెక్యూరిటీ సిబ్బంది రూపంలో ప్రైవేటు సైన్యాల్ని పెంచి పోషిస్తున్న యాజమాన్యాలకు అడ్డుకట్ట వేయాలి. లేదంటే మానెసర్ ఘటనలు దేశవ్యాప్తమవుతాయి. కొన్ని వర్గాలు భయపడుతున్నట్లుగా వామపక్ష తీవ్రవాదం వైపు కార్మికులు మొగ్గు చూపుతారు. ఇప్పటికే మధ్యభారత అడవుల్లో, ఆదివాసీ ప్రాంతాల్లో ప్రాబల్యశక్తిగా కొనసాగుతున్న మావోయిస్టులు పట్టణాలు, నగరాల్లో సైతం పాగా వేస్తారు.

***(నమస్తే తెలంగాణ, 14-08-2012)***

# మూడవ భాగం

# సామ్రాజ్యవాదం.. పేదరికం..

# అంతులేని అమెరికా ఉగ్రవాదం..

నిన్న ఆగస్టు 6.. జపాన్‌లోని హిరోషిమా నగరంపై అణుబాంబు ప్రయోగం జరిగిన రోజు.. ఎల్లుండి ఆగస్టు 9న మరో అణుబాంబు నాగసాకి పట్టణంపై పడింది. ఈ రెండు బాంబుదాడుల్లో కలిసి సుమారు నాలుగు లక్షల మందికి పైగా ప్రజలు ప్రాణాలు కోల్పోయారు. వీరిలో చాలా మంది పేలుడులోనే చనిపోగా, మిగతావాళ్లు సంవత్సరాల తరబడి రేడియేషన్ మహమ్మారితో పోరాడుతూ క్యాన్సర్ కారణంగా తనువు చాలించారు. 1945లో రెండవ ప్రపంచ యుద్ధం ముగింపునకు వస్తున్న వేళ జరిగిన ఈ రెండు ఘటనలు మానవ చరిత్రలోనే అత్యంత విషాదకరమైనవిగా నిలిచాయి. ప్రతి సంవత్సరం ఆగస్టులో హిరోషిమా, నాగసాకి డేలను జరుపుకోవడం ద్వారా ప్రపంచం అప్పటి మృతులను స్మరించుకుంటుంది. సభలు, సమావేశాలు, సెమినార్లు, శాంతి ర్యాలీలు జరుగుతాయి. అణ్వాయుధాల మూలంగా పొంచివున్న ముప్పును గురించి వక్తలు మాట్లాడుతారు. దేశాధినేతలు సైతం అణ్వస్త్ర రహిత సమాజం, నిరాయుధీకరణ, ప్రపంచ శాంతి ఆవశ్యకత గురించి ఉపన్యసిస్తారు. విచిత్రమేమిటంటే ఈ మారణ హోమాల సృష్టికర్త అయిన అమెరికా సైతం ఇటీవలికాలంలో మొసలి కన్నీరు కార్చడం మొదలుపెట్టింది. 2010 ఆగస్టు 6న హిరోషిమాలో జరిగిన నివాళి కార్యక్రమానికి జపాన్‌లో అమెరికా రాయబారి జాన్ రూస్ మొట్టమొదటిసారి హాజరయ్యారు. గత సంవత్సరం నాగసాకిలో నిర్వహించిన సంస్మరణ సభకు ఆ దేశ ఉప రాయబారి జేమ్స్ జుమ్‌వాల్ట్ హాజరై అధ్యక్షుడు ఒబామా పంపిన సందేశాన్ని చదివి వినిపించారు. అణ్వస్త్ర రహిత ప్రపంచ సాధన కోసం జపాన్‌తో కలిసి పని చేస్తామని ఒబామా ఈ సందర్భాన్ని పురస్కరించుకుని వాగ్దానం చేశారు.

అమెరికా చర్య జపాన్ సహా ప్రపంచ దేశాల్లో ఆగ్రహావేశాలను రగిలిస్తోంది. ఒబామా సందేశం మొగన్ని కొట్టి మొగసాలకెక్కిన చందంగా ఉందని పలువురు తీవ్రంగా నిరసించారు. యుద్ధం ముగుస్తున్న సమయాన, లొంగుబాటుకై జపాన్ ప్రయత్నిస్తున్న క్రమంలో కేవలం తన ప్రపంచాధిపత్యాన్ని చాటుకోవడానికి లక్షలాది ప్రాణాలను బలి

తీసుకున్న అమెరికాకు మృతులకు నివాళులర్పించే అర్హత లేదని నినదించారు. మానవజాతి మనుగడ పట్ల అగ్రరాజ్యానికి ఏ మాత్రం నిబద్ధత ఉన్నా వెంటనే జపాన్ ప్రజలకు బేషరతుగా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు.

నిజానికి హిరోషిమా-నాగసాకి ఘటనలు పథకం ప్రకారం అమెరికా సాగించిన హత్యాకాండలేనని అప్పటి చరిత్ర క్రమాన్ని పరిశీలిస్తే అర్థమవుతుంది. పోలండుపై నాజీ జర్మనీ దురాక్రమణతో 1939 సెప్టెంబర్ 1న రెండవ ప్రపంచ యుద్ధం మొదలైంది. హిట్లర్ ఫాసిజానికి వ్యతిరేకంగా ప్రపంచ దేశాలన్నీ ఒక్కటై కదన రంగాన దూకినా తన రేవు పట్టణం పెరల్‌హార్బర్‌పై జపాన్ దాడి చేసే వరకూ అమెరికా అంటీముట్టనట్లుగానే వ్యవహరించింది. రెండు పులులు కొట్లాడుకుంటుంటే చోద్యం చూస్తూ తన శక్తిని కాపాడుకునే విధానాన్ని అవలంభించింది. పోరులో ఇరుపక్షాలూ ఢీలాపడిన స్థితిలో యుద్ధంలో ప్రవేశించి ప్రాబల్యశక్తిగా అవతరించి ప్రపంచాధిపత్యాన్ని సాధించాలన్నది మొదటినుంచీ ఆ దేశ వ్యూహంగా ఉండింది. ఈ వ్యూహంలో భాగంగానే ఐన్‌స్టీన్ తదితరుల సహకారంతో 1939 అక్టోబర్‌లో అణుబాంబుల తయారీ ప్రక్రియ (మ్యాన్‌హట్టన్ ప్రాజెక్ట్)ను చేపట్టింది. అమెరికా యుద్ధంలో ప్రవేశించిన నాటికి ఈ ప్రాజెక్టు ఒక కొలిక్కి వచ్చింది. ఒకవైపు అక్షరాజ్యాలపై మిత్రరాజ్యాల పోరు ఉధృతమై యుద్ధం ముగింపు దశలో ప్రవేశిస్తుండగా ఈ అణుబాంబుల నిర్మాణం పూర్తయింది. 1945 ఏప్రిల్ 3వ తేదీకల్లా యురేనియం, థోరియంలతో కూడిన రెండు రకాల బాంబులను మెక్సికన్ ఎడారిలో ప్రయోగాత్మకంగా పరీక్షించారు. ఇక నిజ ఫలితాలు ఎలా ఉంటాయో, ఎన్ని టన్నుల యురేనియం లేదా థోరియంలను విచ్ఛిన్నం చేస్తే ఎంతటి విధ్వంసం జరుగుతుందో.. ఎంత మంది జనం చనిపోతారో.. రేడియేషన్ ప్రభావం ఎంత ఉంటుందో చూడడమే మిగిలింది. ఈ క్రమంలోనే అణుబాంబులతో భారీ విధ్వంసాన్ని, మారణహోమాన్ని సృష్టించడం ద్వారా ప్రపంచాన్ని బెదరగొట్టాలని, ఎర్రసైన్యం జోరుతో మొనగాడుగా ముందుకువచ్చిన సోవియట్ యూనియన్‌ను భయపెట్టాలని అమెరికన్ పెద్దలు నిర్ణయించారు. జర్మనీని లక్ష్యంగా చేసుకుంటే తన సొంత జాతి(ఆంగ్లో-సాక్సన్) ప్రజలే బలవుతారు కనుక వారి దృష్టిలో మనుషుల కిందికే లెక్కకురాని మంగోలులపై అనగా జపాన్‌పై ప్రయోగించడానికి రంగం సిద్ధం చేశారు.

యుద్ధ పరిస్థితులతో నిమిత్తం లేకుండా లొంగుబాటుకు ప్రయత్నిస్తున్న జపాన్‌పై అణుదాడి కొనసాగించడానికి, సాధ్యమైనంత ఎక్కువ విధ్వంసాన్ని, జనహననాన్ని సృష్టించడానికి అమెరికా ముందు నుంచే కుట్రకు పాల్పడిందనడానికి అనేక ఆధారాలున్నాయి. బాంబులు ఎక్కడ వేయాలనే విషయాన్ని నిర్ణయించడానికి జరిగిన టార్గెట్ కమిటీ సమావేశాల మినిట్సే ఇందుకు సాక్ష్యాలు. జనసాంద్రత అంతగా లేని టోక్యో బే మొదలుకొని జపాన్‌కు చెందిన 17 పట్టణాలు కమిటీ ముందుండగా మూడు

లక్షల జనాభా కలిగిన హిరోషిమాను యురేనియం బాంబుకు మొదటి టార్గెట్‌గా, రెండు లక్షలకుపైగా జనాభా కలిగిన నిగటా పట్టణాన్ని ప్రత్యామ్నాయ టార్గెట్‌గా నిర్ణయించారు. థోరియం బాంబుకు మొదటి టార్గెట్‌గా నిర్ణయించిన కొకురా పట్టణం, ప్రత్యామ్నాయ టార్గెట్‌గా నిర్ణయించిన నాగసాకి కూడా అధిక జనాభా కలిగిన పట్టణాలే.(కొకురాపై మేఘాలు దట్టంగా ఆవరించివున్న కారణంగా దానిని వదిలి నాగసాకిపై బాంబు వేశారు) పైగా హిరోషిమా, కొకురా పట్టణాల చుట్టూ ఎత్తైన పర్వతాలు విస్తరించివున్నాయి కనుక పేలుడు ప్రభావం రెట్టింపై ఎక్కువ మందిని చంపుతుందని ఆశించారు. ఆసక్తికరమైన మరో విషయమేమిటంటే 1945 ఫిబ్రవరిలో అమెరికన్, బ్రిటన్ వైమానిక దళాలు టోక్యో సహా జపాన్‌కు చెందిన 66 పట్టణాలపై కార్పెట్ బాంబింగ్ చేసి భారీ విధ్వంసం సృష్టించాయి. సుమారు పది లక్షల మంది జపానీయులను పొట్టనబెట్టుకున్నాయి. 25 లక్షల భవనాలు ధ్వంసం కాగా కోటి మంది నిరాశ్రయులయ్యారు. అయితే, ఈ విధ్వంసం నుంచి హిరోషిమా, నాగసాకి, కొకురా, నిగటా పట్టణాలను మినహాయించారు. అక్కడ ఒక్కటంటే ఒక్క బాంబు పడలేదు. తమ పట్టణాలపై అమెరికా విమానాలు బాంబులు ఎందుకు వేయడంలేదో హిరోషిమా–నాగసాకి ప్రజలకు అప్పుడు అర్థం కాలేదు. అర్థమయ్యేసరికి వాళ్లీ లోకంలో లేరు.

లక్ష్యసాధన కోసం బీభత్సకాండను ఆయుధంగా వాడుకోవడమే ఉగ్రవాదమని ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీ చెబుతోంది. ఈ నిర్వచనం ప్రకారం చూస్తే హిరోషిమా–నాగసాకిల్లో అమెరికా సాగించిన మారణహోమం ఒక వ్యూహం ప్రకారం కుట్రపూరితంగా సాగించిన ఉగ్రవాదమేనని చెప్పకతప్పదు. ఆ మాటకొస్తే నాటి నుంచి నేటి వరకు ప్రపంచ దేశాలపై అమెరికా సాగించిన దురాక్రమణ దాడులన్నీ రాజ్య ఉగ్రవాదం (స్టేట్ టెర్రరిజం) కిందికే వస్తాయి. అమెరికన్ దాడుల్లో ఇప్పటి వరకు కనీసం కోటి మంది ప్రజానీకం మరణించారంటే ఎవరైనా ఆశ్చర్యపోక తప్పదు. రెండవ ప్రపంచ యుద్ధం ముగిసి రెండేళ్లయినా కాకముందే గ్రీస్ అంతర్యుద్ధంలో రైటిస్టులకు మద్దతుగా బలగాలను దించి వందలాది ఉద్యమకారుల చావుకు అమెరికా కారణమైంది. 1948 నుంచి ఆరేళ్ల పాటు ఫిలిప్పైన్స్‌లో హక్‌ల తిరుగుబాటును, 1950లో పోర్టరికోను ఆక్రమించడమే కాకుండా స్థానికుల తిరుగుబాటును నిర్దాక్షిణ్యంగా అణచివేసింది. 1950లలో కొరియన్ సంక్షోభంలో జోక్యం చేసుకుని వేలాది కమ్యూనిస్టులను ఊచకోత కోసింది. 1953లో ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన ఇరాన్ ప్రభుత్వాన్ని కూలదోసి రాజు షాను గద్దెనెక్కించింది. 54లో గ్వాటేమాలలో అధికారంలోకి వచ్చిన వామపక్ష ప్రభుత్వాన్ని దించేసి సైనిక ముఠాకు పగ్గాలప్పగించింది. 60లో వియత్నాం అంతర్గత వ్యవహారాల్లో తలదూర్చి కమ్యూనిజాన్ని అంతం చేసే పేరిట పదిహేనేళ్ల పాటు క్రూర దమనకాండను కొనసాగించి బాంబుదాడులు చేసి 20 లక్షల ప్రాణాలను హరించింది. ఇదే కాలంలో కంబోడియాలో,

లావోస్‌లో సైతం బలగాలను దించి మరో 20లక్షల మంది చావుకు కారణమైంది. 1961లో క్యూబాలో, 62లో లావోస్‌లో, 64లో పనామాలో జోక్యం చేసుకుంది. 65లో ఇండోనీషియాలో ఎన్నికైన ప్రభుత్వాన్ని కూలదోసింది. ఈ సందర్భంగా జరిగిన పోరాటంలో 3 నుంచి 10 లక్షల మంది చనిపోయారని అంచనా. 65-66లో డొమినిక్ రిపబ్లిక్‌లో, గ్వాటెమాలలో, 70లో ఒమన్‌లో సైనికచర్యలు నిర్వహించింది. 73లో చిలీలో సైనిక కుట్ర చేసి అధ్యక్షుడు అలెండీ సహా వందలాది మంది కమ్యూనిస్టులను హతమార్చింది. 80లలో నికరాగ్వాలో అమెరికా సాగించిన మారణకాండను ప్రపంచ న్యాయస్థానం సైతం అంతర్జాతీయ ఉగ్రవాదంగా అభివర్ణించింది. 82-84 మధ్య లెబనాన్‌లో విధ్వంసం సృష్టించింది. 84లో గ్రెనెడా సర్కారును కూలదోసింది. 89లో పనామాపై దాడిచేసి అధ్యక్షుడిని బంధించి అమెరికన్ జైలులో ఖైదు చేసింది.

1990లో అంతర్గత సంక్షోభంతో సోవియట్ క్యాంపు కుప్పకూలిన తర్వాత ఇక అమెరికాకు ఎదురే లేకుండా పోయింది. ప్రపంచ పోలీసుగా వ్యవహరిస్తూ ఏకపక్షంగానే దాడులను కొనసాగిస్తోంది. 9/11 తదనంతర పరిణామాల్లో ఆఫ్ఘనిస్తాన్‌పై దాడిచేసి ఆక్రమించుకుంది. తన సృష్టే అయిన తాలిబన్లను అంతం చేసే పేరిట మానవ రహిత విమానాలతో బాంబుదాడులు చేస్తూ వేలాది మంది అమాయకులను పొట్టన బెట్టుకుంటోంది. ఇక ఇరాక్ సంగతి మనకు తెలిసిందే. తనకు అనుకూలంగా వ్యవహరించినంత కాలం సద్దాం హుస్సేన్‌ను పెంపుడు కుక్కలా సాకి కాసింత స్వతంత్రంగా వ్యవహరించడంతోనే పిచ్చి కుక్కను చేసి వెంటాడి వేటాడింది. బాంబుల వర్షంతో ఇరాక్‌ను వల్లకాడు చేసింది. ప్రజాస్వామ్య పరిరక్షణ పేరుతో లిబియా అధినేత గడ్డాఫీని అంతమొందించింది. ప్రస్తుతం ఆపరేషన్ ఇరాన్ బాటలో పయనిస్తూ ఆ మార్గంలో అడ్డుగా నిలిచిన సిరియాపై కారాలు మిరియాలు నూరుతోంది.

కొలంబస్ ఆ గడ్డపై కాలుమోపిన నుంచీ అమెరికన్ చరిత్ర అంతా మూలవాసుల అస్తిత్వాన్ని, దేశాల సార్వభౌమత్వాన్ని, స్థానిక పాలకుల ఆత్మగౌరవాన్ని మంటగలిపిన చరిత్రే. అయితే, ఎక్కడ దోపిడి, అణచివేత ఉంటుందో అక్కడ ప్రతిఘటన ఉంటుందన్న సూత్రీకరణను నిజం చేస్తూ ప్రపంచం నలుమూలలా ప్రజలు అగ్రరాజ్య ఆధిపత్య ధోరణులపై తిరగబడుతున్నారు. నాడు వియత్నాంలో చావు తప్పి కన్ను లొట్టబోయినట్లుగానే నేడు ఆఫ్ఘనిస్తాన్‌లోనూ తీవ్ర ప్రతిఘటనతో అమెరికన్ బలగాలు వెనక్కి వెళ్లక తప్పని పరిస్థితి ఏర్పడింది. రేపు సిరియాలోనూ, ఇరాన్‌లోనూ ఇదే పునరావృతమవుతుంది. భారీగా బలగాలు, లెక్కకు మిక్కిలి ఆయుధాలు, అణుబాంబులతో పులిలా పంజా విసురుతున్న అమెరికా చివరకు కాగితపు పులై ప్రజా వెల్లువలో కొట్టుకుపోవడం ఖాయం.

***(నమస్తే తెలంగాణ, 07-08-2012)***

# అమెరికాలో నయా బానిసలు..

ప్రపంచ పెద్దన్నగా పేరొందిన అమెరికాలో సరికొత్త వ్యాపారం వర్ధిల్లుతోంది. జైళ్లలో ఉండే ఖైదీలను కట్టుబానిసలుగా మార్చి బహుళజాతి కంపెనీలు వందల కోట్లు గడిస్తున్నాయి. శతాబ్దాల క్రితం డబ్బూ మందీ మార్బలం ఉన్న తెల్ల దొరలు ఆఫ్రికా అడవుల నుంచి నల్ల జాతీయులను బంధించి తెచ్చి బానిసలుగా ఉపయోగించుకోవడం గురించి మనకు తెలుసు. కాని కుట్రపూరితంగా నేరాలను ప్రోత్సహిస్తూ, తదనుగుణంగా చట్టాలనూ, శిక్షలనూ ఇష్టానుసారం మార్చుకుంటూ ఖైదీలను నయా బానిసలుగా ఉపయోగించుకుంటున్న వైనం చాలా తక్కువ మందికి తెలుసు. ఆ దేశంలోని ఫెడరల్, స్టేట్, కౌంటీ, ప్రైవేట్ జైళ్లలో ఉన్న సుమారు 23 లక్షల మంది ఖైదీలు రాత్రిళ్లు ఇరుకు గదుల్లో మగ్గుతూ పగటి పూట వివిధ పరిశ్రమల్లో నామమాత్రపు వేతనాలకు పని చేస్తున్నారు. బహుళజాతి కంపెనీలు ఈ జైళ్లతో కాంట్రాక్టు కుదుర్చుకుని లేదా తామే జైళ్లను నిర్వహిస్తూ సుమారు 30 బిలియన్ డాలర్ల వ్యాపారం చేసుకుంటున్నాయి. కనీస వేతన చట్టం ప్రకారం గంటకు 7.25 డాలర్ల చొప్పున ఇవ్వాల్సివుండగా ఈ ఖైదీ శ్రామికులకు గంటకు 20 నుంచి 50 సెంట్లు మాత్రమే చెల్లిస్తున్నారు. నాటి బానిసల్లాగే వీరికి స్వేచ్ఛ లేదు. ఓటు హక్కుతో సహా ఏలాంటి హక్కులు లేవు. ప్రశ్నించే అధికారం లేదు. ఎదురు తిరిగితే గొడ్డును బాదినట్లు బాదుతారు. ఏ కంపెనీలో పని చేయాలి? ఎంత కూలీకి పని చేయాలి? ఎన్ని గంటలు పని చేయాలి? ఇవేవీ వీరి చేతుల్లో ఉండవు. తిండి కూడా యజమానుల భిక్షే. జ్వరమొచ్చినా పట్టించుకునే నాథుడుండడు. జైలు పరిశ్రమల అభివృద్ధి పేరుతో రిపబ్లికన్ రీగన్ హయాంలో మొదలైన ఈ నయా వ్యాపారం డెమోక్రాట్ క్లింటన్ పాలనలో బాగా విస్తరించింది. నల్ల సూరీడుగా వినుతికెక్కిన ఒబామా నేతృత్వంలో ప్రస్తుతం మూడు పువ్వులు ఆరు కాయలుగా వర్ధిల్లుతున్నది. సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్న అమెరికన్ ఆర్థిక వ్యవస్థ ఇప్పుడు ఈ కొత్త వ్యాపారంతో పుంజుకోజూస్తున్నది.

ఈ బానిస వ్యాపారం ఉనికిలోకి రావడానికి బీజం 1980లలోనే పడింది. సంక్షోభం

సుడిలో చిక్కుకున్న ఆర్థిక వ్యవస్థను గాడిలో పడేయడానికి స్వేచ్ఛా విపణి సిద్ధాంతం ప్రాతిపదికగా అభివృద్ధి పేరుతో, అవుట్ సోర్సింగ్ పేరుతో, సెజ్‌ల పేరుతో మూడవ ప్రపంచ దేశాల కార్మికశక్తిని కొల్లగొట్టడంతో పాటు స్వదేశంలోని జైళ్లలో మగ్గుతున్న లక్షలాది మంది ఖైదీలను ఉపయోగించుకోవడానికి అమెరికన్ ప్రభుత్వం, బహుళజాతి సంస్థలు వ్యూహాలు రచించాయి. బానిస వ్యవస్థను రద్దు చేస్తూనే ఖైదీలకు మినహాయింపునిచ్చిన 13వ రాజ్యాంగ సవరణను, తర్వాతి కాలంలో ఆ సవరణకు తూట్లు పొడుస్తూ దొడ్డిదారిన పెట్టుబడిదారులు అమలు చేసిన ఖైదీలను లీజుకు తీసుకునే పద్ధతిని స్ఫూర్తిగా తీసుకుని కొత్త చట్టాలకు, విధానాలకు శ్రీకారం చుట్టాయి.

బహుళజాతి సంస్థలు, చట్టసభల ప్రతినిధులతో కలిపి ఏర్పాటుచేసిన 'ది అమెరికన్ లెజిస్లేటర్స్ ఎక్స్ఛేంజ్ కౌన్సిల్' ఈ విధానాల రూపకల్పనకు వేదికైంది. ప్రిజన్ ఇండస్ట్రీస్ యాక్ట్, ప్రిజన్ ఇండస్ట్రీస్ ఎన్‌హాన్స్‌మెంట్ సర్టిఫికేషన్ ప్రోగ్రాం తదితర చట్టాలు ఈ కాలంలోనే ఆమోదం పొందాయి. ఈ చట్టాల ప్రకారం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధీనంలో ఉన్న, అలాగే ప్రైవేట్ కంపెనీల చేతుల్లో ఉన్న జైళ్లలోని ఖైదీలతో నిర్వాహకులు పని చేయించుకోవచ్చు. పని చేయ నిరాకరించిన వారిని వివిధ రకాల ఒత్తిడులకు గురి చేసే అధికారాన్ని ఈ చట్టాలు కల్పించాయి. వేతనాల రూపంలో వచ్చిన డబ్బును జైలు నిర్వహణ కోసం ఉపయోగించవచ్చు. ప్రైవేట్ కంపెనీలయితే లాభాలు రాబట్టుకోవచ్చు.

ఖైదీల సంఖ్యాబలాన్ని పెంచడానికి కూడా కొత్త చట్టాలను, విధానాలను అమలులోకి తెచ్చారు. తీవ్రమైన నేరాలు మూడుసార్లు చేసిన వారిని జీవితాంతం జైలులోనే ఉంచే చట్టం ఇందులో ఒకటి. దీంతో పాటు మత్తు పదార్థాలపై యుద్ధం పేరుతో ఒక కేంపెయిన్ ప్రారంభించారు. అతి తక్కువ పరిమాణంలో మత్తు పదార్థాలను కలిగివున్నా 5 నుంచి 10 ఏళ్ల ఖైదును విధించే అధికారం కోర్టులకిచ్చారు. 5 గ్రాముల రాక్ కొకెయిన్ లేదా 110 గ్రాముల హెరాయిన్ కలిగివున్నవారికి పెరోల్ లేకుండా ఐదేళ్ల శిక్ష, రెండు ఔన్సుల కంటే తక్కువ పరిమాణంలో రాక్ కొకెయిన్‌ను కలిగివున్న వారికి పదేళ్ల శిక్ష, 500 గ్రాముల కొకెయిన్‌ను కలిగివున్న వారికి ఐదేళ్ల శిక్ష విధించడానికి ఈ చట్టాలు వీలు కల్పిస్తాయి. విచిత్రమేమిటంటే తెల్ల దొరలు, ధనిక వర్గాలు ఎక్కువగా ఉపయోగించే కొకెయిన్ 500 గ్రాములు దొరికినా, నల్ల జాతీయులు, పేద మధ్య తరగతి వర్గాలు ఎక్కువగా వాడే రాక్ కొకెయిన్ 5 గ్రాములు దొరికినా ఒకటే శిక్షట. ఇక్కడే అమెరికన్ పాలకుల వివక్ష నగ్నంగా బయటపడుతుంది.

దరిమిలా అమెరికాలో రెండు ముఖ్యమైన పరిణామాలు సంభవించాయి. జైళ్లలో శిక్షననుభవిస్తున్న ఖైదీలతో వారికిష్టమున్నా లేకున్నా పని చేయించడం మొదలైంది. కేంద్ర, రాష్ట్రాల జైళ్లలో వివిధ పరిశ్రమలను స్థాపించి అనేక రకాల వస్తువులను ఉత్పత్తి

చేయనారంభించారు. అనతికాలంలోనే ఈ జైలు పరిశ్రమలు అతివేగంగా అభివృద్ధి చెందాయి. వాల్‌స్ట్రీట్‌లో ఈ పరిశ్రమల షేర్లకు డిమాండ్ పెరిగింది. లెఫ్ట్ బిజినెస్ అబ్జర్వర్ పత్రిక ప్రకారం మిలిటరీ ఉపయోగించే హెల్మెట్లు, అమ్యునిషన్ బెల్టులు, బుల్లెట్ ప్రూఫ్ జాకెట్లు తదితరం నూటికి నూరు శాతం ఈ పరిశ్రమలే సరఫరా చేస్తున్నాయి. సైనికేతర ఉత్పత్తుల్లో పరికరాల అసెంబ్లీయింగ్‌లో 98 శాతం, పెయింట్లు, బ్రష్‌ల తయారీలో 93 శాతం, స్టౌలలో 92 శాతం, దేహధారణ వస్తువుల్లో 46 శాతం, గృహోపకరణాల్లో 36 శాతం, స్పీకర్లు, మైక్రోఫోన్లు, హెడ్‌ఫోన్లలో 30 శాతం, ఆఫీస్ ఫర్నిచర్‌లో 21 శాతం మార్కెట్ వాటాను ఈ పరిశ్రమలు కలిగివున్నాయి. విమానాల విడిభాగాలు.. మందులు.. కాల్ సెంటర్ ఆపరేటర్లు.. చివరకు అంధులకు దారి చూపే శునకాలను పెంచే పనిని కూడా ఖైదీలు చేస్తున్నారు.

జైళ్ల ప్రైవేటీకరణ ఈ ప్రక్రియను మరింత వేగవంతం చేసింది. అమెరికాలో మొట్టమొదటి ప్రైవేట్ జైలు 1984లో నిర్మితమైంది. కరెక్షన్ కార్పొరేషన్ ఆఫ్ అమెరికా(సీసీఏ) పేరుతో ఓ బహుళజాతి కంపెనీ స్థాపించిన సంస్థ జైళ్లను నిర్మించి నిర్వహించడానికి ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకుంది. ఇక అప్పటి నుంచి ప్రైవేట్ రంగం వేగంగా విస్తరించింది. 1987లో ప్రైవేట్ జైళ్లలో ఉన్న ఖైదీల సంఖ్య కేవలం 3,122 కాగా 2010 కల్లా ఆ సంఖ్య లక్షా 20 వేలకు చేరుకుంది. స్మిత్-బార్నీ, అమెరికన్ ఎక్స్‌ప్రెస్, జనరల్ ఎలక్ట్రిక్, ఏటీ అండ్ టీ, స్ప్రింట్ వంటి పేరొందిన సంస్థలు ఈ రంగంలోకి ప్రవేశించాయి. ప్రస్తుతం అక్కడ తక్కువ మంది గార్డులతో ఎక్కువ మంది ఖైదీలకు కాపలా కాసే అత్యాధునిక వ్యవస్థ కలిగిన సూపర్‌మ్యాక్స్ జైళ్ల యుగం నడుస్తోంది. శ్రమశక్తిపై తక్కువ వ్యయంతో ఎక్కువ లాభాలు ఆర్జించే ఉద్దేశంతో బహుళజాతి సంస్థలు ప్రైవేట్ జైళ్ల నిర్వహణ కాంట్రాక్టులను దక్కించుకోవడానికి పోటీ పడుతున్నాయి.

వివిధ కౌంటీల్లో, రాష్ట్రాల్లో అధికారంలో ఉన్న ప్రభుత్వాలను రకరకాలుగా ఆశలు చూపి లొంగదీసుకోవడం, తాము పెట్టాలనుకున్న పరిశ్రమను నెలకొల్పడం, దాని చుట్టూ హై సెక్యూరిటీ వాల్ నిర్మించి జైలుగా మార్చడం, కోట్లల్లో లాభాలు ఆర్జించడం ఇప్పుడక్కడ సర్వసాధారణమైంది. తాము ఒప్పందం కుదుర్చుకున్న కేంద్ర లేదా రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఒక్కో ఖైదీకి రోజుకు 50 డాలర్ల చొప్పున ప్రైవేట్ జైలు కంపెనీలు వసూలు చేస్తాయి. ఖైదీలు పారిపోకుండా భద్రతావ్యవస్థను ఏర్పరచడంతో పాటు తిండి, బట్టలు, వైద్యం తదితర బాధ్యతలన్నీ ఈ కంపెనీలవే. కాగా, తమ జైలులో ఉన్న ఖైదీలతో ఆ కంపెనీ పని చేయించుకోవచ్చు. తనే స్వయంగా ఓ పరిశ్రమను స్థాపించి అందులో పని చేయించవచ్చు లేదా మరో సంస్థకు వీరి శ్రమశక్తిని అమ్ముకోవచ్చు. ఎంతటి లాభాలైనా గడించవచ్చు. సహజంగానే ఖైదీల తిండికి, బాగోగులకయ్యే వ్యయాన్ని

ఈ కంపెనీలు బాగా తగ్గించి వారి శ్రమతో ఆదాయం పెంచుకోవడానికి ప్రయత్నిస్తాయి.

ప్రభుత్వ జైళ్ల నిర్వహణ బాధ్యతలు చూసే అధికారులు కూడా తక్కువ తినలేదు. ప్రైవేట్ జైలు కంపెనీలకు దీటుగా తమ జైళ్లలో ఉన్న ఖైదీలను పోటీపడి మరీ బహుళజాతి సంస్థల్లో పని చేయడానికి వీలుగా విధానాలను ఆమోదింపజేసుకున్నారు. స్వయం పోషణ పేరుతో నిర్వహణ ఖర్చులను తగ్గిస్తున్నామని చెబుతూ ఖైదీలను కాంట్రాక్టుకు ఇచ్చి ఆ సంస్థల నుంచి కమీషన్లు దండుకుంటున్నారు. అమెరికాలోని 37 రాష్ట్రాలు జైలు ఖైదీలను పని కోసం ప్రైవేట్ కంపెనీలు కాంట్రాక్టుకు తీసుకోవడాన్ని చట్టబద్ధం చేశాయి. ఐబీఎం, బోయింగ్, మోటరోలా, మైక్రోసాఫ్ట్, ఏటీ అండ్ టీ, డెల్, కంపాక్, నోర్‌టెల్, ఇంటెల్, త్రీకామ్ వంటి ప్రముఖ వ్యాపార సంస్థలన్నీ వివిధ జైళ్ల ఖైదీలతో పని చేయించుకుంటున్నాయి. అలా ప్రైవేట్, ప్రభుత్వ జైళ్ల నిర్వాహకుల మధ్య లాభాల కోసం కొనసాగిన పోటీ అమెరికన్ ప్రభుత్వాల ఫ్రీ మార్కెట్ విధానాల దన్నుతో నయా బానిసల వ్యవస్థ వేళ్లూనుకుని విజయవంతంగా కొనసాగుతున్నది. ఖైదీలను కార్మికులుగా మార్చి వివిధ రకాల పరిశ్రమలను నెలకొల్పి లేదా వారి శ్రమశక్తిని కాంట్రాక్టుకు అమ్ముకుని ప్రభుత్వాలు, ప్రైవేట్ కంపెనీలు కోట్లాది డాలర్లు గడిస్తున్నాయి. ఓపెన్ మార్కెట్‌లో గంట పనికి కనీస వేతనం 7.25 నుంచి 50 డాలర్ల వరకు చెల్లిస్తుండగా ఈ ఖైదీలకు నామమాత్రపు వేతనాలు చెల్లిస్తున్నాయి. ఫలితంగా ఖైదీల సంఖ్య దినదినం పెరుగుతున్నది. ఖైదీల సంఖ్యలో ప్రపంచంలోనే అమెరికాది అగ్రస్థానం. 1970లతో పోల్చితే ఇక్కడి వివిధ జైళ్లలో ఉన్నవారి సంఖ్య 2010కల్లా ఏడు రెట్లు పెరిగింది. 2010లో అమెరికాలో వివిధ నేరాల కింద నిర్బంధితులు 71 లక్షల 63 వేల మంది ఉన్నారు. నేరాలు చేసేవారి సంఖ్య ఏటా 1.9 శాతం చొప్పున పెరుగుతూ వస్తున్నది.

ప్రజాస్వామ్యం, మానవ హక్కుల ఉల్లంఘనల గురించి ప్రపంచ దేశాలకు నీతులు బోధించే అమెరికాలో ఇలాంటి నీచమైన వ్యవస్థ కొనసాగుతుండడం సిగ్గుచేటు. నియంతలనీ, అరాచకాలు చేస్తున్నారనీ, ఉగ్రవాదానికి మద్దతు ఇస్తున్నారనీ పలు సాకులతో ఇరాక్ మొదలుకొని లిబియా వరకు ఎన్నో దేశాలపై పాశవికంగా దాడి చేసిన అమెరికా మొదట తన ప్రజలపై ముఖ్యంగా నల్ల జాతీయులు, శ్వేతజాతేతరుల పైన కొనసాగిస్తున్న వివక్షను ఆపాలి. మానవ హక్కుల సంస్థలు, వామపక్ష మేధావులు చేస్తున్న ఆరోపణలు పట్టించుకుని తన జాత్యహంకార విధానాలకు స్వస్తి చెప్పాలి. లేదంటే ప్రపంచ ప్రజానీకం ఆ దేశాన్ని మరింత ద్వేషించడం, ప్రతిఘటనకు సిద్ధం కావడం తప్పదు.

***(నమస్తే తెలంగాణ, 20-12-2011)***

# ఇరాన్‌పై యుద్ధ మేఘాలు..?

ప్రపంచ పోలీసు అమెరికా తాజాగా ఇరాన్‌పై కన్నెర్ర చేసింది. ప్రజాస్వామ్య హక్కులను ఉల్లంఘిస్తోందని, ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తోందని, పొరుగు దేశాలపై కయ్యానికి కాలు దువ్వుతోందని, రహస్యంగా అణ్వాయుధాల తయారీకి ప్రయత్నిస్తూ అంతర్జాతీయ అణు ఒప్పందానికి విరుద్ధంగా వ్యవహరిస్తోందని ఆరోపిస్తూ ఇరాన్‌పై సైనిక దాడికి సిద్ధమవుతోంది. కొత్త సంవత్సరానికి ముందు అధ్యక్షుడు ఒబామా ఇరాన్ సెంట్రల్ బ్యాంకుపై ఆర్థిక ఆంక్షలు విధించే ఆదేశాలపై సంతకాలు చేశారు. ఆ దేశ కరెన్సీ రియాల్ విలువ 12 శాతం పడిపోయేలా చర్యలు చేపట్టారు. అమెరికా సహా పశ్చిమ దేశాలు ఇరాన్ నుంచి చమురు దిగుమతిని నిలిపివేశాయి. ఇరాన్ సంస్థలతో వాణిజ్య కార్యకలాపాలు నిర్వహించడాన్ని నిషేధించాయి. బ్యాంకు ఖాతాలను స్తంభింపజేశాయి. యూరోపులో ఉన్న 180 మంది ఇరాన్ రాయబార కార్యాలయాల అధికారులను దేశం విడిచి వెళ్లాల్సిందిగా ఆజ్ఞాపించాయి. కాగా, సైనికేతర అవసరాల కోసం మాత్రమే తాము అణు కార్యక్రమాన్ని చేబట్టామని, పొరుగు దేశాలను రెచ్చగొట్టే చర్యలకు తాము పూనుకోలేదని, తన స్వప్రయోజనాల కోసమే అమెరికా ఈ ఆరోపణలు చేస్తోందని ఇరాన్ వాదిస్తోంది. ఏకపక్షంగా ఆంక్షలు విధించడాన్ని తప్పు పడుతూ తాటాకు చప్పుళ్లకు తాము బెదరబోమని, దాడి చేస్తే దీటుగా జవాబు చెబుతామని హెచ్చరించింది. హోర్ముజ్ జలసంధిని మూసివేసి గల్ఫ్ నుంచి యూరప్‌కు చమురు రవాణాను స్తంభింపజేస్తామని హెచ్చరించింది.

సైనిక దాడికి పశ్చిమమిత్రులను ఒప్పించే పనిలో అమెరికా ఉంటే, మూడవ ప్రపంచ దేశాల మద్దతును కూడగట్టే ప్రయత్నం ఇరాన్ అధ్యక్షుడు అహ్మదీ నెజాద్ చేస్తున్నారు. ఇరాన్ అణుశాస్త్రవేత్త ముస్తఫా అహ్మదీ–రోషన్‌ను కొంతమంది ఆగంతకులు జనవరి 11న పట్టపగలు టెహరాన్‌లో హత్యచేయడం ఉద్రిక్తతలను మరింత పెంచింది. ఇప్పటికి నలుగురు శాస్త్రవేత్తలను ఈ విధంగా చంపారని ఇరాన్ ఆరోపించింది. దీంతో ప్రస్తుతం గల్ఫ్‌లో యుద్ధమేఘాలు అలుముకుంటున్నాయి.

ఇరాన్–అమెరికాల వైరం ఈనాటిది కాదు. 1979లో బద్దలైన ఇరాన్ విప్లవంలో అప్పటి వరకు అధికారంలో ఉన్న రాజు షా మహ్మద్ రెజా పహ్లావిని పదవీచ్యుతుని చేసి మత నాయకుడు ఆయతుల్లా ఖొమేని నాయకత్వంలో ఇస్లామిక్ విప్లవకారులు ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసినప్పటి నుంచీ రెండు దేశాల మధ్య శతృత్వం కొనసాగుతోంది. విప్లవ తదనంతర కాలంలో రాజును తమ దేశానికి అప్పగించాలని విప్లవ ప్రభుత్వం అమెరికాను కోరగా, అందుకు అగ్రరాజ్యం నిరాకరించి, షాకు ఆశ్రయం కల్పించడంతో వైరానికి తెరలేచింది. అదే సంవత్సరం నవంబర్ 4న విప్లవ విద్యార్థులు కొందరు టెహరాన్‌లోని అమెరికా రాయబార కార్యాలయాన్ని ముట్టడించి అందులోని 52 మంది అధికారులను నిర్బంధించారు. 1980 ఏప్రిల్ 7న ఇరాన్‌తో తన రాయబార సంబంధాలను అమెరికా తెంచుకుంది. 24వ తేదీన బందీలను విడిపించడానికి అమెరికన్ సైన్యం విఫలయత్నం చేసి 8మంది సైనికులను కోల్పోయింది. చివరకు, అల్జీరియా మధ్యవర్తిత్వంతో కుదిరిన ఒప్పందం ప్రకారం 1981 జనవరి 20న బందీలను ఇరాన్ విడుదల చేసింది.

1980లో మొదలై ఎనిమిదేళ్ల పాటు కొనసాగిన ఇరాన్–ఇరాక్ యుద్ధంలో అమెరికా ఏకపక్షంగా వ్యవహరించిందన్న ఆరోపణలున్నాయి. ఇరాక్‌తో రాయబార సంబంధాలు లేనప్పటికీ ఆ దేశానికి సైనిక సహాయం చేసిందని, ఆంత్రాక్స్, బుబోనిక్ ప్లేగ్ వంటి రసాయనిక, జీవ ఆయుధాలను సైతం సమకూర్చిందని ఇరాన్ ఆరోపించింది. మరోవైపు వివిధ దేశాల్లో అమెరికా రాయబార కార్యాలయాలపై బాంబు దాడులు చేసి విధ్వంసం సృష్టించిన ఉగ్రవాద సంస్థ హిజ్బుల్లాకు ఇరాన్ మద్దతు ఇస్తోందని అమెరికా ఆరోపించింది. ఈ కారణంతో 1987–88మధ్యలో రెండు సార్లు ఇరాన్ నావికాస్థావరాలు, చమురు క్షేత్రాలపై దాడులు చేసింది. క్లింటన్ అధికారంలోకి వచ్చాక 1995లో ఇరాన్‌పై పూర్తి స్థాయి ఆర్థిక ఆంక్షలు విధించారు.

జూనియర్ బుష్ కాలం(2001–08)లో ఇరాన్‌తో శతృత్వం మరింత పెరిగింది. ఉత్తర కొరియా, ఇరాక్‌లతో కలిపి ఇరాన్‌ను ఆయన దుష్టత్రయంగా వర్ణించారు. ఇరాక్‌పై దాడి నేపథ్యంలో ఇరాన్‌తో సంబంధాలు మెరుగుపడవచ్చన్న పరిశీలకుల అంచనాలకు భిన్నంగా అమెరికా ఆ దేశంతో శత్రుపూరిత వైఖరిని కొనసాగించింది. ఇరాక్ భూభాగం నుంచి మానవ రహిత విమానాలను పంపి ఇంటెలిజెన్స్ సమాచారాన్ని సేకరించడం, ప్రభుత్వ వ్యతిరేక సంస్థలను చేరదీసి వారితో బాంబు దాడులు చేయించడం, ఆఫ్ఘనిస్తాన్ భూభాగం నుంచి అమెరికా దళాలు తూర్పు ఇరాన్‌లోకి చొచ్చుకురావడం వంటి ఘటనలు ఈ కాలంలో జరిగాయి.

2005 మార్చ్‌లో అణ్వాయుధ రహిత దేశాలు ఆ ఆయుధాలను

సమకూర్చుకునేందుకు చేసే ప్రయత్నాలను నివారించేందుకు లేదా అడ్డుకునేందుకు అవసరమైతే అణ్వాయుధాలను సైతం ప్రయోగించేలా అమెరికా తన విధానాన్ని సవరించుకుంది. ఆగస్టులో సంప్రదాయవాదీ, అమెరికా ఆధిపత్యవాదానికి బద్ధవ్యతిరేకీ అయిన ప్రస్తుత ఇరాన్ అధ్యక్షుడు అహ్మదీ నెజాద్ పగ్గాలు చేబట్టారు. దీంతో ఇరు దేశాల మధ్య సంబంధాలు మరింత క్షీణించాయి. 2006 లో ఇంటెలిజెన్స్ సమాచార సేకరణకు ప్రత్యేక ఇరానియన్ డైరెక్టరేట్‌ను పెంటగాన్ ఏర్పాటు చేసింది. రెండు దేశాల మధ్య వివాదాన్ని పరిష్కరించే దిశలో కొన్ని ప్రతిపాదనలతో నెజాద్ బుష్‌కు లేఖ రాయగా దానిని అమెరికా తిరస్కరించింది. పైగా, యురేనియం శుద్ధి ప్రక్రియను చేబడుతున్నందుకు ఇరాన్‌పై చర్య తప్పదని బుష్ హెచ్చరించారు. ఇదేకాలంలో ఇరాన్ భూభాగంలో అమెరికా ప్రత్యక్ష పరోక్ష దాడులు క్రమంగా పెరిగాయి. అధ్యక్షుని ఆమోదంతోనే సీఐఏ, జాయింట్ ఫోర్సెస్ కమాండ్‌ల సారథ్యంలో దక్షిణ ఇరాక్ స్థావరంగా ఇరాన్ సరిహద్దుల్లోకి పలుమార్లు అమెరికన్ బలగాలు చొచ్చుకెళ్లాయి. ఇరాక్‌లోని ఎర్బిల్‌లో ఉన్న ఇరాన్ కాన్సులేట్‌పై దాడి చేసి ఐదుగురు రాయబార సిబ్బందిని బంధించి కీలక పత్రాలు ఎత్తుకెళ్లాయి.

2009లో ఒబామా పగ్గాలు చేబట్టాక ఇరాన్–అమెరికా సంబంధాల్లో గణనీయ మార్పు వస్తుందని ఆశించిన పరిశీలకులు మరోసారి భంగపడ్డారు. ప్రారంభంలో ఇరుపక్షాలనుంచీ సానుకూల సంకేతాలు వెలువడ్డా అది మూణ్నాళ్ల ముచ్చటే అయింది. 2009 మేలో ఇరాన్‌కు చెందిన అణుశాస్త్రవేత్త షహ్రామ్ అమీరీని అమెరికా బలగాలు ఎత్తుకెళ్లడంతో రెండు దేశాల మధ్య మరోసారి పగ రగిలింది. ప్రతీకార చర్యగా హోర్ముజ్ జలసంధి గుండా చమురు రవాణాను నిషేధిస్తున్నట్లు ఇరాన్ ప్రకటించింది. మరోవైపు, మధ్యధరా ప్రాంతంలో బలీయమైన శక్తిగా ఎదగడం కోసం ఇరాన్–సౌదీ అరేబియా దేశాల మధ్య పోటీ తీవ్రమైంది. అమెరికా అండదండలు దండిగా ఉన్న సౌదీ అరేబియా ఇరాన్‌కు వ్యతిరేకంగా పొరుగు దేశాలను కూడగట్టడానికి ప్రయత్నిస్తున్నది. ఇరాన్‌తో చీటికి మాటికి కయ్యానికి కాలు దువ్వుతూ అమెరికాను రంగంలోకి దించడానికి తహతహలాడుతున్నది. ఈ నేపథ్యంలోనే ప్రస్తుత సంక్షోభానికి తెరలేచింది. ఫోర్డో యురేనియం శుద్ధి కర్మాగారం త్వరలో తన పనిని ప్రారంభించబోతున్నదని ఇరాన్ అణుశక్తి సంస్థ అధినేత ఫెరిడూన్ అబ్బాసీ–దవానీ ప్రకటించడంతో ఉద్రిక్తతలకు తెరలేచింది.

అయితే, ఈ కర్మాగారంలో తయారయ్యే యురేనియం న్యూక్లియార్ వార్‌హెడ్‌లకు ఉపయోగపడదని, విద్యుత్, సైనికేతర అవసరాలకు ఉపయోగపడే 3.5 శాతం, 4 శాతం, 20 శాతం రకాల యురేనియంను మాత్రమే తాము తయారుచేయ తలపెట్టామని ఆయన స్పష్టం చేశారు. ఈ వాదనలను అమెరికా తిరస్కరిస్తోంది. శాంతియుత

అవసరాలకు మాత్రమే అణుశక్తిని ఉపయోగించేటట్టయితే అంతర్జాతీయ పరిశీలకుల పర్యవేక్షణను ఇరాన్ ఎందుకు నిరాకరిస్తోందని ప్రశ్నిస్తోంది.

కుక్కను పిచ్చి కుక్కగా ప్రచారం చేసి న్యాయబద్ధంగా, చట్టబద్దంగా చంపడమన్నది అమెరికా పాలకులు అనుసరిస్తున్న పద్ధతి. కొరియా నుంచి ఇరాక్ వరకు, నొరీగా నుంచి గఢాఫీ వరకు జరిగిందిదే. ఇదే విధానాన్ని ప్రస్తుతం ఇరాన్ విషయంలోనూ అనుసరిస్తోంది. అమెరికా ఏకపక్ష ధోరణిని, ఇరాన్‌పై తలపెట్టిన దాడిని ప్రపంచ దేశాలు ముక్తకంఠంతో వ్యతిరేకించాలి. శాంతియుత అవసరాలకు అణుశక్తిని వాడుకునే హక్కు ప్రతి దేశానికీ ఉందన్న ఇరాన్ వాదనకు మద్దతునివ్వాలి. ప్రపంచ శాంతిని కాపాడాలి.

***(నమస్తే తెలంగాణ, 17-01-2012)***

# పతనం అంచున అస్సద్!

ఆఫ్ఘనిస్తాన్.. ఇరాక్.. లిబియా.. ఇరాన్.. ఉత్తర కొరియా.. అమెరికా ఆగ్రహానికి గురైన దేశాల జాబితాలో తాజాగా సిరియా చేరింది. తనకు నచ్చితే పచ్చి నియంతనైనా గొప్ప ప్రజాస్వామికవాదిగా, నచ్చకపోతే ప్రజాదరణ గల నేతను కూడా ప్రజాస్వామ్య వ్యతిరేకిగా ముద్రవేసే అగ్రరాజ్యానికి ఇప్పుడు సిరియా పాలకుడు హఫెజ్ అల్ అస్సద్‌పై కొపమొచ్చింది. అంతే.. ఆ దేశం ఉగ్రవాదులకు స్థావరంగా మారిపోయింది. ఇరాక్, లెబనాన్ తదితర దేశాల్లో అనర్థాలకు ఆ దేశమే మూలమైంది. అక్కడ మానవ హక్కుల ఉల్లంఘన విచ్చలవిడిగా జరుగుతుండడం కనిపించింది.. అణ్వాయుధాల తయారీకి ప్రయత్నాలు జరుగుతున్నాయనడానికి ఆధారాలు లభించాయి. ఈ సాక్ష్యాలను గత సెప్టెంబర్‌లో ఐక్యరాజ్యసమితి భద్రతామండలి ముందుంచింది. తక్షణం సిరియాపై ఆర్థిక ఆంక్షలు విధించాలని ప్రతిపాదించింది. ఇందుకు రష్యా, చైనాలు సమ్మతించకుండా వీటో హక్కును వినియోగించుకోవడంతో దొడ్డిదారిన సిరియా మెడలు వంచడానికి తన నాటో మిత్రులతో మార్చ్‌లో రహస్యంగా మంతనాలు ఆరంభించింది. అస్సద్‌ను గద్దె దింపడానికి సైనిక జోక్యం తప్పకపోవచ్చని ప్రతిపాదించింది. సిరియా ప్రతిపక్షాన్ని సాయుధం చేయడం, ప్రభుత్వ వ్యతిరేక మానవ కారిడార్‌ను సృష్టించి, రక్షించేందుకు బలగాలను పంపడం, వైమానిక దాడులకు పూనుకోవడం మన ముందున్న మార్గాలని వివరించింది. అందుకు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చింది.

ప్రపంచవ్యాప్తంగా రాజకీయ పరిశీలకులు, అమెరికా వ్యవహారాల్లో నిపుణులు ప్రస్తుతం అగ్రరాజ్యం మధ్యప్రాచ్యంలో మరో దాడికి పూనుకుంటుందా? అనే విషయంపై లెక్కలు వేసుకుంటున్నారు. అధ్యక్ష ఎన్నికలు సమీపించడంతో తాను శక్తిమంతుడినని పేరు తెచ్చుకోవడం ఒబామాకు చాలా అవసరమని కొందరు వాదిస్తున్నారు. ఆఫ్ఘనిస్తాన్ నుంచి 22వేల మంది సైనికులను ఉపసంహరించుకునే నిర్ణయం వెనకాల సిరియాపై దాడి పథకం దాగుందని వారంటున్నారు. అదీగాక సద్దాం అనంతరం ఇటీవలికాలంలో కొరకరాని కొయ్యగా మారిన ఇరాన్‌ను ఒంటరి చేయాలన్నా సిరియాలో తనకు

కీలుబొమ్మగా వ్యవహరించే ప్రభుత్వం ఉండడం అమెరికాకు అవసరమని పేర్కొంటున్నారు. ఇరాన్‌పై తలపెట్టబోయే దాడికి ఇది రిహార్సల్‌గా కూడా పనికి వస్తుందని పెంటగాన్ భావిస్తున్నట్లు వివరిస్తున్నారు.

సిరియాపై అమెరికా ఆగ్రహానికి సుదీర్ఘ చరిత్ర ఉంది. శతాబ్దాలుగా ఒట్టోమన్ల పాలనలో ఉన్న సిరియా మొదటి ప్రపంచ యుద్ధం తర్వాతి కాలంలో ఫ్రెంచ్ వలసగా మారింది. వలస పాలకులకు వ్యతిరేకంగా పలు పోరాటాలు చేసిన అనంతరం 1946లో స్వాతంత్ర్యం పొందింది. ఆ తర్వాత పదేళ్లలో వరసగా 20 ప్రభుత్వాలు మారాయి. 1956లో సూయెజ్ సంక్షోభంలో భాగంగా ఇజ్రాయెల్, బ్రిటన్, ఫ్రెంచ్ బలగాలు ఈజిప్టును ఆక్రమించుకున్న నేపథ్యంలో రక్షణ కోసం సిరియా అప్పటి మరో అగ్రరాజ్యం సోవియట్ యూనియన్ పంచన చేరింది. పొరుగు దేశం టర్కీ నాటోలో చేరినరీత్యా ఈ చర్య సిరియాకు తప్పనిసరైంది. 1957లో సీఐఏ ఆధ్వర్యంలో సిరియా ప్రభుత్వాన్ని కూల్చడానికి జరిగిన కుట్ర అమెరికా–సిరియా ద్వైపాక్షిక సంబంధాల్లో కీలక మలుపుగా చెప్పుకోవచ్చు. ఈ చర్య ఇరు దేశాల మధ్య శతృత్వానికి బీజం వేసింది.

1958 ఫిబ్రవరిలో సిరియా ఈజిప్టుతో ఐక్యమై యునైటెడ్ అరబ్ రిపబ్లిక్‌గా ఏర్పడింది. ఈ ఐక్యత కేవలం మూడున్నరేళ్లు కొనసాగి 1961 సెప్టెంబర్‌లో జరిగిన సైనిక తిరుగుబాటుతో అంతమైంది. కొత్త పాలకులు సిరియన్ అరబ్ రిపబ్లిక్‌ను ఏర్పరచారు. కాగా, 1963 మార్చి 8న అరబ్ సోషలిస్టు బాత్ పార్టీ మద్దతుదారులైన సైనికాధికారులు అధికారాన్ని చేజిక్కించుకుని అమీన్ హాఫీజ్‌ను అధ్యక్షునిగా ప్రకటించారు. 1966లో బాత్ పార్టీలో అంతర్గతంగా తిరుగుబాటు జరిగి రెండు ముక్కలైంది. హాఫీజ్‌ను గద్దె దింపి పౌర ప్రభుత్వాన్ని ఏర్పరచారు. ఈ సర్కారులోనే తర్వాతి కాలంలో 30 ఏళ్ల పాటు సిరియాను పాలించిన హఫెజ్ అల్ అస్సద్ రక్షణ మంత్రిగా చేరారు. 1967 జూన్‌లో ఈజిప్టు–ఇజ్రాయెల్ మధ్య మొదలైన యుద్ధంలో సిరియా ఈజిప్టు పక్షాన చేరింది. ఈ యుద్ధంలో గోలన్ హైట్స్‌ను సిరియా కోల్పోయింది. యుద్ధానంతర పరిణామాల్లో 1970 నవంబర్ 13న రక్తపాత రహిత తిరుగుబాటులో అస్సద్ అధికారాన్ని చేజిక్కించుకున్నారు. 1973 మార్చిలో కొత్త రాజ్యాంగాన్ని అమలులోకి తెచ్చిన అస్సద్ సిరియాను సెక్యులర్ సోషలిస్టు రాజ్యంగా ప్రకటించారు. మొట్టమొదటి సారిగా పీపుల్స్ కౌన్సిల్‌ను ఏర్పరచి ఎన్నికలు నిర్వహించారు. 1976లో లెబనాన్ అంతర్యుద్ధంలో సిరియా తలదూర్చింది. 2005 వరకు ఈ జోక్యం కొనసాగింది. 1986లో ఇజ్రాయెలీ విమానం పేల్చివేత యత్నంలో సిరియా హస్తం ఉందన్న ఆరోపణపై అమెరికా తన రాయబారిని సిరియా నుంచి వెనక్కి పిలిచింది. 1987లో అబూనిదల్ సంస్థపై సిరియా దేశ బహిష్కరణ విధించడంతో రాయబార సంబంధాల పునరుద్ధరణ జరిగింది.

1990లో కువైట్ ఆక్రమణ నేపథ్యంలో ఇరాక్‌పై అమెరికా నాయకత్వంలో 34 దేశాల కూటమి చేసిన దాడిలో సిరియా పాల్గొనడం కొత్త రాజకీయాలకు తెరతీసింది. లెబనాన్‌లో బందీగా ఉన్న పశ్చిమ దేశస్తులను విడిపించడానికి సిరియా తోడ్పడింది. అంతరించిపోతున్న సోవియట్ ప్రభావం నుంచి సిరియా బయటపడి అమెరికా పక్కన చేరుతోందన్న సంకేతాలు వెలువడ్డాయి. క్లింటన్ కాలంలో మధ్యప్రాచ్యంలో శాంతిని నెలకొల్పడంలో సిరియాను భాగం చేయడానికి ప్రయత్నాలు జరిగాయి. 9/11 దాడుల తదనంతరకాలంలో సైతం ఉగ్రవాదంపై యుద్ధంలో సిరియా కొంతమేరకు అమెరికాకు సాయం చేసింది. బహ్రెయిన్‌లోని అమెరికా నావికా స్థావరంపై అల్‌ఖైదా తలపెట్టిన గ్లెడర్ దాడి గురించి సిరియా ముందే అలర్ట్ చేసింది. అయితే 2002లో ఇరాక్‌పై అమెరికా చేసిన దాడిని సిరియా వ్యతిరేకించడంతో పరిస్థితి మళ్లీ మొదటికొచ్చింది. జిహాద్ ఉగ్రవాదులు సిరియా సరిహద్దుల గుండా ఇరాక్‌లోకి ప్రవేశించారని, సిరియాలో సద్దాం అనుచరులు తలదాచుకున్నారని అమెరికా ఆరోపించింది. 2005 ఫిబ్రవరిలో లెబనాన్ ప్రధాని హత్య అనంతరం ఈ సంబంధాలు మరింత క్షీణించాయి. అమెరికా తన రాయబారిని సిరియా నుంచి వెనక్కి పిలిచింది. అప్పటి నుంచి నేటి వరకూ ఇరు దేశాల మధ్య సంబంధాలు శత్రుపూరితంగానే కొనసాగుతున్నాయి.

నిజానికి అమెరికా ప్రకటించిన ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తున్న దేశాల జాబితాలో 1979 నుంచీ సిరియా పేరుంది. అప్పటి నుంచే కొన్ని రకాల వస్తువుల ఎగుమతులు-దిగుమతులపై, వివిధ ప్రాజెక్టుల కింద అమెరికా మానవతా దృక్పథంతో చేసే సాయంపై, సైనిక సామాగ్రి కొనడంపై ఆంక్షలు కొనసాగుతున్నాయి.. 2006లో కమర్షియల్ బ్యాంక్ ఆఫ్ సిరియాను నిషేధించారు. 2010 మేలో ఆహారం, మందులు మినహా మిగతా అన్ని వస్తువులకు ఈ ఆంక్షలను విస్తరించారు. 2010 ఏప్రిల్‌లో లెబనాన్‌లోని హిజ్బుల్లాకు సిరియా స్కడ్ క్షిపణులు సరఫరా చేసిందని అమెరికా ఆరోపించింది. 2011 ఆగస్టు 11న అమెరికాలోని అన్ని రకాల సిరియా ఆస్తులను స్తంభింపజేస్తూ, అమెరికా పౌరులెవరూ సిరియా సర్కారుతో వ్యవహారాలు నడుపకుండా, అక్కడ పెట్టుబడులు పెట్టకుండా చమురు ఉత్పత్తుల దిగుమతిని నిషేధిస్తూ ఒబామా ఆదేశాలు జారీ చేయడంతో ఆంక్షల పర్వం క్లైమాక్స్‌కు చేరింది.

సిరియాపై తమ ఆగ్రహానికి అమెరికా, ఇతర నాటో దేశాలు చెబుతున్న ప్రధాన కారణాల్లో అక్కడ కొనసాగుతున్న ప్రజాస్వామ్య పునరుద్ధరణ ఉద్యమాన్ని అస్సద్ ప్రభుత్వం అతి క్రూరంగా అణచివేస్తోందన్నది ముఖ్యమైనది. మానవ హక్కుల ఉల్లంఘన విచ్చలవిడిగా జరుగుతోందని, ఇప్పటికే 400 మంది పిల్లలు సహా మూడు వేలకు పైగా అమాయకుల ప్రాణాలను బలి తీసుకున్నారని, 600 మంది చిత్రహింసలతో

జైళ్లలో చనిపోయారని, లక్షా 30 వేల మంది దేశం విడిచి పారిపోయారని ఆ దేశాలు ఆరోపిస్తున్నాయి. దేశ జనాభాలో మెజారిటీ అస్సద్ దిగిపోవాలని కోరుకుంటున్నారని చెబుతున్నాయి.

ఇక్కడ మనం గమనించాల్సిన విషయమేమిటంటే ఓ సద్దాం హుస్సేన్‌లాగే హాఫెజ్ అల్ అస్సద్ అయినా, ఆయన కుమారుడు బషెర్ అల్ అస్సద్ అయినా అమెరికా మాటల్లో చెప్పాలంటే ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన పాలకులు కాదు. అరబ్ ప్రపంచంలో నెలకొన్న ప్రత్యేక పరిస్థితుల్లో ఇజ్రాయెల్ జియోనిజానికి, ఆధిపత్యవాదానికి వ్యతిరేకంగా నిలబడి విశాల ప్రజానీకం అభిమానం పొందిన నేతలు. గత 40 ఏళ్లుగా సిరియాను అస్సద్ కుటుంబం ఏకఛత్రాధిపత్యంగా పాలించిందంటే అందుకు ప్రజల్లో బలంగా ఉన్న ఈ జాత్యాభిమానం, ఇజ్రాయెల్ వ్యతిరేక వాదమే కారణం. బషెర్ పగ్గాలు చేపట్టిన తర్వాత 2005 నుంచి సిరియాలో ప్రజాస్వామ్య పునరుద్ధరణోద్యమం మొదలైంది. నిరంకుశ, నియంతృత్వ విధానాలకు బషెర్ స్వస్తి చెప్పాలని, ప్రజాస్వామ్య సంస్కరణలు చేపట్టాలని ఉద్యమకారులు డిమాండ్ చేశారు. అప్పటి నుంచి ఓ మోస్తరుగా కొనసాగుతున్న ఉద్యమం 2011లో తీవ్రతరమైంది. అరబ్ గర్జనగా మొదలైన విప్లవాలు ట్యునీషియా, ఈజిప్టు, లిబియా తదితర దేశాలకు పాకి సిరియా ప్రజలకూ స్ఫూర్తినిచ్చాయి. ఆ స్ఫూర్తితోనే ప్రస్తుతం అక్కడ అస్సద్‌ను గద్దె దించే ఉద్యమం పెద్దయెత్తున కొనసాగుతోంది.

ఈ ఉద్యమానికి తనదైన రీతిలో కీలక మలుపునిచ్చింది అమెరికా. లిబియా తరహాలోనే అస్సద్‌ను దింపేసి తనకు కీలుబొమ్మగా వ్యవహరించే సర్కారుకు పగ్గాలు అప్పగించడానికి పావులు కదిపింది. ఉద్యమంలో అమెరికా అనుకూల శక్తులను గుర్తించి వారికి ఆర్థిక సాయమందించింది. సాయుధం చేసింది. వికీలీక్స్ ఈ కేబుల్స్‌ను బహిర్గతం చేసింది.. సిరియాలో అమెరికా రాయబారి ఫోర్డ్ వివిధ ప్రాంతాల్లో తిరుగుతూ తిరుగుబాటు వర్గాలను రెచ్చగొట్టారని స్వయంగా సీఐఏ మాజీ అధికారి మైఖేల్ షూయర్ వెల్లడించడం ఇక్కడ గమనార్హం. అయితే, ఇన్ని చేసినా ప్రతిపక్షం అంత బలంగా లేని కారణంగా అమెరికా లక్ష్యం ఇప్పటికీ నెరవేరలేదు. ఫలితంగానే ఇటీవలికాలంలో సిరియాపై తన దుష్ప్రచారాన్ని అమెరికా మరింత తీవ్రం చేసింది. ఆ దేశం ఉగ్రవాద సంస్థలకు అడ్డాగా మారిందని, ఇరాక్, లెబనాన్ తదితర దేశాల్లో జరుగుతున్న అమెరికా వ్యతిరేక దాడులన్నింటి వెనుక ఆ దేశ హస్తమున్నదని. ఇస్లామిక్ జిహాద్, హమాస్, హిజ్బుల్లా, ముస్లిం బ్రదర్‌హుడ్, పీఎఫ్ఎల్‌పీ వంటి సంస్థలు సిరియాలో ఆశ్రయం పొందుతూ విచ్చలవిడిగా దాడులకు పూనుకుంటున్నాయని ఆరోపిస్తోంది. అణురియాక్టర్ తయారీ కోసం సిరియా చేసిన చిన్న ప్రయత్నాన్ని భూతద్దంలో చూపించి అణ్వాయుధాల

తయారీ అంటూ ఊదరగొట్టింది. మానవ హక్కుల ఉల్లంఘన అంటూ నానా యాగి చేస్తోంది. నాటో దేశాలతో కలిసి సిరియాపై దాడి చేయడానికి అవసరమైన ప్రాతిపదికను తయారుచేసుకుంటోంది.

తను చెప్పినట్లు వినే దేశాలకో న్యాయం, వినని దేశాలకు మరో న్యాయమనే విధానాలను అమెరికా ఇకనైనా మానుకోవాలి. సిరియాకో నీతి, ఇజ్రాయెల్‌కు మరోనీతి అవలంభిస్తే బలయ్యేది ప్రపంచ శాంతేననే విషయాన్ని గుర్తించాలి. తమ పాలకులుగా ఎవరుండాలో, నిరంకుశంగా వ్యవహరిస్తున్న ప్రభుత్వాలను ఎలా గద్దె దించాలో ఆయా దేశాల ప్రజలకు బాగా తెలుసు. ఆ విషయంలో వారికి అమెరికా సలహాలు, సహాయాలేమీ అక్కర్లేదనే విషయాన్ని అంగీకరించాలి. ఇజ్రాయెల్‌కు దన్నుగా మధ్యప్రాచ్యంలో ఆడుతున్న యుద్ధక్రీడలకు ఇకనైనా స్వస్తి చెప్పాలి. బేషరతుగా ఆఫ్ఘనిస్తాన్ నుంచి తన బలగాలను ఉపసంహరించుకోవాలి. ఇరాన్ సార్వభౌమత్వాన్ని గౌరవించి ఆ దేశంపై యుద్ధ సన్నాహాలను విరమించుకోవాలి. లేదంటే ప్రపంచ దేశాల ప్రజలు తీవ్రంగా ప్రతిఘటిస్తారు. అప్పుడు సిరియా మరో ఆఫ్ఘనిస్తాన్, ఇరాన్ మరో వియత్నాం కాక తప్పదు.

***(నమస్తే తెలంగాణ, 08-05-2012)***

# శ్రీలంక పాలకులకు టైగర్ ఫోబియా

మన పొరుగున ఉన్న శ్రీలంక పాలకులకు ప్రస్తుతం టైగర్ల భయం పట్టుకున్నది. రెండున్నర దశాబ్దాల పాటు ఎల్‌టీటీఈ (లిబరేషన్ టైగర్స్ ఆఫ్ తమిళ్ ఈలం)తో కొనసాగిన యుద్ధంలో రెండున్నరేళ్ల కిందట ప్రభుత్వ బలగాలు నిర్ణయాత్మక విజయం సాధించాయి. టైగర్ల అగ్రనేత వేలుపిళ్లై ప్రభాకరన్‌తో సహా కీలక నేతలు, కమాండర్లు ఆ పోరులో నేలకొరిగారు. మిగిలిన వారు యుద్ధఖైదీలుగా చిక్కి శ్రీలంకలోని వివిధ జైళ్లలో విచారణ నెదుర్కొంటున్నారు. సుదీర్ఘకాలం సింహళ సైన్యాలతో పోరాడి చివరకు ఓడిపోయి నైతిక స్థయిర్యం కోల్పోయిన దీనస్థితిలో తమిళ ప్రజలున్నారు. ఈ పరిస్థితుల్లో హుందాగా వ్యవహరించాల్సిన శ్రీలంక పాలకవర్గాలు తమిళ ప్రాంతాలను సైనిక బలగాలతో నింపి ప్రజలను భీతావహులు చేస్తున్నారు. భవిష్యత్తులో ఏ సంస్థ సాయుధంగానో, శాంతియుతంగానో తమిళజాతిపై కొనసాగుతున్న వివక్షపై పోరాడలేని స్థితిని తేవడానికి శతవిధాలా యత్నిస్తున్నారు. ఉత్తర, తూర్పు రాష్ట్రాల్లో సర్వాధికారాలు మిలిటరీ అధికారులకే కట్టబెట్టారు. తమిళులు మెజారిటీగా ఉండే ఈ ప్రాంతాలను యుద్ధప్రాతిపదికన సింహళీయుల వలసలుగా మార్చేస్తున్నారు. సైనిక కంటోన్మెంట్ల పేరుతో, హైసెక్యూరిటీ జోన్లు, అభివృద్ధి ప్రాజెక్టులు, చారిత్రక, పవిత్ర స్థలాల పరిరక్షణ పేరుతో ఈ రెండు రాష్ట్రాల విస్తీర్ణంలో 37 శాతం భూభాగాన్ని ఇప్పటికే ప్రభుత్వ బలగాలు, సింహళ వలసవాదులు వశం చేసుకున్నారు. ఇక్కడి వనరులపై కన్నేసిన సింహళ పెట్టుబడిదారులు ఇదే అదునుగా తమ కార్యకలాపాలను విస్తరిస్తున్నారు. దక్షిణాది నుంచి ఇక్కడికి భారీ ఎత్తున వలసలు సాగుతున్నాయి. టైగర్లకు మద్దతుదార్లని, సానుభూతిపరులని వేలాదిమందిని రకరకాల వేధింపులకు గురిచేస్తున్నారు. బతికుంటే బలుసాకు తినవచ్చనే రీతిలో ఇతర దేశాలకు పారిపోయే స్థితిని కల్పిస్తున్నారు. తమిళ ఈలంలో తమిళులను మైనారిటీలుగా మార్చడమే వారి ప్రధాన వ్యూహంగా వ్యవహరిస్తున్నారు.

స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి తమను రెండవ శ్రేణి పౌరులుగా చూస్తూ సింహళీయులే రాజ్యమేలుతున్న పరిస్థితుల్లో వివక్షకు వ్యతిరేకంగా వివిధ రూపాల్లో, వివిధ

సంస్థలు, పార్టీల నేతృత్వంలో పోరాడిన శ్రీలంక తమిళులు చివరకు ఎల్‌టీటీఈ నాయకత్వంలో సాయుధపోరుకు సిద్ధపడ్డారు. మెజారిటీ ప్రాంతాలను సింహళ సైన్యాల నుంచి విముక్తం చేసి స్వయం పాలనను ఏర్పాటు చేసుకున్నారు. సుమారు 26 ఏళ్ల పాటు యుద్ధం-శాంతి-యుద్ధం పద్ధతుల్లో బతికారు. చివరకు 2009 మేలో జరిగిన అంతిమ పోరులో ఓడిపోయారు. ఈ యుద్ధంలో 28 వేల మంది తమిళ గెరిల్లాలు, 24 వేల మంది శ్రీలంక సైనికులు, పోలీసులు, 1155 మంది భారత సైనికులతోపాటు కనీసం 40-50 వేల మందికి పైగా సాధారణ ప్రజలు ప్రాణాలు కోల్పోయారు. 2009 జనవరి నుంచి మే మధ్య సాగిన అంతిమ సమరంలోనే ఐదువేల మంది టైగర్లతో పాటు సుమారు 40వేల మంది తమిళ ప్రజలు ఊచకోతకు గురైనట్లు అంతర్జాతీయ సంస్థల అంచనా.

ఓడిపోయిన ప్రజల పట్ల కనీస యుద్ధనీతిని, మానవతను కూడా ప్రదర్శించకుండా శ్రీలంక ప్రభుత్వం ఉత్తర తూర్పు ప్రాంతాల్లో ఘోర దమనకాండకు పూనుకుంటున్నది. యుద్ధం ముగిసి రెండున్నరేళ్లు దాటినా అనధికారికంగా సైనిక పాలనే కొనసాగిస్తున్నది. అంతర్జాతీయ వేదికలపైన ఎల్‌టీటీఈ టెర్రరిజాన్ని మాత్రమే అంతం చేశామని, తమిళులు తమ దేశంలో అంతర్భాగమనీ, ఈలం యుద్ధంలో పౌరుల ఊచకోతలు జరగలేదనీ, త్వరలోనే సమస్యను రాజకీయంగా పరిష్కరిస్తామని ఊకదంపుడు ఉపన్యాసాలిచ్చే ప్రభుత్వ పెద్దలు.. స్వదేశంలో మాత్రం దమన నీతినే అమలుచేస్తున్నారు.

రాజకీయ పరిష్కారం గురించి మాట్లాడడం అనవసరమని, టైగర్లను అంతం చేయడమే అసలు విషయమని స్వయంగా ఆ దేశ రక్షణ మంత్రి, అధ్యక్షుడు మహింద రాజపక్సేకు సోదరుడు అయిన గోతభయ రాజపక్సే ప్రకటించాడు. అధ్యక్షుడు మహింద కూడా విజయగర్వంతో తాను ప్రవచించిందే ప్రజాస్వామ్యమన్న రీతిలో ప్రవర్తిస్తున్నాడు. భయంకరమైన ఓ భూతాన్ని కష్టమో నష్టమో ఓర్చుకుని అంతం చేశామని, తమిళులు మళ్లీ తలెత్తుకోకుండా, సమైక్యం కాకుండా, సంస్థలు పెట్టుకోకుండా ఎంతకైనా తెగిద్దామనే వైఖరితో సింహళ పాలకవర్గాలున్నాయి. అందుకే 2009 మే తదనంతర కాలంలో తమిళ జాతి ఆత్మగౌరవాన్ని, పోరాట పటిమను నీరుగార్చడానికి వారికి స్వంత భూభాగం లేకుండా చేస్తున్నారు.

ఈ కుట్రల్లో ముఖమైనది వలసీకరణ. ఉత్తర, తూర్పు రాష్ట్రాల విస్తీర్ణం 18,800 చ.కి.మీ. కాగా అందులో 7వేల చ.కి.మీ. భూభాగాన్ని మిలిటరీ తమ స్వాధీనంలోకి తీసుకున్నది. పౌరప్రాంతాల్లో కనీసం మూడవ వంతు మిలిటరీ ఆధీనంలో ఉండాలనే విధానాన్ని కొనసాగిస్తున్నది. తమిళులు నివసించే పలు పట్టణాలను, గ్రామాలను వివిధ చట్టాలు, సర్క్యులర్ల ద్వారా వశం చేసుకుంటూ ఈ ప్రాంతాలకు సింహళీయుల వలసను ప్రోత్సహిస్తున్నది.

ఇందుకోసం పట్టణాభివృద్ధి శాఖను గోతభయ ఆధీనంలో ఉన్న రక్షణ శాఖ పరిధిలోకి తెచ్చారు. తమిళుల ఆధీనంలో ఉన్న ప్రైవేటు భూములను కూడా దఖలు పరుచుకునే అధికారమిచ్చే టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ ఆర్డినెనెన్స్-2011 బిల్లు రూపొందించారు. ఇప్పుడక్కడ సైన్యం, పట్టణాభివృద్ధి అధికారులు కలిసి తిరుగుతూ వ్యూహాలు రచిస్తున్నారు. జాఫ్నా జిల్లా విస్తీర్ణంలో 30 శాతం భూభాగాన్ని మిలిటరీ హైసెక్యూరిటీ జోన్‌గా ప్రకటించింది. కంకేశన్‌తురై, కిలాలి, మాతక్కల్, మంద్రైత్తీవు, కెయిట్స్ తదితర అనేక దీవులు ఇందులో భాగంగా సైన్యం చేతుల్లోకి వెళ్లిపోయాయి. భట్టికలోవా జిల్లాలో కూడా 15-20 వేల ఎకరాల భూమిని ప్రభుత్వం వశం చేసుకోజూస్తున్నది. జిల్లా సరిహద్దు గ్రామం మంగ్‌కలఆరులోని 2500 ఎకరాల భూమిని సింహళ, విదేశీ పెట్టుబడిదారులకు కట్టబెట్టారు. ఈ ఊరి పేరును సైతం మంగళగామగా సైన్యం మార్చేసింది.

అలాగే, పద్ధిపజయి డివిజన్ దేవులాలకులం గ్రామానికి చెందిన పచ్చని పంటపొలాలను సైనికుల సహాయంతో సింహళీయులు ఆక్రమించారు. సహజవనరులు అధికంగా ఉన్న మరో ఆరు గ్రామాలను ముస్లింలు అధికంగా నివసించే అంపరాయ్ జిల్లాలో విలీనం చేస్తున్నారు. కబ్జాలకు ఇది మొదటిమెట్టని వేరే చెప్పనక్కరలేదు. ఈ గ్రామాల్లో ఒకటైన కెవులియమడులోని 114 తమిళ కుటుంబాలకు చెందిన భూములను 108 సింహళ కుటుంబాలు కబ్జా చేశాయి. మన్నార్ జిల్లా చెల్వియారి ప్రాంతంలో కంటోన్మెంట్ నిర్మాణం పేరుతో వేల ఎకరాల భూమిని కాజేశారు. బొగ్గు ఆధారిత థర్మల్ విద్యుత్ ప్లాంట్ నిర్మాణం పేరుతో ట్రింకోమలి జిల్లాలోని చంపూరు ఏరియాలో 10 వేల ఎకరాలను హై సెక్యూరిటీ జోన్‌గా ప్రకటించారు. ఫలితంగా 10వేల మంది తమిళులు నిరాశ్రయులయ్యారు. ఇదే జిల్లాలోని తిరియాయ్ అనే తమిళ గ్రామంలోని బుద్ధ విహార్ పరిరక్షణ మిషతో 3వేల ఎకరాలను కాజేశారు. అభివృద్ధి పథకాల పేరుతో వన్ని అడవుల్లో అధికభాగాన్ని సైన్యం ఆక్రమించుకునివుంది. తమిళ ప్రజలపై ఆగని వేధింపులు మరోగాథ. యుద్ధం ముగిసినా, పూర్తిస్థాయిలో టైగర్ల భౌతిక నిర్మూలన జరిగినా ఉత్తర, తూర్పు రాష్ట్రాల్లో ప్రభుత్వ బలగాల దమనకాండ ఆగలేదు. ఒకప్పుడు ఎల్‌టీటీఈలో పని చేశారనో, ఆ సంస్థకు వివిధ రకాలుగా మద్దతు ఇచ్చారనో, ఇక్కడి విషయాలను విదేశాల్లో ఉన్న టైగర్ల సానుభూతిపరులకు చేరవేస్తున్నారనో, సైన్యానికి సహకరించడం లేదనో పోలీసులు, సైనికులు తమిళులను వేధిస్తున్నారు. తమిళుల రోజువారీ జీవితాన్ని దుర్భరం చేస్తున్నారు. అరెస్టులు, జైలునిర్బంధాలు కొనసాగుతూనేవున్నాయి. తమిళ పౌరుల ఊచకోతకు సాక్షులుగా ఉన్నారనే మిషతో ఇటీవల వివిధ జిల్లాల్లో ఇంటెలిజెన్స్ సంస్థలు అనేక మందిని నిర్బంధించాయి.

జాఫ్నా, భట్టికలోవా, అంపరాయ్, ట్రింకోమలి, మన్నార్ తదితర జిల్లాల్లో పోలీసులు ఇల్లిల్లు తిరిగి వ్యక్తుల సమాచారం సేకరించే ప్రక్రియ కొనసాగిస్తున్నారు. మరోవైపు, ధరల నియంత్రణ పేరుతో, తూనికలు–కొలతలు, క్వాలిటీ కంట్రోల్ పేరుతో, విద్యుత్ మీటర్ల తనిఖీ పేరుతో అధికారులు తమిళులను నంజుకుతింటున్నారు. 49సీసీ మోపెడ్లకు డ్రైవింగ్ లైసెన్స్ అవసరం లేదని ప్రభుత్వం ప్రకటించినా, తమిళుల నుంచి పోలీసులు బలవంతపు వసూళ్లు చేస్తున్నారు. ఇక, పగలు రాత్రనకుండా గుర్తుతెలియని వ్యక్తులు ఇళ్లల్లో చొరబడి సామగ్రి లూటీ చేయడం సాధారణమై పోయింది. పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోరు. ఈ వేధింపులన్నింటి సందేశం ఒకటే. ఇక్కడుండదలుచుకుంటే బానిసలుగా బతకండి లేదంటే వేరే దేశం వెళ్లిపోండి అని. తమిళులకు ఓ జాతిగా ఇక్కడ చోటులేదు.

దీనంతటికి కారణం ముందే చెప్పినట్లు సింహళ పాలకులకు పట్టుకున్న టైగర్ ఫోబియా. అయితే, ఇంత చేస్తున్నా మొన్న నవంబర్ 27న హీరోస్ డే (అమరుల దినం) సందర్భంగా చారిత్రక జాఫ్నా విశ్వవిద్యాలయంలో హాస్టల్ భవనంపై భారీ కాగడా వెలిగించారు. భట్టికలోవాలో ప్రభాకరన్ పుట్టిన రోజును ప్రజలు కేకులు, స్వీట్లతో ఘనంగా జరుపుకున్నారు. ఉత్తర, తూర్పు ప్రాంతమంతటిలో ఊరేగింపులను, సమావేశాలను, దేవాలయాల్లో పూజలను, చర్చిల్లో ప్రార్థనలను సైన్యం నిషేధించినా ప్రజలు ధిక్కరించారు. అమరుల స్మృతిలో ఇంటింటా దీపాలు వెలిగించారు. గల్లీల్లో కాగడాలు మండించారు. గుళ్లలో గంటలు మోగించారు. బ్రిటన్, నెదర్లాండ్స్, అమెరికా వంటి దేశాల్లో కూడా తమిళులు హీరోస్ డేను జరుపుకున్నారు.

శతాబ్దాలుగా స్వతంత్ర అస్తిత్వాన్ని కలిగివున్న ఓ జాతి ఆకాంక్షలను సైనికంగా అణచివేయడం సాధ్యం కాదని ఇప్పటికైనా సింహళ పాలకవర్గాలు గుర్తించాలి. పాతికేళ్ల పాటు సాయుధంగా పోరాడి తమిళులు సాధించుకున్న సార్వభౌమత్వాన్ని గౌరవించాలి. సుదీర్ఘ యుద్ధంలో టైగర్లు సహా ఇప్పటికే సుమారు లక్ష మంది తమిళుల నిర్మూలన, మరో 8 లక్షల మంది విదేశాలకు వలస వెళ్లిన నేపథ్యంలో సింహళ జాత్యహంకారుల చేతుల్లో తమిళ జాతి నాశనం జరుగకుండా, తమిళ ఈలం మరో పాలస్తీనా కాకుండా చూడాల్సిన బాధ్యత శ్రీలంక పాలకులపై ఉంది. అంతర్జాతీయ సమాజం కూడా వెంటనే జోక్యం చేసుకుని తమిళ జాతి సమస్యను న్యాయబద్ధంగా పరిష్కరించే దిశలో చర్యలు తీసుకోవాలి. వలసీకరణను, మానవహక్కుల ఉల్లంఘనలను, మిలిటరీ వేధింపులను ఆపేలా శ్రీలంక ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలి. తమిళజాతిని రక్షించుకోవాలి.

***(నమస్తే తెలంగాణ, 27-12-2011***

# పేదరికం.. అంకెల గారడీ..

దేశంలో ఎంత మంది పేదలున్నారన్న విషయంపై ఇటీవల ఉభయ సభల్లో పెద్ద దుమారం చెలరేగింది. గ్రామీణ ప్రాంతంలో రోజుకు రూ. 22.42, పట్టణప్రాంతంలో రూ. 28.35 ఖర్చు పెట్టగలిగితే చాలు.. వాళ్లు పేదలు కాదంటూ ఇటీవల ప్రణాళిక సంఘం ప్రకటించడం ఈ వివాదానికి కారణమైంది. గత ఐదేళ్లలో దేశంలో పేదరికం 37.2 శాతం నుంచి 29.9 శాతానికి తగ్గిందని, 2004-05లో 40 కోట్ల 72 లక్షల సంఖ్యలో ఉన్న పేదలు 2010 మార్చి 1 నాటికి 35 కోట్ల 46 లక్షలకు తగ్గారని సంఘం అంచనా వేసింది. గ్రామీణ ప్రాంతాల్లో పేదరికం 8శాతం తగ్గగా, పట్టణాల్లో 4.8శాతం తగ్గిందని తెలిపింది. పేదరికంపై టెండూల్కర్ కమిటీ 2004-05 కోసం వేసిన అంచనాలను ద్రవ్యోల్బణం రేటుతో గణించగా ఈ లెక్కలు వచ్చాయని సంఘం ఉపాధ్యక్షుడు మాంటేక్‌సింగ్ ఆహ్లువాలియా వివరించారు. అయితే, ఈ లెక్కలను ప్రతిపక్షాలు తిరస్కరించాయి. గత అక్టోబర్‌లో సుప్రీంకోర్టుకు సమర్పించిన అఫిడవిట్‌లో ఇదే సంఘం పల్లెల్లో రోజుకు రూ. 26, పట్టణాల్లో రూ. 32 ఖర్చు చేయలేనివాళ్లు దారిద్ర్యరేఖ కిందికి వస్తారని పేర్కొని ఇప్పుడిలా అంచనాలు మార్చడమేమిటని ప్రశ్నించాయి. అంకెల గారడీ చేసి దేశంలో పేదరికాన్ని తగ్గించి చూపుతున్న ఆహ్లువాలియాను వెంటనే పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేశాయి. ఇందుకు స్పందించిన ప్రధానమంత్రి మన్మోహన్‌సింగ్ పేదరిక నిర్ధారణ కోసం టెండూల్కర్ కమిటీ రూపొందించిన పద్ధతి సమగ్రంగా లేని మాట వాస్తవమేనని ఒప్పుకున్నారు. ఈ అంశంపై అధ్యయనం చేయడానికి ఒక సాంకేతిక కమిటీ వేయనున్నట్లు ప్రకటించారు.

ఎవరిని పేదలుగా గుర్తించాలన్న విషయంలో వివాదం ఇప్పటిది కాదు. రాచరికం అంతమై ప్రజాస్వామిక పాలన ఆరంభమైన తర్వాత ప్రపంచవ్యాప్తంగా వివిధ దేశాల ప్రభుత్వాలు పేదరికంపై దృష్టి సారించాయి. సమాజంలోని కొన్ని వర్గాలు కనీస సౌకర్యాలు లేక ఆకలితో అలమటిస్తున్నాయని గుర్తించి అలాంటి వారు ఎవరో కనుగొనడానికి ప్రయత్నాలు మొదలుపెట్టాయి. రెండవ ప్రపంచయుద్ధానంతరం ఏర్పడిన ఐక్యరాజ్యసమితి

ఒక మనిషి ఆరోగ్యంగా జీవించడానికి అవసరమైన పోషకాహారం, కట్టుకోడానికి దుస్తులు, ఉండడానికి ఇల్లు, విద్య, వైద్యం అందుబాటులో లేనివాళ్లను పేదలుగా పరిగణించాలని పేర్కొంది. ఇందుకోసం అవసరమైనంత డబ్బును సంపాదించే ఉపాధి లేక, అప్పు కూడా పుట్టక, అభద్రతతో, నిస్సహాయస్థితిలో బతికేవారిని దారిద్ర్యరేఖకు దిగువన జీవిస్తున్నట్లుగా భావించాలని వివరించింది. ప్రపంచబ్యాంకు కూడా పేదరికాన్ని ఇదేవిధంగా నిర్వచించి సమాజంలో ఓ వ్యక్తి బతకడానికి అవసరమైన డబ్బును డాలర్లలో నిర్ధారించింది. రోజుకు 1.25 డాలర్లు కూడా ఖర్చుపెట్టలేని వారిని కడుపేదలుగా, రెండు డాలర్లు ఖర్చుపెట్టలేని వారిని పేదలుగా పరిగణించాలని తెలిపింది. దీనిని ఆయా దేశాల్లో అప్పటి ద్రవ్యోల్బణం, కొనుగోలుశక్తిలో తారతమ్యతల ఆధారంగా గణించి బెంచ్‌మార్క్‌ను రూపొందించాలని సూచించింది.

ఉన్నతస్థాయి జీవనప్రమాణాలున్నాయని భావిస్తున్న అగ్రరాజ్యం అమెరికాలో సమాజం సగటున అనుభవిస్తున్న సౌకర్యాలు, సేవలు అందక, దీనావస్థలో ఉన్నవారందరినీ పేదలుగా పరిగణిస్తున్నారు. డబ్బు లెక్కల్లో చూస్తే సంవత్సరానికి 11వేల139 డాలర్లు ఖర్చు చేయని వ్యక్తి లేదా 22,350 డాలర్లు వెచ్చించని నలుగురు సభ్యుల కుటుంబం పేదరికంలో ఉన్నట్లుగా ఆ దేశం భావిస్తోంది. అమెరికన్ సెన్సస్ బ్యూరో విడుదల చేసిన కరెంట్ పాపులేషన్ సర్వే ప్రకారం 2008లో అక్కడ 3కోట్ల 98లక్షల మంది (13.2 శాతం) పేదలుండగా 2010 నాటికి ఆ సంఖ్య 4కోట్ల 62 లక్షలకు(15.1 శాతం) చేరింది. నల్ల జాతీయుల్లో 27.4 శాతం, శ్వేత జాతీయుల్లో 9.9 శాతం, నాన్ హిస్పానిక్ శ్వేత జాతీయుల్లో 9.9శాతం, హిస్పానిక్ అన్ని జాతుల్లో 26.6 శాతం, ఆసియావాసుల్లో 12.1 శాతం పేదవాళ్ళున్నారు. 2011లో ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని జనాభా లెక్కల అధికారులే ఒప్పుకుంటున్నారు. ఇక దేశంలోని సగటు కుటుంబ ఆదాయంలో కనీసం 60శాతం సంపాదన లేని కుటుంబాలను పేదరికంలో ఉన్నట్లుగా బ్రిటన్ పరిగణిస్తోంది. కరెన్సీ రూపంలో అయితే, వారానికి 124 పౌండ్లు ఖర్చు పెట్టలేని వ్యక్తిని, 346 పౌండ్లు ఖర్చు పెట్టలేని నలుగురు సభ్యుల కుటుంబాన్ని దారిద్ర్యరేఖకు దిగువన ఉన్నట్లు లెక్కిస్తోంది. ప్రస్తుతం అక్కడ ప్రతి ఐదుగురిలో ఒకరు పేదరికంలో మగ్గుతున్నారు. 1979–80లో13.7శాతం ఉన్న పేదరికం 2009–10నాటికి తిరిగి 22.2 శాతానికి చేరుకుంది.

మన దేశానికి వస్తే, పేదరికం నిర్ధారణలో ఇక్కడ మొదటి నుంచీ ఒక నిర్దిష్ట విధానమంటూ అనుసరించిన దాఖలాలు లేవు. దేశ ప్రజల జీవనప్రమాణాలను అంచనా వేయడానికి 1951 నుంచి ఇప్పటివరకు 66 జాతీయ శాంపిల్ సర్వేలు జరిగి, 67వ సర్వే ప్రస్తుతం కొనసాగుతున్నా ఎవరిని పేదలుగా పరిగణించాలనే విషయంలో ఇప్పటికీ

ఒక స్పష్టత రాలేదు. 1978లో నిపుణుల కమిటీ సూచనల ఆధారంగా ప్రణాళికా సంఘం తొలిసారిగా దారిద్ర్యరేఖ విషయంలో కొన్ని నిర్ధారణలకు వచ్చింది. పట్టణాల్లో 2100 కెలరీలు, పల్లెల్లో 2400 కెలరీలు ఆహారం రూపంలో పొందలేని జనాభాను పేదలుగా పరిగణించాలని నిర్ణయించింది. అప్పటి ధరల ఆధారంగా సంవత్సరానికి పల్లెల్లో నెలకు రూ. 61.80 (రోజుకు రూ. 2.06), పట్టణాల్లో రూ. 71.30 (రోజుకు రూ. 2.37) ఖర్చు పెట్టలేని వారిని దారిద్ర్యరేఖకు దిగువన చేర్చింది. ఆ తర్వాతి కాలంలో ప్రతియేటా జరిగే శాంపిల్ సర్వేలను ఆధారం చేసుకుని, ద్రవ్యోల్బణంతో గణించి ఎప్పటికప్పుడు ప్రణాళికాసంఘం ఎవరు పేదలో అంకెలు విడుదల చేస్తూ వస్తున్నది.

అయితే పేదరికాన్ని నిర్ధారించే పద్ధతిపై అనేక విమర్శలు వచ్చాయి. ప్రణాళికా సంఘం ప్రకటిస్తున్న అంకెలు ఓ వ్యక్తి తీసుకునే ఆహారం కొనడానికి ఏమాత్రం సరిపోవని, పేదరికాన్ని తగ్గించి చూపడానికే ప్రణాళికా సంఘం ప్రయత్నిస్తున్నదని పలువురు విరుచుకుపడ్డారు. ఈ నేపథ్యంలో పేదరికాన్ని ఎలా నిర్ధారించాలనే విషయంపై ప్రభుత్వం 1993లో డీ టీ లక్డావాలా కమిటీని వేసింది. ఈ కమిటీ అన్ని కోణాలను పరిశీలించి పాత పద్ధతికే మొగ్గుచూపింది. ఒక కుటుంబం నెల రోజుల కాలంలో వినియోగించిన ఆహారపదార్థాలను అప్పటి ధరలపై ఆధారపడి లెక్కించి పేదరికాన్ని నిర్ణయించాలని తెలిపింది. శాంపిల్ సర్వేల ఆధారంగా 1993–94లో పల్లెల్లో 37.3శాతం, పట్టణాల్లో 32.4 శాతం, మొత్తంగా 36 శాతం పేదరికం ఉందని తెలిపింది. వివిధ వర్గాల నుంచి, ప్రతిపక్షాల నుంచి తీవ్ర నిరసన వ్యక్తం కావడంతో ప్రభుత్వం ఈ కమిటీ నివేదికను ఆమోదించలేదు. తర్వాతికాలంలో 2005 డిసెంబర్ 2న సురేష్ టెండూల్కర్ నేతృత్వంలో మరో కమిటీని నియమించారు. ఈ కమిటీ పేదరిక నిర్ధారణ కోసం లక్డావాలా సూచించిన పద్ధతితో విభేదించింది. పేదలు అవునో కాదో కేవలం తీసుకునే ఆహారాన్ని, కెలరీలను బట్టే కాకుండా విద్యకు, వైద్యానికి అయ్యే ఖర్చులను భరించేశక్తిని కూడా లెక్కతీసుకోవాలని తెలిపింది. వివిధ రాష్ట్రాలకు, పల్లెలకు, పట్టణాలకు వేర్వేరుగా డబ్బురూపంలో బెంచ్‌మార్క్‌లను నిర్ణయించింది. 2004–05 నాటికి పల్లెల్లో రూ. 446.68 (రోజుకు రూ. 14.89), పట్టణాల్లో రూ. 578.80 (రోజుకు రూ. 19.30) ఖర్చు పెట్టలేని వారిని దారిద్ర్యరేఖకు దిగువన ఉన్నట్లు పరిగణించాలని తెలిపింది. 2004–05 నాటికి దేశంలోని పల్లెల్లో 41.8 శాతం, పట్టణాల్లో 25.7 శాతం, మొత్తంగా 37.2 శాతం పేదరికం ఉందని అంచనా వేసింది.

2009 నవంబర్‌లో టెండూల్కర్ కమిటీ సమర్పించిన నివేదికపై కూడా విమర్శలు వెల్లువెత్తాయి. పల్లెల్లో రూ. 15కు, పట్టణాల్లో రూ. 19కి ఒక వ్యక్తి బతుకడం అసాధ్యమని మేధావులు, నిపుణులు వాదించడంతో ప్రభుత్వం ఈ కమిటీ నివేదికను కూడా

పక్కనబెట్టింది. ప్రభుత్వ పథకాలు, సబ్సిడీలు ఎవరికి వర్తింపజేయాలో నిర్ధారించేందుకు ఎన్ సీ సక్సేనా నేతృత్వంలో మరో కమిటీని నియమించింది. కాగా, దారిద్ర్యరేఖకు దిగువన ఉన్నవారిని నిర్ణయించే విషయంలో పీయూసీఎల్ వేసిన ఓ పిటిషన్ సుప్రీంకోర్టులో విచారణకు రాగా 2011 అక్టోబర్‌లో ఆ కోర్టుకు సమర్పించిన అఫిడవిట్‌లో రోజుకు పల్లెల్లో రూ. 26, పట్టణాల్లో రూ. 32 ఖర్చు చేయలేని వాళ్లను తాము పేదరికంలో ఉన్నట్టు గుర్తించాలని నిర్ణయించామని ప్రణాళికా సంఘం తెలిపింది. మరోవైపు, టెండూల్కర్ కమిటీ 2004-05 కోసం రూపొందించిన బెంచ్‌మార్క్ లెక్కలను ఆమోదించడమే కాకుండా 2010-11 ఆర్థిక సంవత్సరానికి తనకు తోచిన పద్ధతిలో ఆన్వయించిన ప్రణాళికాసంఘం గత సోమవారం పేదరికం లెక్కలను మీడియాకు విడుదల చేసింది.

మరో విచిత్రమేమిటంటే ప్రణాళికా సంఘం చేసే ఈ ప్రక్రియ అంతా కేవలం పేదరికాన్ని అంచనా వేయడానికి మాత్రమే పరిమితం కావడం. ప్రభుత్వ పథకాలు, ప్రజాపంపిణీ వ్యవస్థకు వర్తించకపోవడం. గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ప్రతి పంచవర్ష ప్రణాళికను పురస్కరించుకుని దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న కుటుంబాల వివరాలను విడిగా నిర్ణయిస్తున్నారు. ఇప్పుడు కూడా ప్రణాళికా సంఘం తాజాగా విడుదల చేసిన లెక్కల ఆధారంగా పథకాలు, సబ్సిడీల పంపిణీ జరగదని, త్వరలో పూర్తయ్యే సామాజిక-ఆర్థిక కుల గణన ఆధారంగా జరుగుతుందని ప్రభుత్వవర్గాలు చెబుతున్నాయి. ఇక, మన దేశంలోని పేదరికాన్ని వివిధ జాతీయ, అంతర్జాతీయ సంస్థలు పలురకాలుగా విశ్లేషించాయి. 2005లో ప్రపంచబ్యాంకు నివేదిక ప్రకారం భారత జనాభాలో 41.6శాతం పేదలున్నారు. ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయానికి చెందిన అధ్యయన బృందం ఇటీవల ఈ శాతాన్ని 53.7గా నిర్ధారించింది. ఇందులో 28.6 శాతం మంది కటిక దరిద్రులని తేల్చింది. 1994-2004 మధ్య పదేళ్ల కాలాన్ని పరిగణనలోకి తీసుకున్న అసంఘటిత పరిశ్రమల జాతీయ కమిషన్ (అర్జున్‌సేన్ గుప్తా నివేదిక) రోజుకు రూ.20 కూడా ఖర్చు పెట్టలేని వారు దేశంలో 77శాతం ఉన్నారని తెలిపింది.

ఆంతర్జాతీయ సమాజం దృష్టిలో భారత్‌లో పేదరికం లేదని చెప్పడం కోసం, పేదరిక నిర్మూలన కోసం కేటాయించే నిధులను, పేదలకిస్తున్న సబ్సిడీలను తగ్గించడం కోసం కుట్ర జరుగుతోంది. ప్రధాని మన్మోహన్ సింగ్‌కు ప్రియ శిష్యుడైన ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు ఆహ్లువాలియా ఈ కుట్రకు ప్రాతిపదికను తయారుచేస్తున్నారు. అందులో భాగమే ఈ అంకెల గారడీ అని చెప్పక తప్పదు. సమాజంలో పేదలు ఎవరు, ఎంత మంది ఉన్నారనే విషయం నిర్ణయించడానికి ఇన్ని కమిటీలు, ఇన్ని సర్వేలు అక్కర్లేదు. ప్రభుత్వం చిత్తశుద్ధితో వ్యవహరించి అన్ని అంశాలతో ఒక సమగ్ర సర్వే

నిర్వహించాలి. ఆ వివరాలను ఆయా గ్రామ సభల, వార్డు సభల ముందుంచి ఆమోదింపజేయాలి. తినడానికి తిండి, ఉండడానికి ఇల్లు, కట్టుకోడానికి దుస్తులు, చదువుకునేందుకు, జబ్బు చేస్తే చికిత్స చేయించుకునేందుకు ఆర్థిక స్తోమత లేని ప్రతి వ్యక్తి, ప్రతి కుటుంబం దారిద్ర్య రేఖకు దిగువకు వచ్చే విధంగా బెంచ్‌మార్క్‌ను రూపొందించాలి. అన్ని రకాల పథకాలను, సబ్సిడీలను, ప్రోత్సాహకాలను వీరికే వర్తింపజేయాలి. 12వ పంచవర్ష ప్రణాళిక (2012-17)లో పేదరిక నిర్మూలన కోసం భారీగా నిధులు కేటాయించాలి.

*(నమస్తే తెలంగాణ, 27-03-2012)*

# ప్రణబ్ చిలుక పలుకులు..

యూపీఏకు ట్రబుల్ షూటర్‌గా, సోనియాకు అత్యంత విశ్వాసపాత్రునిగా పేరుగాంచిన కేంద్ర ఆర్థిక మంత్రి ప్రణబ్ ముఖర్జీ గత వారం దేశ 13వ రాష్ట్రపతిగా పదవీ బాధ్యతలు స్వీకరించిన సంగతి తెలిసిందే. ప్రమాణం పూర్తయిన వెంటనే ఆయన చేసిన తొలి ప్రసంగం ఆసక్తికరంగా సాగింది. పేదల ఆకాంక్షలను ధనికుల సిద్ధాంతాలు పరిష్కరించలేవంటూ ఆయన చెప్పిన నీతి వాక్యాలు పలువురి దృష్టిని ఆకర్షించాయి. ఆధునిక దేశ నిర్మాణంలో అన్నింటికన్నా ముఖ్యమైనది ఆర్థిక సమానత్వమని, పేదరికమనేది భారత నిఘంటువులో ఉండాల్సిన పదం కాదని, ఆకలి కంటే అవమానకరమైన విషయం మరొకటి ఉండదని ఆయన పేర్కొన్నారు. నత్తనడకన సాగే కృషి ఈ సమస్యలను పరిష్కరించజాలదని స్పష్టం చేశారు. ఉగ్రవాదంపై చేస్తున్న పోరును నాలుగవ ప్రపంచ యుద్ధంగా అభివర్ణించారు. యుద్ధాల ద్వారా శాంతి సాధ్యం కాదని, కండబలంతో కాకుండా ఆత్మబలంతో, విధ్వంసక ఎజెండాతో కాకుండా అభివృద్ధి ఎజెండాతో భారత్ ప్రగతి పథాన సాగుతుందంటూ స్వామి వివేకానందుని సూక్తిని ఉటంకించారు.

ప్రణబ్ చేసిన ఈ వ్యాఖ్యలను చూసి పరిశీలకులు నివ్వెరపోతున్నారు. గత నలభై ఏళ్లుగా కేంద్రప్రభుత్వంలో, పాలకపక్షంలో, అనేక సభాసంఘాల్లో, మంత్రుల గ్రూపుల్లో కీలక పదవులను చేబట్టి ఆధునిక భారత చరిత్రను ప్రపంచీకరణ, ప్రైవేటీకరణ దిశగా మలుపు తిప్పిన ముఖర్జీ ప్రథమ పౌరునిగా ప్రమాణం చేసిన వెంటనే పేదల పట్ల సానుభూతి వచనాలు పలుకడం దయ్యాలు వేదాలు వల్లించినట్లే ఉందంటున్నారు. ఆర్థిక మంత్రిగా, ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షునిగా, అప్పుడు ఇందిరకు, ఇప్పుడు సోనియాకు ప్రధాన సలహాదారుగా ఉంటూ ఆయన ఏనాడూ పేదరిక నిర్మూలన కోసం చిత్తశుద్ధితో కృషి చేయలేదని ఆరోపించారు. అభివృద్ధి పేరుతో జీవన విధ్వంసానికి, మూలవాసుల వినాశానికి కారణమవుతున్న విధానాల రూపకల్పనలో సోనియా, మన్మోహన్, ప్రణబ్, చిదంబరం, మాంటేక్‌సింగ్ పంచపాండవులని పేర్కొంటున్నారు.

నిజానికి మన్మోహన్‌సింగ్‌లోని ప్రతిభను గుర్తించి రిజర్వు బ్యాంకు గవర్నర్‌ను చేసింది కూడా ప్రణబేనని వివరిస్తున్నారు.

దేశంలోనే అత్యున్నత పదవిని చేపట్టిన సందర్భంగా నాలుగు మంచి మాటలు మాట్లాడడం సంప్రదాయమని భావించి ముఖర్జీ ఆ వ్యాఖ్యలు చేసివుండవచ్చు. కాని తన జీవితకాలమంతా ధనికుల, కార్పొరేట్ల సేవలో తరించి ఇప్పుడు రాష్ట్రపతిగా పేదల పట్ల, పేదరికం పట్ల మొసలి కన్నీరు కార్చడం బాధ్యతారాహిత్యం కిందికే వస్తుంది. స్వాతంత్ర్యం వచ్చి 65 ఏళ్లు గడిచాయి. అరవై ఆరు వార్షిక బడ్జెట్లు, పదకొండు పంచవర్ష ప్రణాళికలు, వందలాది అభివృద్ధి, సంక్షేమ పథకాల అనంతరం మూడు పాళ్ల ఆకలి.. ఆరు పాళ్ల పేదరికమన్నట్లుగా ఉంది పరిస్థితి. జనాభాలో 41.6 శాతం మంది పేదరికంలో మగ్గుతున్నారని ప్రపంచ బ్యాంకు అంచనా వేసింది. రోజుకు కనీసం రూ.20 కూడా ఖర్చు పెట్టలేని వారు నూటికి 77 మంది ఉన్నారు. ప్రపంచ మానవాభివృద్ధి సూచికలో మన దేశం 134వ స్థానాన్ని, సంతోష సూచికలో 94వ స్థానాన్ని, ఆకలి సూచికలో 45వ స్థానాన్ని ఆక్రమించింది. ఆసరా కరువై లక్షలాది రైతులు తమ ఉసురు తీసుకుంటున్నారు. ప్రతి వేయి మందిలో 24 మంది ఆకలితో మరణిస్తున్నారు. ప్రతి ముగ్గురు పిల్లల్లో ఒకరు రక్తహీనతతో, భారహీనతతో సతమతమవుతున్నారు. పుట్టిన వేయి మంది శిశువుల్లో 48 మంది ఇంకా కళ్లు తెరువకముందే ఈ లోకాన్ని వీడి వెళ్తున్నారు. ఇప్పటికీ ప్రతి నలుగురిలో ఒక్కరు నిరక్షరాస్యులు. సగం మందికి మరుగుదొడ్లు, స్నానపు గదులు, డ్రైనేజీ సౌకర్యం లేదు. మూడవ వంతు ఇళ్లకు కరెంటు లేదు. 68 శాతం మందికి రక్షిత మంచినీరు అందుబాటులో లేదు.

ఇంకోవైపు, ధనికులు మరింత ధనవంతులవుతున్నారు. ఫోర్బ్స్ జాబితాలో చోటు సంపాదించుకున్న భారతీయుల సంఖ్య, వారి ఆస్తుల విలువ రోజురోజుకూ పెరుగుతోంది. ఆరు వేల కోట్ల రూపాయలకు పైగా ఆస్తులు కలిగిన ధనవంతులు దేశంలో 59 మంది ఉంటే, ఐదు కోట్లకు పైబడిన ఆస్తులున్న వారి సంఖ్య 2009 నాటికే లక్షా 26వేల 7వందలకు చేరింది. వీరందరి వద్ద కలిపి 30 లక్షల కోట్ల రూపాయల ధనం మూలుగుతోంది. ఇక దేశ, విదేశాలకు చెందిన కార్పొరేట్ల ఐశ్వర్యానికైతే లెక్కే లేదు. ప్రతి యేటా వేలాది కోట్ల రూపాయలను లాభాల రూపంలో ఈ కంపెనీలు వెనకేసుకుంటున్నాయి. ఒక అంచనా ప్రకారం దేశంలోని 90శాతం సంపద జనాభాలోని కేవలం పది శాతం పెద్దల వద్ద పోగుబడివుంది.

అయినా ముఖర్జీ భాగస్వామిగా ఉన్న సర్కార్లు సహా వరుస ప్రభుత్వాలు పేదరికంపై యుద్ధాన్ని నిరంతరాయంగా, నిర్విరామంగా, అప్రతిహతంగా కొనసాగిస్తూనేవున్నాయి. ఆర్థిక సమానత్వమే లక్ష్యంగా విధానాలు రూపొందాలని, భాగస్వామ్యంతో కూడిన

అభివృద్ధి అవసరమని ప్రధానులు ఆగస్టు 15న, రాష్ట్రపతులు జనవరి 26న ప్రసంగాలు చేస్తూనేవున్నారు. అయితే వారి నేతృత్వంలో నడిచే కేంద్ర కేబినెట్ చేసే నిర్ణయాలు, పార్లమెంట్ ఆమోదించే చట్టాలు మాత్రం అందుకు విరుద్ధంగా ఉంటున్నాయి. విశాల ప్రజానీకానికి నష్టం కలిగించే, పెట్టుబడిదారులకు, విదేశీ కంపెనీలకు లాభం చేకూర్చే నిర్ణయాలు స్వాతంత్ర్యానంతర కాలంలో లెక్కకు మిక్కిలి జరిగాయి. తమ వలసవాద విధానాలకు అనుకూలంగా బ్రిటిష్ వాళ్లు చేసుకున్న చట్టాలను స్వేచ్ఛాభారతంలోనూ యథాతథంగా అలాగే కొనసాగించడం ఒక ఎత్తయితే, ఆ చట్టాలకు సవరణల పేరిట ప్రైవేటుకు పెద్దపీట వేయడం మరో ఎత్తు. ప్రత్యేకించి 1990ల ఆర్థిక సంస్కరణల తర్వాత దోచుకునే వారికి దోచుకున్నంత ప్రాతిపదికన కొత్త విధానాలు, చట్టాలనేకం వచ్చాయి. ప్రభుత్వ సంస్థల నుంచి పెట్టుబడుల ఉపసంహరణ మొదలుకొని దేశీయ మార్కెట్‌ను బహుళజాతి కంపెనీలకు బార్లా తెరవడం వరకు ఈ క్రమం విజయవంతంగా కొనసాగుతున్నది. నూతన ఆర్థిక విధానాల్లో భాగంగా రూపొందిన, రూపొందుతున్న పారిశ్రామిక, వ్యాపార, బ్యాంకింగ్, కార్మిక, జల విధానాలు, భూసేకరణ, మైనింగ్, సెజ్ తదితర చట్టాలు, కంపెనీల చట్టానికి సవరణలు ఇందులో భాగమే. చివరకు చిరు వ్యాపారస్తులకు జీవనాధారంగా ఉన్న రిటైల్ రంగాన్ని సైతం విదేశీయులకు కట్టబెట్టడానికి కుట్ర జరుగుతోంది. అభివృద్ధిలో పేదలకు, స్థానికులకు, మూలవాసులకు ప్రయోజనం చేకూరే ఒక్కటంటే ఒక్క చట్టాన్ని పాలకులు ఆమోదించలేకపోయారు.

యుద్ధాల ద్వారా శాంతి సాధ్యం కాదని ప్రణబ్ సరిగ్గానే చెప్పారు. కాని దురదృష్టవశాత్తూ ఇక్కడి ఏ ప్రభుత్వమూ ఈ సూక్తిపై నమ్మకముంచలేదు. యుద్ధమార్గాన్నే అనుసరించాయి. 1947 తర్వాత కాశ్మీర్ మినహా మిగతా ప్రాంతాల్లో చెలరేగిన పోరాటాలు, సాయుధ ఉద్యమాలన్నీ ప్రజల ప్రజాస్వామిక ఆకాంక్షల కోసం మొదలైనవేనన్నది మరవరాదు. భారత్‌లో తమ ప్రాంతాలను బలవంతంగా విలీనం చేశారని, తమకు స్వేచ్ఛ, స్వయం నిర్ణయాధికారం కావాలని ఈశాన్య రాష్ట్రాల ప్రజలు డిమాండు చేశారు. ప్రజాస్వామిక పద్ధతిలో వారితో చర్చలు జరిపి సానుకూల వాతావరణంలో పరిష్కరించడానికి బదులు సైన్యాన్ని దించి, మినీ ఎమర్జెన్సీ విధించి అణచివేతకు పూనుకోవడంతోనే సమస్య జఠిలరూపం దాల్చింది. మరోవైపు, భారత, పాక్ పాలకుల స్వార్థపూరిత, ఓటు బ్యాంకు రాజకీయాల మూలంగానే కాశ్మీర్‌లో ఉగ్రవాదం రావణకాష్ఠంలా కొనసాగుతోందన్నది జగద్విదితం. స్థానిక ప్రజలు ఏం కోరుకుంటున్నారో పట్టించుకున్న నాథుడు లేడు. ప్లెబిసైట్ (ప్రజాభిప్రాయ సేకరణ) జరిపి సమస్యను పరిష్కరించాలన్న ఐరాస తీర్మానానికి ఇరుదేశాలూ కట్టుబడిలేవు. సైన్యాన్ని ప్రయోగించి భారత్, ఉగ్రవాదులను ప్రవేశపెట్టి పాక్ మారణకాండలకు

కారణమవుతున్నాయి. ఇక, అంతర్గత భద్రతకు పెనుముప్పుగా పరిణమించిందని ప్రధాని పదేపదే చెబుతున్న వామపక్ష ఉగ్రవాదం (మావోయిజం) సైతం మౌలిక సమస్యల నుంచి ఉద్భవించినదే. పేదరికం, అసమానతలు, వివక్ష, అణచివేతల ఫలితంగానే ఈ ఉద్యమం విశాల ప్రజానీకం మద్దతు పొందుతోందన్నది అందరూ ఒప్పుకుంటున్న విషయం. ప్రణబ్ సహా పలువురు నేతలు ఈ విషయాన్ని పలుమార్లు నొక్కి వక్కాణించారు కూడా. అయినప్పటికీ స్వామి అగ్నివేశ్ లాంటి మేధావులు శాంతి చర్చలకు ప్రయత్నిస్తున్న సమయంలో యూపీఏ సర్కారు 2009లో ఆపరేషన్ గ్రీన్‌హంట్‌ను ప్రారంభించింది. సమస్యను సైనికంగానే పరిష్కరించడానికి ప్రయత్నిస్తోంది. గ్రీన్‌హంట్ సందర్భంలో సైన్యాన్ని సైతం వినియోగించాలనే చిదంబరం వాదనను సమర్థించిన వారిలో ప్రణబ్ కూడా ఒక్కరన్నది ఇక్కడ గమనించాల్సిన విషయం.

ప్రణబ్ సహా సర్కారీ పెద్దలు తమ చిలుక పలుకులను ఇకనైనా మానుకోవాలి. మన రాజ్యాంగ స్ఫూర్తి పౌరులందరికీ స్వేచ్ఛా సమానత్వాలను, ప్రజాస్వామ్య హక్కులను కల్పించాలని చెబుతున్నా వరుస ప్రభుత్వాలు చెప్పేదొకటి.. చేసేదొకటన్న విధానాలను అనుసరిస్తుండడం వల్లనే దేశ ప్రజలకు ఈ దుస్థితి దాపురించింది. పేదరికం విడువని శాపంగా పరిణమించింది. మూడింట రెండు వంతుల భూభాగంలో యుద్ధ పరిస్థితులు నెలకొనివున్నాయి. తాను చేసిన వ్యాఖ్యల పట్ల ప్రణబ్‌కు ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా రాజ్యాంగాధినేతగా, ప్రజాస్వామ్య సంరక్షకునిగా తాను పదవిలో ఉండే ఐదేళ్లలో తన బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించాలి. రబ్బరు స్టాంపు రాష్ట్రపతిని కాదని నిరూపించుకోవాలి. ధనికులకు, ప్రైవేట్ కార్పొరేట్లకు అనుకూలంగా, ప్రజలకు, ప్రజాస్వామిక విలువలకు వ్యతిరేకంగా ఉన్న చట్టాలు, బిల్లులు తన ముందుకు వచ్చినప్పుడు తిరస్కరించాలి. త్రివిధ దళాల సర్వ సైన్యాధిపతిగా దేశంలోని వివిధ ప్రాంతాల్లో కొనసాగుతున్న ఉద్యమాలపై అణచివేతను ఆపాలి. లక్షకు పైబడిన బలగాలతో మధ్యభారతంలో నిర్వహిస్తున్న ఆపరేషన్ గ్రీన్‌హంట్‌ను వెంటనే నిలిపివేసి మావోయిస్టులతో శాంతి చర్చలు ప్రారంభించాలి.

***(నమస్తే తెలంగాణ, 31-07-2012)***

# నల్లధనం.. తెల్ల బతుకులు..

భారతీయులకు చెందిన సుమారు రూ. 25 లక్షల కోట్ల నల్లధనం విదేశీ బ్యాంకుల్లో నిలువ వున్నదని ఇటీవల సీబీఐ డైరెక్టర్ ఏ పీ సింగ్ వెల్లడించారు. స్విస్ బ్యాంకుల్లో డబ్బు దాచుకున్న వారిలో మన దేశ కుబేరులదే అగ్రస్థానమని కూడా ఆయన తెలిపారు. సింగ్ ప్రకటన దేశీయంగా సంచలనం సృష్టించింది. మీడియాలో ఈ అంశంపై చర్చోపచర్చలు చోటుచేసుకున్నాయి. నల్లధనాన్ని వెనక్కి తేగలిగితే దేశం అప్పుల బాధ నుంచి విముక్తి పొందుతుందని, అగ్రరాజ్యంగా మారుతుందని విశ్లేషకులు వ్యాఖ్యానిస్తున్నారు. జనాభాలో సగం వరకు ఉన్న పేదలకు ఈ మొత్తాన్ని పంచగలిగితే తెల్ల కార్డు బతుకుల రాత రాత్రికి రాత్రి మారిపోతుందని చెప్పుకొచ్చారు. కాగా, విదేశీ బ్యాంకుల్లో మూలుగుతున్న నల్లధనాన్ని వెంటనే వెనక్కి తెప్పించాలని బీజేపీ తదితర ప్రతిపక్షాలు డిమాండ్ చేశాయి. ఈ డిమాండుతో తమ పార్టీ సైతం ఏకీభవిస్తున్నదని, డబ్బును వెనక్కి రప్పించడానికి ప్రభుత్వపరంగా చర్యలు తీసుకుంటామని కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి దిగ్విజయ్‌సింగ్ అన్నారు. ప్రస్తుతం జరుగుతున్న ఐదు రాష్ట్రాల శాసనసభ ఎన్నికల్లో నల్లధనం అంశం కీలకంగా మారింది. బీఎస్పీ, ఎస్పీ వంటి ప్రాంతీయ పార్టీలు సైతం ప్రచారాస్త్రంగా వాడుకుంటున్నాయి.

అయితే.. నల్లధనంపై చర్చ కొత్తదేం కాదు. ఆ మాటకొస్తే భారీ కుంభకోణాలు చేసిన ప్రముఖులు అక్రమంగా సంపాదించిన డబ్బును స్విస్ బ్యాంకుల్లో దాచుకుంటారనే విషయం దేశంలో చిన్న పిల్లలను అడిగినా చెబుతారు. ఎన్నికల సమయంలో వైరిపక్షాలను, వ్యతిరేకులను అపఖ్యాతిపాలు చేయడానికి నల్లధనాన్ని అస్త్రంగా వాడుకోవడం చాలా సంవత్సరాలుగా జరుగుతోంది. సమయ సందర్భాలను బట్టి కొంతకాలం ఈ అంశంపై మీడియాలో, ప్రజల్లో చర్చ జరగడం, తర్వాత మర్చిపోవడం షరా మామూలైంది. ఇప్పుడు కూడా అదే జరుగుతోంది. ఒక అంచనా ప్రకారం ప్రపంచంలోని వివిధ దేశాల్లో భారతీయులు దాచుకున్న డబ్బు రూ. 120 లక్షల కోట్లు కాగా, మరో రూ. 150 లక్షల కోట్ల వరకు దేశ ఆర్థిక వ్యవస్థ లోపల బ్లాక్ మనీ రూపంలో ఉంది. ఈ డబ్బును

లోక్‌సభ నియోజకవర్గాల వారీగా పంచితే ఒక్కో నియోజకవర్గానికి రూ.50 వేల కోట్ల వరకు నిధులు అందివ్వవచ్చు. దేశానికున్న అన్ని రకాల అప్పులను తీర్చవచ్చు. పేదలు ధనికులనే తేడా లేకుండా భారతీయులందరికీ పంచినా తలా ఒక్కంటికి రూ. రెండు లక్షల 25 వేలు వస్తుంది. 2006లో స్విస్ బ్యాంక్ అసోసియేషన్ అధికారిక లెక్కల ప్రకారం స్విట్జర్లాండ్‌లోని వివిధ బ్యాంకుల్లో దాచుకున్న డబ్బు నిల్వల్లో భారత్‌దే అగ్రస్థానం. భారతీయుల డబ్బు రూ.72 లక్షల 80 వేల కోట్లు ఉంది. రూ.23 లక్షల 50 వేల కోట్లతో రష్యా రెండవ స్థానంలో, రూ.19 లక్షల 50 వేల కోట్లతో బ్రిటన్ మూడవ స్థానంలో, 5 లక్షల కోట్లతో ఉక్రెయిన్ నాల్గవ స్థానంలో, రూ. 4 లక్షల 80 వేల కోట్లతో చైనా ఐదవ స్థానంలో ఉన్నాయి. విచిత్రమేమిటంటే మిగతా ప్రపంచ దేశాలన్నింటి నల్లధనాన్ని కలిపినా భారతీయులతో సాటిరాని పరిస్థితి ఉంది. ఒక్క స్విస్ బ్యాంకుల్లోనే ఇంత డబ్బు ఉంటే ఇక మారిషస్, సింగపూర్, దుబాయ్, న్యూజీలాండ్, వర్జిన్ ఐలాండ్స్, సెషెల్స్, అమెరికా, బ్రిటన్ తదితర దేశాల్లోని బ్యాంకుల్లో మూలుగుతున్న నల్లధనానికి లెక్కల్లేవు. మధ్యయూరపులోని అతిచిన్న దేశం లీక్టెన్‌స్టెయిన్‌కు చెందిన ఎల్‌జీటీ బ్యాంకులో అక్రమంగా డబ్బు దాచుకున్న 18 మంది భారతీయుల జాబితాను 2009 మార్చిలో జర్మనీ మన కేంద్ర ప్రభుత్వానికి అందించింది. గత సంవత్సరం జనవరిలో దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు సైతం వివిధ విదేశీ బ్యాంకుల్లో భారతీయులు దాచిన నల్లధనం నిల్వల గురించి తెలుసుకుని నిర్ఘాంతపోయింది. జర్మనీ అందించిన జాబితాను బయటికి వెల్లడించకపోవడంలోని ఔచిత్యాన్ని ప్రశ్నించింది. ఈ దిశలో వెంటనే తగిన చర్యలు చేపట్టాలని కేంద్ర ప్రభుత్వానికి సూచించింది.

అసలు నల్లధనం అంటే ఏమిటి? ఆదాయపు పన్ను సహా ఏ ఇతర పన్నులు చెల్లించకుండా, ప్రభుత్వానికి లెక్కలు చూపకుండా దాచుకున్న సొమ్మును నల్లధనంగా వ్యవహరిస్తారు. విదేశీ బ్యాంకుల్లో ఇది డిపాజిట్ల రూపంలో ఉంటే దేశీయంగా అక్రమ లావాదేవీలతో పోటీ ఆర్థిక వ్యవస్థను నడుపుతుంటుంది. ధనం అంటే ఒక్క కరెన్సీ (రూపాయలు లేదా డాలర్లు వగైరా) రూపంలోనే ఉండనక్కరలేదు. బంగారం, వెండి, ప్లాటినం, వజ్రాలు తదితర విలువైన లోహాల రూపంలో ఉన్నా, ఇతర వస్తువులు, ఆస్తుల రూపంలో ఉన్నా, పన్నులు చెల్లించకుండా, లెక్కలు చూపకుండా ఉంటే అది నల్లధనంగానే పరిగణించబడుతుంది. అక్రమ, చట్టవిరుద్ధ లావాదేవీల ద్వారానే నల్లధనం సృష్టించడం సాధ్యమవుతుంది. భారీగా డబ్బు కేటాయింపులు జరిగే అభివృద్ధి పథకాలు, ప్రాజెక్టులు, పరిశ్రమలు, షేర్‌మార్కెట్, ఎగుమతులు-దిగుమతుల వ్యాపారం, ఇతర వర్తక-వాణిజ్యాల్లో దొంగ లెక్కలు చూపడం ద్వారా ఆయా వ్యక్తులకు నల్లధనం సమకూరుతుంది. సూటిగా చెప్పాలంటే నల్లధనానికి మూలం కుంభకోణాలు, అవినీతి,

అక్రమాలు, దోపిడీ.. విశ్లేషకుల అంచనా ప్రకారం దేశంలో నల్లడబ్బు కలిగివున్నవారిలో అగ్రస్థానం రాజకీయ నాయకులది కాగా, తర్వాతి స్థానం హవాలా వ్యాపారులది. ఈ జాబితాలో స్మగ్లర్లు, ప్రముఖ పారిశ్రామికవేత్తలు, అధికారులు, సినీతారలు, క్రికెట్ ఆటగాళ్లు సైతం ఉన్నారు.

నల్లధనం చర్చ వస్తే వెంటనే ఎవరికైనా గుర్తుకువచ్చేది మన దేశంలో ఉన్న పేదరికం. లక్షల కోట్లు అలా విదేశీ బ్యాంకుల్లో పడివుంటే దేశంలో దారిద్ర్యం ఉండడమేమిటని చాలా మంది ఆశ్చర్యం వ్యక్తం చేస్తారు. ప్రపంచంలో ఉన్న మొత్తం పేదల్లో మూడవ భాగం ఇక్కడే ఉన్నారు. 2005లో ప్రపంచ బ్యాంకు వేసిన అంచనా ప్రకారం భారత జనాభాలో 41.6 శాతం మంది అంతర్జాతీయ దారిద్ర్యరేఖకు దిగువన నివసిస్తున్నారు. ప్లానింగ్ కమిషన్ నియమించిన టెండూల్కర్ కమిటీ దారిద్ర్య రేఖకు దిగువన జీవిస్తున్నవారు 37 శాతంగా పేర్కొనగా, ఎన్‌సీ సక్సేనా నేతృత్వంలోని మరో కమిటీ 50 శాతంగా అంచనా వేసింది. అసంఘటిత కార్మిక రంగానికి చెందిన జాతీయ కమిషన్ లెక్కల ప్రకారం(అర్జున్‌సేన్ గుప్తా నివేదిక) 77 శాతం భారతీయులు రోజుకు కేవలం 20 కంటే తక్కువ ఆదాయంతో బతుకుతున్నారు. 2001 జనాభా లెక్కల ప్రకారం రేడియో, టీవీ, సైకిల్, మోపెడ్, ఫోన్, బ్యాంక్ అకౌంట్ వంటి సౌకర్యాలేవీ లేని కుటుంబాలు దేశంలో 34.5 శాతం ఉన్నాయి. ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయానికి చెందిన పేదరికం, మానవాభివృద్ధి విభాగం చేసిన అధ్యయనంలో కూడా 53.7 శాతం భారతీయులు పేదరికంలో మగ్గుతున్నారు. వీరిలో 28.6 శాతం కడుపేదలు. ఒక అంచనా ప్రకారం కేవలం ఉత్తర తూర్పు భారతంలోని 8 రాష్ట్రాల్లో ఉన్న పేదల సంఖ్య ఆఫ్రికాలోని 26 దేశాల పేదల సంఖ్య కంటే ఎక్కువ. ఇక, ప్రపంచవ్యాప్తంగా పోషకాహారం లోపించిన పిల్లల్లో ప్రతి ముగ్గురిలో ఒక్కరు ఇక్కడే ఉన్నారు. ఐదేళ్ల లోపు పిల్లల్లో 42 శాతం మంది భారహీనతతో బాధపడుతున్నారు. 2011 ప్రపంచ ఆకలి సూచిక లో మన దేశం 45వ స్థానం ఆక్రమించింది. పాకిస్తాన్, బంగ్లాదేశ్, మియన్మార్, ఉగాండా, జింబాబ్వే వంటి పేద దేశాల పరిస్థితి కూడా మెరుగుపడుతుండగా మనం మాత్రం 22.9 నుంచి 23.7 పాయింట్లకు ఎగబాకి ఆకలిచావుల సంఖ్యను పెంచుకుంటున్నాం.

పెరుగుతూనేవున్న నల్లధనానికి, తగ్గకుండా ఉన్న పేదరికానికి మధ్య అవినాభావ సంబంధాన్ని ఇక్కడ మనం అర్థం చేసుకోవాలి. పేదలకని పలు పథకాల కోసం, ప్రాజెక్టుల కోసం విడుదల చేసిన తెల్ల కరెన్సీ వారికి చేరకుండా పేదరికాన్ని పెంచితే, అదే కరెన్సీ 2జీ, 3జీ తదితర కుంభకోణాల రూపంలో పెద్దల జేబుల్లోకెళ్లి నల్ల డబ్బుగా పరిణామం చెందుతున్నది. స్విస్ బ్యాంకులను చేరుతున్నది. ప్రభుత్వాలను శాసిస్తున్నది. పార్టీలను బతికిస్తున్నది. అందుకే నల్లధనాన్ని వెనక్కి తెప్పిస్తామంటున్న అధికారపక్షమైనా, ఈ

డబ్బును ప్రభుత్వం స్వాధీనం చేసుకుని పేదరిక నిర్మూలన పథకాలకు ఖర్చు పెట్టాలని డిమాండు చేసే ప్రతిపక్షాలైనా తమ మాటపై నిలబడడం సాధ్యం కాదని చెప్పొచ్చు. నల్లధనం పుట్టుక, పెరుగుదల, నిర్మూలన అంశాలను అధ్యయనం చేయడానికి 2011 జూన్‌లో కేంద్రం నియమించిన కమిటీ సమర్పించిన నివేదికతో ఈ విషయం తేటతెల్లమైంది. నివేదికలో కొన్ని సంచలన విషయాలున్నాయి. తమ సంవత్సరాదాయం రూ.500 కోట్లుగా చూపుతున్న ఒక ప్రధాన పార్టీ, రూ.200 కోట్లుగా చూపుతున్న మరో ప్రధాన పార్టీ (కాంగ్రెస్, బీజేపీలని వేరే చెప్పనక్కరలేదు) కేవలం ఎన్నికల కోసమే 10 వేల నుంచి 15 వేల కోట్ల వరకు ఖర్చు పెడుతున్నాయంటే నల్లధనం పడగ నీడలోనే మన ప్రజాస్వామ్యం వర్ధిల్లుతున్నదని ఈ నివేదిక తేల్చిచెప్పింది. అవినీతి నిర్మూలన చట్టాలను మరింత కఠినతరం చేయాలని, శిక్షలు పెంచాలని, పకడ్బందీ పన్నుల విధానాన్ని అమలు చేయడానికి జాతీయ పన్నుల ట్రిబ్యునల్‌ను ఏర్పరచాలని, నిర్ణీత పరిమితి దాటిన విదేశీ లావాదేవీలను పసిగట్టేందుకు వీలుగా అమెరికా దేశభక్తుల చట్టం తరహాలో ఒక చట్టాన్ని ఆమోదించాలని కమిటీ సూచించింది. అయితే, పైన పేర్కొన్న రెండు ప్రధాన పార్టీలే ఈ నివేదికను అమలు చేయడంలో కీలకం కనుక నల్ల కుబేరులు నిశ్చింతగానే ఉన్నారు.

నల్ల ధనంతో తెల్ల బతుకులను మార్చాలన్నా, అవినీతి, అక్రమాలు, దోపిడీ లేని సమాజాన్ని నిర్మించాలన్నా బలమైన ప్రజా ఉద్యమ నిర్మాణమొక్కటే మార్గం. విదేశీ బ్యాంకుల్లో, స్వదేశీ ఆర్థిక వ్యవస్థలో ఉన్న నల్ల ధనాన్ని జాతీయ సంపదగా ప్రకటించి స్వాధీనం చేసుకోవాలి. ఈ డబ్బును పేదరిక నిర్మూలన పథకాలకు ఖర్చు పెట్టాలి. అవినీతిపరులను ఉరితీసే విధంగా చట్టాలను సవరించాలి. నిధుల కేటాయింపులో, పథకాల అమలులో ప్రజల భాగస్వామ్యాన్ని, పారదర్శకతను పెంచి పన్నుల వ్యవస్థను పకడ్బందీగా అమలు చేయాలి. ఈ దిశలో ప్రజలను చైతన్యవంతం చేయాలి. ఉద్యమాలు నిర్మించాలి. పాలకులపై ఒత్తిడి తెచ్చి జాతి సంపదను జాతిపరం చేయాలి.

***(నమస్తే తెలంగాణ, 21-02-2012)***

# ఆ సంతోషాలు మనకెప్పుడు..?

ఐక్యరాజ్య సమితి ఇటీవల ప్రపంచ సంతోష సూచికను విడుదల చేసింది. ఇప్పటివరకూ మానవాభివృద్ధి సూచికను మాత్రమే ప్రతియేటా విడుదల చేస్తూ వస్తున్న సమితి తొలిసారిగా ఆయా దేశాల్లో ప్రజలు ఏ మేరకు సంతోషంగా ఉన్నారనే కోణంలో సర్వేలు నిర్వహించింది. అభివృద్ధితో నిమిత్తం లేకుండా ఆయా దేశాల పౌరులు ఏ మేరకు ఆనందంగా ఉన్నారో తెలుసుకోవడానికి ప్రయత్నించింది. 2006 నుంచి 2011 మధ్యకాలంలో జరిగిన ఈ సర్వే ఫలితాలపై ఆధారపడి వివిధ దేశాలకు ఈ సంతోష సూచికలో స్థానాలను కేటాయించింది. ఆశ్చర్యకరమైన విషయమేమిటంటే ఈ సూచికలో కూడా మన దేశం బాగా వెనుకబడింది. 156 దేశాలున్న జాబితాలో 94వ స్థానాన్ని పొంది దుఖంలో ఉన్న దేశమనిపించుకుంది. పొరుగుదేశాలైన మియన్మార్ 74వ స్థానంలో, పాకిస్తాన్ 85వ స్థానంలో నిలిచి మనకంటే మెరుగైన పరిస్థితిలో ఉండడం గమనార్హం. ప్రపంచంలోకెల్లా అత్యంత సంతోషంగా ఉన్న దేశంగా డెన్మార్క్ నెంబర్ వన్ స్థానాన్ని పొందగా రెండవ స్థానంలో ఫిన్లాండ్, మూడవ స్థానంలో నార్వే ఉన్నాయి. తర్వాతి స్థానాల్లో వరుసగా నెదర్లాండ్స్, కెనడా, స్విట్జర్లాండ్, స్వీడన్, న్యూజిలాండ్, ఆస్ట్రేలియా, ఐర్లాండ్ నిలిచాయి. అగ్రరాజ్యం అమెరికాకు 11వ స్థానం దక్కగా బ్రిటన్ 18వ స్థానాన్ని, ఫ్రాన్స్ 23వ స్థానాన్ని, జర్మనీ 30వ స్థానాన్ని, రష్యా 76వ స్థానాన్ని ఆక్రమించాయి.

సంతోషంగా లేని దేశాల విషయానికి వస్తే సూచికలో చివరి స్థానాన్ని ఆక్రమించిన ఆఫ్రికాకు చెందిన టోగో ప్రపంచంలోనే అత్యంత దుఖదాయక దేశంగా నిలిచింది. ఆ తర్వాతి స్థానాలను చీకటి ఖండానికే చెందిన బెనిన్, సెంట్రల్ ఆఫ్రికన్ రిపబ్లిక్, సియాాలియోన్, బురుండి, కొమరోస్, హైతి, టాంజానియా, కాంగో ఆక్రమించాయి. ఆసియా దేశాల్లో చూస్తే ఇజ్రాయెల్ ప్రజలు అత్యంత సంతోషంగా ఉన్నారని ఈ సర్వే తేల్చింది. సంతోష సూచికలో ఈ దేశం 14వ స్థానాన్ని పొందింది. 17వ స్థానంతో యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, 26వ స్థానంతో సౌదీఅరేబియా, 29వ స్థానంతో కువైట్, 31వ స్థానంతో కటార్, 33వ స్థానంతో సింగపూర్, 44వ స్థానంతో జపాన్, 46వ

స్థానంతో తైవాన్ టాప్ ఫిఫ్టీలో చోటు సంపాదించాయి. 138వ స్థానంతో కంబోడియా, 131వ స్థానంతో ఆఫ్గనిస్తాన్, 132వ స్థానంతో శ్రీలంక ఆసియాలో అత్యంత దుఖదాయక దేశాలుగా నిలిచాయి.

సూచికను నిశితంగా పరిశీలిస్తే మనకు కొన్ని కఠిన వాస్తవాలు అర్థమవుతాయి. అభివృద్ధి చెందిన అమెరికా, కెనడా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ సహా యూరపు దేశాల ప్రజలు సాధారణంగా ఎక్కువ సంతోషంతో ఉన్నారు. సూచికలోని టాప్ ట్వంటీ దేశాల్లో పదహారు ఇవే కావడం ఇందుకు నిదర్శనం. ఈ దేశాలన్నీ ధనిక దేశాలు. శతాబ్దాల కిందటే పారిశ్రామిక వికాసం జరిగి ఆసియా, ఆఫ్రికా ఖండంలోని అనేక వెనుకబడిన దేశాలను వలసలుగా మార్చుకుని వందల ఏళ్లు పాలించిన దేశాలు. అక్కడి చౌక శ్రమశక్తిని ఇంధనంగా మార్చుకుని ఆర్థిక వ్యవస్థలను బలోపేతం చేసుకున్న దేశాలు. వలసప్రజల తిరుగుబాట్లను సమర్థవంతంగా ఎదుర్కోవడం కోసం స్వదేశీ ప్రజలను ఐక్యంగా, సంతోషంగా, తమ వెనుకాల ఉంచుకోవడం ఆ దేశాల పాలకులకు అనివార్యమైంది. అందుకే దోచుకున్న సంపదలో కొంతభాగాన్ని పౌరులకు కేటాయించారు. సమస్త సౌకర్యాలను, సామాజిక, ఆర్థిక, విద్య, వైద్య భద్రతలను కల్పించారు. వలసల్లో నియంతృత్వాన్ని అమలు చేసినా తమ ప్రజలకు మాత్రం స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను, పూర్తిస్థాయి ప్రజాస్వామిక హక్కులనూ ఇచ్చారు. తర్వాతికాలంలో వలసలు పేరుకు స్వాతంత్ర్యం పొందినా ఇప్పటికీ ఆయా దేశాల పాలకులను, పాలనను వీరే శాసిస్తున్నారు. అక్కడున్న భారీ పెట్టుబడులు ఎడతెగని లాభాల ప్రవాహాన్ని సృష్టిస్తున్నాయి. ఈ లాభాలతోనే తమ ప్రజలను కొంతమేరకు సంతోషంగా ఉంచగలుగుతున్నారు. ఎంతమేరకో అర్థం చేసుకోవడానికి ఉద్యోగరీత్యా డెన్మార్క్ రాజధాని కోపెన్‌హాగన్‌కు వలసవెళ్లిన ఓ ఢిల్లీ వాస్తవ్యురాలి మాటలను చూద్దాం.

“అక్కడి జీవనం స్వర్గాన్ని తలపించేలా ఉంది. వారానికి ఐదు రోజులు.. రోజుకు ఆరు గంటలే పని. ఉద్యోగం పోతుందనే భయం ఉండదు. ఉపాధికి ప్రభుత్వమే హామీ పడుతుంది. ఉద్యోగానికి చేసిన దరఖాస్తు వరుసగా మూడుసార్లు రిజెక్ట్ అయితే నిరుద్యోగ భృతి లభిస్తుంది. విద్య, వైద్యంలో భారీ రాయితీలుంటాయి. మహిళ గర్భం దాల్చితే ప్రసవం జరిగేవరకూ, ఆ తర్వాత ప్లేస్కూల్, నర్సరీ.. అన్నీ అధికారులే చూసుకుంటారు. దైనందిన సమస్యల కోసం పౌరులు రోడ్డుకెక్కడం ఉండదు. వీధులు వాహనాలతో నిండివుండవు. ట్రాఫిక్ జామ్‌లు అసలుండవు. ప్రత్యేకించి సైకిల్ వేలుంటాయి.”

సంతోషంగా ఉన్న మరోరకం దేశాలు చమురు నిక్షేపాలను దండిగా కలిగివున్న మధ్యప్రాచ్యపు దేశాలు. యుఏఇ, కువైట్, సౌదీఅరేబియా, కటార్ లాంటి దేశాలు రాచరికపు అమీర్‌ల పాలనలో ఉన్నా ధనబలంతో తమ పౌరులను సంతోషంగా ఉంచగలుగుతున్నాయి. వలస కార్మికులు, ఇతర దేశస్తులతో పోల్చితే అక్కడి పౌరులకు

స్వేచ్ఛాస్వాతంత్ర్యాలు కూడా ఎక్కువే కనుక సర్వేలో తాము సంతోషంగా ఉన్నామనే చెప్పివుంటారు.

ఇక సంతోషంగా లేని దేశాల విషయానికి వస్తే ఇవన్నీ వెనుకబడిన ఆఫ్రికా, అభివృద్ధి చెందుతున్న ఆసియా ఖండాలకు చెందిన దేశాలు. శతాబ్దాలుగా వలస పాలనలో మగ్గి, దశాబ్దాలుగా అంతర్యుద్ధాలతో అట్టుడుకుతున్న ఈ దేశాల ప్రజలు కడుదీనస్థితిలో కాలం వెళ్లదీస్తున్నారు. ఒక కాంగో.. ఒక బురుండి.. ఒక హైతి.. ఇలా ఏ దేశ చరిత్ర చూసినా సామ్రాజ్యవాదుల యుద్ధక్రీడలకు వేదికగా మారిన వైనమే మనకు కనిపిస్తుంది. అగ్రరాజ్యానికి, ప్రపంచబ్యాంకుకు తాబేదార్లుగా మారిన పాలకులు ప్రజల సంక్షేమం కంటే తమ క్షేమానికి పెద్దపీట వేసిన ఫలితమే అక్కడ నెలకొన్న పేదరికం. ఈ దేశాలన్నింటిలో మెండుగా ఉన్న ఖనిజవనరులను బహుళజాతి కంపెనీలకు అమ్ముకుంటూ అధికారంలో ఉన్న వర్గాలు, దళారులు కోట్లకు పడగలెత్తుతుంటే ప్రజలు మాత్రం దినదిన గండంగా కాలం వెళ్లదీస్తున్నారు..

మన దేశానికి వస్తే జాబితాలో 94వ స్థానం లభించడం ఒక చారిత్రక విషాదమేనని చెప్పవచ్చు. ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్యంగా, 11వ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా వర్ధిల్లుతున్న దేశంలో ప్రజలకు సుఖశాంతులు కరువవడం పాలకులకే సిగ్గుచేటు. వలస పాలన నుంచి విముక్తి పొంది 65 ఏళ్లు గడిచింది. మనను మనమే పాలించుకుంటున్నాం. వైశాల్యంలో మన దేశానిది ఏడవ స్థానం. జనాభాలో రెండవ స్థానం. ప్రపంచ ఖనిజనిక్షేపాల్లో నాలుగవ వంతు మన దేశంలోనే ఉన్నాయి. మాంగనీస్ నిల్వల్లో రెండవ స్థానం.. ఇనుము నిల్వల్లో మూడవ స్థానం.. బొగ్గు నిల్వల్లో నాలుగవ స్థానం. ప్రపంచ మైకా నిల్వల్లో నాలుగింట మూడు వంతులు మన దగ్గరే ఉన్నాయి. సహజ వాయువు, చమురు నిల్వలకూ ఇక్కడ కొదవ లేదు. పుష్కలంగా నీళ్లున్నాయి. సంవత్సరమంతా పారే గంగ, యమున, గోదావరి, కృష్ణ, బ్రహ్మపుత్ర వంటి జీవ నదులున్నాయి. సారవంతమైన 19 కోట్ల హెక్టార్ల సాగుభూములున్నాయి. వ్యవసాయోత్పత్తుల్లో మనది రెండవ స్థానం. కష్టించి పనిచేసే ప్రజలున్నారు. చైనా తర్వాత ఎక్కువ సంఖ్యలో సుమారు 49 కోట్ల శ్రమజీవుల బలగమున్న దేశం మనది.

ఇన్ని విశిష్ఠతలు, అనుకూల అంశాలున్నా దేశంలో నివసిస్తున్న 90శాతం ప్రజలు అపార దుఃఖంతో ఉన్నారు. ప్రపంచ బ్యాంకు అంచనా ప్రకారమే ఇక్కడ 41.6 శాతం మంది పేదరికంలో మగ్గుతున్నారు. రోజుకు కనీసం రూ.20 కూడా ఖర్చు పెట్టలేని వారు జనాభాలో 77శాతం ఉన్నారని ఓ ప్రభుత్వసంస్థ సైతం అంచనా వేసింది. ఇందులో 30 శాతం వరకూ కడుపేదరికం అనుభవిస్తూ తినడానికి సరైన తిండి కూడా లేని పరిస్థితుల్లో బతుకుతున్నారు. 2011 ఆకలి సూచికలో మన దేశం 45వ స్థానం ఆక్రమించింది. ప్రతి వేయి మందిలో 24 మంది ఆకలితో, పోషకాహార లోపంతో

మరణిస్తున్నారు. ఇక్కడి ప్రతి ముగ్గురు పిల్లల్లో ఒకరు రక్తహీనతతో బాధపడుతుంటే, ఐదేళ్ల లోపు పిల్లల్లో 42శాతం మంది భారహీనతతో సతమతమవుతున్నారు. ఇక ప్రతి వేయి మంది శిశువుల్లో 48 మంది ఇంకా కళ్లు తెరువకముందే ఈ లోకాన్ని వీడి వెళుతున్నారు. ఆత్మహత్యలకూ ఇక్కడ కొదవ లేదు. ఆర్థిక బాధలు, భరించలేని రోగాలు, అధికారుల వేధింపులు, పోలీసుల చిత్రహింసలు చివరకు పౌరుల కనీస ప్రజాస్వామిక ఆకాంక్షను నెరవేర్చని ప్రభుత్వ విధానాలు యేటా లక్షల మంది బలవన్మరణాలకు కారణమవుతున్నాయి. 1997 నుంచి ఇప్పటివరకు రెండు లక్షల మందికి పైగా రైతులు దేశంలోని వివిధ ప్రాంతాల్లో అప్పుల బాధతో ఆత్మహత్యలు చేసుకున్నారు. కడుపు నొప్పి భరించలేక వ్యక్తి ఆత్మహత్య అంటూ మీడియాలో వార్త రాని రోజుండదు. లాకప్‌డెత్‌లు జరుగుతూనేవుంటాయి. పార్లమెంటులో ఇచ్చిన హామీని నిలబెట్టుకొమ్మని పాలకులను అర్థిస్తూ 800 మందికి పైగా తెలంగాణ యువతీ యువకులు ప్రాణాలు తీసుకోవడం చరిత్రలో ఎప్పుడూ, ఎక్కడా జరిగుండదు.

ఇక కనీస సౌకర్యాల విషయానికి వస్తే దేశ జనాభాలో 53శాతం మందికి మరుగుదొడ్ల సౌకర్యం లేదు. 41.6 శాతానికి స్నానపు గదులు లేవు. 32.8 శాతం ఇళ్లకు కరెంటు లేదు. యాభై శాతం గ్రామాలకు రోడ్లు లేవు. రేడియో, టీవీ, సైకిల్, మోపెడ్, ఫోన్, బ్యాంక్ అకౌంట్ వంటి సౌకర్యాలు లేని కుటుంబాలు దేశంలో 34.5 శాతం ఉన్నాయి. మరోవైపు అభివృద్ధి ప్రాజెక్టుల పేరిట మూలవాసుల జీవన విధ్వంసం విచ్చలవిడిగా కొనసాగుతోంది. స్టీలు ఫ్యాక్టరీలంటారు.. పవర్ ప్లాంట్లంటారు.. సెజ్‌లంటారు.. వేల ఎకరాలు లాక్కుంటారు.. సాయుధ బలగాల దన్నుతో బహుళజాతి కంపెనీలు తిష్ట వేస్తాయి. భారీగా లాభాలు దండుకుంటాయి.. ఇలాంటి అభివృద్ధి మాకొద్దన్న స్థానికులకు ఉద్యోగాలకు బదులు లాఠీదెబ్బలు, ఇళ్లకు బదులు జైళ్లు లభిస్తాయి. ఇన్ని బాధల మధ్య జీవిస్తున్న భారతీయులు తాము సంతోషంగా ఉన్నామని ఎలా చెప్పగలరు?

ఇప్పటికైనా మన పాలకులు కళ్లు తెరవాలి. ప్రపంచీకరణ, ప్రైవేటీకరణ, సరళీకరణ పేరిట స్వదేశీ వనరులను విదేశీ బహుళజాతి కంపెనీలకు కట్టబెట్టకుండా స్వయం సంపూర్ణబాటలో పయనిస్తూ దేశాన్ని పారిశ్రామికీకరించాలి. రైతు సంక్షేమమే ధ్యేయంగా వ్యవసాయాన్ని ఆధునీకరించాలి. అభివృద్ధిలో ప్రజలకు విస్తృత భాగస్వామ్యం కల్పించాలి. ప్రణాళికేతర వ్యయాన్ని తగ్గించుకోవాలి. ప్రాజెక్టుల్లో, పథకాల్లో కుంభకోణాలు జరుగకుండా నివారించాలి. అవినీతిపరులను కఠినంగా శిక్షించే చట్టాలను ఆమోదించాలి. విదేశీ బ్యాంకుల్లో మూలుగుతున్న నల్లధనాన్ని స్వాధీనం చేసుకోవాలి. ఆ డబ్బును పేదరిక నిర్మూలనకు వినియోగించాలి. యువతీ యువకుల ఉద్యోగ భద్రతకు ప్రభుత్వమే హామీ పడాలి. కేజీ నుంచి పీజీ వరకు ఉచిత విద్యను అందించాలి. వైద్యవిద్యకు భారీ

నిధులు కేటాయించి పల్లెపల్లెనా ప్రభుత్వ వైద్యుడు, ప్రాథమిక వైద్యకేంద్రం ఉండేలా చర్యలు చేపట్టాలి. ముఖ్యంగా దేశవ్యాప్తంగా వివిధ ప్రజాస్వామిక డిమాండ్లపై ఉద్యమిస్తున్న ప్రజల ఆకాంక్షలను గుర్తించి, వాటిని నెరవేర్చడానికి కృషి చేయాలి. అప్పుడే ప్రజలు సంతోషంగా ఉండగలరు.

***(నమస్తే తెలంగాణ, 30-04-2012)***

# పని మనుషులా? బానిసలా?

పైకి కనిపించని సరికొత్త బానిస వ్యవస్థ ఒకటి ప్రస్తుతం మన దేశంలో అతివేగంగా విస్తరిస్తోంది. ప్రపంచీకరణ, ప్రైవేటీకరణ, పారిశ్రామికీకరణ విధానాల ఫలితంగా పెరిగిన పట్టణ ధనిక, ఉన్నత మధ్యతరగతి వర్గాల నివాసాలే ఈ కొత్త వ్యవస్థకు నిలయాలుగా మారాయి. పంట పొలాల నుంచి పరిశ్రమలకు కార్మికులుగా, ఉద్యోగులుగా వెళ్లాల్సిన స్త్రీ పురుషులు పనిమనుషులుగా స్థిరపడుతున్నారు. ఏ నగరంలోని ఏ ఇంటిని చూసినా ఇప్పుడు పనిమనుషులో లేక పనిపిల్లలో కనబడడం సాధారణమైంది. యజమాని ఇంట్లోనే నివాసముంటూ 24 గంటలూ బండచాకిరీ చేసేవాళ్లు కొందరైతే, కొన్ని గంటల పాటు కొన్ని రకాల పనులు చేసి తమ ఇళ్లకు తిరిగి వెళ్లేవాళ్లు మరికొందరు. పురుషులు, స్త్రీలు, వృద్ధులు, ముక్కుపచ్చలారని పసిపిల్లలు.. ఇలా అన్ని వయస్సుల వాళ్లూ పనిమనుషుల్లో ఉన్నారు. అధికారిక అంచనా ప్రకారం 2008 నాటికి మన దేశంలో 9 కోట్ల మంది పనిమనుషులు ఉన్నారు. సాధారణంగా వీరంతా కింది కులాలవాళ్లు. నిరుపేదలు. నిరక్షరాస్యులు. వీరిలో 8కోట్ల మంది 10 నుంచి 70ఏళ్ల మధ్య వయస్సు కలిగిన స్త్రీలు. కోటి 10 లక్షల మంది 14 ఏళ్లలోపు బాలికలు. ఏ హక్కులూ, చట్టపరమైన రక్షణలు లేకుండా కేవలం యజమానుల దయాదాక్షిణ్యాల పైననే ఆధారపడి కాలం గడుపుతున్న ఈ ఇంటి పనివారికి సంబంధించి గత వారం కేరళలోని త్రివేంద్రంలో ఓ సదస్సు జరిగింది. దక్షిణాసియా దేశాలన్నింటి నుంచి ప్రతినిధులు హాజరయ్యారు. మన రాష్ట్రం నుంచి కూడా నలుగురు వెళ్లారు. ఇంటి పనిని గౌరవనీయమైన పనిగా, పనిమనుషులను పూర్తి స్థాయి కార్మికులుగా గుర్తించాలని, కార్మికులకు వర్తించే అన్ని చట్టాలను, హక్కులను వీరికి కూడా వర్తింపజేయాలన్న అంతర్జాతీయ కార్మిక సంస్థ(ఐఎల్ఓ) తీర్మానాన్ని అమలుచేయాలని సమావేశం డిమాండ్ చేసింది. గృహ కార్మికులకు సంబంధించి నియమించిన టాస్క్‌ఫోర్స్ కమిటీ రూపొందించిన ముసాయిదా జాతీయ విధానాన్ని కేంద్ర కేబినెట్ వెంటనే ఆమోదించాలని విజ్ఞప్తి చేసింది.

మన దేశంలో పనిమనుషులకు కడుదీనమైన చరిత్ర ఉంది. స్వాతంత్ర్యం

రాకముందు తెల్లదొరల, రాజుల, జమీందార్ల, జాగీర్దార్ల ఇళ్లలో పాచి పనులు, వంటలు చేయడానికి సేవకులు ఉండేవాళ్లు. శూద్ర, నిమ్న కులాలకు చెందిన పేదలు కొందరు పూర్తికాలం యజమానుల సేవలు చేస్తే, మరికొందరు వెట్టి రూపంలో ఇతర పనులు నిర్వహించేవాళ్లు. 1947 తర్వాత ఈ పరిస్థితుల్లో మార్పు రాకపోగా దినదినం పట్టణాలు వృద్ధి చెందుతూ ఒక కొత్త వర్గం ఉనికిలోకి వచ్చింది. పరిశ్రమలు, పెట్టుబడులే ప్రాతిపదికగా ఈ వర్గం దినదినాభివృద్ధి చెందింది. వీరిళ్లలో కూడా కొన్ని కింది కులాలకు చెందిన పేదలు, అనాథ పిల్లలే పని చేస్తుండేవాళ్లు. 1980 వరకూ ఈ పరిస్థితే కొనసాగింది. తర్వాతికాలంలో వరుస ప్రభుత్వాలు అనుసరించిన విధానాలు దేశ ఆర్థిక వ్యవస్థలోనే కాకుండా సామాజిక, సాంస్కృతిక, రాజకీయ రంగాల్లో పెనుమార్పులు స ష్టించాయి. పంచవర్ష ప్రణాళికల్లో వ్యవసాయానికి బదులుగా పరిశ్రమలు, సేవల రంగానికి పెద్దపీట వేయడం ఆరంభమైంది. ప్రపంచీకరణ పేరిట మార్కెట్‌ను విదేశీ కంపెనీలకు బార్లా తెరువడం, ప్రైవేటు రంగంలో చిన్నా పెద్దా పెట్టుబడులకు ఇతోధిక ప్రోత్సాహం, ఐటీ విస్తరణ, ప్రభుత్వ విభాగాల్లో, సంక్షేమ పథకాల్లో అవినీతి ప్రవాహం.. ఇవన్నీ కలిసి సమాజ స్వరూపాన్ని పూర్తిగా మార్చివేశాయి. నగరాలు, పట్టణాల సంఖ్య బాగా పెరిగింది. వాటి జనాభా ఇంకా ఎక్కువ పెరిగింది. ధనికులు మరింత ధనికులయ్యారు. వారి సంపద లక్షల నుంచి కోట్లకు చేరింది. పట్టణ మధ్యతరగతిలోని ఒక వర్గం సైతం దళారులుగా, అధికారులుగా, రాజకీయ నాయకులుగా ఎదిగి శ్రమకు దూరమైంది. డబ్బుకు, విలాసాలకు దగ్గరైంది. మరో వర్గం పశ్చిమ సంస్కృతికి దగ్గరై ఊహాలోకాల్లో విహరిస్తూ డబ్బు సంపాదనే ఏకైక లక్ష్యంగా తల్లిదండ్రులను, తోబుట్టువులను కూడా పట్టించుకోకుండా ఎప్పుడెప్పుడు పెద్దోళ్లమవుదామా అని అర్రులుచాచి ఎదురుచూస్తోంది.

మరోవైపు వ్యవసాయానికి ఆసరా కరువై పల్లెల్లో భూస్వాములు మినహా అన్ని వర్గాలూ అప్పుల పాలై దివాళా తీశాయి. నిరుద్యోగం, ఆత్మహత్యలు, ఆకలిచావులు నిత్యకృత్యమయ్యాయి. ఓసారి అతివృష్టి, మరోసారి అనావృష్టి రైతులను దెబ్బతీస్తే పెరిగిన వినిమయ వస్తు సంస్కృతి చేతివృత్తుల వారిని కోలుకోకుండా చేసింది. గనుల పేరిట, కర్మాగారాలు, విద్యుత్ ప్లాంట్లు, డ్యాంల నిర్మాణం పేరిట, రహదారుల అభివృద్ధి పేరిట, వన్యప్రాణుల సంరక్షణ పేరిట లక్షలాది ఎకరాలను లాక్కోవడం మూలంగా అనేక కుటుంబాలు వీధినపడ్డాయి. ఇలా పల్లెల్లో అన్ని రకాలుగా బతుకుదెరువును కోల్పోయిన అభాగ్యులకు విస్తరిస్తున్న నగరాలు, పట్టణాలు ఆశ్రయమిచ్చాయి. పురుషులు అడ్డాకూలీలుగా మారితే, స్త్రీలు, పిల్లలు పనిమనుషులుగా స్థిరపడ్డారు. అలా పనిమనుషుల సంఖ్య రోజురోజుకూ పెరిగింది. ఆకలి, నిస్సహాయత, నిరక్షరాస్యత కలగలిసి యజమాని

ఇచ్చేది ఎంతని చూడకుండా గొడ్డుచాకిరీ చేయడం అలవాటైంది. బంజారాహిల్స్, జూబ్లీహిల్స్ లాంటి ధనవంతుల కాలనీల్లోని ఏ భవంతిలో చూసినా బట్టలుతుకుతూనో, వంట చేస్తూనో, అంట్లు తోముతూనో, ఇళ్లు కడుగుతూనో, పిల్లలను ఆడిస్తూనో డజన్ల కొలదీ నేడు ఇలాంటి ముక్కుపచ్చలారని పిల్లలు, స్త్రీ, పురుషులు కనిపిస్తారు. కుటుంబ సభ్యులంతా ఒకే అపార్ట్‌మెంటులోని వివిధ ఇళ్లలో రకరకాల పనులు చేస్తుంటే ఆ కుటుంబ పెద్ద వాచ్‌మన్‌గా గేటు వద్ద నిలబడివుండడం మనం గమనించవచ్చు.

పనిమనుషుల పద్ధతిని ప్రస్తుత కాలపు బానిస వ్యవస్థగా ఐక్యరాజ్యసమితి మానవ హక్కుల సంఘం అభిప్రాయపడింది. కూలీడబ్బుల కోసం ప్రైవేటు గృహాల్లో ఇంటి పని చేసే వారు పనిమనుషులని, వీరిని గృహకార్మికులుగా గుర్తించాలని ఐఎల్‌ఓ పేర్కొంది. వీరు అసంఘటితంగా, చెల్లాచెదురుగా పనిచేస్తారు. ఎలాంటి హక్కులు లేవు. చట్టాల రక్షణ లేదు. కూలీ యజమాని ఇష్టం. సాధారణ కార్మిక చట్టాలు వీరికి వర్తించక పోవడం వల్ల వీరికి నైపుణ్యం లేని కార్మికులకు చెల్లించే వేతనాల్లో నాలుగోవంతు కూడా చెల్లించరు. కుటుంబసభ్యుల సంఖ్యను బట్టి లేదా గంటలను బట్టి లేదా పనిని బట్టి జీతం నిర్ణయిస్తారు. రూ.150 నుంచి 2 వేల వరకు ఇస్తారు. ఇంట్లోవాళ్లు తినగా మిగిలింది వీరికి అంటగడతారు. వీక్లీ ఆఫ్‌లు, సెలవులు ఉండవు. జ్వరమొచ్చి పని మానేసినా మరునాడు తిట్ల పురాణాన్ని భరించాల్సివుంటుంది. ఏదైనా వస్తువు మాయమైతే వీరినే దొంగగా ముద్ర వేస్తారు. కొడతారు. కేసులు పెడతారు. ముఖ్యంగా 14 ఏళ్లలోపు పిల్లలు చాలామంది యజమాని ఇంట్లోనే ఉండి 24 గంటలూ బానిసల్లాగా పనిచేస్తారు. చదివిస్తాం.. బాగోగులు చూస్తామంటూ పల్లెటూరి పేద కుటుంబాల నుంచి, ఆదివాసీ తండాల నుంచి తెచ్చుకుంటారు కనుక బాలకార్మిక చట్టాలు కూడా వీరి విషయంలో చాలాసార్లు వర్తించవు. దేశంలోని 18 రాష్ట్రాల్లో అమలులో ఉన్న నిబంధనల ప్రకారం ప్రభుత్వోద్యోగులెవరూ 14 ఏళ్లలోపు బాలలను పనిమనుషులుగా పెట్టుకోవడం నేరం. కాని ఆయా చట్టాల్లో ఉన్న లొసుగుల మూలంగా ఏ ఒక్క కేసులోనూ శిక్ష పడిన సందర్భాలు లేనేలేవు. ఇక, సౌదీ లాంటి గల్ఫ్ దేశాలకు పనిమనుషులుగా, సేవకులుగా వెళ్లినవారి పరిస్థితి బానిసల కంటే కూడా హీనాతిహీనం. శారీరక, మానసిక, లైంగిక చిత్రహింసలు సర్వసాధారణమని చెప్పవచ్చు. యజమాని ఆమోదముద్ర లేకుండా స్వదేశానికి తిరిగివెళ్లడం అక్కడ అమలులో ఉన్న చట్టాల ప్రకారం కుదరదు కనుక ఎన్ని ఇబ్బందులనైనా భరిస్తూ పదో పాతికో సంపాదించుకుని బయటపడకతప్పదు.

పనిమనుషుల హక్కుల రక్షణ కోసం దేశంలో మొట్టమొదటిసారిగా 1985లో జాతీయ గృహ కార్మికుల ఉద్యమం (ఎన్‌డీడబ్ల్యూఎం) ఏర్పడింది. బెల్జియంకు చెందిన మహిళా హక్కుల కార్యకర్త జియాన్నె దెవోస్ ఈ సంస్థను స్థాపించి జాతీయ

సమన్వయకర్తగా పని చేస్తున్నారు. 17 రాష్ట్రాల్లో బలమైన నిర్మాణమున్న ఈ సంస్థ ప్రపంచీకరణ నేపథ్యంలో పనిమనుషుల దీనస్థితి, పట్టణాలకు వలసలు, మానవహక్కులు, పనిపిల్లలపై లైంగిక వేధింపులు, నిర్బంధచాకిరీ తదితర అంశాలపై ఉద్యమిస్తోంది. సంస్థ చేసిన కృషి మూలంగా 2006 తర్వాత ఆంధ్రప్రదేశ్, కర్నాటక, తమిళనాడు, కేరళ, మహారాష్ట్ర, రాజస్తాన్, బీహార్ ప్రభుత్వాలు పనిమనుషులను కనీసవేతనాల చట్టం పరిధిలోకి తెచ్చాయి. కేంద్రం కూడా వీరిపట్ల ఒక జాతీయవిధానాన్ని రూపొందించడానికి టాస్క్‌ఫోర్స్‌ను నియమించింది.

అయితే, విధానాలు, చట్టాలు మన దేశంలో అంతగా పనిచేయవని ఎప్పుడో రుజువైపోయింది. జనాభాలోని వివిధ వర్గాల, సమూహాల హక్కుల, అధికారాల రక్షణకని తెచ్చిన కనీస వేతనాల చట్టం.. బాలకార్మిక వ్యవస్థ వ్యతిరేక చట్టం.. అసంఘటిత కార్మికుల హక్కుల రక్షణ చట్టం.. వరకట్న నిషేధ చట్టం, బాల్యవివాహాల నివారణ చట్టం.. గృహహింస నివారణ చట్టం.. ఇలా లెక్కకు మిక్కిలిగా వచ్చిన ఎన్నెన్నో చట్టాలు ఎంత సమర్థవంతంగా పనిచేస్తున్నాయో మనకు తెలియంది కాదు. ఒకవేళ కేంద్రం పనిమనుషుల విషయంలోనూ భవిష్యత్తులో చట్టం తెచ్చినా అది వీటి సరసన మరో పనికిరాని చట్టంగా మారుతుందనడంలో ఎలాంటి సందేహం లేదు. పనిమనుషుల బతుకులు మారాలంటే ముందు ఇంటి పనిని ఒక పరిశ్రమగా, సేవల రంగంగా గుర్తించాలి. పనిమనుషులు పరుల ఇళ్లల్లో, గృహిణులు తమ సొంత ఇంట్లో చేసే శ్రమకు విలువను, వేతనాన్ని నిర్ణయించాలి. పురుషుడు బయటకు వెళ్లి ఉద్యోగం చేసి సంపాదిస్తే గృహిణి ఇంట్లో పనిచేసి సంపాదిస్తుందన్న చైతన్యం సమాజంలో పెరగాలి. అప్పుడే బయటకు వెళ్లి ఉద్యోగం చేసే మహిళ స్థానంలో ఇంటి పని చేసే పనిమనిషికి గృహ కార్మికురాలిగా గౌరవం లభిస్తుంది. ఈ దిశగా ప్రభుత్వాలు కృషి చేయాలి. ఈ లోపు తాము చేసిన చట్టాలను చిత్తశుద్ధితో కఠినంగా అమలుచేయాలి. గ హ కార్మికుల డిమాండ్లను నెరవేర్చాలి.

***(నమస్తే తెలంగాణ, 03-07-2012)***

# ఆహారం భద్రమేనా!

ఆహార భద్రత బిల్లును అమలులోకి తెచ్చేందుకు యూపీఏ ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టింది. మొన్నటి పార్లమెంటు సమావేశాల్లో ఈ బిల్లును చర్చకు పెట్టే వీలు కుదరకపోవడంతో కేంద్ర కేబినెట్ హడావుడిగా గత బుధవారం ఇందుకు సంబంధించిన ఆర్డినెన్స్‌ను ఆమోదించి సంతకం కోసం రాష్ట్రపతికి పంపించింది. శుక్రవారం రాజ్యాంగ అధినేత అయిన ప్రణబ్ ఆమోదముద్ర కూడా వేశారు. సోనియాగాంధీ ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న ఈ బిల్లు భారత పౌరుల్లో మూడింట రెండు వంతుల జనాభాకు ఆహార భద్రతను కల్పిస్తుంది. జీవించడానికి అవసరమైన ఆహారాన్ని అందుబాటు ధరల్లో పంపిణీ చేస్తుంది. పథకానికి ఎంపికైన కుటుంబాల్లోని ప్రతి సభ్యునికీ నెలకు ఐదు కిలోల చొప్పున తిండిగింజలను సబ్సిడీ ధరలకు అందజేస్తారు. బియ్యం కిలో మూడు రూపాయలకు, గోధుమలు రెండు రూపాయలకు, తృణధాన్యాలను ఒక రూపాయికి అమ్ముతారు. లబ్ధిదారుల జాబితాను రాష్ట్ర ప్రభుత్వాలు కేంద్రానికి అందిస్తాయి. అంత్యోదయ అన్నయోజన కింద నెలకు 35 కిలోల బియ్యాన్ని పొందుతున్న కుటుంబాలకు ఇక ముందూ ఆ ప్రయోజనాన్ని కొనసాగిస్తారు. ఇదికాకుండా గర్భిణులకు, బాలింతలకు ప్రసూతి ప్రయోజనం కింద ఒకేసారి రూ.6 వేలు మంజూరుచేస్తారు. ఆరు నెలల నుంచి పద్నాలుగేళ్ల లోపు పిల్లలకు అంగన్‌వాడీలు, పాఠశాలల్లో వండిన పోషకాహారాన్ని ఉచితంగా అందిస్తారు. లేదంటే వారి వంతు రేషన్‌ను కుటుంబాలకు ఇస్తారు.

ఈ కార్యక్రమమంతా ఇప్పటికే ఉనికిలో ఉన్న ప్రజాపంపిణీ వ్యవస్థ(పీడీఎస్) ద్వారా కొనసాగుతుంది. పర్యవేక్షణ కోసం రాష్ట్రస్థాయిలో ఆహార కమీషన్‌లను, జిల్లా స్థాయిలో ఫిర్యాదుల పరిష్కార అధికారిని నియమిస్తారు. పథకానికి అవసరమైన బియ్యం, గోధుమలను భారత ప్రభుత్వం రైతుల వద్ద కనీస మద్దతు ధరకు కొనుగోలు చేసి సబ్సిడీ ధరలపై రాష్ట్ర ప్రభుత్వాలకు అందిస్తుంది. ఆహారధాన్యాలను అందించలేని పరిస్థితి తలెత్తినప్పుడు చట్టంలోని లబ్ధిదారులకు ఆహాభద్రత భత్యాన్ని రాష్ట్రప్రభుత్వాలు

చెల్లించాల్సివుంటుంది. పథకం ఆచరణలో అమలైతే ప్రపంచంలోనే అతిపెద్ద సంక్షేమ కార్యక్రమం అవుతుందని విశ్లేషకులు వ్యాఖ్యానిస్తున్నారు. బిల్లుతో అట్టడుగు వర్గాలకు ఊరట కలుగుతుందని, పౌరులందరికీ ఆహారహక్కును కల్పించడమంటే మాటలు కాదని కొందరు ప్రశంసల వర్షం కురిపిస్తుండగా, ఇప్పటికే అంతంత మాత్రంగా ఉన్న దేశ ఆర్థిక వ్యవస్థకు ఇది పెనుభారమని, సర్కారు ఖజానాకు ఏటా ఒక లక్షా 25వేల కోట్ల రూ.ల చిల్లు వేస్తుందని మరికొందరు ఆర్థికవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఓటుబ్యాంకు రాజకీయాల కోసమే యూపీఏ సర్కారు ఈ పథకాన్ని ముందుకు తెచ్చిందని, పార్లమెంటులో కనీస చర్చ లేకుండానే దొడ్డిదారిన ఆర్డినెన్స్‌ను జారీ చేయడం అక్రమమని ప్రతిపక్షాలు విమర్శిస్తున్నాయి.

ఎవరేం వ్యాఖ్యానించినా సమర్థవంతంగా అమలుచేసిన పక్షంలో ఆహార భద్రత బిల్లులో జనాలకు మేలుచేసే అనేక అంశాలున్న మాట వాస్తవం. మూడేళ్ల లోపు పిల్లల్లో 46 శాతం, మహిళల్లో 33 శాతం, పురుషుల్లో 28 శాతం భారహీనత (అండర్‌వెయిట్)తో, మూడేళ్ల లోపు పిల్లల్లో 79 శాతం, వివాహిత మహిళల్లో 56 శాతం, గర్భిణుల్లో 58 శాతం, వివాహిత పురుషుల్లో 24 శాతం రక్తహీనత (ఎనీమియా)తో బాధపడుతున్న దేశంలో సబ్సిడీ ధరలకు తిండిగింజలను పొందే హక్కును చట్టబద్ధం చేయడం ఆహ్వానించదగిన పరిణామమే. రోజుకు కనీసం రూ.20 కూడా ఖర్చు పెట్టలేని వారు జనాభాలో 77 శాతం ఉన్నచోట సర్కారు అందించే ఐదు కిలోల ఆహారం పేదరికాన్ని పోగొట్టకపోవచ్చు కాని ఆకలిచావులనైతే నివారిస్తాయి. గర్భిణులకు పోషకాహారం కోసం ఇచ్చే ఆరువేల రొక్కం అనేకమంది తల్లులను ప్రసూతిమరణం నుంచి కాపాడుతుంది. ప్రతి వేయి మంది శిశువుల్లో 48 మంది ఇంకా కళ్లు తెరువకముందే ఈ లోకాన్ని వీడడాన్ని అరికడుతుంది. అంగన్‌వాడీల్లో, పాఠశాలల్లో పెట్టే మధ్యాహ్నభోజనం దేశంలో గల కోటిన్నర మంది బాలకార్మికుల్లో కొందరినైనా బడిబాట పట్టిస్తుంది. ఏటా అతివృష్టి, అనావృష్టిల బారిన పడి కరువులో అల్లాడుతూ ఆత్మహత్యలకు పాల్పడే రైతుల కుటుంబాలను సర్కారీ రేషన్ బతికిస్తుంది. రోడ్డున బతికే అనాథలకు, అభాగ్యులకు తిండి పెడుతుంది. మొత్తం కుటుంబానికి సంబంధించిన రేషన్‌ను ఆ ఇంటి ఇల్లాలికి అప్పగించడమన్నది మహిళా సాధికారతకు బాటలు వేస్తుంది.

అయితే, సమర్థవంతంగా అమలు చేస్తారా అన్నదే ఇక్కడ కీలక ప్రశ్న. ఎందుకంటే ఈ పథకం అమలుకు పీడీఎస్‌ను ఎంచుకోవడం, లబ్ధిదారుల ఎంపిక బాధ్యతను రాష్ట్రాలకు వదిలేయడం పలు అనుమానాలకు తావిస్తున్నది. ఇప్పటికే ఆంధ్రప్రదేశ్ సహా పలు రాష్ట్రాల్లో రేషన్ దుకాణాల ద్వారా సబ్సిడీపై సరుకుల పంపిణీ జరుగుతున్న విషయం మనకు తెలిసిందే. పేదలకు అందాల్సిన సరుకులు కాస్తా పక్కదారి పట్టి

బ్లాక్‌మార్కెట్‌కు తరలడం, టన్నుల కొద్దీ పట్టుబడడం కళ్లారా చూస్తూనేవున్నాం. సర్కారు సరఫరా చేస్తున్న బియ్యం, కిరోసిన్, చక్కెర తదితర పదార్థాల్లో 51శాతం ఇలా దుర్వినియోగమవుతోందని ప్రభుత్వవర్గాల పరిశీలనలో తేలింది. అత్యంత లోపభూయిష్టంగా, అవినీతిమయంగా ఉన్న ఇలాంటి వ్యవస్థ ద్వారా అమలయ్యే ఆహారభద్రత పథకం గతీ రేపు ఇలాగే అవుతుందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇక లబ్ధిదారుల ఎంపిక కూడా అస్తవ్యస్తంగానే ఉండబోతోంది. దేశంలోని ఏ రాష్ట్రం కూడా ఇప్పటి వరకు పేదలను గుర్తించేందుకు సమగ్ర సర్వే నిర్వహించలేదు. ప్రజల జీవనప్రమాణాలను అంచనా వేయడానికి కేంద్ర ప్రభుత్వం 1951 నుంచి ఇప్పటివరకు 67 జాతీయ శాంపిల్ సర్వేలు నిర్వహించినప్పటికీ ఎవరిని పేదలుగా పరిగణించాలనే విషయంలో లెక్కలు తేలలేదు. ఈ అంశంపై అధ్యయనం కోసం 1993లో లక్డావాలా కమిటీ, 2005లో టెండూల్కర్ కమిటీ, 2009లో సక్సేనా కమిటీ, 2012లో రంగరాజన్ కమిటీలను నియమించినా స్పష్టత రాలేదు. ఇలాంటప్పుడు గ్రామీణ జనాభాలో 75శాతం, పట్టణ జనాభాలో 50 శాతం కుటుంబాలను దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న పేదలుగా, ఆహారభద్రత పథకానికి అర్హులుగా పేర్కొంటూ ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు సమర్పించే జాబితాలు ఎంత తప్పుల తడకలుగా ఉంటాయో మనం ఊహించవచ్చు. తెల్లకార్డులున్న వారందరినీ అర్హులుగా గుర్తిస్తారని భావించినా వాటిలో 30 శాతం వరకు బోగస్ కార్డులేనని సాక్షాత్తూ మంత్రులే ఒప్పుకునివున్నారు కనుక ఆ పేరుతో ఈ సరుకులు కాస్తా నల్లబజారుకు తరలివెళ్లడం ఖాయంగా కనిపిస్తోంది. పైపెచ్చు ఇళ్లూ జాగా లేకుండా బతుకులీడుస్తున్న కడుపేదలకు, అనాథలకు, సంచారజాతులకు ఎలాంటి కార్డులూ లేనందున లబ్ధి పొందలేరు.

ఆహారభద్రత బిల్లు నిజానికి పౌరులకు ఆరోగ్యభద్రత కల్పించలేదన్న విమర్శ ఉంది. ఒక మనిషి ఆరోగ్యవంతమైన జీవనం గడపాలంటే నెలకు సగటున 10 నుంచి 13 కిలోల బియ్యం, 600 నుంచి 800 గ్రాముల పప్పులు, తగినంత నూనె, చక్కెర, కూరగాయలు అవసరమవుతాయని నిపుణులు పేర్కొంటుండగా, బిల్లులో కేవలం ఐదు కిలోల తిండిగింజలతో సరిపెట్టారు. పది రూపాయలకు ఐదు కిలోల బియ్యం తెచ్చుకుని ఒక వ్యక్తి మిగతా పప్పు, ఉప్పుల కోసం నెలకు కనీసం ఐదు వందల రూపాయలు ఖర్చు పెట్టాల్సివచ్చినప్పుడు భద్రత కల్పించినట్టు ఎలా అవుతుందన్న ప్రశ్నకు సర్కారు వద్ద ఎలాంటి సమాధానం లేదు. ఇక ఈ బిల్లు రైతులను బజారుకీడ్చి, కొత్త బిచ్చగాళ్లుగా తయారుచేయడం ఖాయంగా కనిపిస్తోంది. అతి తక్కువ ధరలకే మెజారిటీ జనాభాకు ప్రభుత్వం తిండిగింజలను అందించడం మూలంగా ఓపెన్ మార్కెట్‌లో బియ్యం, గోధుమలకు డిమాండు తగ్గి ధరలు భారీగా పడిపోతాయి. కనీస మద్దతు ధరకు సర్కారీ

కొనుగోలు కేంద్రాల్లో తమ ధాన్యాన్ని అమ్ముకోలేని రైతులు మధ్యదళారుల చేతికి చిక్కి ఎంతకంటే అంతకు అమ్ముకునే పరిస్థితి వస్తుంది.

ఈ బిల్లును కేవలం వచ్చే ఎన్నికలను దృష్టిలో పెట్టుకునే యూపీఏ ప్రభుత్వం ఆదరాబాదరాగా ముందుకు తెచ్చిందన్న వాదనలూ ఉన్నాయి. పౌరులకు పాలకులు కొత్తగా ఇస్తున్నదేమీ లేదని, ఇప్పటికే ఆయా రాష్ట్రాల్లో అమలుచేస్తున్న ప్రజాపంపిణీ వ్యవస్థ, స్కూళ్లలో మధ్యాహ్నభోజనం, గర్భిణులకు పోషకాహారం, అంగన్‌వాడీల నిర్వహణ తదితర పథకాలను కలగలిపి ఆహారభద్రత అంటూ కొత్త పేరు పెట్టారని కొందరు విమర్శిస్తున్నారు. ఆయా రాష్ట్ర ప్రభుత్వాలకు పీడీఎస్ నిర్వహణ కోసం ప్రతియేటా కేంద్రం భారీ సబ్సిడీలను ఇస్తోందని, మొన్నటి కేంద్ర బడ్జెట్‌లో సైతం 90వేల కోట్ల రూ.లను ఇందుకు కేటాయించిందని వివరిస్తున్నారు.

ఏమైనా పౌరులకు ఆహారాన్ని పొందే హక్కును కల్పించాలన్న ప్రభుత్వ ప్రయత్నం అభినందనీయం. అయితే బిల్లులో కొన్ని కీలక మార్పులు చేయడం తక్షణావసరం. ముఖ్యంగా పేదరికాన్ని అంచనా వేసే విషయంలో వెంటనే కేంద్రం ఒక స్పష్టతకు రావాలి. ఆయా కమిటీల నివేదికలు, సర్వే రిపోర్టుల ఆధారంగా దారిద్ర్యరేఖకు దిగువన జీవిస్తున్న వారి జాబితాను రూపొందించి రాష్ట్రాలకు అందజేయాలి. అవసరమైతే ఆరు నెలల కాలపరిమితితో ఒక సమగ్ర సర్వేను నిర్వహించాలి. కనీస ఆహారభద్రత లేని కుటుంబాలను గుర్తించాలి. వేల కోట్ల ఖర్చుతో ఆధార్ లాంటి ప్రాజెక్టును ప్రతిష్ఠాత్మకంగా అమలుచేస్తున్న పాలకులకు ఇది అసాధ్యమేంకాదు. మరోవైపు, ప్రజాపంపిణీ వ్యవస్థను మరింత పారదర్శకంగా, పర్యవేక్షణ యంత్రాంగాన్ని పకడ్బందీగా పనిచేయించాలి. బియ్యంతో పాటు పప్పు, ఉప్పు, నూనె, కూరగాయలను సరఫరా చేయాలి. రైతుల నుంచి ధాన్యం కొనుగోళ్లలో దళారుల పాత్రను నివారిస్తూ ఎప్పటికప్పుడు కనీస మద్దతు ధరను సవరించాలి.

***(నమస్తే తెలంగాణ, 08-07-2013)***

# జనాభా లెక్కలు.. అపోహలు.. నిజాలు..

2011 జనాభా లెక్కల ప్రాథమిక నివేదిక ఇటీవల విడుదలైంది. వివిధ రాష్ట్రాల, జిల్లాల, పల్లెల, పట్టణాల, నగరాల జనాభాకు సంబంధించిన పూర్తి వివరాలను ఈ నివేదికలో పొందుపర్చారు. నివాసగృహాల సంఖ్యతో పాటు వాటికి సమకూరివున్న సదుపాయాలు, జనాభా పెరుగుదల రేటు, లింగ నిష్పత్తి, అక్షరాస్యత, జననాల–మరణాల రేటు, సగటు జీవితకాలం, ఎస్‌సీ, ఎస్‌టీలు, మతాల వారీగా జనాభా, పట్టణీకరణ తదితర అనేక వివరాలు ఇందులో ఉన్నాయి. నివేదిక ప్రకారం 2011 మార్చ్ 1 నాటికి దేశ జనాభా 121 కోట్ల ఒక లక్షా 93 వేల 422 మందికి చేరింది. వీరిలో 62 కోట్ల 37 లక్షలు(51.54 శాతం) పురుషులు కాగా, 58 కోట్ల 64 లక్షల మంది (48.46 శాతం) స్త్రీలు. ఆరేళ్ల లోపు బాలలు 15 కోట్ల 88 లక్షలు. 19 కోట్ల 95 లక్షలతో ఉత్తరప్రదేశ్ దేశంలో అత్యధిక జనాభా కలిగిన రాష్ట్రంగా తన స్థానాన్ని నిలుపుకుంది. ఆ తర్వాతి స్థానాన్ని 11 కోట్ల 20 లక్షల జనాభా కలిగిన మహారాష్ట్ర ఆక్రమించింది. కేవలం 6 లక్షల 7 వేల జనాభాతో సిక్కిం అతితక్కువ జనాభా కలిగిన రాష్ట్రంగా ఉంది. దేశంలోని వందకు పైగా జిల్లాలు సిక్కిం కంటే ఎక్కువ జనసంఖ్యను కలిగివుండడం విశేషం. అక్షరాస్యత 2001లో 64.83 శాతం ఉండగా, 2011 నాటికి అది 74.04 శాతానికి పెరిగింది.

ఇక కనీస సౌకర్యాల విషయానికి వస్తే దేశ జనాభాలో 53.1 శాతం మందికి మరుగుదొడ్ల సౌకర్యం లేదు. 41.6 శాతానికి స్నానపు గదులు లేవు. 49.8 శాతం గృహాలకు డ్రైనేజీ సౌకర్యం లేదు. 68 శాతం గృహాలకు రక్షిత మంచినీటి సరఫరా లేదు. 32.8 శాతం ఇళ్లకు కరెంటు లేదు. 28.5 శాతం కుటుంబాలు వంటకు ఎల్‌పీజీని ఉపయోగిస్తుండగా, 65.8 శాతం మంది కట్టెలు, పిడకలతో వంట చేసుకుంటున్నారు. బ్యాంకు అకౌంట్ లేని వారు 41.3 శాతం కాగా, టీవీలు ఉన్నవారు 47.2 శాతం, రేడియోలు మాత్రం ఉన్నవారు 19.9 శాతం, కంప్యూటర్లు ఉన్నవారు 6.3 శాతం, సైకిల్ ఉన్నవారు 44.8 శాతం, మోపెడ్ లేదా బైక్ ఉన్నవారు 21 శాతం, ఏ వాహనం

లేనివారు 17.8 శాతం ఉన్నారు. జనాభాలో 63.2 శాతం మంది ఫోన్ సౌకర్యం కలిగివుండడం గమనార్హం.

వివరాలు, రికార్డులు, శాతాలు ఇలా ఉంటే, ఈసారి జనాభా లెక్కలకు సంబంధించి ఆసక్తికరమైన అంశాలు కొన్ని ఉన్నాయి. వీటిలో ప్రధానమైనది జనాభా పెరుగుదల రేటు. మన దేశ జనాభా అసాధారణ రీతిలో వేగంగా పెరిగిపోతున్నదని, మరికొన్ని దశాబ్దాల్లో చైనాను సైతం అధిగమించి ప్రపంచంలోనే అగ్రస్థానాన్ని ఆక్రమించనున్నదని మనకు తెలుసు. 110 సంవత్సరాల కిందట 23కోట్ల 84లక్షలున్న జనాభా ఐదు రెట్లు పెరిగి ప్రస్తుతం 121 కోట్లకు చేరడమే ఇందుకు నిదర్శనం. 1921 జనాభా లెక్కల నాటికి దశాబ్దపు పెరుగుదల కేవలం 0.31 శాతం మాత్రమే ఉండగా, 1971 నాటికి అత్యధికంగా 24.80 శాతానికి చేరి సర్వత్రా ఆందోళనకు కారణమైంది. ఆ తర్వాత వరుస ప్రభుత్వాలు ప్రత్యేకించి ఇందిరాగాంధీ ప్రభుత్వం కుటుంబ నియంత్రణ విషయంలో చేపట్టిన చర్యలు కొంతవరకు ఫలితాలనిచ్చాయి. అప్పటిదాకా పెరుగుదలను నమోదు చేసుకుంటున్న వృద్ధి శాతం పడిపోవడం ఆరంభమైంది. 1981లో 24.66 శాతం, 91లో 23.86 శాతం, 2001లో 21.34 శాతం, మొన్నటి లెక్కల్లో 17.64 శాతం పెరుగుదల నమోదు కావడం గమనార్హం.

అయితే, జననాల రేటు తగ్గాల్సినంత తగ్గకపోవడం మూలంగానే మన జనాభా అదుపులో లేని స్థాయిలో పెరిగిపోతోందని చాలా మంది భావిస్తుంటారు. ఇది నిజం కాదు. 1901లో 49.2 (ప్రతి వేయి మందికి)గా ఉన్న జననాల రేటు క్రమంగా తగ్గుతూ 2011 నాటికి 20.9కి పడిపోయింది. అలాగే, స్త్రీల సాఫల్యతా రేటు కూడా బాగా తగ్గింది. 1951లో సగటున ప్రతి స్త్రీకి ఆరుగురు పిల్లలు పుడితే ప్రస్తుతం అది 2.62కి చేరింది. అంటే జనాభాలో అత్యధిక కుటుంబాలు కేవలం ఇద్దరు పిల్లలతోనే సరిపెట్టుకుంటున్నాయన్నమాట. మరి అసలు కారణాలేమిటి? అంటే సాధారణ మరణాల రేటు, శిశు మరణాల రేటు బాగా తగ్గడం. భారతీయుల సగటు జీవితకాలం బాగా పెరగడం. లెక్కల్లోకెళితే, 1901లో సంవత్సరానికి వేయి మందికి 42.6 మంది చనిపోతే 2011 నాటికి కేవలం 6.9 మంది మాత్రమే ఈ లోకాన్ని విడిచి వెళుతున్నారు. మెరుగుపడిన సామాజిక, ఆర్థిక పరిస్థితులు, అందుబాటులోకి వచ్చిన ఆధునిక వైద్యం తదితరం ఇందుకు కారణాలుగా చెప్పుకోవచ్చు. ఇవే కారణాలతో దేశంలో శిశు మరణాల రేటు సైతం తగ్గింది. 1901లో ప్రతి వేయి జననాలకు 210 మంది శిశువులు ఆరేళ్లు పూర్తయ్యే లోపే కళ్లుమూస్తే ప్రస్తుతం 48 మంది శిశువులు మాత్రం చనిపోతున్నారు. ఇక, మన దేశపౌరుల సగటు జీవితకాలం కూడా బాగా పెరిగింది. వందేళ్ల కింద 1911లో భారతీయులు సగటున కేవలం 23 ఏళ్లు మాత్రమే బతికేవారు. ప్రస్తుతం

ఇది 65 ఏళ్లకు చేరుకుంది. స్త్రీలు 66 ఏళ్లు, పురుషులు 63 ఏళ్లు నిండేవరకూ బతికేస్తున్నారు. ఈ కారణాలన్నింటి మూలంగానే జనాభా ఆశించిన స్థాయిలో తగ్గడం లేదనే విషయాన్ని మనం గుర్తించాలి.

జననాల రేటు తగ్గుతున్నది నిజమే గాని అందులో ఓ మతలబు దాగివుంది. ఆ తగ్గడంలో ఘోరమైన లింగ వివక్ష అమలవుతోంది. మగ జననాల కంటే ఆడ జననాలు బాగా తగ్గుతున్నాయి. ఫలితంగా దేశంలో లింగనిష్పత్తి వేగంగా పడిపోతున్నది. 1901లో ప్రతి వేయి మంది పురుషులకు 972 మంది స్త్రీలు ఉండగా ప్రస్తుతం ఈ సంఖ్య 940కి పడిపోయింది. అమెరికా, రష్యా, జపాన్, ఫ్రాన్స్ వగైరా అభివృద్ధి చెందిన దేశాల్లో, బ్రెజిల్, నైజీరియా, ఇండోనేషియా వంటి అభివృద్ధి చెందుతున్న దేశాల్లో పురుషుల కంటే స్త్రీలే ఎక్కువ ఉన్న పరిస్థితి ఉండగా మన దేశంలో ఈ నిష్పత్తి ఇలా దిగజారడం ఆందోళన కలిగించే విషయమే. ఆరేళ్ల లోపు పిల్లల విషయంలో ఈ నిష్పత్తి మరింత ఘోరంగా ఉంది. ప్రతి వేయి మంది బాలురకు 914 మంది మాత్రమే బాలికలున్నారు. అనగా కుటుంబ నియంత్రణ పద్ధతులు వ్యాప్తిలోకి వచ్చిన తర్వాత ప్రతి ఇంట్లో ఉండే పిల్లల సంఖ్య గణనీయంగా తగ్గింది నిజమే కాని ఆడపిల్లలు మాత్రమే అధికంగా తగ్గారన్నది ఇక్కడ చెప్పదల్చుకున్న విషయం.

దంపతులు ఆడపిల్లలు వద్దనుకోవడానికి కారణాలు అనేకం. హైటెక్ యుగం లో ప్రవేశించినా వరకట్న దురాచారం ఇంకా కొనసాగుతూనేవుంది. కూతురు పుడితే మరో ఇంటికి వెళుతుంది.. కొడుకైతే వారసత్వం కొనసాగిస్తాడన్న మూఢవిశ్వాసం సమాజాన్ని ఇంకా వీడలేదు. ఇక మహిళలను చిన్నచూపు చూసే ధోరణి సరేసరి. ఇవన్నీ కలిసి ఆడ శిశువుల భ్రూణహత్యలకు పురికొల్పుతున్నాయి. 1980ల తర్వాత అమల్లోకి వచ్చిన లింగనిర్ధారణ పరీక్షలు, గర్భస్రావాల చట్టబద్ధత ఇందుకు తోడయ్యాయి. జన్యులోపాలతో శిశు జననాలను, అవాంఛిత గర్భాలను నివారించడానికి ఉనికిలోకి వచ్చిన ఈ పద్ధతులు ఆడపిల్లల పాలిట మృత్యుపాశాలుగా మారాయి.

ఆడశిశువుల భ్రూణహత్యలను ఆపడానికి వివిధ ప్రభుత్వాలు ఎన్ని చర్యలు చేపట్టినా ఫలితాలనివ్వడం లేదు. కుటుంబాల ఆర్థిక స్థితిగతులను మెరుగుపర్చితే, తల్లుల అక్షరాస్యతా స్థాయిని పెంచితే ఈ అకృత్యాలు ఆగిపోగలవని నిపుణులు భావిస్తుంటారు. ప్రభుత్వాలు కూడా ఇదే దారిలో ఆలోచించి పథకాలను ప్రవేశపెట్టాయి. కాని 2011 జనాభా లెక్కలు వీరి నమ్మకాన్ని పటాపంచలు చేశాయి. ధనిక రాష్ట్రాలుగా పేరుగాంచిన పంజాబ్, హర్యానా, గుజరాత్, మహారాష్ట్రల్లో బాలల లింగ నిష్పత్తి 1991-2011 మధ్య ఘోరంగా పడిపోయింది. ఈ రాష్ట్రాల్లో ప్రతి వేయి మంది బాలురకు 830 నుంచి 886 మంది బాలికలే ఉన్నారు. ఇక, నిరక్షరాస్యులైన తల్లులను కలిగిన

కుటుంబాల్లో వేయి మంది బాలురకు 920 మంది బాలికలుంటే, ప్రాథమిక విద్యనభ్యసించిన వారిలో 909 మంది, హైస్కూలు పూర్తి చేసిన వారిలో 885 మంది, డిగ్రీ ఆ పైన చదివిన తల్లుల్లో కేవలం 876 మంది బాలికలున్నారు.

జనాభా అదుపులో ఉండడం అభివృద్ధి చెందుతున్న దేశంగా భారత్‌కు అవసరమే కాని ఈ పేరుతో లింగవివక్ష, ఆడపిల్లల హత్యలు కొనసాగడం మాత్రం అసమంజసం. ప్రస్తుత ధోరణి ఇలాగే కొనసాగితే సమీప భవిష్యత్తులో అబ్బాయిలు పెళ్లి చేసుకుందామంటే అమ్మాయిలు దొరక్కపోవచ్చు. ఒక అంచనా ప్రకారం మరో 20 ఏళ్లలో దేశంలో కోటి 20 లక్షల మంది అబ్బాయిలు జోడీ దొరక్క బ్రహ్మచారులుగా ఉండిపోవాల్సివస్తుంది. జనాభాను అదుపులో పెట్టే చర్యలను కఠినంగా అమలు చేసిన చైనా సైతం ఇలాంటి పరిస్థితినే తీవ్రంగా ఎదుర్కొంటున్నది. కనుక భారత ప్రభుత్వం వెంటనే మేల్కోవాలి. 2011 జనాభా లెక్కల వివరాలను విశ్లేషించి లింగవివక్షను మదింపు చేయడానికి వెంటనే ఓ నిపుణుల కమిటీని నియమించాలి. ఆడపిల్లల పట్ల వివక్షను నిర్మూలించడానికి తగిన సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక మార్గాలను అన్వేషించాలి. ఏ రూపంలోనైనా వరకట్నం తీసుకోవడాన్ని నిషేధించాలి. లింగనిర్ధారణ పరీక్షలకు సంబంధించిన, గర్భస్రావాలకు సంబంధించిన నిబంధనలను కఠినతరం చేయాలి. శిక్షలు పెంచాలి. అన్ని రంగాల్లో అబ్బాయిలతో సమానంగా అమ్మాయిలకు సమాన హక్కులు కల్పించాలి. తల్లిదండ్రుల ఆస్తిలో వారు సమవాటా పొందేలా చట్టాలను ఖచ్చితంగా అమలు చేయాలి.

జనాభాలో భాగమైన ప్రతి వ్యక్తీ దేశాభివృద్ధికి కీలకమనుకున్నప్పుడే అది నాగరిక సమాజమనిపించుకుంటుంది. భారత్ పేదల దేశమే తప్ప పేదదేశం కాదన్న ఆర్థిక వేత్తల వక్కాణింపును ఇక్కడ పరిగణనలోకి తీసుకోవాలి. ఇప్పటి జనాభాకు మించిన జనసంఖ్యకు సర్వం సమకూర్చగల వనరులు మన దేశంలో పుష్కలంగా ఉన్నాయి. కేవలం జనాభా పెరుగుదలను అరికట్టడమన్న కోణంలోనే ఆలోచించకుండా పౌరులందరినీ ఉత్పత్తితో పాటు లాభాల పంపకంలో సమ భాగస్వాములను చేసే విధానాలు అమలులోకి తేవాలి. విదేశీ కంపెనీల దోపిడిని అరికట్టి స్వదేశీయుల మనుగడను కాపాడాలి. అప్పుడు ప్రజలే చైతన్యవంతులై స్వయంగా స్వచ్ఛందంగా కుటుంబనియంత్రణ పద్ధతులను అవలంభిస్తారు. దేశాన్ని అభివృద్ధి బాటలో నడిపిస్తారు.

***(నమస్తే తెలంగాణ, 19-06-2012)***

# బాలలు.. హక్కులు.. చట్టాలు..

ప్రవాస భారతీయులు అనురూప్, సాగరిక భట్టాచార్యల పిల్లల కస్టడీ వ్యవహారంతో బాలల హక్కులు, చట్టాలపై మరోమారు చర్చ మొదలైంది. నార్వేలో భూవిజ్ఞాన శాస్త్రజ్ఞునిగా పని చేస్తున్న అనురూప్ దంపతులు తమ సంతానం మూడేళ్ల అభిజ్ఞాన్, ఏడాది పాప ఐశ్వర్యలపై మమతానురాగాలను చూపించడం లేదన్న కారణంగా అక్కడి బాలల సంరక్షణ చట్టాల ప్రకారం వారిపై కేసు నమోదయింది. కేసును విచారించిన కుటుంబ న్యాయస్థానం పిల్లలిద్దరినీ వారికి 18 ఏళ్లు నిండేవరకూ తల్లిదండ్రుల నుంచి విడదీసి పిల్లల సంరక్షణాలయానికి తరలించాల్సిందిగా ఆదేశించింది. భారత్‌కు తిరిగి వెళ్తున్నామని, తమ పిల్లలను తమకు అప్పగించాలంటూ అనురూప్ దంపతులు చేసిన న్యాయపోరాటం ఫలించలేదు. చివరకు భారత విదేశాంగమంత్రి ఎస్.ఎం. కృష్ణ జోక్యంతో పిల్లలను వారి మేనమామకు అప్పగించడానికి నార్వే ప్రభుత్వం అంగీకరించింది. ఈ ఘటనపై పలువురు పలు రకాలుగా స్పందిస్తున్నారు. పిల్లలను కన్న తల్లిదండ్రుల నుంచి విడదీయడం అమానవీయమని, ఏ చట్టం పేరు చెప్పి చేసినా బిడ్డకు తల్లి బలవంతంగా తినిపించడం నేరమెలా అవుతుందని కొందరు ప్రశ్నిస్తున్నారు. నార్వే ప్రభుత్వ చర్య తరతరాల భారత సంస్కృతిని, సంప్రదాయాలను అవమానపరచే విధంగా ఉందని అరోపిస్తున్నారు. భూతల స్వర్గంగా భావించే నార్వేలో పసిపిల్లలు మొదలు వృద్ధుల వరకు అందరి హక్కుల పరిరక్షణకు సమగ్ర చట్టాలున్నాయని, ఆ చట్టాల ప్రకారం చర్యలు చేబట్టడాన్ని ఎలా తప్పు పట్టగలమని వాదించేవారూ లేకపోలేదు. బాలల హక్కులు, సంరక్షణ విషయంలో ఐక్యరాజ్యసమితి రూపొందించిన ఒడంబడిక (జెనీవా కాన్వెన్షన్)ను పాటించే దేశాల్లో నార్వే ముందువరుసలో ఉందని వారు చెబుతున్నారు.

ఈ వాదనల్లోని ఉచితానుచితాలను బేరీజువేసే ముందు బాలల హక్కులు, చట్టాల గురించిన నేపథ్యాన్ని మనం అర్థం చేసుకోవాలి. ఎదిగిన వారితో పోల్చితే పిల్లలు అన్ని విషయాల్లో బలహీనులని, వారి పోషణ, పెంపకం బాధ్యత పూర్తిగా తల్లిదండ్రులదేనని పురాతన సమాజం నుంచే మానవులు గుర్తించారు. వారి ఆహారాన్ని వారు సమకూర్చుకునే

స్థాయికి చేరేదాకా వాళ్లు పిల్లలను కంటికి రెప్పలా కాపాడుకునేవారు. నాగరిక సమాజంలో మొట్టమొదటగా బాలల హక్కులను గుర్తించింది 1850లలోనని చెప్పవచ్చు. 12 ఏళ్ల కంటే తక్కువ వయసున్న పిల్లలతో పని చేయించరాదన్న నియమాలను కొన్ని దేశాలు పాటించాయి. వారిని పాఠశాలలకు పంపేందుకు చర్యలు చేబట్టాయి. 1924లో నానాజాతి సమితి బాలల హక్కులపై డిక్లరేషన్‌ను విడుదల చేసింది. 1956లో ఐక్యరాజ్యసమితి ఆ డిక్లరేషన్‌ను సవరించింది. హక్కులతో పాటు పిల్లలను అర్థం చేసుకుని వారిపై ప్రేమ కురిపించే విషయంలో గైడ్‌లైన్స్‌ను చేర్చింది. 1979ని అంతర్జాతీయ బాలల సంవత్సరంగా ప్రకటించింది. ఇదే ఏడాదిలో డిక్లరేషన్ స్థానంలో బాలల హక్కులపై ఒక సమగ్ర పత్రాన్ని ఆమోదించాలంటూ పోలండ్ ప్రతిపాదించగా, 1989 నవంబర్ 20న సమావేశమైన ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ బాలల హక్కులపై ఒడంబడిక పత్రాన్ని ఆమోదించింది. ఈ పత్రంలో 18 ఏళ్ల లోపు వయసున్న వారిని బాలలుగా నిర్వచించారు. వయోజనులకు వర్తించే అన్ని హక్కులూ మరింత ఎక్కువగా పిల్లలకు వర్తిస్తాయని, ఎందుకంటే తమను తాము రక్షించుకోవడం వారికి తెలియదని ఇందులో పేర్కొన్నారు. ఈ పత్రంపై మొదటగా సంతకం చేసిన దేశాల్లో నార్వే ఒకటి కాగా ఇప్పటి వరకు భారత్ సహా 191 దేశాలు ఒడంబడికకు కట్టుబడివున్నట్లు ప్రకటించాయి.

ప్రజాస్వామ్యం, మానవ హక్కులు, శాంతి, సౌభ్రాతృత్వంలకు కట్టుబడివున్న దేశంగా పేరుగాంచిన నార్వే బాలల హక్కుల విషయంలో కూడా ముందు వరుసలో ఉంది. 1874లోనే బాల కార్మిక వ్యవస్థను నిషేధించింది. 1900లో బాలల సంరక్షణ చట్టాన్ని ఆమోదించింది. మొదటి ప్రపంచ యుద్ధంలో బాలలను సైనికులుగా పోరాటంలోకి దించడాన్ని, వారితో పరిశ్రమల్లో పని చేయించడాన్ని వ్యతిరేకిస్తూ 1919లో సేవ్ ద చిల్డ్రన్ ఫౌండేషన్ నార్వేలోనే ఏర్పాటైంది. నానాజాతిసమితి డిక్లరేషన్‌ను, ఆ తర్వాతికాలంలో ఐక్యరాజ్యసమితి ఒడంబడికను వెంటవెంటనే ఆమోదించి చిత్తశుద్ధితో అమలు చేసింది. ఈ దిశలో కీలక చట్టాలను ప్రవేశపెట్టింది. 1981లో బాలల వ్యవహారాల పర్యవేక్షణకు స్వతంత్ర ప్రతిపత్తి కలిగిన అంబుడ్స్‌మన్‌ను నియమించింది. నార్వే ఆమోదించిన చట్టాల్లో బాలల చట్టం (1981), బాలల సంక్షేమ చట్టం (1992), మానవ హక్కుల చట్టం (2003) ముఖ్యమైనవి.

ఈ చట్టాల ప్రకారం సమాజంలో స్వేచ్ఛగా బతకడానికి వీలుగా పిల్లల భౌతిక, మానసిక, ఆధ్యాత్మిక, నైతిక వికాసానికి తల్లిదండ్రులు తోడ్పడాలి. వారిపై ఎలాంటి వివక్ష కొనసాగకుండా చూడాలి. శారీరక, మానసిక, లైంగిక హింసలు జరగకుండా సంరక్షించాలి. తినడం లేదని, స్కూలుకు వెళ్లడం లేదని, హోంవర్క్ చేయడం లేదని, చెప్పినట్టు వినడం లేదని, కాని పనులు చేస్తున్నారని వారిని బెదిరించడం, వేధించడం,

కొట్టడం శిక్షార్హమైన నేరం. ఈ చట్టాల కింద నమోదయిన కేసులను విచారించడానికి కౌంటీల స్థాయిలో ఏర్పాటు చేసిన కుటుంబ న్యాయస్థానాలు పిల్లల ప్రయోజనాలే లక్ష్యంగా తీర్పులను ప్రకటిస్తాయి. కాగా, పిల్లల హక్కుల ఉల్లంఘనల విషయంలో వచ్చే ఫిర్యాదులను బాలల సంక్షేమ విభాగం చూసుకుంటుంది. ఏ ఇంట్లోనైనా తల్లిదండ్రులు తమ పిల్లలను సరిగ్గా పట్టించుకోవడం లేదని, అనారోగ్యంతో ఉన్నా డాక్టర్ వద్దకు తీసుకెళ్లడం లేదని, వారిని వేధిస్తున్నారని లేదా కొడుతున్నారని సమాచారం అందితే ఈ విభాగం నేరుగా రంగంలోకి దిగుతుంది. సంబంధిత బాలుడిని లేదా బాలికను ఆస్పత్రికో, కౌన్సెలింగ్ కేంద్రానికో పంపించి దర్యాప్తు ప్రారంభిస్తుంది. వాస్తవాలు రాబడుతుంది. తమ పొరుగిళ్లలో ఇలాంటి ఘటనలు జరిగినప్పుడు ఏ పౌరుడైనా ఈ విభాగానికి ఫిర్యాదు చేయవచ్చు.

అనురూప్–సాగరిక దంపతుల విషయంలో ఇదే జరిగింది. మూడు సంవత్సరాల అభిజ్ఞాన్‌కు వాళ్లమ్మ తన చేతితో బలవంతంగా తినిపిస్తున్నదని బాలల సంక్షేమ విభాగానికి ఫిర్యాదు అందింది. వెంటనే వాళ్ల ఇంటిపై కొద్ది రోజుల పాటు నిఘా వేయగా భట్టాచార్య దంపతులు తమ పిల్లలను మమతానురాగాలతో పెంచడం లేదని, వారితో మానసిక అనుబంధం కొరవడిందని, పైగా మూడు సంవత్సరాలు దాటిన అభిజ్ఞాన్‌ను తమ బెడ్‌రూంలోనే పడుకోబెడుతున్నారని తేలింది. ఈ మేరకు అభియోగాలను నమోదు చేసి పిల్లలను స్థానిక కుటుంబ కోర్టులో ప్రవేశపెట్టారు. అభియోగాలను వాస్తవాలుగా నిర్ధారించిన కోర్టు ఇద్దరు పిల్లలను 18 సంవత్సరాలు నిండేవరకు సంరక్షణ కేంద్రంలో ఉంచాలని ఆదేశించింది.

ఇక్కడ కొన్ని ప్రశ్నలు తలెత్తడం సహజం. భారతీయ సమాజంలో పిల్లల పెంపకానికి పశ్చిమ దేశాల్లో పిల్లల పెంపకానికి మౌలికంగా కొన్ని తేడాలున్నాయి. పెట్టుబడిదారీ విధానం బాగా అభివృద్ధి చెందిన యూరపులో, అమెరికాలో బాలలకు స్వేచ్ఛ ఎక్కువ. తల్లిదండ్రులిద్దరూ ఉద్యోగాలు చేస్తారు కనుక నెలల వయసులోనే పసికందులను బేబీ కేర్ సెంటర్లలో వేస్తారు. కాస్త పెద్దవగానే ప్లేస్కూలుకు పంపిస్తారు. ఇక వారి చదువుల బాధ్యత ప్రభుత్వమే చూసుకుంటుంది. వృత్తి–ఉద్యోగాల ఎంపికలో కూడా తల్లిదండ్రుల ప్రమేయం తక్కువే. తద్విరుద్ధంగా భారత్‌లో పిల్లలపై పెద్దల అజమాయిషీ కాస్త ఎక్కువేనని చెప్పవచ్చు. భూస్వామ్య విధానం నుంచి పెట్టుబడిదారీ విధానానికి పరివర్తన చెందుతూ ఆధునిక పోకడలు ఇప్పుడిప్పుడే పల్లెలకు పాకుతున్న దశలో మన సమాజం ఇటూ అటూ కాకుండా ఉంది. పట్టణాల్లో పెరిగే పిల్లలకు కాసింత స్వేచ్ఛ ఎక్కువ ఉన్నప్పటికీ పెంపకంలో తల్లిదండ్రులు ఇప్పటికీ సంప్రదాయ పద్ధతులనే పాటిస్తున్నారు. తప్పులు చేసిన పిల్లలను కొట్టడం ఇక్కడ తప్పు కాదు. ఇళ్లలో తల్లిదండ్రులు, స్కూళ్లలో

ఉపాధ్యాయులు బాలలను భయపెట్టడం, వినకపోతే రెండు దెబ్బలు వేయడం మామూలే. పిల్లల భవిష్యత్ కోసమే తాము ఇలా చేస్తున్నామని వీళ్లు చెబుతారు. అలాగే, పేదరికం, ఉపాధిలేమి మూలంగా బాలలచే పని చేయించడం అనేక ప్రాంతాల్లో ఇప్పటికీ కొనసాగుతోంది. ఈ నేపథ్యంలోనే మనం అనురూప్ దంపతుల ప్రవర్తనను అర్థం చేసుకోవాలి.

మన దేశంలో కూడా బాలల హక్కుల పరిరక్షణకు అనేక చట్టాలు వచ్చాయి. 2005లో జాతీయ బాలల హక్కుల పరిరక్షణ సంఘం ఏర్పాటును పార్లమెంట్ ఆమోదించింది. జెనీవా ఒడంబడికలోని అంశాలు అమలయ్యేలా చూడడం ఈ కమిషన్ విధుల్లో ముఖ్యమైనది. 1986లో బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన, బాల్య వివాహాల నిరోధక చట్టాలు, 2000లో జువెనైల్ జస్టిస్ చట్టం, 2002 లింగ నిర్ధారణ పరీక్షల నిషేధ చట్టం, 2010లో బాలలందరికీ తప్పనిసరి ఉచితవిద్యను అందించే చట్టం అమలులోకి వచ్చాయి. పలు పంచవర్ష ప్రణాళికల్లో బాలల సంక్షేమం కోసం ఎన్నో పథకాలను ప్రవేశపెట్టారు. అయినప్పటికీ పరిస్థితుల్లో చెప్పుకోదగిన మార్పు రాలేదు. మహిళలపై, పిల్లలపై గృహహింస పెరుగుతూనేవుంది. రెచ్చిపోయిన ఉపాధ్యాయులు పలురకాల సాకులతో విద్యార్థులను శిక్షిస్తూనే వున్నారు. చైల్డ్ ట్రాఫికింగ్ వర్ధిల్లుతూనేవుంది. పోషకాహారం కరువైన వీధిబాలలు రోగాల బారిన పడుతూనేవున్నారు. బాలకార్మిక వ్యవస్థ కొనసాగుతూనే వుంది.

అభివృద్ధి ఫలాలు సమాజంలోని అట్టడుగు వర్గాల ప్రజలకు అందనంత వరకు పెద్దలతో పాటు పిల్లల హక్కుల పరిరక్షణ మేడిపండు చందంగానే ఉంటుంది. నిలువ నీడే కరువైన పేదలు తమ పిల్లలకు వేరుగా పడక గదులను ఏర్పాటుచేయడం అసాధ్యం. బాలలు స్వేచ్ఛగా పెరగాలన్నా, పోషకాహారం అంది ఆరోగ్యంగా ఉండాలన్నా, కోరుకున్న చదువులు చదవాలన్నా, ఇష్టమైన వృత్తిని ఎంచుకోవాలన్నా ముందు ఇక్కడి సామాజిక ఆర్థిక పరిస్థితులు సమూలంగా మారాలి. ఈ దిశలో భారత ప్రభుత్వం చర్యలు చేపట్టేలా హక్కుల సంఘాలు, మేధావులు, రాజకీయ పార్టీలు, ప్రజలు ఒత్తిడి తేవాలి.

***(నమస్తే తెలంగాణ, 31-01-2012)***

maro konam
by d. markandeya

"కార్ల్ మార్క్స్ కాలానికి పెట్టుబడితో ప్రారంభమైన పరాయీకరణ, మన దేశాన్ని అధికారికంగానే ప్రపంచ మార్కెట్ శాసించే కాలానికి ఎంత విశ్వరూపం తీసుకున్నదో అవగాహనకు తెచ్చుకుని రచయిత రాసిన ఈ వ్యాసాలు చదవాలి. ఒక దినపత్రికలో ఆయా సందర్భాల్లో తక్షణ సంఘటనలకు, పరిణామాలకు స్పందించి రాసినట్లుగా కనిపించే ఈ వ్యాసాల వెనుక మార్కండేయ పుట్టిన గడ్డ 1967 నుంచి అనుభవించిన, ప్రతిఘటించిన, నిర్మించిన చరిత్ర, ఆ క్రమంలో ప్రజలు నిర్మిస్తున్న చరిత్ర ఉన్నది."

"ప్రకృతి సంపద, మానవ శ్రమ కోసం పెట్టుబడి వేటకు ఇవ్వాలటి పేరు ప్రపంచీకరణ. అందులోని పరాయీకరణను రచయిత పట్టుకున్న పద్ధతి ఎంతో శాస్త్రీయంగా ఉన్నది. సాధికారికంగా ఉన్నది."

"మెయిన్ స్ట్రీమ్ పత్రికల్లో పనిచేసే వాళ్లు కూడా పంక్తుల మధ్యన ప్రపంచీకరణ వలన పరాయీకరణకు గురవుతున్న ప్రజల గురించి ఎంత వేదనను, ఎంత వెలుగును ప్రసరించవచ్చునో ఈ వ్యాసాలు కూడా ఒక తార్కాణం."

**– వరవరరావు**

ISBN 978-93-85076-14-5
9 789385 076145
Essays ₹ 150

email : malupuhyd@gmail.com